అభ్యుదయ

సచిత్ర సాహిత్య మాసపత్రిక

మహాసభా సంచిక

సంపుటి ౧ సంచిక ౫

మార్చి, 1947

ACC. NO.
CL. NO.
LANGUAGE
DATE

సంపాదకులు :

చదలవాడ పిచ్చయ్య

కొమర్రాజు వినాయకరావు ప్రయాగ కోదండరామశాస్త్రి

గౌరవ సంపాదకులు :

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి

శ్రీ పి. వి. రాజమన్నారు శ్రీ తుమ్మల వెంకటరామయ్య

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

విషయసూచిక

★

చిత్రకారుడు : రాంగోపాల్

కళారాధకుడు, రాజమన్నారు

'అరుణ'

"ఆంధ్రదేశమంతయు స్వాతంత్ర్యరంగమై యున్నది. ప్రజల ప్రబోధము వర్ణనాతీతము. సుషుప్త్యవస్థ నందియుండినవా రెందరెందరో మేల్కాంచి స్వధర్మ జ్ఞానపూరితు లగుచున్నారు. స్వాభిమానము ఆత్మగౌరవము నిర్భయత్వము, పరోపకారపరాయణత్వము, ఉత్సాహము— అన్నియును ప్రబలియున్నవి. ఈ గుణము లన్నియును సారస్వత వికాసమునకు ననుకూలములైనవి."

ఈ మాటలు ఇప్పటికి దాదాపు 24 సంవత్సరాలకు పూర్వం శ్రీ పాకాల వేంకటరాజమన్నారుగారు 'కళ' అనే తన పత్రికలో వ్రాశారు. ఆనాడు ఆంధ్రసాహిత్యరంగంలో నూతన భావప్రాభవం రూపొందుతోంది. పాశ్చాత్య విజ్ఞాన ప్రభావంతో మేల్కొన్న ప్రజలలో జాతీయాభిమానం, స్వాతంత్ర్యపిపాస పరవళ్ళు త్రొక్కుతున్నాయి. బ్రిటిష్ సామ్రాజ్య దాస్యంనుంచి త్రెంచుకొని బయటపడాలని ఉద్వేగంతో, ఉత్సాహంతో యువరక్తం పొంగులువారుతోంది. ఆ ప్రభావం నిర్మలమైన రాజమన్నారుగారి హృదయంపై ప్రసరించింది. అప్పటినుంచీ, కళలు జాతీయ జీవితవికాసానికి తోడ్పడాలని అహర్నిశలూ ఆయన కృషిచేస్తూవచ్చారు. అదే ఆయన జీవితానికి పరమాశయం! అదే ఆయనకళాహృదయానికి కాంతిరేఖ!

రాజమన్నారుగారు 1901 మే 10 వ తేదీన, రాజమహేంద్రవరంలో జన్మించారు. తండ్రి శ్రీ పాకాల వెంకట రమణరావుగారు — ధనిక కుటుంబం — అందువల్లే రాజమన్నారుగారు అతి గారాబంగా పెరిగారు.

అయిదేళ్ళు వచ్చాయి. బడికి పంపించారు. పంతులుగారు కసురుకోడం చూసి ఆయన పసిహృదయం చివుక్కుమంది. ఇంటికి వచ్చాడు బడికి పోనని మారాం చేశాడు. తండ్రి బ్రతిమలాడాడు. పంతులు కసురుకోవడం తనకు అవమానంగా ఉందనీ, తానెన్నడూ బడికిపోయి చదువుకోననీ—తండ్రికి వినయంగా చెప్పుకున్నాడు; జాలిగా వేడుకున్నాడు. తండ్రి అంగీకారంతో ఇంటిపద్దనేచదువు కేర్పాటయింది.

అంతేకాదు—నాయనమ్మ చూడామణమ్మగారు విద్వాంసురాలు. తనకు చిన్నతనం నుంచీ భారత, భాగవతాలు కథలుగా చెప్పేది. చరిత్రను వినిపించేది.

వీరగాధలు నూరిపోసేది. ఒడిలో కూర్చోబెట్టుకొని ఆటవిడుపు పద్యాలు నోట బట్టించేది. ఇవన్నీ ఆ లేత హృదయంలో స్థానం సంపాదించాయి. అతని మన స్సును ఉద్రూత లూగించాయి.

ఇలా నాలుగేళ్ళపాటు ఇంటివద్దనే చదువు సాగింది మళ్ళీ ఫస్టుఫారంలో పంతులుగారి మొహం ప్రత్యక్షమైంది.

నెమ్మది నెమ్మదిగా ఒక్కొక్క తరగతే పూర్తిచేశాడు పదమూడేళ్ళు నిండక పూర్వమే ఐదవ ఫారం పూర్తయింది.

ఆ రోజుల్లో స్కూలుఫైనల్ చదవడానికి పదహారేళ్ళు వయస్సుండాలి. అందువల్ల చదువు ఆగిపోయింది. మళ్ళీ ఇంటివద్దనే ఉండిపోయాడు. తండ్రిగారి సహాయంతో ఇంగ్లీషు వాఙ్మయం చదువ సాగాడు షేక్స్పియర్ నాటకాలంటే ఆసక్తి పెరిగింది. నాటకాలు చదువుతున్నప్పుడు అనేక రకాలుగా ఊహాలు వచ్చేవి. తానూ రచన చేయాలని ఉవ్విళ్ళూరుతూండేవాడు. అందుకనే, సంస్కృత కావ్య నాటకాలతోను, అలంకార శాస్త్రాలతోను బాగా సాధిక చేశాడు, తెలుగు శతకాల మీద వ్యాసం వ్రాసినందుకు ఆరోజుల్లోనే బహుమానం వచ్చింది. 1917 లో పదహారేళ్ళూ పూర్తవడంతో స్కూలుఫైనలూ పూర్తయింది.

కాలేజీలో ప్రవేశించాడు. క్రొత్తజీవితం ప్రారంభమయింది. రకరకాల వ్యక్తులతో పరిచయం కలిగింది లైబ్రరీ పుస్తకాలు చదవడం, వ్యాసాలు వ్రాయ డం ప్రారంభమయింది. ఆరోజుల్లో ఆయన రచనలన్నీ 'సుధాకరు' డనే పేరుతో ప్రచురించబడేవి. వ్రాయాలనే కుతూహలం నానాటికి హెచ్చింది తెలుగు, ఇంగ్లీషు రెండింటిలో వ్రాస్తుండేవాడు. పద్యాలూ, కధలూ వెలువడసాగాయి. ఆయన నాటిరచనలకు ముఖ్యంగా 'ఈస్ట్ అండ్ వెస్టు', 'న్యూ ఇండియా', 'నేషన లిస్టు' పత్రికలు దోహదమిచ్చేవి అప్పుడే ఆయన వ్రాసిన ఒక చిన్నకధకు 'ఎవ్వెరి మాన్స్ రివ్యూ' (Every man's Review) పత్రిక ప్రత్యేక బహుమా నం ఇచ్చింది. వంగ చిత్రకళా సంప్రదాయాలను గురించి ఆయన వ్రాసిన వ్యాసాలు 'హిందూస్థాన్ రివ్యూ' లో ప్రచురించబడ్డాయి.

గ్రీకు నాటకాలు, ఫ్రెంచి నాటకాలు, ఇంగ్లీషు నాటకాలు చదవడం బాగా అలవాటు. అందులోనే తన్మయుడై ఉండేవాడు ఒక్కొక్క నాటకం చదువుతూ ఒక్కొక్కరకంగా ఊహించేవాడు, తన జాతీయజీవితాన్ని గురించి ఒక్కొక్క ఘట్టమే కళ్ళముందు కనిపించేది. తన ప్రజల జీవితంకూడా తాను చదివిన నాటకాల్లోని జీవితాన్ని అందుకొనేలా చేయాలని కలలుగనేవాడు. తనజాతి ఔన్నత్యాన్ని గురించి పద్యాలూ, పాటలూ, కధలూ, నాటకాలూ వ్రాశాడు.

'వాసంతిక' అనే వ్రాతపత్రిక నడిపాడు. 'పుష్పాంజలి'అనే పేరుతో ఆధు నిక కవుల గీతాలను ఒక సంపుటిగా ప్రచురించాడు.

1921 లో ప్రారంభమైన సత్యాగ్రహోద్యమం దేశమంతటా నూతనోత్సాహాన్నీ, జాతీయ చైతన్యాన్నీ వెదజల్లింది. ఆరోజుల్లోనే శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు ఈ జాతీయోద్యమంలో ప్రముఖపాత్ర వహిస్తున్నారు. వారిపై రాజమన్నారుగారికి అభిమానం కలిగింది. పరిచయం చేసుకున్నారు. అప్పటినుంచీ ఖద్దరుదీక్ష పట్టారు. తన బంధువులూ, మిత్రులూ ఖద్దరు కట్టడం ప్రమాదమన్నారు. ఎంతో పైకి రావలసిన నీకు, ఇవన్నీ ఎందుకన్నారు. ఆయనలోని అభిలాషను చంపాలని ఎన్నో విధాల ప్రయత్నించారు. అంతకంతకూ ఆ అభిలాష పెరిగింది 'స్వతంత్ర జీవనం' అన్న పుస్తకం వ్రాసి ప్రచురించారు. ఆనాటి ఆయన భావాలకు అదే ప్రతిబింబం.

"అసత్యమును, అన్యాయమును అణగద్రొక్కి స్వాతంత్ర్య లక్ష్మికి పట్టాభిషేకమొనర్చునంతవరకు తనివినొందని యతడే స్వాతంత్ర్య లక్ష్మి కటాక్షములకు పాత్రుడైనవాడు. కష్టములకు భయంపడి పందలై ధర్మమును విడనాడెడు వారెల్లప్పుడును దాస్యమునే అనుభవింతురు. స్వాతంత్ర్యమో, దాస్యమో - ఈ రెంటిలో నొక్కటి దక్కం గత్యంతరంలేదు."

అన్న ఆవేదన వెల్లడించాడు తనలో మొలకెత్తి ఎదుగుతూన్న భావాలకు స్పష్టంగా, సూటిగా రూపురేఖలు దిద్దాడు. అదే అతని సున్నిత హృదయానికి, నిశితమైన బుద్ధికి నిదర్శనం.

ఆయన జాతీయాభిలాష, స్వాతంత్ర్యపిపాస హిందీచదువుకు దారితీశాయి. గాంధీజీ వ్రాసిన హిందీపుస్తకాలను తెలుగులోకి అనువదించాడు.

1921లోనే బి. ఏ పూర్తయింది — ఫస్టుక్లాసేకాదు; రాష్ట్రమంతటిలోను, ఆంగ్లసాహిత్యంలోను, వేదాంతంలోను ప్రధమస్థానం పొందాడు. ఇంగ్లండువెళ్ళి మనస్తత్వశాస్త్రం చదువుకోవాలని ఉండేది. కాని తండ్రిగారు అంగీకరించలా.

మనసులో ఎన్నోరకాల ఊహలు వచ్చాయి. తాను ఎలానైనావెళ్ళి చదవాలనుకున్నాడు. ఎంత ప్రయత్నించినా వీలుపడలా. గత్యంతరంలేక, చివరకు 'లా' కాలేజీలో చేరాడు 'లా' అంటే అభిరుచిలేదు. కళాశాలకన్నా, కన్నెమెరా లైబ్రరీ ఆశ్రయమైంది. మావియర్, మాటర్‌లింక్, స్టిన్‌బర్గ్, సామర్‌సెట్, మాఘం, ఆస్కార్‌వైల్డ్, మొదలయిన వారిరచనలు చదివాడు.

తనకెంత అభిరుచి లేకపోయినా, న్యాయశాస్త్ర విజ్ఞానంలో బహుమానం పొందాడు. విద్య పూర్తిచేశాడు.

1922 సెప్టెంబరులో 'కళ' అనేపత్రికను ప్రచురించ నారంభించాడు. ఆరోజులలో సాహితీసమితి సభ్యులతో పరిచయమైంది. కొమర్రాజు, వేటూరి, మానవల్లి, రామిరెడ్డి, నాయని, కృష్ణశాస్త్రి, వేదుల, నోరి మొదలైనవారి రచనలు 'కళ'లో ప్రచురింపబడుతుండేవి.

ఆనాడు పత్రిక నడపడంలో సాధక బాధకాలు ఎన్నో ఉండేవి. అన్నిటి కన్నా ఆర్థికబాధే అధికం. ఆ బాధనుంచి తప్పించు కోడానికి బి. ఎ. విద్యార్థులకు ఇంగ్లీషు నోట్సు వ్రాసి సంపాదిస్తుండేవాడు. రాత్రీ పగలు అనకుండా సాహిత్యంలో కొత్త రూపాలను తేవడానికి కృషిచేస్తుండేవాడు. చిత్రకళ, శిల్పం అంటే అభిమానం. ఇవన్నీ చాలక ఫొటోగ్రఫీ నేర్చుకున్నాడు. పత్రికలచ్చేస్తూ, కంపోజింగ్ నేర్చుకున్నాడు. అచ్చేసుకున్న పత్రికలు అభిమానులకూ, చందాదార్లకూ చేరాలి. రేపర్లంటించి, అడ్రెసులు వ్రాసి, పోస్టుచేసి వచ్చిందాకా నిద్రపట్టేది కాదు.

ఆయన కళాతృష్ణ ఎన్నెన్నో ఆటంకాలను దాటించింది. ఒక్కొక్క రచయితను బ్రతిమాలి ప్రార్థించి మరీ వ్యాసాలు తెచ్చుకునేవాడు. వీలైనంతవరకు తానే మారుపేర్లతో వ్రాసుకునేవాడు. మన సాహిత్యంలో వివిధరూపాలు పెంపొందాలని తహ తహ లాడేవాడు.

"మనభాష నానాటికి వృద్ధినొందు చుండిననేగాని మన వ్యక్తిత్వము వికసింపనేరదు నానాటికి వృద్ధినొందుటయేగాక, నానావిధముల వృద్ధినొందవలెను. మన వాఙ్మయమంతయు కేవలము పురాణ ప్రబంధములతోడనే నిండియుండిన భాష సంపూర్ణ సౌభాగ్యమున విలసిల్లనేరదు. ఇతర భాషా సాంగత్యము చేతను, నూతన లోకాచారపద్ధతుల చేతను, నవీనభావ సమ్మేళనము చేతను, సారస్వతమున కావ్యరూపంబులు క్రొత్తవి బయలుదేరును. ప్రాతవానియందు మార్పు లావశ్యకములగును" అని చాటాడు,

నాటక విమర్శలు చేశాడు. రాఘవాచారిగారివంటి నటులతో పరిచయం కలిగింది. ప్రదర్శనయోగ్యమైన నాటకాలు వ్రాయాలని కుతూహలంహెచ్చింది. రచన ఆరంభించాడు.

ఇంతలో రామారాయణంగారు 'రిప్రెజెంటేటివ్ గవర్నమెంట్ ఇన్ షెంట్ ఏన్ ఇండియా' అన్న విషయంమీద వ్యాసరచనకు రు 500 లు బహుమానం ప్రకటించారు. ఆ పోటీలో డాక్టరు చిలకూరి నారాయణరావుగారిలాంటి ప్రముఖులెందరో పాల్గొన్నారు. బహుమానం రాజమన్నారుగారికి వచ్చింది.

చిన్నతనంనుంచీ స్వతంత్రంగా జీవించాలని ఉవ్విళ్ళూరుతుండేవాడు. కాని మన ఈ బానిసదేశంలో స్వేచ్ఛా సమానత్వం, స్వాతంత్ర్యం అన్న భావాలతో స్వతంత్రంగా జీవించగం దుర్లభం. [illegible]ను లాయరుగా ప్రాక్టీసు చెయ్యాలని లేక పోయినా, [illegible]ంతో జూనియర్‌గాచేరాడు. కోర్టులో అడుగుపెట్టాడు. అక్కడి [illegible] వాతావరణం తన కళాహృదయానికి ఎంతో దూరంగా కనిపించాయి [illegible]యూ తన ఊహలూ ఆ వాతావరణంలో నలిగి ఏమైపోతాయో అన్నభయం [illegible]తహృదయానికి తగిలింది. అయినా ఏం చేస్తాడు? ఒక్క నిట్టూర్పు విడిచాడు. చివరకి తన పత్రిక 'కళ' ప్రచురించడంకూడా చాలిం

చాడు. ఆనాడు ఆయన హృదయం ఎంతో బాధపడింది. తన కళాజీవితంలో ఇంత దెబ్బ తగులుతుందని ఆయన ఎన్నడూ భావించలా. ఎన్నెన్నో ఆలోచనలు వచ్చాయి. తల తిరిగిపోతున్నట్లుండేది. తనలో తానే సమాధానం చెప్పుకునేవాడు. ఒకనాడైనా తనకళాజీవితం వికసిస్తుందని ఆశ.

1928 లో తండ్రిగారు ప్రభుత్వ న్యాయవాది అయారు. తనపై బాధ్యత మరింత అధికమైంది. అయినా తీరిక చూసుకున్నాడు. 'తప్పెవరిది ?' అన్న సాంఘిక నాటకం వ్రాశాడు. ఆ నాటకాన్ని రాఘవాచారిగారు ముఖ్యమైన పట్టణా లలో ప్రదర్శించారు; ప్రజల మెప్పు సంపాదించారు. కొన్ని పత్రికలు విమర్శించాయి ! కొందరు ఖండించారు ! మరికొందరు ప్రశంసించారు — ఇంతకీ మూలం, ఆ నాటకంలో సంఘసంస్కారదృష్టి వుందట !

ఒకవైపు న్యాయవాదివృత్తి, రెండోవైపు కళాకృషి జరుగుతూనేవున్నాయి. ఇలా వుండగా 1930 లో ఫ్రెంచిభాషలో యూనివర్సిటీ డిప్లొమో పొందాడు. తమిళ—కర్నాటక భాషల్లో ప్రవేశం సంపాదించాడు సాహిత్యం చదివాడు. తాను అంతవరకూ వ్రాస్తున్న గ్రాంధికభాషను విడిచాడు. సజీవమైన వ్యావహారికంలో ప్రప్రధమంగా 'దయ్యాలలంక' అనే నాటిక వ్రాశాడు ఆనాటి సాంఘిక వ్యవస్థలో నలిగిపోతున్న వ్యక్తులు మార్పుకోసం జీవితంకోసం, పొందే వేదనను వ్యక్తం చేశాడు. ఆ నాటిక అందరి మన్ననా పొందింది.

తరువాత చెకోవ్, టాల్‌స్టాయ్ రచనలు చదివాడు తనకింకా చదవాలని ఎంతో కుతూహలం వుండేది; వ్రాయాలని అభిలాష ఉండేది ఇంతలో తండ్రి గారు జడ్జి అయారు బావమరది సుబ్బారావుగారితో కలిసి ప్రాక్టీసు చెయ్యవలసి వచ్చింది. ఊపిరి తిరగని పనవుండేది తన కళాతృష్ణ కీ గతి పట్టిందని లోలోన తపించేవాడు తనని తానే నిందించుకొనేవాడు. కాని ప్రయోజనం శూన్యం. ప్రాక్టీసు, ప్రాక్టీసు — ఒకటే ప్రాక్టీసు ! అందుకే టైం చాలేదికాదు

కాని, సెలవులు దొరికినప్పుడు కాగితం కలం పుచ్చుకునేవాడు. "మాతృప్రేమ, ఏమి మగవాళ్ళు. వృధాయాసం" మొదలైన నాటికలు చాలా వ్రాశాడు. తాను వ్రాసిన ప్రతినాటకంలో, క్రుళ్ళినసాంఘిక వ్యవస్థలోని మాలిన్యాన్ని ఎత్తి చూపించాడు. నూతన సమాజనిర్మాణం జరగనిదే సాంఘికవ్యవస్థ చక్కబడదన్నాడు మనస్సూ, హృదయం ఉన్న వ్యక్తులు సరియైన మార్గం లేకపోతే, జీవితాన్నెలా వ్యర్థంచేసుకుంటారో వివరించాడు మార్పులేకుండా మార్పురాకుండా మార్పు తేకుండా కూర్చుంటే సమాజం క్షణక్షణం నీరసించి నిర్జీవమైపోతుందనే వ్యధను వెలిబుచ్చాడు.

ఆయన ప్రతినాటకం నూతన సమాజనిర్మాణానికి ఒక సందేశం, ఒక ఆదేశం.

"కాలములు మారక తీరవు. అట్లు మారుట సహజము. మానవాభి వృద్ధికి నావశ్యకము. అట్టి మార్పులకు నూత్నభావోత్పత్తియు, నూత్న భావసమ్మేళనమును మూలకారణములు ఎప్పుడో వేదములనాటి ఆర్యుల భావములును, ఆశయములును ఎల్లప్పటికిని మనకు చాలవు; సరిపోవు. లోకమునందు మున్ను జనసమూహముల జీవితము స్వల్పవిస్తీర్ణమున నిమిడిపోవుచుండెను, ఇప్పుడట్లుండుట దుర్లభము".

అని 1920 లోనే తాను ఊహించిన భావాలకు ప్రతిబింబాలుగా తన నాటకాలలోని పాత్రలను తీర్చి దిద్దాడు. తన ఆశలనూ, ఆశయాలనూ పాత్రల జీవిత సంఘర్షణద్వారా చిత్రించాడు. కళారూపాలలో పొదివి మానవ జీవితాన్ని సంస్కరించే సందేశాన్ని అందించాడు. సాహిత్యానికీ, సంస్కారానికీ, జీవితం ఆదర్శముగా తీసుకున్నాడు. ఈ విధంగా ఆంధ్ర సాహిత్యాభ్యుదయానికి కృషిచేస్తూ వచ్చాడు.

ఆయనకు 1944 లో 'అడ్వకేట్ జనరల్' పదవి లభించింది 1945 లో మదరాసు హైకోర్టు న్యాయమూర్తి పదవి నలంకరించాడు. విశ్రాంతి లభించింది. ఇానెంత కాలంనుంచో అభిలషిస్తున్న కళాభ్యుదయానికి కృషిచేసే అవకాశం చిక్కింది. మళ్ళీ కళారంగంలో ఇప్పుడిప్పుడే అడుగు పెడుతున్నాడు.

నాల్గవ అభ్యుదయ రచయితల మహాసభకు అధ్యక్షత వహించాడు

"రాజకీయంగా జాతీయగౌరవం, దేశాభిమానం, స్వాతంత్ర్యాభిలాష అనే భావాలు చాలా ప్రబలమైనవి. ఆర్థిక సమస్యలు మిక్కిలి గడుసైపోతున్నవి. స్త్రీ పురుష సంబంధం గురించి, ఇతర ఆచార వ్యవహారాల గురించి నూతన సిద్ధాంతాలు బయలుదేరినవి. క్రొత్తవిజ్ఞానం అనుక్షణం సువేద్యమవుతున్నది. ప్రయాణ సాధనాలు ఈ విశాల జగత్తును చిన్న పల్లెగా చేసివేస్తున్నవి. ఇన్ని మార్పులు చూస్తూ కళ్ళుమూసుకోవడం శ్రేయస్కరమేనా? ఈ మార్పులు సాహిత్యరంగం ప్రవేశించకుండడం అసాధ్యం ప్రవేశించి జీవితంలో అల్లుకొనక తప్పవు వాటికి అనుగుణంగా సాహిత్యం మారితేనేకాని, ఉత్తమ సాహిత్యం కానేరదు. అటువంటి సాహిత్యమే అభ్యుదయ సాహిత్యం" అన్న సందేశం అందించాడు.

"ఆంధ్ర సాహిత్య ప్రపంచకళ్యాణానికి పెద్దలూ, పిన్నలూ అందరూ అన్ని తరాలవారూ, అన్ని రకాలవారూ కలిసి కృషిచెయ్యడం పరమకర్తవ్యం అభ్యుదయ రచయితల ఆశయం అదే" అందుకే ఈ బాధ్యత స్వీకరించానన్న ఉత్సాహాన్ని వెల్లడించాడు.

ఆంధ్రకళాభ్యుదయానికి భవిష్యత్తు ఎంతో వుంది. అందుకు అందరినీ కలిపి కృషిచేస్తూ శ్రీ రాజమన్నారుగారు ఆదర్శప్రాయులవుతారు; తమ బాధ్యత నిర్వర్తిస్తారు.

సంపాదకీయం

జీవితాన్ని రసవంతంగా చిత్రించేదే సాహిత్యం

మద్రాస్‌లో ఆంధ్ర అభ్యుదయ రచయితల మహాసభలు జరిగాయి: అందులో ఆంధ్ర సాహిత్య పరిషత్తుకు చెందినవారూ, నవ్య సాహిత్య పరిషత్తుకు చెందినవారూ కొందరు ప్రతినిధులుగా వచ్చారు. మరికొందరు ఆహ్వానితులుగా వచ్చారు. వివిధాభిప్రాయాల్ని ప్రకటించారు సాహిత్యంలో అభ్యుదయ పోకడల్ని గురించి రకరకాలుగా వర్ణించారు సందేహాలు... సమాధానాలు చెప్పుకున్నారు. ప్రతినిధులు అన్నీ విన్నారు. సాహిత్యానికి అందులో కొందరుకట్టిన మూల్యాలకు విస్తుపోయారు కొంత సాంఘిక మూల్యంవున్న సాహిత్యం వస్తుందనీ, మరికొంత రసమూల్యంవున్న సాహిత్యం వస్తుందనీ అన్నారు. అసలు రచనే అభ్యుదయ మన్నారు సాహిత్య నిర్వచనం చేయడంలో అనుభవజ్ఞులు, అరితేరిన రచనా నైపుణ్యం గలవారు. ఇంత పేలవంగా సాహిత్యానికి విలువలు కడతారని ఎన్నడూ. ఎవరూ భావించలేదు. ఐనా—పాపం మాట్లాడారు. వారి సాహిత్య జ్ఞానాన్ని వెల్లడించారు.

దాస్యాన్నీ, కులాభిమానాన్నీ, మతాభిమానాన్ని రేకెత్తించేరచనలు అభ్యుదయ రచనలు కానేరవు: అవి రసవంతమైనవి కావచ్చు—'కళ' అనిపించుకోవచ్చు — ఆ కళారూపంనుంచి స్పందించే భావాలు కులకక్షల్నీ, మతకక్షల్నీ రేకెత్తిస్తాయి. మానవత్వాన్ని మట్టిగలుపుతాయి. జాతిని కలతల్లో ముంచెత్తుతాయి. అవి భీభత్సానికీ, అశాంతికీ, వినాశానికీ దోహదం చేస్తాయి. ఈభావాలను ప్రేరేపించే రచనలు మానవ జీవితాభ్యుదయానికి వినాశకరాలు ఇవి అభ్యుదయ రచనలుకావు: సాంఘికమూల్యం, రసమూల్యం, అని వేరువేరుగాగల సాహిత్యం ఉండనే ఉండదు. సంఘం వ్యక్తులతో కూడివుంది ఏవ్యక్తి జీవితాన్ని సాహిత్యంలో ప్రతిబింబించినా అతనుపొందే అవస్థలన్నీ వ్యక్తం కావాలి. అతనేయవస్థను బలంగా పొందితే, ఆయవస్థే ప్రధానంగా రచన వస్తుంది రచయిత ఏ అవస్థని వ్యక్తం చేస్తున్నాడో దాన్ని ఇతరుల కందించగలిగితే ఆ ప్రభావం ఎంత బలంగా మనస్సుకీ, హృదయానికీ తగులుతుందో—అంత రసవంతమైన రచన అంటాము. అది ఎంత పేలవంగా వుంటే—అంత హీనమైన రచన అంటాము. సాహిత్యంలో రచయిత శక్తినిబట్టి తరగతు లుంటాయ్. అంతేగాని సాంఘిక మూల్యంగల రచనలనీ; రసమూల్యంగల రచనలనీ వేరువేరు అరలుగా,

వుండవు. ఇలా వేరు వేరు లరలుగా అంతస్థులుగా కట్టడానికి కారణం రచయిత సంస్కారాన్నిబట్టి ఉంటుంది. రచయిత శిల్పం, పుస్తకంనుంచి నేర్చుకుంటాడు మానవ జీవితంనుంచి కథ ఎంచుకుంటాడు. తను ఎంచుకునే కథావస్తువు ఎంత జీవం గలదైతే, అంత బలంగా, తను నేర్చుకున్న శిల్పం ఎంత నైపుణ్యం గలదైతే, అంత హృదయ రంజకంగా ఉంటుంది—"అభ్యుదయ రచన సమకాలీనమైన జీవిత పరిస్థితులకూ, రాజకీయ వాతావరణానికీ, ఆర్థిక సమస్యలకూ, సమాజ సంఘర్షణలకూ, నైతిక సందర్భాలకూ,... వైజ్ఞానిక విశేషాలకు అనుగుణ్యంగా, అనుకూలంగా, తగినట్టి, అవసరమైనట్టి మార్పులతో విలసిల్ల వలెను" అన్న, శ్రీ పి. వి. రాజమన్నారుగారి అధ్యక్ష వాక్యాలను అనుసరించాలి అదే జాతీయాభ్యుదయానికి సజీవమైన సాహిత్య మౌతుంది. రసవంతమైన రచన అవుతుంది. మహాసభలో మాటాడిన పెద్దలు, పిన్నలు అందరూ అదే సందేశమిచ్చారు. ఉత్తమ సాహితీ సంస్కృతులను ప్రభవించే మార్గం ఇదేనని ఎలుగెత్తి చాటారు. ఈ ఆశయాన్ని అన్ని తరాల రచయితలు అనుసరిస్తారని, అన్నిరకాల రచనలు సాగిస్తారని ఆశిస్తున్నాం—ఇదే సాహిత్యాభ్యుదయానికి రాచబాట —

కళారాధకుల కర్తవ్యం

ఆంధ్రదేశం నలుమూలలనుంచీ ఆర్తనాదాలు వినిపిస్తున్నాయ్ అసంతృప్తి కనిపిస్తోంది జాతీయాభిమానం, స్వాతంత్ర్యాభిలాష, దేశభక్తి నిండిన ఈరోజుల్లో ఇంకా హాహాకారాలు ఆర్తనాదాలు వినిపిస్తున్నాయంటే, గొప్పలోటుగా భావించాలి' ఎవరిదీలోటు? ఎందుకీలోటు? ఈప్రశ్నలకు జవాబుచెప్పుకున్నామంటే నిజంగ్రహించగలం! సత్యంకోసం న్యాయంకోసం నడుం బిగించగలం! మూడు కోట్లమంది ఆంధ్రప్రజలను అత్యున్నతస్థాయికి తీసుకుపోగలం! అదే విజ్ఞానవంతుల లక్షణం! అదే సంస్కారవంతుల సాధనం! అదే కళాకారుల కాంక్ష! అదే స్వాతంత్ర్యారాధకుల సేవ!

పది మాసాల క్రితం ప్రజాభిమానాన్ని చూరగొన్న ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వాధికారం స్వీకరించారు ప్రజలు తమ బాధలు, కష్టాలు, హింసలు, అన్యాయాలు, అక్రమాలు తొలగుతాయని ఆశించారు, తిండీ, బట్ట, విద్య, విజ్ఞానం, ఆరోగ్యమూ. అన్నీ అందుబాట్లో వుంటాయని అనుకొన్నారు. వారి మూపున ఉన్న భారం అంతా తీరిపోతుందని నమ్మారు ఆ నమ్మకాలన్నీ ఒక్కసారిగా తుడుచుకుపోయాయ్ ప్రజలు ఆశించిన ఏకోరికా నెరవేరలేదు! అసలైన నోరు తెరిచి అడగటానికి వీల్లేదు! నిర్బంధం! ఏ ఒక్క విషయాన్ని ఆలోచించకూడదని నిర్బంధం! ఏ ఒక్క కష్టమూ తీర్చుకోరాదని శాసనం!! అనుమానిస్తే జైళ్లు! అవసరమనుకుంటే ఆస్థిపాస్తుల స్వాధీనాలు! నోరు మెదపరాదు! కాలు కదప

కూడదు!! అబ్బబ్బా! ఆ సామ్రాజ్యవాదతాబేదారుల పరిపాలనలోకూడా ఈనిర్బంధ, నిషేధాలు లేవు!! ఈ హింసాతిహింసలు లేవు! మానవుని హక్కులన్నీ హరించారు! ఈ విధానం పిడికెడు వ్యక్తులైన ధనవంతులకే వినియోగిస్తుంది. చీల్చి పాలించే విధానంలో నైపుణ్యం గడించిన సామ్రాజ్యవాదులకే లాభిస్తుంది! స్వాతంత్ర్య పోరాటమార్గాన్ని అడ్డేస్తుంది! ఛీ! ఈ కటిక కసాయివిధానంనుండి మరల్చండి! ఇప్పటికే జీవితనిర్వహణ భారమైపోయింది బ్రతుకుతెరువు కన్పించడంలేదు! దేశములో చీలికలు! స్వాతంత్ర్యాభిలాషుల్లో అపోహలు! అంతా అంధకారమయంగా వుంది! ఈ అంధకారంనుంచి బైటపడడానికి ప్రజలకు మార్గంకావాలి. ఈనిరుత్సాహ, నిస్పృహలనుంచి ఉత్తేజం పొందడానికి, ఉత్సాహవంతులు కావడానికి ఆశారేఖలు విరజిమ్మబడాలి. నేడు ప్రజాసామాన్యం కోరుతున్నది ఇది! ఇందుకు అనువైన, యోగ్యమైన భావస్పందన కలగడానికి దోహదం చేయాలి. ఈబాధ్యత, ఈకర్తవ్యం జాతికి అత్యుత్తమసందేశం ఇవ్వగలరచయితలపైన వుంది మానవ జీవితం వికసింపచేయగల కళాకారులపైన వుంది. ఈ బాధ్యత నిర్వహిస్తారా? ఈ కర్తవ్యం నెరవేరుస్తారా? అన్నపిలుపులు వినిపిస్తున్నాయ్. వివిధరకాల గొంతుకలు కదులుతున్నాయ్; అందులో కార్మికులున్నారు; కర్షకులున్నారు; విద్యార్థులున్నారు; యువకులున్నారు; స్త్రీలున్నారు; పండితులున్నారు; పంతుళ్ళున్నారు; ఆచార్యులున్నారు; విజ్ఞానవంతులున్నారు; రచయితలున్నారు ఒకరేమిటి—అందరూ ఉన్నారు; వారి కరుణామయ జీవితాలు కళ్ళకు కనిపిస్తున్నాయ్! వారి నిరాశాపూరిత హృదయాలు పలకరిస్తున్నాయ్! సున్నితమైన మనస్సు, నిశితమైన మేధస్సు, ద్రవీభూతమయ్యే హృదయం, వారసత్వంగా గల కళాకారు లందరూ ముందుకు రావాలి. తమ రచనల్లో, తమ చిత్రాల్లో, తమ పాటల్లో, తమ అభినయంలో ఒకటేమిటి అన్ని కళారూపాల్లో ఆశాపూరిత భావాన్ని రేకెత్తించాలి! ప్రజాప్రతినిధుల్ని వక్రమార్గాలనుంచి మరల్చాలి! దాస్య బంధాలను తెంచేఐక్యతను సాధించాలి! ఇదే కళాకారుల కర్తవ్యం! ఉత్తమ కళారాధకుల సార్థక్యం!

ఏలూరు అభ్యుదయ రచయితల సభపై నిషేధం తొలిగించాలి

ఏలూరు పట్టణ అభ్యుదయ రచయితల మహాసభను జరపడానికి వీల్లేదని స్థానికపోలీసు అధికారులు నిషేధించారు. కారణం అడిగితే—'ప్రజాశాంతి రక్షణ' శాసనం పేరుచెబుతున్నారు. రచయితల సభను నిషేధించడం చూస్తుంటే ఈనాడు ప్రజాప్రభుత్వమేనా పాలిస్తుందనిపిస్తుంది! ఇది స్థానికాధికారుల లోటో—లేక ప్రజాప్రభుత్వం లోటో తెలీడంలేదు. స్థానికాధికారులు మాత్రం "ఈనాడు మీ

ప్రజాప్రభుత్వమేగదా ఉన్నది! మమ్మల్ని ఏంచెయ్యమంటారు? వారు ఆజ్ఞలు ఇస్తున్నారు, మేం పాలిస్తున్నాం. మాచేతుల్లో ఏమీలేదని" అంటున్నారు.

జాతీయాభిమానం, స్వాతంత్ర్యాభిలాష కలిగించే సాహిత్యంకావాలని ఎంతో ఆందోళన చేసిన ప్రజామంత్రివర్గమే ఈ నిర్బంధ విధానాన్ని అనుసరిస్తే—ఇకమన జాతీయకళలు అడుగంటిపోవూ? శాంతిరక్షణ, అన్న శాసనం పేరుతో ప్రజల హక్కులనే అణచివేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యవిధానం కాదు. దేశభక్తులూ, స్వాతంత్ర్యారాధకులూ ఐన ప్రజామంత్రులు, సాహిత్యసమావేశంపై స్థానికాధి కారులు చేస్తున్న అధికార దుర్వినియోగాన్ని అరికట్టాలనీ, సభలు జరుపుకోడానికి వెంటనే అవకాశాలు కల్పించాలనీ జాతీయ కళాభ్యుదయానికి దోహదంచేయాలనీ కోరుతున్నాం.

★

కృ త జ్ఞ త

మహాసభలో రాష్ట్ర సంఘానికి అడిగినవెంటనే విరాళాలిచ్చిన పెద్దలకు మా కృతజ్ఞతాభి వందనాలు. వీరి ఆదర్శాన్ని పాటించి, ఆంధ్ర కళాభిమానులు తమ శక్తికొలదీ విరాళాలిచ్చి అభ్యుదయసాహిత్యోద్యమానికి తోడ్పడాలనికోరుతున్నాను.

విరాళాలిచ్చినవారు :

1.	శ్రీ సుంకర తిరుమలరావుగారు	1116—0—0
2.	శ్రీ పి. వి రాజమన్నారుగారు	300—0—0
3.	శ్రీ వి. గోవిందరాజాచారిగారు	300—0—0
4.	శ్రీ పాటిబండ్ల రఘుపతిరావుగారు	116—0—0
5.	శ్రీ సుంకర వెంకట నారాయణగారు	116—0—0
6.	శ్రీ అట్లూరి వెంకటప్పయ్యగారు	50—0—0
7.	శ్రీ చెలసాని నాగభూషణరావుగారు	50—0—0

ఇట్లు,
చదలవాడ పిచ్చయ్య.
కార్యదర్శి, ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ రచయితలసంఘం.

ఆంధ్ర అభ్యుదయ రచయితల
చతుర్థ మహాసభకు
ప్రముఖుల సందేశాలు

"ఆంధ్ర అభ్యుదయ రచయితల చతుర్థ మహాసభకు నన్ను ఆహ్వానించినందుకు కృతజ్ఞుణ్ని.

"ఈ మహాసభ తెలుగుసాహిత్యంలో మహత్తరమైన అభ్యుదయంకోసం, భావాలలో అత్యున్నతిస్థాయినీ, రీతినీ ప్రదర్శిస్తుందని నాకు తెలుసు. నేను చాలా అభిలాషతోను, అభిమానంతోను మన నవీనకవుల, వచన రచయితల, చిత్రకారుల పోకడను గమనిస్తున్నాను. మహాసభావిజయానికి, దానికి సంబంధించినమహోద్యమానికీ నా శుభాశీస్సులు."

—డాక్టర్. కట్టమంచి రామలింగారెడ్డి.

●

సంగీతంలో అభ్యుదయాన్ని వాంఛించే అనేకమంది నాదోపాసకులలో నే నొకణ్ని. ప్రజల చైతన్యం అభ్యుదయరీతుల్లో పురికొల్పేందుకు సంగీతం అమోఘమైన అస్త్రం. నేను నిరతం చేసేకృషి ప్రజలకు సంగీతాన్ని సన్నిహితంగా చేయడమే పరమావధిగా గలది.

మీ సభ అఖండంగా జరిగి తన ఆదర్శాలను నిర్వర్తించుకొనేకార్యక్రమాన్ని జయప్రదంగా సాగించుకొంటుందని నా నమ్మకం.

— ద్వారం వెంకటస్వామి.

●

"మహాసభకు అన్నివిధాలా విజయంచేకూరాలని ఆశిస్తున్నాను."

— ఎం. వి. సీతారామయ్య, ఎం. ఏ.
(కర్నాట భాషోపన్యాసకులు, బెంగుళూరు.)

●

"మహాసభపూర్తిగా విజయవంతం కావాలని ఆశిస్తున్నాను."

— డి. ఆర్. బెంద్రీ, ఎం. ఏ.
(కర్నాట మహాకవి.)

●

"ఆంధ్ర అభ్యుదయ రచయితల మహాసభ సర్వదా విజయమందుగాక !"

— అచ్యుత కురుప్ దామోదరన్

(కేరళీక వి.)

●

"అభ్యుదయ రచయితల మహాసభ జయప్రద మగుగాక !"

— రామచంద్ర అప్పారావు

(ఆంధ్రనాటక కళాపరిషదధ్యక్షులు.)

●

"సభలు జయప్రదంగా జరుగవలెనని ఆశిస్తున్నాను."

— నాయని సుబ్బారావు.

●

"ఆంధ్రాభ్యుదయ రచయితల మహాసభ దిగ్విజయముగా కొనసాగుగాక...."

— హరి నాగభూషణం.

●

"కవితా శక్తితో అభ్యుదయ రచయితలు పురోగమింతురుగాక !"

— పెద్దాడ రామస్వామి.

●

ప్రజాసాహిత్యము, జాతీయ సారస్వతము ఈ రెండును అభివృద్ధిచెంది ఆంధ్రుల అభ్యుదయము సిద్ధింపవలసిన యీ రోజులలో మీ ప్రయత్నము మిక్కిలి ప్రశంసనీయము. మీ సభ విజయపూర్వకముగా జరుగునట్లు యాసించుచున్నాను

—గంటి జోగంసోమయాజి.

●

ఆంధ్రాభ్యుదయ రచయితల సంఘము ఉత్సాహశీలురు, సమాజ వికాస నిరతులునగు యువజనులతో నిండియున్నది. వీరి కృషిచే ఆంధ్ర వాఙ్మయమున కొక నూతన సౌందర్యము, జీవము రాగలదని తలంతు.

—తుమ్మల సీతారామమూర్తి చౌదరి.

●

అభ్యుదయ రచయితల సంఘమొనరించుచున్న దేశసారస్వత సేవలను చాలరోజులనుండి సోత్సాహముగా పరిశీలించి ఆనందించుచున్నాను. దేశకాలానుగుణమైన చలనమును, మార్పునుపొంది దేశ, సంఘక్షేమమునకై పాటుపడనినాడు జీవద్భాషలు తమ సహజ లక్షణమును కోల్పోయినవన్నమాటే. ప్రతిభావంతములును, ఆవేశ సంజనకములును ఐన రచనలతో సంఘము నుద్ధరించుచు సారస్వత సేవ కావించుటకు దేశభాషా కవులయు, రచయితలయు విధియై యున్నది. ఈ విషయమును గుర్తించి అభ్యుదయ రచయితల సంఘమిదివరకే కొంతపని సాగించి

నికముందితోధికముగా చేయసమకట్టియు. ఉత్సాహముగా పనిచేయుచు తనపేరు సార్థకము కావించుకొనుచున్నందు కెంతయు అభినందించుచున్నాను.

—దివాకర్ల వేంకటావధాని

"మహాసభ ఇదివరలో చేసిన, ఇప్పుడు చేస్తూవుండే కార్యక్రమం నిజంగా భవిష్యద్భారతంలో రసికంగా, నైతికంగా మహాభ్యుదయానికి కారకం కాగలదని మనఃపూర్వకంగా ఆశిస్తున్నాను...."

— రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

"........అభ్యుదయ రచయితల మహాసభకు నా శుభాశీస్సులు."

— నండూరి వెంకటసుబ్బారావు

"ఆంధ్ర అభ్యుదయ రచయితల నాల్గవ మహాసభకు నేను రాజాలనందుకు విచారిస్తున్నాను....మహాసభా, (కళా) ప్రదర్శనమూ అఖండవిజయం పొందాలని ఆశిస్తున్నాను."

— కె సంపద్గిరిరావు
('త్రివేణి' సహాయ సంపాదకులు)

★

విరాళం-వెయ్యినూట పదహార్లు

అధ్యక్షా !

కవి సోదర సోదరీ మణులారా ! ప్రథమ అభ్యుదయ రచయితల మహాసభ తెనాలిలో జరిగిననాడు నేను వాలంటియర్‌గా వున్నాను. తాతగారైన ధర్మారావు గారు దీనిని ఎలా అభ్యుదయ మార్గాన నడుపాలో అని, వారుపడ్డఆవేదన కళ్ళారా చూచాను. చెవులారా విన్నాను. తరువాత కొన్నిసంవత్సరాలకు అభ్యుదయ కవులు వివిధరకాలవారు, వివిధ మనస్తత్వాలవారు కలిసి పనిచేయగలుగుతారా ! అని అనుమానంవుండేది. ఈ 4 సంవత్సరాల మధ్యకాలంలో అభ్యుదయ రచయితల సంఘముతో సంబంధం లేకపోవడంవల్ల కలిగిన అనుమానం అది. కాని, ఈనాడు ఆ అనుమానం కాస్తా పటాపంచలయింది. అందుకు సంతోషంతో ఆంధ్రాభ్యుదయానికి అభ్యుదయ రచయితల సంఘం సాహిత్య కళద్వారా తోడ్పడుతుందని వెయ్యి నూటపదహార్లు ఇస్తున్నాను. ఇచ్చటికివచ్చి సభలు జయప్రదంగా జరుపుతున్న రచయిత లందరికీ నా హృదయపూర్వక అభివందనాలు.

ఇట్లు,
సుంకర తిరుమలరావు
పల్లెకోన

సాహిత్య విద్యాలయం

ఏప్రిల్ 26 మొదలు - పల్లెకోనలో

విద్యాలయ సమితి తీర్మానాలు

సాహిత్య విద్యాలయసమితి సమావేశం 16—2—4[illegible] న సాయంత్రం 6 గంటలకు చెన్నపురి ఆంధ్రమహాసభా భవనంలో న్యాయమూర్తి, శ్రీ పి. వి. రాజమన్నారుగారి అధ్యక్షతను జరిగినది. ఈక్రింది తీర్మానాలు ఏకగ్రీవంగా అంగీకరించబడ్డాయి.

౧. పాఠ్య ప్రణాళిక

"ప్రాకృత సాహిత్యము, సంస్కృత సాహిత్యము, భారత దేశ చరిత్ర, భారతీయ కళలను గురించి సంక్షిప్తంగా చెప్పి: — ఆంధ్రవాఙ్మయము, చరిత్ర: (అ) నన్నయ్యకు పూర్వము: (ఆ) నన్నయ మొదలు ఎర్రాప్రగడవరకు - (ఇ) ఎఱ్ఱన మొదలుకొని భట్టుమూర్తి వరకు (ఈ) భట్టుమూర్తి మొదలుకొని కస్తూరి రంగ కవి వరకు - నాలుగు భాగములుగా విభజించి చెప్పి. ఈ కాలంలో మన ఆంధ్ర వాఙ్మయంలో దక్షిణ సంప్రదాయమూ, ఉత్తర సంప్రదాయమూ, యక్షగానమూ, కథ, వచనమూ, గేయమూ యెలా పెంపొందాయో వివరించి. తర్వాత కస్తూరి రంగ కవి మొదలుకొని వీరేశలింగం పంతులుగారి వరకూ: పంతులుగారి మొదలుకొని సాహితీ సమితి వరకూ: (ఉ) ఆధునిక వాఙ్మయం - కథలూ, కావ్యాలూ, ఖండకావ్యాలూ, నాటకాలూ - ఆ యా యుగాలలో భాష, ఛందస్సు, సాహిత్యతత్వము బోధించాలి. ఆ యా యుగాలలోని చారిత్రక సామాజిక కళా పరిణామాలను, ఆనాటి సాహిత్యంతో సమన్వయించి వివరించాలని ఈ సాహిత్య విద్యాలయసమితివారు తీర్మానించుచున్నారు."

౨. స్థల, కాల నిర్ణయం

"రేపల్లె తాలూకా పల్లెకోన గ్రామంలో సాహిత్య విద్యాలయము ఏప్రిల్ 26 వ తేదీని ప్రారంభించుటకు తీర్మానించడమైనది."

౩. ఎన్నిక

"ఈ సాహిత్య విద్యాలయానికి శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారిని ప్రిన్సిపాలుగా, శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారిని వైస్-ప్రిన్సిపాలుగా ఎన్నుకోవడమైనది."

"విద్యాలయ ప్రారంభకులుగా న్యాయమూర్తి శ్రీ వింజమూరి గోవిందరాజా చారిగారిని ఆహ్వానించుటకు తీర్మానించడమైనది."

•"విద్యాలయ స్నాతకోత్సవానికి న్యాయమూర్తి శ్రీ పి. వి. రాజమన్నారు గారిని ఆహ్వానించడమైనది."

४. విద్యార్థులు - నిబంధనలు

"యాభై మందికంటె మించకుండా విద్యార్థులను చేర్చుకోవలెననీ, విద్యార్థి రుసుం రు. 30-0-0 ఉండాలనీ, విద్యార్థులుగా చేరగోరువారు ఏప్రిల్ 15 వ తేదీ లోగా విద్యాలయ సమితి కార్యదర్శి శ్రీ చదలవాడ పిచ్చయ్య (ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం, బెజవాడ)గారి పేర విద్యార్థి దరఖాస్తు, రుసుములో సగం పంపాలనీ—కోరుతూ తీర్మానించడమైనది."

సాహిత్యవిద్యాలయ సమితి

1. శ్రీ పి. వి. రాజమన్నారు
2. శ్రీ వి. గోవిందరాజాచారి
3. శ్రీ గిడుగు సీతాపతి
4. శ్రీ తాపీ ధర్మారావు
5. శ్రీ ఎం. రామానుజరావు నాయుడు
6. శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి
7. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ
8. శ్రీ కోరాడ రామకృష్ణయ్య
9. శ్రీ చిలుకూరి నారాయణరావు
10. శ్రీ నిడదవోలు వెంకటరావు
11. శ్రీ కొడవటిగంటి కుటుంబరావు
12. శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు
13. శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు
14. శ్రీ పిలకా గణపతిశాస్త్రి
15. శ్రీ చదలవాడ పిచ్చయ్య (కార్యదర్శి)

★

చెప్పరాని చిన్నగుట్టు

తాపీ ధర్మారావు

చెప్పరాని చిన్నగుట్టు చెప్తా రావోయ్
గొప్పకవులు ఈ కిటుకును చెప్పరులేవోయ్
గొప్పవాడ వవడానికి తప్పనిదారోయ్॥

కప్పులేని గుడిసెలు వేయ్ కలగబట్టేనోయ్
గొప్పవారి మేడొక్కటి కులుకుతుంటాది॥

వెన్నునంటు కడుపులు వేయ్ కలగబట్టేనోయ్
ఉన్నవారి బొర్ర ఒకటి ఉబ్బుతుంటాది॥

మొండి దిన్న మొల లొకవేయ్ కలగబట్టేనోయ్
ధనికుల కొక పట్టుదుస్తు దక్కుతుంటాది॥

ఎముకపంజరాలు వేయ్ కలగబట్టేనోయ్
నిండారిన విగ్రహాలు నిగనిగ మంటాయ్॥

నెత్తురేడ్చు కన్నులు వేయ్ కలగబట్టేనోయ్
కలిమి తళుకు ఒక ధనికుని కంటనుంటాది॥

తిండిలేని నోరులు వేయ్ కలగబట్టేనోయ్
సావుకార్ల విందొక్కటి సాగుతుంటాది॥

కరిగి తరుగు కండలు వేయ్ కలగబట్టేనోయ్
పెద్దవారి ఫాక్టరీలు పెరుగుతుంటాయి॥

ఏడ్పుకూడు కొంపలు వేయ్ కలగబట్టేనోయ్
సంగీతముతో ఒకిల్లు కంగుమంటాది॥

కంపు చీకటిళ్ళొకవేయ్ కలగబట్టేనోయ్
ధూప దీప వాసన లొక యింట నుంటాయి॥

కటికినేల పక్కలు వేయ్ కలగబట్టేనోయ్
మెత్తమెత్త పరుపు లొక్క మేడనుంటాయి॥

చప్పని కలిదుత్తలు వేయ్ కలగబట్టేనోయ్
పాయసాల కొక్క వెండి[illegible] [illegible]టాది॥

[హెచ్చరిక : వెయ్యి [illegible] లతలు]

★

వివిధ భాషా రచయితలందరూ కలిసి కృషి చేయాలి!

చతుర్థ మహాసభాహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ వింజమూరి గోవిందరాజాచారిగారి ఉపన్యాసం

ఈ మహాసభకు మా ఆహ్వానాన్ని అంగీకరించి ఆంధ్రదేశమందలి అనేక ప్రదేశాలనుంచీ, ఇతర రాష్ట్రములనుంచీ విచ్చేసిన అభ్యుదయ రచయిత లందరికీ నమస్కారపూర్వకముగా మా ఆహ్వాన సంఘం తరపున స్వాగతం ఇస్తున్నాను.

ఉర్దూ, ఇంగ్లీషు సాహిత్యాలలో ప్రసిద్ధ సాహిత్యవేత్తగా పేరెన్నికగన్న శ్రీ కె ఎ అబ్బాస్‌గారు ఈ సభను ప్రారంభించడానికీ, ఆంధ్ర ప్రముఖ రచయితలలో ఒకరైన న్యాయమూర్తి శ్రీ పి. వి. రాజమన్నారుగారు అధ్యక్షత వహించడానికీ అంగీకరించినందుకు వారికి మా కృతజ్ఞతాపూర్వక అభివందనములు సమర్పిస్తున్నాను. అప్పుడప్పుడు పత్రికలలో ప్రకటించిన కొన్ని వ్యాసాలుతప్ప, సాహిత్య కృషి నేను అంతగా చెయ్యలేదు అయినా సాహిత్యమంటే నాకున్న ఆదరణనూ, అభిలాషనూ పురస్కరించుకొని, నన్ను ఆహ్వాన సంఘాధ్యక్షుడుగా నియమించి, గౌరవించినందుకు కృతజ్ఞుణ్ణి. ఈ సభ ముఖ్యంగా ఆంధ్రాభ్యుదయ రచయితలకని ఉద్దేశించబడినప్పటికీ, తమిళ, కన్నడ, కేరళ రచయితలను కూడా ఆహ్వానించాం.

ఇది మనలో సోదరభావమూ, సహకారమూ పెంపొందించుకోడానికి తోడు పడుతుంది. అంతేకాదు-మన ప్రాంతీయ రచయితలు అందరూ ఒక్కచోట సమావేశమై, మన సంస్కృతి సాహిత్యాలు ఎలాంటి పరిణామం పొందుతున్నవో చర్చించి, తెలుసుకోవడానికి తోడ్పడుతుంది మన వైజ్ఞానిక, సాహిత్య విషయిక కృషి ఏకోన్ముఖమై, ఒక్క మన సాహిత్యానికేగాక, భారతదేశమంతటికీ ప్రయోజనకారి కాగలదు. మన 'సంస్కృతి' ఒకటేనన్న విషయం, మనం నిరూపించుకోగలుగుతాము కూడా. మనలో, మన సాహిత్యాలలో వైవిధ్యం ఉంటే ఉండవచ్చు. అంతమాత్రంచేత మన సాహిత్యమే గొప్పదని మనమూ, వారి సాహిత్యమే గొప్పదని వారూ స్వాభిమానాలతో గోడలు కట్టుకొని దూరం కానవసరంలేదు. ఎవరి భాషలో వారికి ఆదరణా, విశ్వాసమూ ఉండవచ్చు. తన భాష, తన సారస్వతం, తన సాహిత్యమే ఉత్కృష్టమైన దనుకొని; ఇతరుల భాషలు, సారస్వతాలు సాహిత్యాలు అంత ఉత్కృష్టమైనవీ, ఉదాత్తమైనవీ, ఉన్నతమైనవీ కావనే సంకుచితత్వానికి తావులేకుండా

చేసుకొని, విశాల దృక్పథంతో పవిత్రాశయాలతో కృషి చేయవలసి ఉన్నది. ఇదొక్క తెనుగు రచయితలను మనస్సులో పెట్టుకొనే చెప్పడంలేదు; వివిధ భాషా రచయితలందరూ కలిసి ఇట్లాంటి సమావేశాలద్వారా కృషి సాగించడం మంచిది. ఈ మహాసభకు అనుకున్నంతగా ఇతర ప్రాంతాలవారిని ఆహ్వానించడానికి వీలుపడలేదు.

ఇతర ప్రాంతీయ రచయిత లందరితోనూ కలిసి కళావికాసానికీ, సారస్వతాభ్యుదయానికీ ఏకోన్ముఖంగా కృషి సాగించేందుకు ఈ మహాసభ మార్గదర్శకం కాగలదని ఆశిస్తున్నాను. ఈ కృషి, ఒకరంటే మరొకరికి నిరసన తిరస్కారభావం కలగకుండా, సామరస్యం, సౌమనస్యం ఏర్పడేటందుకు ఉపచరిస్తుంది. పరస్పర సహకారంతో సాగించే కృషివల్ల నిరాశా, నిస్పృహలకు గురికాకుండా ముందుకు పోగలుగుతాము.

మన దేశ భాషల సంప్రదాయాలు ఏవి? ఇతర భాషా సంప్రదాయాలు ఏవి? వాటిని ఎదుర్కొంటున్న సమస్యలు ఏవి? ప్రాచీన, ఆధునిక యుగాలలో కాలానుగుణంగా ఎట్లాంటి పరిణామాలు వచ్చాయి? - ఇవి తెలుసుకోవాలని ప్రయత్నించేవారే అరుదు కొందరు ప్రయత్నించినప్పటికీ కృతకృత్యులు కాలేకపోతున్నారు. 'లిపి భేదాలు' దీనికి ప్రధానమైన ప్రతిబంధకం.

మన పొరుగున ఉన్న తమిళసోదరుల సాహిత్యాన్ని గురించి తెలుసుకోవాలంటే, ముందుగా వారి 'లిపిని'నేర్చుకోవాలి. వాళ్లు మన సాహిత్యాన్ని గురించి తెలుసుకోవాలన్నా ఇదే చిక్కు. బెంగాలీకి ఒకలిపి, హిందీకి ఒకలిపి, ఉర్దూకు ఇంకోలిపి, ఇట్లాగే మన దేశ భాషలన్నింటికీ అన్ని లిపులు ఉన్నాయి గదా! వీటిలో అనేక భాషలకు సంబంధించిన లిపులు, ఆ భాషలలాగానే మార్పులు చెందాయి. పూర్వపు తెలుగు లిపికీ, ఇప్పటి తెలుగు లిపికీ ఎంతో వ్యత్యాసం ఉన్నది. కొన్ని శతాబ్దముల నాటి శాసనాలు ఏ చరిత్ర పరిశోధకులో తప్ప, ఇప్పుడు మనము అందరమూ చదవడానికి సాధ్యంకావు. మనందరికీ తెలిసిన విషయమే ఇది. తెలుగు, తమిళ లిపులకు ఏదో కొన్ని అవసరమైన మార్పులుచేసి, కొన్ని క్రొత్త అక్షరాలుచేర్చి, రోమక లిపిలో సులువుగా బోధపడేట్టు వ్రాయవచ్చునని ఇటీవల కొందరు సూచించారు. గెలెటీ వ్రాసిన 'తెలుగు - ఇంగ్లీషు' నిఘంటువులో తెలుగు మాటలుకూడా రోమక లిపిలోనే వ్రాశాడు. తెలుగు లిపిని ఎంత తేలికగా చదువుతామో వీటినీ అంత తేలికగా చదువవచ్చు.

నేతాజీ సుభాష్ చంద్ర బోసు 'అజాద్ హింద్ ఫౌజ్' తరఫున ప్రకటించిన హిందీ, బెంగాలీభాషల పత్రికలన్నింటినీ ఈ రోమకలిపిలోనే ప్రకటించాడు. అది ఎంతలాభమో ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపాడు. శిపాయీలు చదువుకోడానికని ఈ మధ్య ప్రభుత్వమువారు అచ్చు వేయించిన హిందీపుస్తకాలన్నింటినీ ఈ రోమన్ లిపిలోనే వేశారు. ఈలిపిని చాలాకాలం

క్రిందటే వాడుకలో పెట్టుకున్నారు టర్కీ-దేశస్థులు. ఇన్ని లిపులు నేర్చుకోవడంలో ఇబ్బంది శ్రమా, వృధా కాలయాపనా లేకుండా చేసుకునేందుకు సుళువైన సరళమైన పద్ధతిని అనుసరించడం సమంజసం.

నేను ఇప్పుడు చెబుతున్న మాటలు వివాదహేతువు కావచ్చును, ఉద్రేకాలనూ, ఆవేశాలనూ రేకెత్తించవచ్చును. అయితే—మనందరికీ ఉపయోగించే ఒక సంస్కరణను మనం చెయ్యాలని కోరుతున్నప్పుడు నిర్హేతుకమైన అభిమానాలకు, ఆవేశాలకు మనం గురికాగూడదు. పురోగమించే వేళంలో ఇలాంటి అంధ విశ్వాసాలకు తావియ్యకూడదు. ఒకే లిపిని మనమందరమూ ఉపయోగించినట్టయితే, ఒకరిభాషను మరొకరునేర్చుకోడానికి వీలవుతుంది. మనమందరమూ ఒకేలిపినే ఉపయోగించినట్టయితే, భారతీయులలోని విభేదాలలో ఒకటైనా తగ్గించగలిగినవార మవుతాము. ఒకే లిపిని ఉపయోగించినట్టయితే - దేశీయులందరిలోనూ ఒకేసంస్కృతి పెంపొందడానికి, ఐక్యదృష్టి కలగడానికి పాదు కట్టినట్లవుతుంది. అయితే ఈ సమస్యను నేను, ఈ సభలోనే తీర్మానించమనడం లేదు. కాని ఈ విషయంలో జోక్యం కలిగించుకోవలసినవారు రచయితలే కాబట్టి ఈ సమస్యను మీ దృష్టిలోకి తెచ్చాను. మిమ్మల్ని ఆలోచించమంటున్నాను.

ఇటీవల తెనుగు సాహిత్యంలోని నవ్యరచనా పద్ధతులను చూచి నిజంగా గర్వపడవచ్చును. విమర్శనా దృష్టితో వాటిని పరిశీలించి, ఉపయుక్తములైన మార్గాలను నిర్దేశించి, నిరూపించేభారము రచయితలైన మీకే వదలివేస్తాను.

నేటి తెనుగురచనలలో నేను గమనించిన ఒకటి, రెండు విషయాలను చెప్తాను. ఒక విషయంలో మాత్రం కొంచెం వక్రమార్గంలో పోతున్నామనిపిస్తుంది. అన్ని భాషలలాగే మన భాషలోను మాండలికభేదాలు చాలా ఉన్నాయి. పదప్రయోగంలో, ఉచ్చారణ రీతిలో జిల్లాకు జిల్లాకు తేడా కనిపిస్తుంది. విశాఖ తెనుగుకీ, కృష్ణాజిల్లా తెనుగుకీ తేడా ఉంది. అట్లాగే నెల్లూరి తెనుగుకీ, అనంతపురం తెనుగుకీ

అయితే మనందరికీ కేంద్రంగావున్న ఈ చెన్నపట్నంలో అనేక జిల్లాలవారు విద్యార్థులు, విద్యాధికులు, ఇంకా ఇతరులు వేలాదివేలమంది ఉంటూఉండడం చేత, ప్రాంతీయపదభేదాలు అంతరించి వీరి వ్యవహారంలో ఒక సామాన్యమైన భాష అభివృద్ధిచెందుతుంది. ఈవిధంగా ప్రామాణికమైనభాష వ్యవహారంలో పెంపొందుతున్న సమయంలో మన రచయితలు కొందరు ఇతర జిల్లాలవారికి అర్థంకాని యాసమాటలు ఎక్కువగా ఉపయోగిస్తూ రచన చేస్తున్నారు. ఇది చాలా శోచనీయం. నేటి నాగరికుల తెలుగులో సాధర్మ్యము అధికముగాను, వైషమ్యము తక్కువగాను ఉన్నందున అట్లాంటి శిష్టజనభాషను వాడడం మంచిది. ఇట్లా అర్థంకాకుండా ఉండే రచనలు చేస్తూండడం సుపరిచితమైన వ్యావహారిక భాషకే ముప్పు తెస్తుంది. కొందరు తమవ్రాతలలో గ్రామ్యంకూడా

వాడుతూనేవున్నారు. మనకు మార్గదర్శకులైన గిడుగు రామమూర్తిపంతులు గారు, అప్పారావుగారు 'వ్యావహారిక మంటే అక్షర విన్యాసం తెలియని పామరులు వాడుకొనే భాష కాదని' చెప్పిన విషయం మరచిపోకూడదు.

మన భాషలో అనేక హిందూస్థానీ పదాలు, ఇంగ్లీషుపదాలు ఐక్యమైపోయినాయి. వాటిని విడదీయలేము. విడదీయ నక్కరలేదు కూడా. ఇట్లా అనేక పదాలు నిత్య వ్యవహారంలోకి వచ్చి, క్రమంగా భాషలో కలిసిపోతుంటాయి. అయితే అరవమాటలు ఇంగ్లీషు మాటలు, ఇంగ్లీషుమాటలుఅరవమాటలు సమ్మిశితంచేస్తే అది భాష అనిపించుకొంటుందా? ఇట్లాంటి కలగాపులగం ఎలా తయారవుతుందో మెలనీగారు A Book of South India అన్న పుస్తకంలో రెండు ఉదాహరణలిచ్చారు. అవి ఇవి: "ఎప్పో దేజు లీవు ఎవేల్దు ఇరికిరదు" అన్నాడట ఒక అరవాయన. 'రఫ్‌గా కాలిక్యులేషన్ చేస్తా'మన్నాడట ఒక తెలుగాయన. ఇట్లాంటి కలగాపులగం భాష నవ్యసాహిత్య పరిషత్ పత్రికలో కాబోలు చూచినట్టు జ్ఞాపకం — ఒక యువకుడు తెనుగు-హిందుస్థానీ మాటలు మిశితంచేసి పద్యాలు వ్రాశాడు. మీరు ఇట్లాంటివి ఎన్ని చూచి ఉంటారో? అటువంటి వ్రాతలవల్ల మనభాషకు అనర్థం కలుగుతుందని చెప్పక తప్పదు!

ఆంధ్రదేశంలోని అభ్యుదయ రచయితలు అభ్యుదయ సాహిత్యమనే పేరిట కమ్యూనిజాన్ని ప్రచారంచేస్తున్నారని చాలామంది అభిప్రాయపడుతున్నారు. ఇది కేవలం అపోహ అని నాకు తెలుసును. అయినప్పటికీ అభ్యుదయ రచయితలు ఇల్లాంటి అపవాదులకు తావియ్యరని భావిస్తాను. సాంఘిక విషయాలనుగురించి ప్రస్తావిస్తున్నప్పుడో, సామాజిక జీవితంలోని దురాచారాలను, దుర్మార్గాలను, మూఢ విశ్వాసాలను, ఖండిస్తున్నప్పుడో, రచయిత తన రచనలో, తను ఆశించే ఉత్తమ సామాజిక జీవితాన్ని స్ఫురింపజేయక తప్పదు. రచయిత తన భావ ప్రపంచాన్ని చిత్రించేటప్పుడు రసప్రధానంగా చేస్తాడు. సజీవంగా చేస్తాడు. అక్కడ ప్రచారకుడుచెప్పినట్లు చెప్పడు. కళకూ, ప్రచారానికీ ఉన్నభేదాన్ని విస్మరించకూడదు ఇది నా అభిప్రాయం.

ఉదాత్తమైన సంగీత సాహిత్యము, భక్తిపరంగానో, శృంగార రసమయంగానో ఉంటుందని ఒక పెద్దమనిషి నాతో అన్నాడు. అది వాస్తవమే. భక్తిరసాన్నీ విప్రలంభ శృంగారాన్నీ తప్ప, ఇతర భావాలు వేటినీ శాస్త్రబద్ధమైన కర్నాటక సంగీత సాహిత్యంలో కీర్తించలేదు. మనకు వీర రస ప్రధానములైన పల్నాటి వీరచరిత్ర, బొబ్బిలి పాటల వంటివి ఉన్నాయి. అయితే ఈ శ్రీనాథుడి వీర చరిత్ర పాడడానికి అనువుగా వుండేటట్లు ఎలా మార్చుకోవాలో ఆలోచించాలి. బొబ్బిలిపాటవంటి సామాన్య జనులు పాడుకొనే పాటలు, హృద్యంగా ఉండేట్టు కొన్ని సవరణలుచేస్తే సంగీత ఫణితులు కొన్ని కుదిరిస్తే అవి మరింత ప్రజామోదాన్ని పొందగలుగుతాయి.

ఈ వీర రసప్రధానములైన రచనలు, కథలు మనల్ని పులకింపజేస్తాయి. రక్తం ఉడికించి, మన్ని కార్యశూరులుగా చేస్తాయి. కన్యకా పరమేశ్వరీకథ ఫ్రెంచి వీరవనిత దేవీ జోన్ గాథలు, కన్యక ఇట్లాంటివి మనల్ని కదలింపజేస్తాయనడంలో ఆశ్చర్యమూ అతిశయోక్తీ లేదు. అప్పారావుగారు వ్రాసిన 'కన్యక' పద్యాన్ని జముకుల కథగా రేడియోలో మార్చిచెప్పారు. ఈ కన్యక కథ దేవీ జోన్ వీరగాథకు వీసంవాసి కూడా తీసిపోదు. మదాంధుడైన రాజు వాంఛను ప్రతిఘటించి, కన్యక శీలరక్షణ కోసం, ఆత్మగౌరవంకోసం, జాతి గౌరవంకోసం అగ్నికి ఆహుతి అయింది. ఇట్లాంటి కథల విషయంలో అందరూ ఎక్కువగా జోక్యం తీసుకోవాలి.

ఆదర్శమూర్తులైన పోతన, త్యాగయ్యల జీవితాలను వెండితెరపై రసమయంగా చిత్రించినప్పుడు, అవి మన ఆంధ్ర ప్రజలను ఎంత ఉద్రూతలూగించినదీ మనకు విదితమే. ఇలాంటి గాథలను కావ్యవస్తువులుగా స్వీకరించవచ్చని నిస్సందేహముగా చెప్పవచ్చు. మనం అనేక విషయాల్లో ఈనాడు అభివృద్ధి చెందుతున్న సంగతి నేను గుర్తించక పోలేదు కాని యిప్పటికీ ప్రఖ్యాత పురుషుల దివ్యగాధలు, రసవంతములైన చారిత్రకగాధలు గ్రహింపదగినవి అనేకం ఉన్నాయి. వీటిని ఎలా ఉపయోగించుకోవాలో రచయితలే జాగ్రత్తగా పరిశీలించాలి.

అందులో, మన తెలుగుభాషలో నవలలూ, నాటకాలు అనేకంగా వచ్చాయి. వివాహసంస్థలలో, సాంఘికంగా ఉండే లోపాన్ని ఆధారంగా చేసుకొని, దంపతులలో అసంతృప్తి బహుళంగాఉంది. ఇదేకథావస్తువుగా అనేకులు చెప్పారు. ఇదిఆదర్శప్రాయంగా చూపక, కష్టాలనీ, దుర్నీతినీ ప్రదర్శించడం మూలంగా ఫలితం శూన్యమైపోయింది. నీచమైన పశుప్రవృత్తినే ప్రదర్శించడం కంటే, పతితులైన వ్యక్తులకు ఆదరణతో సందేశాన్ని ఇచ్చి, ప్రేమను పవిత్రమైన దానిగా సూచిస్తూ, వ్రాయాలి; గాని కుపంథాను చూపవద్దని రచయితలను హెచ్చరిస్తున్నాను..ఊహాగానమే సారస్వతంకాదు. సంఘానికి అభ్యుదయ మార్గాన్నిచూపించేది సారస్వతం. సంఘవిచ్ఛేదనకు దారిచూపడం అరాచకాన్ని ప్రచారంచేయటమే అవుతుంది.

రాజకీయ ఔన్నత్యంతోపాటు, సారస్వతాభివృద్ధి చారిత్రకంగా కనబడుతోంది. రాజకీయంలో 'స్వాతంత్ర్యం' సన్నిహిత మవడంచేతే సారస్వతంలో కూడా ఈ సంచలనం ప్రారంభిస్తోంది. భావి భారత నిర్మాణానికి సక్రమమైన మార్గం చూపించడమే రచయితల కర్తవ్యం. క్రియారూపేణా ఆంధ్రులు వాచాలురు కారని రుజువు చెయ్యవలసిన బాధ్యత మీ పైన ఉంది.

ముందు ముందు మన జాతికి చైతన్యంకలిగించే ఉత్తమరచనలు ఈ అభ్యుదయ రచయితలు చేస్తారనీ, భారత దేశంలోనేగాక యావత్ ప్రపంచంలోని ఉత్తమ సాహిత్యంతో తులతూగే రచనలకు ప్రయత్నిస్తారనీ ఆశించుతున్నాను.

జనులంతా నీవారలె!

శ్రీ మల్లిరెడ్డి వెంకటరంగయ్య

కార్మికుడా! కర్షకుడా!
లేచితివా? నిలచితివా?
కరకుకత్తి పరిపాలన
కడకుద్రోయ కదలితివా?

కడు ఇడుముల కోర్చివోర్చి
కంటినీరు కార్చికార్చి
కదలితివా, కదలితివా!

నీబాధలు హద్దుమీరి
నీవోరిమి కడకుజారి
పొగలురేగు నీదుగుండె
సెగలురేగు నీయెడంద
మండిందా నేటికి........

అణగి అణగి లేములలో
అరగి అరగి బాములలో
ప్రళయకాల భానునివలె
విలయకాల రుద్రునివలె
లేచితివా, యిటులేచితివా....

మాట్లాడే హక్కులేక
పొట్టకింత కూడులేక
నరపశువుగ బ్రతుకలేక
న్యాయముకై పోరుసలుప
నిలచితివా ధీరత....

నీశక్తికి యెదురులేదు
నిశ్చయముగ జనులంతా
నీవారలె, నీవారలె

అన్యాయపు రథముత్రోలు
యీరాజుల రోజుమారె
పరిపాలన మనదేనోయ్!
పరపీడన ఎన్నాళ్ళోయ్!


రారమ్మని లేలెమ్మని
పిలచితివా?
పీడితులను పిలచితివా?
కార్మికుడా, ధార్మికుడా
నిశ్చయముగ జనులంతే
నీవారలె! నీవారలె!!

★

రచయితలే నవజీవన నిర్మాతలు

జీవితాన్ని ఉజ్జీవింపజేసుకోవాలనే ఆకాంక్ష ప్రత్యక్షరంలోను కల్పించాలి అభ్యుదయ రచయిత

ఆంధ్ర అభ్యుదయ రచయితల చతుర్థ మహాసభలో శ్రీ కె. ఎ. అబ్బాస్‌గారి ప్రారంభోపన్యాసం



ఈ మహాసభకు ప్రారంభోత్సవం చెయ్యమని మీరు నన్ను ఆహ్వానించి, గౌరవించినప్పుడు నేనెంతో కలవరపడ్డాను. ఇట్లా నేను మాటవరసకు చెప్పడంలేదు.

అంత ప్రసిద్ధిలేని నన్ను, మీభాషనైనా అర్థం చేసుకోలేని యువ రచయితను ఎందుకు ఆహ్వానించారా అని విస్మయం కలిగింది. మీలాగే ఉత్తమ ఆశయాలతో కృషిచేస్తున్న ఇతర రాష్ట్రాలలోని అభ్యుదయ రచయితల యందున్న మీసానుభూతి, అందరమూ సహకరించి ఈ మహోద్యమంలో ఏకోన్ముఖంగా కృషి చేయాలనే మీ ఆకాంక్ష, నన్ను పిలవడానికి కారణమని తర్వాత అర్థంచేసుకున్నాను. అట్లా అర్థం చేసుకోకపోతే ఇక్కడికి వచ్చి వుండేవాణ్ణేకాదు. అభ్యుదయరచయితల ఉద్యమంలోను ప్రజానాట్యమండలిలోను నేనుచేస్తున్నకృషిని పురస్కరించుకొని నన్నుపిలిచిఉంటారే కాని మరేఇతర వ్యక్తిగతకారణాలవల్లా కాదనికూడా నాకుతెలుసు. అభ్యుదయ రచయితల ఉద్యమమంటే నాకున్న అభిమానమూ, ఆదరణవల్ల నాశక్తికిమించిన ఈగురుతర బాధ్యతను నిర్వర్తించడానికి అంగీకరించాను.

నాకు నిజానికి ఇక్కడికి రావాలని ఎంతో కోరిక ఉంది అది ఏదో తెలియనిది తెలుసుకోవాలనే కోరిక అనండి. లేక 'దూరపుకొండలు నునుప'న్నట్టు ఇక్కడేదో ఉందనుకుని వచ్చాననండి. ఏమన్నాసరే—మీ దక్షిణ దేశం నన్ను ఎందుకో ఆకర్షిస్తున్నది. నాకు మీ భాషలతో, పరిచయం లేకపోయినప్పటికీ మీ దేశంతో, మీ దేవాలయ సుందరశిల్పాలతో, సాటిలేని మీ ప్రాచీన నాట్యరీతులతో పరిచయం ఉన్నది. వీటిని చూచి ఆనందించినప్పుడు మీ నాగరికతకు సంస్కృతికి దగ్గర దగ్గరగా వచ్చాను. అప్పుడు నాకుమీ భాషరాకపోవడమనేది ఒకపెద్ద ప్రతిబంధకం కాలేదు ఈ ప్రాంతాలకు నేను మొట్టమొదట 1934 లో వచ్చాను. మీ దేవాలయాలు, అక్కడి చెక్కడాలు చూచాను. ఇప్పటికీ అవి మరుపుకు రావడం లేదు. మతాభిమానంతో చెప్పడం కాదు.గాని ఆ చెక్కడాలలో మానవుడిలో ఉన్న అనశ్వరమైన సౌందర్య పిపాస, సత్యాన్వేషణా కళ్ళకు కట్టినట్టు ఈ నాటికీ కనిపిస్తున్నది మీ భరతనాట్య, కథాకళీవిధానాలలో ఆరితేరిన వారి నాట్యం చూచాను. ఆ నాట్యభంగిమలూ, భంగిమలలో సౌందర్యమూ, భావవ్యక్తీకరణా అందలి పటిమా కవిత్వంలాగా పరవశుణ్ణి చేసాయి.

ఇక్కడ నాటకాలు, కళా ప్రదర్శనాలు చూస్తున్నప్పుడూ, కావ్యపఠనం సాగుతున్నప్పుడూ సభికుల్లోని కదలిక, వారి ముఖకవళికలు చూస్తే ఈ కళలు ఇంకా ప్రజల్లో సజీవంగానే ఉన్నాయనీ, ప్రదర్శనశాలలో చిహ్నప్రాయంగా నిల్చి ఉన్నవిమాత్రంకావనీ స్పష్టంగా గుర్తించాను. సంగీతం, నాట్యం ముఖ్యంగా మీ దక్షిణ దేశంలో పెంపొందాయి. వాటిని ఇంకా మీరు ఇతర రాష్ట్రాలవారి కంటె ఎక్కువ శ్రద్ధతో వికసింపజేస్తున్నారు. అన్ని కళలలాగే ప్రజా జీవితాన్ని చిత్రిస్తూ అభ్యుదయపథాలలో ఇవి ఇంకా వృద్ధిపొంద గలుగుతాయి. పేద రైతుకుటుంబంలోనుంచి వచ్చిన మీ నాజర్ కవి మేధావంతులైన యీ సామాజికులందరి ఎదుటా తన బుర్ర

కథను రసవంతంగా చెప్పగలగడం ప్రశంసనీయమైన విషయం.

ఒక్క కళారంగంలోనే కాదు - జాతీయాభ్యున్నతికై సాగుతున్న ప్రతి ఉద్యమంలో దాక్షిణాత్యులైన మీకు ప్రత్యేక స్థానం ఉన్నది. మన స్వాతంత్ర్యపోరాటాలలో మీదే ముందడుగు! సమానతా, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు, ఆర్థిక సాంఘికాభివృద్ధికి మీరు ఎన్నో ఉద్యమాలు సాగిస్తున్నారు. మీ ఆంధ్రరాష్ట్రంలోని రైతువుద్యమంనుంచి అన్యరాష్ట్రాల వారు నేర్చుకోవలసిన పాఠాలు యెన్నో ఉన్నాయి. మీ రాష్ట్రంలో బలపడుతున్న ఈ రైతువుద్యమాన్ని మేము గమనిస్తూనే ఉన్నాము. ఈ ఉద్యమాలకు, ఈ నవయుగ శక్తులకు ముందుండి, మీరచయితలు వాటికి వన్నెలుదిద్దే సాహిత్యం, సారస్వతం సృష్టిస్తున్నారు మీ ప్రజా జీవితాన్ని సుఖమయం చేయడానికి మీ విశిష్ట కళా రూపాలద్వారా వారిని ఉత్తేజపరుస్తున్నారు. మేరువుల వంటి ఈ వీరోచిత ప్రజా పోరాటాలకు మీ రచనలు జీవంపోసేవిగా, మీజాతిని జాగృతం చేసేవిగా ఉన్నాయి. ఇది హఠాత్తుగా వచ్చిన పరివర్తనకాదు - ఎవరో తెచ్చిపెడితే వచ్చినదీ కాదు. చారిత్రకంగా వచ్చిన, రావలసిన పరివర్తన, అభ్యుదయ రచయితల మహోద్యమానికి, ప్రజా నాట్యమండలికి మీ ఆంధ్రరాష్ట్రం బలవత్తరమైన కేంద్రమయింది.

స్నేహితులారా!

నేను మీకు ఏమేమో ఉపన్యసించాలని రాలేదు. మీదగ్గర ఎన్నో తెలుసుకోవాలని వచ్చాను. నేను మీకు ప్రత్యేకంగా తెలియజేయవలసింది ఒకటి ఉంది. లాహోరు, ఢిల్లీ, బొంబాయిల్లో వున్న మీ సోదర రచయితల జోహార్లు. వాళ్ళందరూ మీ సభలు జేగీయమానంగా జరగాలని ఆసిస్తూ పెంపొందే మీ ఉద్యమమునుంచి ఎంతో తెలుసుకోవాలనుకుంటున్నారు.

మన అఖిల భారత అభ్యుదయ రచయితల మహోద్యమంలో మీ సభలకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. ఏ రాష్ట్రంలోనూ మన సంఘం కొన్ని సంవత్సరాలుగా ఇంత పెద్దసభ జరుపలేదు. ప్రత్యేకమైన మీ సమస్యలకు ప్రాధాన్యమిస్తూనే మీరు భారతదేశంలో సాహిత్యము ఎలా అభివృద్ధి చెందాలో ప్రపంచంలో మనకు ఎటువంటి స్థానం ఉన్నదో చర్చించుకోవాలి. ఈ దృష్టిలో నేను కొన్ని విషయాలు వివరిస్తాను.

ఈనాడు - ప్రపంచ పరిస్థితులు, మనల్ని ఎదుర్కొంటున్న సమస్యలు ఎంతో క్లిష్టంగా ఉన్నవని చెప్పడం పరిపాటి అయిపోయింది. జాతీయంగా అంతర్జాతీయంగా ఏవిధంగా చూచినప్పటికీ మనం చరిత్రలో చిక్కుచిక్కుదారులలో పోతున్నాం. ఇప్పుడు మన లక్ష్యాన్ని స్పష్టంగా గుర్తించాలి.

ఆరు సంవత్సరాలు హోరాహోరీగా సాగిన హననక్రీడ, రగిలిన మారణహోమం, మిన్నుమన్ను ఏకంగా త్రెళ్లిన రక్తం, ఈ యుద్ధం ఇప్పటికి ముగిసింది. వినాశానికి దారితీసే ఈ యుద్ధంలో కురిపించిన మంటలలో కొన్ని మహత్తరశక్తులు ప్రభవించాయి, నాజీ ఫర

హంతకులను ఎదిరించి అజేయమై నిలిచిన సోవియట్లు బలవత్తరశక్తులు, యూరప్‌లో దేశదేశాలలో పెంపొందుతున్నస్వాతంత్ర్యోద్యమాలు, పురోగాములయిన ఫ్రెంచి మేధావంతులు ఆదర్శప్రాయంగా నాయకత్వం వహించి రహస్యంగా నడిపించిన ఉద్యమాలు, ఇంగ్లండులో యుద్ధకాలంలో బలపడ్డ ప్రజాపుద్యమాలు, తర్వాత అక్కడ వచ్చిన లేబర్ విజయాలు - ఇవన్నీ యుద్ధానంతర సత్ఫలితాలు, అంతర్జాతీయ భద్రతాసమితి (U. N. O.) దానికి అనుబంధంగా పనిచేసే 'వైజ్ఞానికసమితి' (UNESCO)నవజగత్తు నిర్మాణానికి ఎత్తిన పునాదులు. ఇదొకటి స్పష్టంగా గుర్తించాల్సిన విషయం ఫాసిజం, నాజీజం, జపాన్ సైనికపరిపాలన కూకటి వేళ్ళతో పెకలించబడ్డవి. అవి నాశనమైన వనడానికి సందేహ మేమీలేదు! అయితే - చిత్రమేమిటంటే, ఫాసిజాన్ని నిర్మూలించడంతో సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించినట్టుకాలేదు. ఇది చారిత్రకంగాకూడా రుజువైంది. నాస్నేహితులు కొందరు ఘంటాపథంగా 'సామ్రాజ్యవాదం కొన ఊపిరితో ఉంది. ఫాసిజంతో పోరాటం సాగిస్తున్నది. ఇప్పుడు ప్రజలు ఫాసిజాన్ని ఎదుర్కొంటూనే సామ్రాజ్యవాదానికి గట్టిదెబ్బ కొట్టేట్టయితే అది నాశనంకాక తప్పదు అన్నారు. యుద్ధానంతరఫలితాలు కొన్ని వారికి స్పష్టంగా నిరాశ కల్పించి ఉంటాయి. ఇటీవల ఫ్రాన్సుకు సంబంధించిన కొన్ని సందర్భాలలో ఇంగ్లండు ధోరణిచూస్తే, ఫాసిజాన్ని వ్యతిరేకించదంలో సామర్థ్యాన్ని చూపించిన చర్చిల్ అట్లీ, డిగాల్, బ్లమ్ మొదలైన ప్రముఖులు పెట్టుబడిదారీ విధానాన్ని నిలబెట్టగలగడంలేదు. వీరిలో కొందరు వారి దేశీయవిషయాల్లో సామ్యవాదాన్ని, విదేశాల విషయంలో ముఖ్యంగా వలసరాజ్యాల విషయంలో సామ్రాజ్యవాదాన్ని అనుసరిస్తున్నారు. ఇండోనేషియా, వియట్‌నామ్‌ల విప్లవ పోరాటాలను గమనించనివారెవరూ ఉండరు. 'అటంబాంబును' వెనుకేసుకవచ్చే అమెరికాతో చేయిచేయి కలిపి సోవియట్ రష్యాకు వ్యతిరేకంగా కుట్రలుపన్నే కుటిలరాజనీతి ఒక ప్రక్క, పరస్పర వైరుధ్యం. వైమనస్యాలు ఒక ప్రక్క. ఆఫ్రికా అమెరికాలలో విచ్చలవిడిగా పెరుగుతున్న వర్ణవైషమ్యాలు ఒక ప్రక్క, చూస్తే ఇంకా మంటలు రగులుకుంటూనే ఉన్నాయని అనిపిస్తుంది. ఇప్పటి పరిస్థితులలో ఈ ముగిసిన యుద్ధమే మరో యుద్ధానికి దారితియ్యదని చెప్పలేకుండా ఉన్నాము.

మనదేశ పరిస్థితులను చూస్తే మనం మన స్వాతంత్ర్య లక్ష్యానికి చేరువలో వున్నామని అనిపిస్తుంది. ఇంకా ఈ బ్రిటిష సామ్రాజ్యవాదులు మనపైన పెత్తనం సాగించగలుగుతారనేది ఉత్తమాట అయితేమనం వారికి ఉండటానికి అనువయ్యేఅవకాశాలు సృష్టించకూడదు. ఈస్వాతంత్ర్యభానూదయంలో, ఈఅరుణారుణ కాంతులను మతయుద్ధాలతో సోదరులమన్న విషయం మరచి ఒకరి రక్తాన్ని మరొకరు చిందించి కళంకితం చేసాము. ఇదిమనకు సిగ్గు చేటు.

మాయనిమచ్చ. కలకత్తా, నౌఖలీ,బీహార్ యు. పి.లలో జరిగిందేమిటి ? దౌర్జన్యం దౌష్ట్యం,రాక్షసత్వం! మానవత్వంమంట గలిసి పశుత్వంప్రదర్శితమైంది. చీలించి పాలించే పెట్టుబడిదారీ విధానపు విష ఫలం ఈ మతకలహం, ఈ కారుచిచ్చు!

ఇదొక్కటే కారణం కాదు. ఇంతగా పశువుల స్థితికి మానవులు దిగజారడానికి మతోన్మాదాలతో కలహ ప్రియులు కొందరు వీటిని రెచ్చగొట్టారు. ఇంత కాలం సాగినయుద్ధంవల్లా, కరువులు, దోపిళ్ళు పెచ్చుపెరిగి సామాన్యులకు మోయలేని బరువై పోతున్న జీవిత వ్యయం, ఆర్థిక సంక్షోభాలవల్ల "సమత" లేని మానవులకు మరణం. మానభంగం అంటే మామూలు విషయాలై పోయినై. ఆకలి, అసంతృప్తి ఇంత పతనానికి దారిచేశాయి దీనికి ఇంకా ఎన్నోకారణాలు సాంఘిక శాస్త్రజ్ఞులు పరిశీలించి తర్వాత చెప్పవచ్చు

అయితే ఇప్పుడు ఈనైతిక పతనం నుంచి మానవులను ఉద్ధరించేది ఎవరు? సమభావం, సౌభ్రాతృత్వం పునాదులుగ నవజీవన నిర్మాణంచేసే వారెవరు? శాంతిని ప్రసాదించేది ఎవరు? ఈ గాయం మానేట్టు ఎవరుచేస్తారు?—రచయితలు. రచయితలే లోకకళ్యాణానికి మంగళ గీతాలు ఆలపించాలి. జీవితాన్ని పునరుజ్జీవింపజేసే, పునీతంజేసే రచనలు చెయ్యాలి.

ఇది రచయితలైన మన విధ్యుక్త ధర్మం. త్వరలో మన రచనలద్వారా ఈ ఉత్తమ ఆదర్శాన్ని సాధించాలి.

రాజకీయరంగంలో ఈ మత కలహాగ్నులు ప్రజ్వరిల్లి మన మార్గానికి అవరోధం కల్పించాయి. రాజకీయాధికారం తమ హస్తగతం చేసుకోవడానికి అభ్యుదయ నిరోధకశక్తులన్నీ ఏకీకృతమైపోతున్నాయి. భూస్వాములు, పెట్టుబడిదార్లు అందరూ ఒకటిగా పీడిత ప్రజలపై కత్తిగడుతున్నారు. వ్యాపారాన్నీ, ఉత్పత్తినీ గుత్తగొనే పెద్ద పెద్ద పెట్టుబడిదారీ సంస్థలు వాటి భావప్రకటనకు ప్రచారానికి ఉపకరించే గొలుసులలాంటి దిన, వార, మాసపత్రికలు ఎన్నో, ఎన్నెన్నో వస్తున్నాయి. పరిశ్రమలు, యంత్రాలు అన్నీ వారి చేతుల్లో కీలుబొమ్మలైపోతున్నాయి, పీడితులు, శ్రామికులు ఎన్నో సంవత్సరాలుగా చెమటోడ్చి సాగించిన పోరాటాల ఫలితంగా పొందిన కొద్దిహక్కులు పౌరసత్వాలు వారికి లేకుండా చెయ్యడానికి ఉన్నవారు అందరూ 'ఒకటై' ప్రయత్నిస్తున్నారు.

ఈ నవజీవన సంగ్రామంలో ఇంకా కొన్ని పాతకాలపు సంకెళ్ళు తెగిపోనే లేదు. మీ ప్రాంతంలో ఇంకా కుల భేదాలు అంతరించలేదు, జమీందారీ విధానాన్నీ, మితవాదదృక్పథాన్నీ, అజ్ఞానాన్నీమూఢ మతవిశ్వాసాలను పటాపంచలుచేస్తేనేగాని మనజాతికివిముక్తిలేదు.

ముస్లింలీగు, కాంగ్రెసు, హిందూ మహాసభల్లో ఉన్న పెట్టుబడిదార్లు, భూస్వాములు ఎంతభేదాలు ఉన్నట్టు వాదించుకున్నా వాళ్ళ 'వర్గ సంస్థలలో ఒకటై ప్రజాభ్యుదయాన్ని అరికట్టుతున్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేకులైన సోషలిస్టులు, కమ్యూనిస్టులు

ఈ తీవ్రవాదులలో విభేదాలు సమసిపో వడం లేదు. ఇది ప్రజాశత్రువర్గాలకు లాభదాయకం! ఈ అభ్యుదయ శక్తు లన్నింటినీ ఛిన్నాభిన్నం కాకుండా కూడ గట్టి కృషిచెయ్యాలి. ఇక్కడ పెట్టుబడి దారీ విధానాన్ని నిరసించే తీవ్రవాదు లలో ఎవరిది తప్పు, ఎవరిది సరియైన మార్గం అని చర్చించడానికి నాకు అవ కాశం లేదు. కమ్యూనిస్టులది సరియైన మార్గమా? లేక సోషలిస్టులది సరియైన మార్గమా? అని నేను తేల్చడంలేదు. కమ్యూనిస్టుల ప్రజాయుద్ధ నినాదం సరి యైనదందామా? సోషలిస్టులు అప్రమ త్తంగానే విప్లవం వస్తుందని చెప్పింది సరియైనదందామా?— ఈఇద్దరి వాదాల లోనూ కొంతసత్యంలేకపోలేదు. మొత్తం మీద వీళ్ళకృషి ఫలించిందనటానికి అవ కాశంలేకుండా ఉన్నది. ఇప్పుడు కావ లసింది ఈతీవ్ర వాదులందరూ ఒకటై మనస్వాతంత్ర్య పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడం. వీళ్ళలో ఐక్యతలేకుంటే వీళ్ళు ఇట్లాగే చిందర వందరగా చీలి ఉన్నట్లయితే అభ్యుదయ నిరోధక శక్తు లను హతమార్చటం కల్ల! వీళ్ళంతా మనదేశాన్ని అజ్ఞానాంధకారం నుంచి, దాస్యంనుంచి, దీర్ఘవ్యాధులనుంచితప్పిం చడానికి వివాదాలు పడనక్కరలేదు. ఇక్కడ అందరూ ఒకటిగా కృషిచెయ్య వచ్చు.

ఈవిషయాన్ని ఇంతగాచెప్పి, మీకెవ రికైనా కష్టం కలిగించానేమో! నేను మాత్రం ఈ తీవ్రవాదుల కలయిక త్వరలో రావాలని గాఢంగా వాంఛిస్తు న్నాను. అందువల్ల ఇంతగా చెప్పవలసి వచ్చింది. వీళ్ళందరూ కలవక పొయ్యే ట్టయితే మనకు మార్గాంతర మేమిటి? ఈదాస్యం ఈసంకెళ్ళు ఉండాల్సిందేనా? మేధావంతులు, రచయితలు, కళాభిజ్ఞు లైన మీ కృషి. ఇలాంటి సాహిత్య సమ్మేళనాలు ఈ ఐక్యతకు ప్రాతిపదిక కాగలవని నా విశ్వాసం. రాజకీయాలు మనిషిని మనిషిని దూరంచేస్తే, కళా బంధాలు మనిషిని మనిషిని దగ్గరకు తెచ్చి ఆర్ద్రితా, అన్యోన్యమైత్రీ, కల్పిస్తా యని చెప్తారు. కళద్వారా ఈ ఐక్యతను సాధించాలి. ఇందుకు కళ కంటే ఉత్త మమైన సాధనం మరొకటిలేదు. ఐక్యత లేని ఈ సమయంలో ఈ కళలు మనకు ఎంతో అవసరమవుతున్నాయి వీటివల్ల ఇంత ఉపయోగం, ఉపకృతి మనం పొందవలసి ఉంది. ఈ మధు కలశాలను మనం అందరికీ అందించాలి.

ఇంకొక్కమాట చెప్పవలసి ఉంది. అభ్యుదయ రచయితలంటే, అభ్యుదయము అనే మాటవింటే పెద్దలు కొందరికి కటువుగా కంటకంగా ఉంటు న్నది. అనేకమంది తెలిసి తెలియని వారు సాగించిన విషప్రచారమే దీనికి కారణం. కొందరు మనల్ని రష్యా ఏజం ట్లన్నారు. కొందరు, మనం సాహిత్యం లోకి జొరబడి వితండవాదాలతో ఏవేవో చెబుతున్నామన్నారు. కొందరు మనం ప్రాచీనసాహిత్యాన్నీ మనసంస్కారస్వత్వాన్నీ నాశనం చెయ్యాలంటున్నామన్నారు. సత్యదూరమైన ఈ భ్రాంతిని పోగొట్టి అభ్యుదయ రచయితలంటే ఎవరో స్పష్టంగా చెప్పాలి ఏదో ఒకటి రమణీ యంగా చెప్పడంకాదు. సౌందర్య

పిపాసా, సత్యాన్వేషణా బలంగా వుండి. వాటికి మన దైనందిన జీవితంలో స్థానం కల్పించాలి. జీవితాన్ని ఉజ్జీవింపచేసుకోవాలనే ఆకాంక్ష అక్షరాక్షరంలోను కల్పించాలి అభ్యుదయ రచయిత. అభ్యుదయ రచయితనని చెప్పుకోక పోయినప్పటికీ అభ్యుదయ రచన చేసినవారు అనేకులు ఉన్నారు. వీళ్ళలో కొందరు 'నీవుఅభ్యుదయ రచయిత'వని చెబితే కోపగించుకుంటారు కూడా. క్షణక్షణమూ దోపిడీకీ, దగాకు గురియైపోతున్న ఈనాటి సమాజంలో అభ్యుదయ రచయితలు నిర్వర్తించవలసిన బాధ్యతలు ఎన్నో ఉన్నాయి. మీరు రచన రచనకోసమని చెయ్యకుండా జీవితాన్ని రమణీయం చేసేందుకు చెయ్యాలి. సాంఘిక మూఢవిశ్వాసాలను ఖండించడంతో మీ పని తీరిపోదు. అభ్యుదయోద్యమాలకు చేయూతనివ్వడంతో సమాప్తికాదు.

ఈ జగత్తునే స్వర్గంగా మార్చాలి. ఇక్కడ సుఖమయజీవితం సమాన ప్రతిపత్తితో గడిపేందుకు, అందరికీ సమానంగా అవకాశాలు సృష్టించాలి. స్వేచ్ఛకు, శాంతికి వెన్నెలదారులు పూలవంతెనలు కట్టాలి.

రాళ్ళతో, రంగులతో కట్టే పెద్దపెద్ద భవనాలుకావు. అంతకంటే అమూల్యమైన 'జీవితాన్నే కడతారు' రచయితలని, లెనిన్ చెప్పిన మాటలు మరచిపోకూడదు. మీరు కష్టేపంతెనలు, అసూయ అజ్ఞానం, మౌఢ్యాలనుంచి మానవులను దాటించేందుకు.

స్పెయిన్‌లో, చైనాలో, ఫ్రాన్సులో అభ్యుదయ రచయితలు ఎప్పుడూ తమ దేశ స్వాతంత్ర్య పోరాటాలను ముందుండి నడిపారు. దేశాన్ని నలుపైపులా శత్రువులు ముట్టడించినప్పుడు వారి ఆదర్శాలకు ముప్పు వచ్చినప్పుడు సాయుధులై పోరాడారు. దీనికి ఒకటే నిదర్శనం. మన పాలకులు తమ పరిపాలనలో ఘనంగా కట్టించిన కారాగారాలలోనుంచి వచ్చిన సాహిత్యం ఎట్లాంటిది?

నేటి సామాజిక జీవితాన్ని పునర్నిర్మించేటందుకు మన రచయితలు కూడా ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించాలు.

దేశంలో విజృంభిస్తున్న విప్లవోద్యమాలన్నింటితో అభ్యుదయ రచయితలు సంబంధం పెట్టుకొని, వాటిని అర్థం చేసుకొని, వాటి వికాసానికీ, చారిత్రకాభివృద్ధికీ దోహదంచేసే రచనలు చెయ్యాలి. వాటిని ప్రజలకు అందించి వారు ఈ నవయుగ పరిణామాలను అర్థంచేసుకొనేట్టు చెయ్యాలి.

స్నేహితులారా! ఇది మనం నెరవేర్చవలసిన బాధ్యత. సాధించవలసిన కనీస ధర్మం!

అభ్యుదయ రచయితలని మనం పెట్టుకొన్న పేరు సార్థకమయ్యేట్టు మీ కృషి సాగించండి!!

నడిపించు, నావికా !

శ్రీ 'మురళి'

నడిపించు నావికా
నడిపించు నీ నావ
అలసి సొలసిన హృదయము
ఆగిపోవక మునుపె

నట్టనడి సాగరము
నడిరేయి తిమిరంబు
దాటి వచ్చామింక
దాపుకొచ్చెను ఒడ్డు

సుడిగాలి వీవనలు
ప్రళయాగ్ని జ్వాలికలు
శాంతికిదె శిరమొగ్గె
దీపస్తంభం బదిగో

ఆశ లుడుగకుమోయి
అరుణ తారల్లదిగో
నైరాశ్య మానసము
నుదయకాంతుల నింప

చిరకాలముల వాంఛ
స్వాతంత్ర్య రేఖదిగో
కష్టాలు గట్టెక్క
దరిజేరు నీ నావ

పగిలిపోయిన గుండె
యెండిపోయిన మోడు
అణగిపోయిన కోర్కె
లేదటా లోకాన

మానసంబుల లోన
మాసిపోవని పుండు
మానవత్వపు సంత
మృగ్యంబులట నచట

హృదయాలలో నచట
పండువెన్నెల కురియు
భావాంబరంబులో
హాసరేఖలు మెరయు

కళ ద్వారా చిత్రకారులు దేశాభ్యుదయానికి కృషి చేయాలి!

ఆంధ్ర అభ్యుదయ రచయితల చతుర్థ మహాసభలో కళాప్రదర్శన ప్రారంభకులు శ్రీ సి. ఆర్. చిత్ర గారి ఉపన్యాసం

ఈ ఆంధ్ర చిత్రకళా ప్రదర్శన ప్రారంభోత్సవం చెయ్యమని నన్ను మీరు ఆహ్వానించి నందుకు మీకు ఎంతో కృతజ్ఞుణ్ణి. నేనూ ఒక చిత్రకారుణ్నే కాబట్టి సహజంగా ఇందుకు అంగీకరించే వాణ్ణికాదు. అయితే నా మిత్రుడు శ్రీ కృష్ణశాస్త్రి ఎంతో పట్టుపట్టాడు.

వృద్ధిలోకివస్తున్న ఆంధ్రయువకుల చిత్రాల నన్నింటినీ ప్రదర్శిస్తున్నామని 'నిర్వాహకులు' తెలియజేశారు. ఇంక నేను కాదనలేక పోయాను. మనచిత్ర కళ సక్రమమార్గాలలో పెంపొందాలని నా కోరిక. ఇక్కడ ప్రదర్శించిన చిత్రాలలో ఒక క్రమమయిన సుస్పష్టమైన పరిణామంద్యోతక మవుతున్నది. మన చిత్రకళాచరిత్రలో ఒక నూతనాధ్యాయానికి, ఒక నవయుగోదయానికి ఇవి దోహదం చేస్తున్నాయి.

రాజకీయాలలో, ఆర్థిక విధానాలలో మార్పులు వచ్చినట్టే, ఈ చిత్రకళారీతులలోనూ మార్పులు వస్తుంటాయి. కాలంతోపాటు ఈకళ మారితేనే మన జాతీయదృక్పథాన్ని స్పష్టంగా, సజీవంగా చిత్రించ గలుగుతుంది.

శతాబ్దాల మన ఆంధ్ర కళాచరిత్రా, దాని విశిష్టతా ఎక్కువగా ముచ్చటించి కాలహరణం చెయ్యదలచుకోలేదు. సూక్ష్మంగా కొన్ని విషయాలు ప్రస్తావిస్తాను.

'అజంతా శిల్పాలు' వెలసేనాటికి, ఆంధ్ర శిల్పకళకు ఒకస్థిరమైన రూపం ఏర్పడింది. 'అమరావతి' పట్నం ఈ చిత్రకళా కృషికి ఆటపట్టయింది. ఆనాటి 'అమరావతీ శిల్పాలు' ఈనాటికీ ఆదర్శప్రాయంగా ఉన్నై. తర్వాత ఆంధ్ర రాజుల పోషణలో ఈ కళలకు 'నాగార్జున కొండ' కేంద్రమైంది. చిత్రాలు, శిల్పాలు ఇక్కడ పెంపొందాయి. పిమ్మట, మన చిత్రకళలో వాసికెక్కిన 'ఉత్కళరీతులు' వచ్చాయి. ఇవి దాక్షిణాత్య, ఔత్తరాహరీతుల మేళికలయిక. దక్షిణ దేశీయుల సౌకుమార్యమూ, ఉత్తర దేశీయుల విభవమూ ఇందులో బలంగా నిండుగా ఉంటుంది.

ఇటీవలి మన విజయనగర రాజుల కాలం నాటి చిత్రాలు, శిల్పాలు ఆతర్వాత వచ్చాయి. మన దక్షిణదేశంలో కృష్ణ రాయలవంటి ప్రభువులు ఈ కళలను పాదులుకట్టి పెంచారు.

మన చిత్రకళకూ, శిల్పకళకూ ఎంతో చరిత్ర ఉంది. యుగయుగాలుగా ఆరక వెలిగే ఈకళాజ్యోతులను మనం తేజరిల్ల జెయ్యాలి. చిత్రకళా కృషిలోనూ మన ఆంధ్రులు అన్ని రాష్ట్రాలకు తీసిపోరన వచ్చు.

19 వ. శతాబ్దారంభంలో విఖ్యాత వంగ చిత్రకారులు ఒక నూతన పద్ధతిని ప్రవేశపెట్టారు. పాశ్చాత్యరీతుల్లో భావాలను వ్యక్తపరచడం పనికిరాదని, ప్రాచీన సాంప్రదాయాలనే పునరుద్ధరించారు. ఈ ఉద్యమ ప్రభావం ఆంధ్రదేశం మీదకూడా పడ్డది. మన దేశీయులు ఈ నూతన చైతన్యంతో 'జాతీయ కళా విలయం'లాంటి కేంద్రాలను నెల కొల్పారు. ఆరోజులలో ఉత్సాహవంతులైన మన చిత్రకారులు అపూర్వమైన తమ సృజనాశక్తిని వెల్లివిరియజేసే ఉత్కృష్టమైన చిత్రాలు వేశారు. ప్రసిద్ధ బెంగాలీ చిత్రాలతో అవి తులతూగేట్టు చేశారు. ఈ ప్రదర్శనంలో, మీరు చూడబొయ్యే చిత్రాలలో, మన ప్రాచీన కళా రీతులలో వేసిన ఉత్తమమైనవి ఎన్నో ఉన్నాయి.

ఇక్కడి చిత్రకారులను, ఇంతటితో సంతృప్తిజెందక, ఈకృషి ఇంకా ఇంకా సాగించి వారు ఈ కళాభ్యున్నతికి ఎంతో తోడ్పడాలని కోరుతున్నాను.

ఈ కళ వికసిస్తూ ఎంతో వృద్ధి పొందుతున్నది. ఇంకా వృద్ధిపొందుతుంది. వేగంగా మారుతూ ముందుకు పోతున్న ఈ కాలంలో, అభివృద్ధిజెందుతున్న ఈ కళలతో ముందుకు పోలేని వారు 'ఒకనాటి మనుషులు' 'అనగా అనగా' అన్నట్టయిపోతారు.

అనుస్యూతంగా వస్తున్న ఈ ఆంధ్ర అభ్యుదయ కళావాహినిని ముందుకు తీసుకుపోవాలనే లక్ష్యంతో చేస్తున్న మీ కృషికి ప్రోత్సాహం ఊతం ఇవ్వడానికి నేను మీ ఆహ్వానాన్ని అంగీకరించాను. ముందు ముందు మన జీవితపథాలలో ఎన్నో మార్పులు రానున్నాయి.

మారే మన జీవితానికి, మనదేశ భావి భాగ్యోదయానికి మీ కళద్వారా మీరు చేయవలసింది ఎంతో ఉంది. మన జీవితానికి అదే జీవం. మీ కృషి విజయవంతం కావాలనీ, ఈ చిత్రాలు అందరూ చూడాలనీ అభిలషిస్తున్నాను.

చూడండి - ఇవిగో - మనచిత్రాలు !


★



శ్రీమతి దర్శి సుభద్రమ్మగారు

(కోశాధికారిణి)

ఆంధ్ర అభ్యుదయ రచయితల సమ్మేళనమహాసభ



ఆహ్వాన సంఘాధ్యక్షులు
శ్రీ వి. గోవిందరాజాచారి

ప్రారంభకులు
శ్రీ కె. ఎ. అబ్బాస్

అధ్యక్షులు
శ్రీ పి. వి. రాజమన్నారు

ఉపదేశం సందేశంలేని సాహిత్యం గొప్ప సాహిత్యం కాజాలదు!

అభ్యుదయ కవి సమస్యను వ్యక్తం చేసి కర్తవ్యం స్ఫురింపజేస్తాడు!

మహాసభాధ్యక్షులు

శ్రీ పి. వి. రాజమన్నారుగారి ఉపన్యాసం

ఈ ఆంధ్ర అభ్యుదయ రచయితల చతుర్థ మహాసభకు అధ్యక్షత వహించడానికి అర్హత నాకేమాత్రమైనా ఉందా లేదా అనే ప్రశ్నకు సమాధానం తక్షణం చెప్పమంటే చెప్పలేను. అధ్యక్షోపన్యాసం సాంతంగా విన్న తరువాత ప్రాజ్ఞులైన సభాసదులకే గాని ఆ ప్రశ్నకు జవాబుచెప్పడానికి నాకు అధికారం లేదు,

ఆదరం, అభిమానం, ఆపేక్షతో ఆహ్వానించారు. సంఘం తరపున శ్రీ చదలవాడ పిచ్చయ్యగారు. పిలిచి పిల్లనిస్తే వద్దనలేని బ్రహ్మచారివలె అంగీకరించాను, తగినవరుణ్ణి కానేమోనని ఆలోచించకుండా. సూత్రధారణమైన తరువాత విచారం నిరుపయోగం. కనుక హృదయపూర్వకంగా కృతజ్ఞతతో వందనాలు అర్పిస్తున్నాను.

ఈ సభ మద్రాసు పట్టణంలో జరగడంలో అనౌచిత్యం ఏమీలేదు. ఈ నగరం ఆధునిక ఆంధ్రసాహిత్యానికి విజ్ఞానానికి చాలాకాలంనుంచీ ప్రఖ్యాత కేంద్రంగా ఉన్న విషయం నిస్సందేహం. రాయప్రోలు సుబ్బారావుగారు తమ కావ్యాల్ని మొదట ఈ పట్టణం నుంచే ప్రచురించారు. బసవరాజు అప్పారావు (నా ఆప్తస్నేహితుడు) ఈ ఊళ్ళో నుంచే తన గీతాలు ఎన్నో వ్రాశారు. ఆంధ్రపత్రిక జన్మస్థానం ఇది. ప్రస్తుతం ఆంధ్రప్రభ, భారతి మొదలైన దినపత్రికలు, వారపత్రికలు, మాసపత్రికలు ఈ పట్టణంలో ప్రకటింపబడుతున్నవి. కొంచెం స్వంత విషయం చెప్తాను మన్నించండి. ఇరవైనాలుగేండ్లకు పూర్వం, ఈ పట్టణంలో నేను "కళ" అనే సచిత్ర మాసపత్రిక సంపాదించేవాణ్ణి. ఆ పత్రికకు తమ రచనలు దానం చేసిన మహనీయుల్లో కొందరి పేర్లు చెప్పితే మీకు ఆశ్చర్యం కలగవచ్చును. కొమర్రాజు లక్ష్మణరావుగారు, మానవల్లి రామకృష్ణకవిగారు, వేటూరి ప్రభాకర

శాస్త్రిగారు, బసవరాజు అప్పారావు, నోరి నరసింహశాస్త్రి, దువ్వూరి రామిరెడ్డి, భమిడిపాటి కామేశ్వరరావు మొదలైన వారు. కొమర్రాజు లక్ష్మణరావుగారు నేను వేడుకొంటే కళలపైన అతి సరళంగా వ్యాసాలు వ్రాశారు. రామిరెడ్డిగారు కవిత్వతత్వాన్ని గురించి వ్రాశారు. పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు వివిధ విషయాలమీద విపులంగా వ్రాసేవారు. చిన్నకథలు, ఏకాంక నాటికలు, గీతాలు, విమర్శలు, సాహిత్య చర్చలు, వింతలు, వినోదాలు అన్నిటితో నింపేవాళ్ళం పత్రికను. అప్పటికి భారతి ఇంకా ప్రారంభం కాలేదు. ఇంతగా చెప్పటానికి కారణం మద్రాసు నగరానికీ, నాకూ, చాలాకాలంనుంచి సాహిత్యంతో పరిచయం ఉన్నదని మనవి చేసుకుంటున్నాను.

ఇంతేకాదు, రేడియో ఫిల్ము స్టూడియోలు వచ్చినప్పటినుంచి కళావికాసానికి, వాఙ్మయ వైభవానికి మద్రాసు నిలయమైపోయింది. అటువంటి పట్టణంలో ఈ మహాసభ జరపడం సమంజసంగా వుంది. అందులో ఔచిత్యమే కాక అవశ్యకత సహా విదిత మవుతూ వున్నది.

ఇది అభ్యుదయ రచయితల సభ. నాలుగవ మహాసభ అయినప్పటికీ అనేక ప్రశ్నలు స్ఫురించక తప్పదు. అభ్యుదయ రచయితలంటే ఎవరు? ఆ పేరుతో సంఘంవున్నది అందరికీ తెలుసును. అయితే ఆ సంఘంలో సభ్యుడు కాని వాడు అభ్యుదయ రచయిత కాడా? సభ్యుడయినంతమాత్రాన అవుతాడా? ఈ సంఘం స్థాపించి నాలుగేండ్లన్నా కాలేదు గదా! అంతకుముందు అభ్యుదయ రచయితలే లేరా?

ఈ ప్రశ్నల్లో కొన్నింటికి ప్రత్యుత్తరము ఇవ్వడం సులభం. సంఘంలో సభ్యుడైనంతమాత్రాన ఎవ్వడూ అభ్యుదయ రచయిత కాజాలడు. సభ్యుడు కానంతమాత్రాన కాకపోడు. అభ్యుదయ రచయితలు నాలుగేండ్లనుంచే సృష్టింపబడుతున్నారని ఎవ్వరూ చెప్పరు. ప్రతి యుగంలోనూ ప్రతి దేశంలో ప్రతి భాషలో అభ్యుదయ రచయితలు ప్రభవిస్తూ వుంటారు. ఎప్పుడు అట్టి రచయితలు ప్రభవించరో అప్పుడు ఆ వాఙ్మయం జీవచ్ఛవంలాగ వుంటుంది కీర్తిశేషమై, గత వైభవమైన నేటి సంస్కృత వాఙ్మయస్థితి అటువంటిదే. అట్టిదే లాటిన్, గ్రీక్ వాఙ్మయస్థితి. ఈ భాషల్లో గొప్ప కవినిగాని, గొప్పకృతిని గాని పేర్కొనవలెనంటే కొన్నివందల సంవత్సరాలు వెనక్కి వెళ్ళవలసి వస్తుంది.....దీనికి కారణం ఆ భాషల్లో ఆ తరవాత అభ్యుదయ రచయితలు లేక పోవడంచేత.

ఒక్క ప్రశ్నమాత్రం వుండిపోయినది. అభ్యుదయ రచయిత అంటే ఎవరు? అభ్యుదయ రచనకు లక్షణాలేవి? ప్రత్యేకగుణం, విశిష్టత ఏమి? ఈ విషయం గురించి నేను చెప్పదలచుకున్న మాటలు నా అభిప్రాయాన్ని మాత్రమే సూచించగలవు. భిన్నాభిప్రాయాలు వుండక తప్పవు.

అభ్యుదయ రచయితకు పర్యాయపదంగా 'Progressive Writer' అనే

ఇంగ్లీషుపదం వ్య వ హా ర ం లో ఉన్నది. Progressive అన్న పదం Progress కు వి శే ష ణ రూ ప ం. Progress లాటిన్ ధాతువు 'progre-ssus' నుంచి వచ్చింది. అంటే "ముందుకు పోవడం" అని. ఇంగ్లీషులో ఈ వ్యుత్పత్తి అర్థంకూడావాడుకలోవున్నది. 'Progress of journey' అంటాము. శాస్త్ర, సాహిత్య, జీవిత పరంగా ఉపమా వాచకంగా 'advance' అనే అ ర్థ ం రూఢియైపోయింది. అంటే పూర్వస్థితి కన్నా మంచిస్థితికి రావడం. ఈ అర్థం తోనే 'అభ్యుదయం' అనే పదాన్ని ఉపయోగిస్తున్నాము.

"Progress is the Law of Life" (అభ్యుదయమే జీవితానికి మూల సూత్రం) అన్నాడు సుప్రసిద్ధ కవియైన బ్రౌనింగు (Browning).

"Progress is not an accident but a necessity ... It is part of nature" (అభివృద్ధి అనేది అకస్మాత్తుగా వచ్చే మార్పుగాదు. సజీవంగా వచ్చే సహజమైన మార్పు; జీవితానికి ఎంతో అవశ్యకమైంది) అని ఘోషించినాడు జ్ఞాననిధియైన హెర్బర్టుస్పెన్సర్ [Herbert Spencer.]

Progress (అభ్యుదయం) అనే భావంలో రెండు గుణాలు గర్భితంగా వున్నవి: ఒకటి మార్పు, రెండవది వృద్ధి.

మార్పు లేకపోతే అభ్యుదయమే లేదు. వ్యక్తికిగాని సంస్థకుగాని జాతికిగాని సంఘానికిగాని .... సజీవంగా వుండడమంటేనే మారుతూ వుండడం.

It is Nature's law to change Change is in-evitable. In a progressive country change is constant (Disraeli) [మారడమనేది ప్రకృతిలక్షణం. మార్పు రాక తప్పదు పురోగమిస్తున్న దేశంలో నిరంతరంగా మార్పులు వస్తూనేఉంటాయి.(డిస్రాలీ)]

భౌతిక ప్రపంచంలో ప్రతిక్షణము మార్పు. జీవప్రపంచంలోనూ అట్లే.

"Change is the whole principle of Life" [మారడమనేది జీవితం యొక్క ప్రధానలక్షణం.] అని మొన్ననే Prof. Low వ్యాసంలో చదివాను.

సాంఘిక జీవితంలో సహా కాలాను గతంగా మార్పులు కలుగుతూ వుంటవి. రాజకీయ, ఆర్థిక మత పరిస్థితులు మారుతూ వుంటవి. అలాగే ఆశయాలు, ఆదర్శాలు, విశ్వాసాలు, సహా మారుతుండడం సహజం.

అయితే ఏ మార్పయినా అభ్యుదయమేనా? కాదు. క్షీణించి నశించడం కూడా మార్పే కావచ్చును. కాని అది అభ్యుదయం కా జా ల దు. [లోకకళ్యాణానికి తోడ్పడే మార్పే అభ్యుదయం. అభివృద్ధి ద్యోతకమైన మార్పే అభ్యుదయం.] అభ్యుదయ సాహిత్యానికి పైజెప్పిన రెండూ లక్షణాలు. ఒకటి మార్పు రెండవది ప్రయోజకత్వమైన వృద్ధి సాహిత్యంలోమార్పు ఆవశ్యకమా? కాదని చెప్పడానికి ఎవ్వరూ సాహసించరు మా ర్పు ఆవశ్యకం, స హ జ ం, స్పష్టం. కవికీ సంఘానికి జీవితానికి ఎడతెగని సంబంధంకలదు. కవులు ఒక విధంగా చూస్తే స్వతంత్రులు,

సృష్టికర్తలు. ఇంకొక విధంగా సమకాలీన పరిస్థితులకు వశవర్తులు. Shelly మహాకవి అన్నట్లు,

"Poets, not otherwise than
philosophers, painters,
sculptors and musicians,
are in one sense the
creators and in another
the creators of their age.
From this subjection
the loftiest do not escape."

(ఒకవిధంగాచూస్తే కవులు; తత్వజ్ఞులు. చిత్రకారులు, శిల్పులు, గాయకులకంటే స్వతంత్రులుసృష్టికర్తలు. ఇంకొక విధంగా చూస్తేసమకాలీన పరిస్థితులకు వశవర్తులు. ఎంత గొప్పకవి అయినా సరే దీన్ని అతిక్రమించలేడు.)

రాయప్రోలు సుబ్బారావుగారు రమ్యాలోకంలో "కాలధర్మానుగతమై జగత్ప్రవృత్తి మారునపుడు వాఙ్మయమును మారు, నిజము" అన్నారు.

కవికీ సంఘానికీ, కాలానికీ సంబంధం క్రొత్తదికాదు, అనాదిగా వస్తున్న సాంప్రదాయమే. ఏ భాషలోని సాహిత్యం పరిశీలించినా ఈసత్యం గోచరించక తప్పదు. ఆ యా కాలపరిస్థితులు చక్కగా ఆకలించుకొనే మహాకవులు రచన సాగించారు ఇది కేవలం పాశ్చాత్య సాంప్రదాయం కాదు. "మన ప్రాచీన వాఙ్మయం దేశకాలానుగుణ్యంగా వెలసినదే కాని గాలికి పెరిగినది కాదు. ఆయా కాలములలోని రాజకీయ మత పరిస్థితుల దేశపరిస్థితుల పరిణామం కారణంగా, ఆవిష్కారం పొందింది మన వాఙ్మయం ....తమ కాలంలోని పరిస్థితులు ఆయా కవుల హృద్గతభావాలను కలచివేయగా, తత్పరిణామముగా వెలసిన కావ్యాలు మన ప్రాచీనప్రబంధాలు.. మనదేశచరిత్ర మనకు సరిగా అవబోధం కాకపోవడం వల్ల, మనకు సరియైన చారిత్రకదృష్టి లేకపోవడంవల్ల మనం ఈ యఖండ సత్యాన్ని గుర్తించలేకుండా ఉన్నాము." ఈ వాక్యాలు నావికావు. నాకన్నా వెయ్యిరెట్లు పాండిత్యం, విజ్ఞానం, ప్రతిభా సామర్థ్యంకలిగిన శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారివి.

ఆవిధంగా దేశకాలపరిస్థితి పరిణామాత్మకంగా, సంఘజీవిత ప్రతిబింబితంగా, ప్రాచీన పూర్వకవులందరూ అభ్యుదయకవులే నన్నయ, తిక్కన, పాల్కురికి సోమనాథుడు, శ్రీనాథుడు, అల్లసాని పెద్దన, కృష్ణదేవరాయలు, నన్నయ భారతం తెలుగులో వ్రాయడం [illegible]కాదు. [illegible]. నన్నయ భారత రచన అభ్యుదయ రచన అభ్యుదయరచన రెండు లక్షణాలకు మహోన్నతమైన ఉదాహరణ. సంఘజీవితంలో మతపరిస్థితుల్లో కలుగుతూవున్న మార్పుకు అనుగుణంగా, అనుకూలంగా సాహిత్యరచనలోమార్పు అంటే క్రొత్తపోకడ; ధర్మసంస్థాపనాదర్శానికి ప్రోద్బలంగా లోకసంగ్రహార్థంగా | జనంలో వేద పురాణేతిహాసాలపై భక్తి వ్యాపింపచెయ్యడమనే ప్రయోజనత్వం -- నన్నయను ఆంధ్రకవులలో మొదటి అభ్యుదయ కవి అని నా అభిప్రాయం.

ఆయుగంలో నన్నయ తిక్కనల వలెనే, ఈ శతాబ్ది ప్రారంభ కాలంలో

వీరేశలింగంగారు. గురజాడవారు అభ్యుదయ కవీశ్వరులు. కాని, ఈ శతాబ్దంలో రాయలనాటి పరిస్థితుల కనుగుణ్యంగా వ్రాసిన మనుచరిత్రకు నకళ్ళువ్రాస్తే ఆరచన అభ్యుదయ రచనకాదు; ముమ్మాటికి కాదు.

అభ్యుదయ రచన సమకాలీనమైన జీవిత పరిస్థితులకు రాజకీయ వాతావరణానికి, ఆర్థికసమస్యలకు, సమాజ సంఘర్షణలకు, నైతిక సందర్భాలకు, ఐహికాముష్మిక సిద్ధాంతాలకు, వైజ్ఞానిక విశేషాలకు అనుగుణ్యంగా, అనుకూలంగా తగినట్టి, అవసరమైనట్టి మార్పులతో విలసిల్లవలెను.

ప్రపంచపరిస్థితులు ఇంత ప్రచండ వేగంతో పూర్వం ఎప్పుడూ మారలేదు. మనదేశంలో కూడా అంతే. రాజకీయ కారణాలవల్ల విద్యావిధానం మారింది. ప్రాచీనకాలంలో విద్య బ్రాహ్మణ క్షత్రియాధీనంగా ఉండేది; ఆతరువాత ఇతర వర్ణస్థులలో కొంత కొంత వ్యాపించినప్పటికి నూటికి తొంభైపాళ్ళు విద్యావంతులు ద్విజులుగానే ఉండేవారు. ఆ స్థితి మారిపోయినది; ఇప్పుడు విద్యావంతులు అన్ని కులములలో నున్నారు. అన్ని వర్ణములవారికిని విద్యాభ్యాసము అందుబాటులోనికి వచ్చింది. అభ్యసించే విద్యకూడా మారిపోయినది. పాశ్చాత్య సంస్కృతి సంపర్కం చాలా హెచ్చు అయిపోయినది. కళాశాలల్లో శాస్త్రములన్నీ ఆంగ్లభాషలోనే అభ్యసించడం తప్పని సరియైనది. ప్రతి దినమును విద్యావంతుల సంఖ్య ఎక్కువై పోతూ వున్నది. పూర్వకాలంలో కావ్యాల్ని పఠించడానికి అధికారం, శక్తి స్వల్ప సంఖ్యాకులకే ఉండేవి. వారందరికిసమాన సంస్కృతి ఉండేది. నేడు సంఖ్య హెచ్చినది; సంస్కృతి భిన్న భిన్నమైనది.

రాజకీయంగా జాతీయ గౌరవము దేశాభిమానం, స్వాతంత్ర్యాభిలాష అనే భావాలు చాలా ప్రబలమైనవి. ఆర్థిక సమస్యలు మిక్కిలి గడుసైపోతున్నవి. స్త్రీ పురుష సంబంధం గురించి; ఇతర ఆచారవ్యవహారాల గురించి; నూతన సిద్ధాంతాలు బయలుదేరినవి. క్రొత్త విజ్ఞానం అనుక్షణం సువేద్యమవుతుంది. ప్రయాణ సాధనాలు ఈ విశాలజగత్తును చిన్న పల్లెగా చేసివేస్తున్నవి. ఇన్ని మార్పులు చూస్తూ కండ్లుమూసుకోవడం శ్రేయస్కరమేనా? "క్రొత్తరారాదని యెవడను బిగించుకొని కూర్చుండరాదు" అని అన్నారు విశ్వనాధ సత్యనారాయణగారు. కూర్చుండనివ్వదుకూడాను ప్రపంచశక్తి.

ఈ మార్పులు సాహిత్యరంగం ప్రవేశింపకుండడం అసాధ్యం. ప్రవేశించి, జీవితంతో అల్లుకొనక తప్పవు. వాటికి అనుగుణంగా సాహిత్యంమారితేనేగాని ఉత్తమ సాహిత్యం కానేరదు. అటువంటి సాహిత్యమే అభ్యుదయ సాహిత్యం.

మార్పు మూడు అంశాలలో ఆవశ్యకంగా కనబడుతున్నది నాకు. విషయంలో, రీతిలో, భాషలో.

మొదటిది విషయం. ఒక్క దృష్టిలో కావ్యవస్తువు సర్వత్ర సర్వదామార్పు లేనిది. జగత్ ప్రవృత్తి, జీవితానుభవం

ఇదే కదా కావ్యసామగ్రి. ఆకారణంచేతనే ఇంకోదృష్టిలో వస్తువు మారుతూవుంటుంది. సాహిత్యం జీవితానికి దూరం కాగూడదు. ఎప్పుడు దూరమవుతుందో అప్పుడు నిర్జీవమై శుష్కించి నశించి పోతుంది. పూర్వకవులందరు ఒక్కటే కావ్యవస్తువునే ఉపయోగించుకొన్నారు. షేక్స్పియరు గొప్పనాటకకర్తయే. కాని ఆతని కాలపు జీవితం అదృశ్యమై పోయినది. ఇబ్సన్, షావంటి నాటక కర్తలు షేక్స్పియర్ ఉపయోగించిన కావ్యవస్తువునే ఉపయోగించి నాటకాలు వ్రాసివుంటే వారి ప్రతిభ ఆవిష్కరించడానికి అవకాశం ఏమాత్రమైనా ఉండేదా?

మన సాహిత్యానికి లక్షణాలు మహా పండితులైనవారు శాసించి వున్నారు. వాటిని అతిక్రమిస్తే ఉత్తమకావ్యం ఎలా సృష్టించడం అని అనుకోడం చాలా పొరపాటు. అలంకార శాస్త్రాలు, లక్షణ గ్రంధాలు కావ్యవిమర్శనకు ఉపకరించవచ్చు. అవి కేవలం శిల్పాన్ని నిర్దిష్టంచేస్తాయి కావ్యవస్తువును నిర్దేశించవు. అది అపారమైన మన జీవితానుభవాలనుంచి సేకరించుకోవాలి" అనే శ్రీరంగం శ్రీనివాసరావుగారి అభిప్రాయంతో నేనుపూర్తిగా అంగీకరిస్తున్నాను

ఉదహరిస్తాను, కవికి ఉపకరించని వస్తువు లోకంలో లేదు. ఎటువంటి వస్తువునైనా రసనిష్పత్తి కలిగేటట్లు చిత్రింపగలడు.

"రమ్యం జుగుప్సిత ముదార
మథాఒపినీచం
ఉగ్రం ప్రసాది గహనం
వికృతంచవస్తు
యద్వాఒప్యవస్తు కవి భావక
భావ్యమానం
తన్నాస్తి యన్నరసభావ
ముపైతిలోకే"

అని దశరూపకంలో శ్లోకం. ఏవస్తువైనాసరే కవి రసాలవాలంగా చేయవచ్చును. కవి రమ్యంగా వున్న విషయాన్నే వస్తువుగా గ్రహిస్తాడనే మూఢ అభిప్రాయం రసస్వరూపం తెలిసినవాళ్ళకెవ్వరికీ ఉండదు

రసస్వరూపంమారక పోవచ్చుగాని ఆ రసాన్ని పోషించడానికిన్నీ రసాన్ని పాఠకులకు, సామాజికులకు ఆస్వాద యోగ్యంగా చేయడానికిన్నీ అనుభవ వేద్యంగా వుండే వస్తువు ఆవశ్యకం. ఒక కాలంలో శోకరసం ఉత్పన్నమయ్యే సందర్భం ఇంకొకకాలంలో కన్నీటి బొట్టుకుకూడా కరవగును. నలుగురు భార్యలతో కాముక జీవితం విసిగిపోయేటట్లు అనుభవించిన దక్షిణనాయకుడు ఇంకో క్రొత్తపిల్ల కనబడగానే మోహపాశబద్ధుడై, త్వరగా సంయోగం ప్రాప్తించక, విదూషకుడితో ఆ వేగన వెళ్ళబోసుకుంటూ వుండే ఒకప్పుడు ఒక రకమైన పాఠకులకు సభ్యులకు ఆకర్షణీయంగా ఉన్నరోజులు వెళ్ళిపోయినవి అలాంటి రాజులు మన సంఘంలో అదృశ్యులై పోతున్నారు. ఇక మీద అట్టి సందర్భాలు జీవితానికి చాలా ఎడమై పోతవి. ఈ యంశాన్ని రామలింగా రెడ్డిగారు తమ సహజహాస్య ధోరణిలో బాగా వాక్రుచ్చారు. ఇలాగ

"శోకరసము వర్ణింపవలయునన్న ననుకూలమగు సందర్భ మెయ్యది?

క్రొవ్వు కాటెడి నాయికా నాయకుల యూహా మాత్రములైన కష్టములా? ప్రజలు దినదినము కన్నీరు గార్చుటకైన నవకాశములేక కుడుచుచుండు పరిపరి విధములైన గోడులా?"

అభ్యుదయ సాహిత్యానికి వస్తువు, విషయం. యదార్థజీవితంనుంచే స్వీకరించడం ప్రధానం. స్వానుభవదూరమైన విస్మృతజీవితంనుంచి గ్రహించిన వస్తువులో చైతన్యం ఉండదు.

యదార్థజీవితం, సమకాలీన పరిస్థితులు అని అన్నాను. ఈ పదాల్ని సంకుచితంగా అర్థం చేసుకోకూడదు. కండ్లయెదుట జరుగుతూ వున్న కార్యాల్ని వర్ణించడమే అభ్యుదయరచన, తదితరమైనది కాదని తీర్మానించుకోకూడదు అభ్యుదయసాహిత్యం ప్రస్తుత జీవితానికి ప్రతిబింబం- అంతే వార్తాపత్రికలలో రిపోర్టే గొప్పరచన అని కాదు.

ఏయే భావాలు, ఏయే ఆదర్శాలు, ఏయే సంఘర్షణలు, ఏయే సమస్యలు యదార్థజీవితంలో ప్రబలివుంటవో అవి అన్నీ అభ్యుదయరచనకు సామగ్రియే. వాటికి అనుగుణంగా ఉండే పూర్వచరిత్రలోని ఘట్టాలు, పురాణవాఙ్మయంలోని గాథలుకూడా అభ్యుదయరచనకు ఉచితమైన వస్తువులే. ఎలిజబెత్ కాలంలో ఇంగ్లండులో ప్రజ్వరిల్లిన జాతీయాభిమానం షేక్స్పియరు చరిత్ర నాటకాల్లో తొంగిచూడకసలాడుతూ వుంటుంది. ప్రకృతిశాస్త్రజ్ఞానము అనేక విధముల దినదిన ప్రవర్ధమానమవుతున్నది. సర్వవ్యాప్తమవుతున్నది. తన్మూలంగా లభ్యమైన కొత్తజ్ఞానం ఉత్పన్నమయ్యే క్రొత్తభావాలు-ఇవికూడా అభ్యుదయ రచయితలకు ఉచిత వస్తువులే అగును. Wordsworth మహాకవి తన Lyrical Ballads ఉపోద్ఘాతంలో ఈ విధంగా వ్రాసుకొన్నాడు.

> "If the labours of Men of Science should ever create any material revolution direct or indirect in our condition and in the impressions which we habitually receive, the Poet will sleep no more than at present; he will be ready to follow the steps of the Man of science."

(శాస్త్రజ్ఞుల నిరంతర కృషిఫలితంగా యదార్థజీవితంలో వచ్చే ప్రధానమైన మార్పులూ, వాటివల్ల మన ఉనికిలో, భావనలో, నడవడికలో అనేక రూపాలలో వస్తున్న మార్పులను, ఇప్పుడు కవి గుర్తించకుండా నిర్లక్ష్యం చెయ్యడానికి వీల్లేదు అప్రమత్తుడై, శాస్త్రజ్ఞునితోపాటు తనూ తన జ్ఞానాన్వేషణ సాగించటానికి సన్నద్ధుడై ఉండాలి)

విషయంలో మార్పుగురించి కొంత సూచించాను. రెండవమార్పు రచనా విధానంలో, పద్ధతిలో, కవిత్వరీతుల్లో, కావ్యభేదాల్లో. ప్రబంధాలు ఏ యుగానికి సరిపోయినవో ఆ యుగం వెళ్ళిపోయినది. ప్రబంధాలకు కాలం కాదిది ఇంతమాత్రంవరకు అందరూ అంగీకరిస్తారు. కానీ, క్రొత్తకవిత్వ రీతులు పూర్వరీతులకు బదులుగా సృష్టించడంకూడా సహజమని నమ్ముతారు అభ్యుదయ రచయితలు. వాస్తవికత, అధివాస్తవి

కత, Psycho analytic treatment మొదలైన సిద్ధాంతాలు యెంతవరకు మనకు ఉపకరిస్తవో అని ప్రయత్నించ డానికి కౌతూహలం వుండడంలో తప్పు లేదు. మన సంస్కృతికి సరిపోనివి ఎంతోకాలం నిలబడవు.

వృత్తాలలో, ఛందస్సులో మార్పు. ఛందోబద్ధ … కవిత్వం - ఇవన్నీ కూడా నీరసించిన కవిత్వవిధానానికి క్రొత్తబలం ప్రతిపాదించడానికే. అందు చేతనే అట్టి క్రొత్తరీతులు అభ్యుదయ సాహిత్యంలో ప్రాముఖ్యత వహిస్తవి. నూత్నభావోద్రేకానికి, శిథిల విశ్వాస నిర్మూలనానికి, అపూర్వ వస్తువర్ణనకు ప్రాతరీతులు అననుకూలంగా వుండక తప్పవు. 'శ్రీశ్రీ' గారి ప్రచండగీతాలు ఉత్పలమాల, చంపకమాలల్లో ఇమిడిపోగలవా ?

మూడవది భాషలోమార్పు. పూర్వ కాలంలో సాహిత్యం పండితులకే యేర్పడినది. కొంత పాండిత్యం లేక పోతే ఆ సాహిత్యం సామాన్యజనులకు అగమ్యగోచరంగా ఉంటుంది. అయినా అప్పటిపరిస్థితుల్లో అటువంటిసాహిత్యం సరిపోయింది. అభ్యుదయరచనా, ప్రజా సాహిత్యమూ పర్యాయపదాలై పోతూ వున్నప్పుడు భాషలో తదనుగుణంగా మార్పురాక తప్పదు. అభ్యుదయ కవి ఉపయోగించే భాష, జీవ భాష గా ఉండాలి.

" The staple of his art must always be the living infinitely variable speech he hears about him"

[అతనిచుట్టూ ఉన్న ప్రజలు నిత్యమూ వాడుకొనే మాటలూ, అనంతంగా మార్పులు చెందుతూవున్న పరిభాషా, అతని కళకి ప్రాణం] అన్నాడు అబెర క్రాంబీ తన "కవిత్వసిద్ధాంతం" లో, వ్యావహారిక భాషను విద్యుచ్ఛక్తితో పోల్చాడు.

"The nameless indefinable electricity of common speech"

[ఇదని పేరుపెట్టి చెప్పటానికి, ఇట్లాంటి దని నిర్వచించటానికి వీల్లేనివిద్యుచ్ఛక్తి వ్యావహారికభాష]

వర్తమాన వ్యావహారిక భాషే అభ్యుదయ సాహిత్యానికి తగినభాష. ఈ భాష గిడుగు రామమూర్తిపంతులుగారు చెప్పినట్లు "విద్యాభ్యాసమునకు అనుకూల సాధనమై పరిణమించి ఉన్న భాష." ఈభాషే మనదేశమందు బడులలో విద్యాబోధకు సాధనం చెయ్యటం అవసరం. అప్పుడే ప్రజాసారస్వతం విజృంభిస్తుంది. సులభంగా విజ్ఞానం సంపాదించుకోడానికి ఇదే మార్గం. మన యూనివర్సిటీలు ఇంకా ఎన్నాళ్ళు ఈ కృత్రిమ గ్రాంథిక భాషను వదలకుండా ఉంటాయో కదా ! రవీంద్రనాథఠాకూరు కలకత్తా యూనివర్సిటీనిగురించి వ్రాసిన వాక్యాలు మన యూనివర్సిటీవారికి హెచ్చరికగా స్మరించుకొంటున్నాను.

" But I have found that the direct influence which the Calcutta University wields over our language is not strengthening and vitalising but pedantic and narrow. It ried to perpetuate

the anachronism of preserving the pandit-made Bengali swathed in grammar wrappings borrowed from a dead language. It is every day becoming a more formidable obstacle in the way of our boys' acquiring that mastery of their tongue which is of life and literature. The artificial language of a learned mediocrity, inert and formal, ponderous and didactic devoid of the least breath of the creative vitality, is forced upon our boys at the most receptive period of their life :"

[మన కలకత్తా విశ్వవిద్యాలయం ఆధ్వర్యం వహించి సాగిస్తున్న భాషా కృషి. అభివృద్ధికి దోహదం చేసేదిగా లేదని నేను తెలుసుకొన్నాను. అది నీరసంగా, ఆడంబరంగా, సంకుచితంగా ఉంది. బెంగాలీ పండితుల ఆడంబరాలతో, వ్యాకరణసూత్రాలతో బిగించబడిన నిర్జీవ ప్రతిమల గా ఉంది. వాడుకలో లేక శవప్రాయంగావున్న భాషనే సుస్థిరంచెయ్యడానికి మన విశ్వవిద్యాలయం విశ్వప్రయత్నం చేస్తున్నది. ఇది నిత్యమూ మన భాషను నేర్చుకుంటూ అందులో సామర్థ్యాన్ని పెంపొందించుకొనే విద్యార్థులకు ఎన్నో ప్రతిబంధకాలు కల్పిస్తున్నది. ఇది మన జీవితానికీ, సాహిత్యానికే ముప్పు. సామాన్యంగా పాండిత్యంపేరిట సాగించే ఈ కృత్రిమభాషా కృషి, జటిలంగా, జడమై ఉంటున్నది. ఈ కృతకభాష మన హృదయాలను కదలించదు. నిర్జీవమైన భాష సృజనాశక్తిని పెంపొందించదు. ఈ కృతకభాషని నేర్చుకోమని విద్యార్థులను ఒత్తిడిపెట్టడం వారిలో వికసిస్తూవున్న గ్రహణశక్తిని చేతులారా చంపివేయడమే.]

ఈ పైచెప్పిన మార్పులు ఇటీవల ఇంగ్లండులోనేకాక యూరప్‌లోని అన్ని దేశాల సారస్వతంలోనూ కలిగి, అభ్యుదయ రచన ప్రారంభం అయినది. ప్రజాసాహిత్యం ప్రబలినది. ఈ క్రొత్త ఉద్యమాన్ని జాన్ లేమాన్ (John Lehman) తన "New writing in Europe" అనే గ్రంథంలో ఈవిధంగా వర్ణించాడు.

"The movement began with a feeling among a number of young writers that society was sick and that great changes were developing below the surface that seemed likely to break out all over the world in revolutions or wars and that these changes profoundly affected them as writers and as human beings...A new social consciousness, a new sense of the fact that the writers belonged with the people and also that they had a great responsibility towards the people . . a responsibility which they believed most of their predecessors of the twenties had shirked .. was born in them. Parallel with this went an increasing desire to write naturally and simply, to avoid the recondite or elaborate as

far as possible and bring language close to everyday speech ... Thus from a combination of urgent economic and political causes on the one hand and a natural development in the English Language ... on the other hand, literature and the people began to move towards one another again. A new realism began to grow up, the aim of which was to create an image of life as it was, not for the millions who had to struggle for their living and bear the main brunt of all economic and social disturbances.'

[ఈ నూతన ఉద్యమ ప్రారంభకులు తీవ్ర భావాలు కలిగి, సమాజంలో మార్పులు తేవాలనే ఆకాంక్ష, ఆవేశము కలిగిన యువరచయితలు, ఈ సమాజం వ్యాధిగ్రస్తమైవుందనీ, లోలో పెరుగుతున్న ఈ కుళ్ళు ప్రపంచమంతటా ఒక్కసారిగా విప్లవాలుగా, యుద్ధాలుగా బ్రద్దలుగాకపోదని వారు ముందుగానే గుర్తించారు. వారిలోని 'మానవత్వమనేది' ఈ నవరచయితలను యీ మార్పును గుర్తించేట్టు చేసింది.. దీనికి తోడు వారిలో ఒక నూతన చైతన్యం కలిగింది. రచయితలకూ, ప్రజలకూ ఉన్న సాన్నిహిత్యాన్ని [illegible] మాటలలో ప్రజలకు [illegible] సమాజ శ్రేయస్సుకై రచయితలుగా తాము నిర్వర్తించవలసిన బాధ్యతలను వారు గుర్తించారు. అంతకుముందు ఇరవై సంవత్సరాలగా సారస్వతరంగంలో ఉన్నవారెవరికీ ఈ దృక్పథం లేదు. తమ భావాలను సుళువుగా, సూటిగా ప్రజలకు అవగతమయ్యేటట్లు, నిత్యంగా వారు వాడుకొనే భాషలో తిప్పుళ్ళూ తిరుగుళ్ళూ లేకుండా సరళంగా, సహజంగా చెప్పేవారు. ఈలాంటి రచనలవల్ల, రచయితలకూ, ప్రజలకూ మరీమరీ దగ్గరసంబంధం ఏర్పడింది. ఆర్థిక, రాజకీయ సంచలనంతో అభివృద్ధి చెందుతున్న ఇంగ్లీషు భాష ఒకవైపూ, మరోవైపు రచనలకూ ప్రజలకూ ఏర్పడుతున్న బలవత్తరమయిన సంబంధమూ ఇంకా యీ వుద్యమాన్ని ముందుకు తీసుకుపోయింది. దీనిఫలితంగా సాహిత్యంలో యదార్థవాదం, వాస్తవిక దృక్పథం పెంపొందింది. దీనిఆదర్శం, సాహిత్యంఏ కొద్దిమందిఅదృష్టవంతులకో, సంపన్నులకో వారి జీవితాన్ని చిత్రించడానికే కాదనీ; అది అనేకులకు, అశాంతులకు అభాగ్యులకు, దోపిడికీదాస్యానికీ బలియైపోతున్న కోట్ల కోట్ల సోదర మానవులకు, వారి జీవితాలకూ, స్వేచ్ఛాస్వాతంత్ర్యము, శాంతికై వారు క్షణం క్షణం సాగించే సంఘర్షణలకు రూపం దిద్దేదిగా ఉండాలని ఉద్దేశించారు)

అభ్యుదయ రచనయొక్క ఉద్దేశం ప్రచారంగా కనబడుతుంది. కనుక అది ఉత్తమసాహిత్యం కాదు. అనే ఆక్షేపణ నేను అనేక పర్యాయములు విన్నాను. ఈ సంగతి గురించి నా అభిప్రాయం స్పష్టంగా చెప్తాను. కాని ఇది నా అభిప్రాయం మాత్రమే. ఇతరులు ఎంతవరకు అంగీకరిస్తారో నాకు తెలియదు.

అసలు ఉత్తమ సాహిత్యానికి ప్రయో

జనం ఏమి అన్నది ప్రథమ ప్రశ్న. ఆనందానుభవం మాత్రమేనా ? మన పూర్వులు కేవలం ఆనందం ఒక్కటే ఫలంగా గణించలేదనుకుంటాను. ఉపదేశంకూడా ఫలంగా పేర్కొన్నారు. ధ్వన్యాలోకంలో నాటకాల విషయంలో "పదార్థోపదేశ రూప నిబంధనాహి నాటకాది గోష్ఠి వినేయజన హితార్థమేవ మునిభిరవతారితా" అని ఉన్నది కావ్యప్రకాశంలో "సద్యఃపర నిర్వృతయే కాంతాసమ్మిత తయోప దేశయుజే" అని అనడంలో ఆనందం, ఉపదేశం రెండూ సూచింపబడ్డవి.

కవి సంఘానికి మార్గదర్శకుడు. Poets are the unacknowledged legislators of the world అన్నాడు షెల్లీ.

ఒక ఆదర్శం, ఒకనీతి ఆత్మగా గల కావ్యం ప్రచారమే అవుతుంది ఒక విధంగా. హరిశ్చంద్రోపాఖ్యానం ప్రచారము కాదూ ? సావిత్రి, అనసూయ కథలు ప్రచారంకావూ ? భారత భాగవతాలు గొప్ప ప్రచార గ్రంధాలుకావా ? ఉపదేశం, సందేశం ఉన్నంత మాత్రాన సాహిత్యం ప్రచారం అయిపోదు. అంతేకాదు. ఉపదేశం సందేశంలేని నిరర్థక సాహిత్యం గొప్పసాహిత్యం కాజాలదు

అయితే కేవలం ప్రచారవాఙ్మయానికి సాహిత్యానికి భేదం లేకపోలేదు సాహిత్యంలో ప్రచారం వాచ్యంగా, శాసనరూపంగా ఉండదు. వ్యంగ్యంగా ధ్వనిస్తూ వుంటుంది. సహేతుకంగా తర్కించదు. సమస్యను వ్యక్తంచేసి కర్తవ్యం స్ఫురింపజేస్తాడు ; కాని తీర్పు చెప్పడు కవి. Shelley ఇలా అంటాడు

> "I have a passion for reforming the world. But it is a mistake to suppose that I dedicate my poetical compositions solely to the direct enforcement of reform."

[ఈనాటి ప్రపంచాన్ని మార్చాలనే కోరిక నాకు గాఢంగా ఉంది. అయితే నాకవిత్వాన్ని, రచనలనూ నేను, "ఉపపాదించే సంస్కరణ" అనిఅర్థం చేసుకోవడం పొరపాటు.]

మన పూర్వుల ప్రకారం ఉత్తమ సాహిత్యం ధ్వనిప్రధానం. ఉపదేశం కూడా ధ్వనిస్తే ఎక్కువ శక్తివంతంగా ఉంటుంది. కనుక అభ్యుదయ రచయితలు కేవలం ప్రచారంకోసం వ్రాయరు ; వ్రాయకూడదని నా మనవి. యూరప్‌లో రాజకీయ కక్షలవారు కవులను ప్రచారార్థం వినియోగించుకొంటున్నారు, కాని అది పొరపాటని గ్రహించారు.

> "It is indeed clear that the three greatest theorists of socialism, Marx, Engles and Lenin all realised that a creative artist was wasting his time with propaganda and was far more valuable to the people and to the world in general, if ...his views about society in his works arise from the situation and action themselves without being explicitly formulated"-(Lehman)

[సామ్యవాద నిర్మాతలైన మార్క్సు, ఏంజిల్సు, లెనిన్లు. శక్తివంతుడైన రచయిత తన అమూల్యమైన కాలాన్ని

వృథాగా ప్రచారానికే వినియోగిస్తున్నా డనే విషయాన్ని స్పష్టంగా గుర్తించారు. అట్లా కాకుండా కావ్య సృష్టిలో వివిధ ఘట్టాలలో సజీవమైన పాత్రలుండి, ఆ పాత్రల కదలికద్వారా చైతన్యం కలిగించాలన్నారు. అందులోనే రచయితల కున్న సామాజిక దృక్పథం గర్భితంగా ఉంటుంది అంతేగాని, రచయిత తన సామాజిక దృక్పథం ఇదని వివరించి సమస్యలు సమస్యలుగా వర్ణించనక్కర లేదనీ, కళాస్పందన సజీవంగానూ బలంగానుఉండాలనీ, ఇట్లాంటిశక్తివంతమైన రచనలే ప్రజలకూ, ప్రపంచానికీ ఎంతో ఉపకరిస్తాయనీ వారు స్పష్టం చేశారు.]

అభ్యుదయ సాహిత్యానికి మార్పు అంత ప్రధానం గదా! అయితే పూర్వ సాహిత్యాన్ని త్రోసిపుచ్చవలెనా? అభ్యుదయ రచయితలు పూర్వ వాఙ్మయాన్ని తిరస్కరిస్తారా, ధిక్కరిస్తారా, బహిష్కరిస్తారా? అనికొందరుప్రశ్నించవచ్చును. ఆ విధంగా ఎప్పుడూ చెయ్యరు; చేస్తే ఆత్మహత్యాదోషం తగులుకుంటుంది. పూర్వసంస్కృతి అవగాహనం చేసుకోకపోతే పునాది లేకుండా భవనం నిర్మించటం అవుతుంది. అయితే కేవలం పూర్వ సంస్కృతితోనే తృప్తిపడడు అభ్యుదయ రచయిత. కథలో రెండవ ప్రకరణం మొదటి ప్రకరణంతో సంబంధం లేకుండా వ్రాయడానికి ఎల్లా వీలవుతుంది? అట్లాగే, మొదటి ప్రకరణంలో విషయమే రెండో ప్రకరణంలోకూడా వ్రాస్తే విసుగుగాను, నిష్ప్రయోజనంగానూ వుండదూ? "ప్రాత క్రొత్తల మేలుకలయిక" అని అనడంలో పరమార్థం గ్రహించాలి. కొంచెంక్రొత్త కొంచెం ప్రాత అని అర్థం చేసుకోకూడదు. దాయప్రోలు సుబ్బారావుగారు చెప్పినది నాకు చాలా నచ్చింది.

> చి॥ శశి స్థానము గొనిన ప్రాచీనమునవి
> వాఙ్మయమునను ఆదర్శమునను
> [illegible] ప్రావ్యము
> శబ్దరీ విలాసమున్ సంప్రసారిత
>
> కాని, నా రచనలనె యుగాంతమైన
> సృష్టి వైచిత్ర్యమును, ప్రాచీ చేతనా వి
> కాసమును స్వతంత్రముగ లక్ష్యమునవిల్పి
> స్వానుభవభాష్యములు విశ్వసాహిత్య

విశ్వనాథ సత్యనారాయణగారి వాక్యాలు మిక్కిలి ఆదరణీయములు.

"అభ్యుదయ మార్గము క్రొత్తది. క్రొత్తది యైనను ప్రాత మార్గములతో సమన్వయము కొరకు ప్రయత్నించుచున్నది. ప్రాతకు ప్రాత, క్రొత్తకు క్రొత్త. యెవరిదారిని వారుపోయి జాతి మత సంఘములలో భిన్నత్వము తెచ్చుకొని యెవరి తెన్ను వారుపోయి యైక్యము లేకుండ జేసికొనరాదు. అప్పుడు బలము నశించును. అట్లుకాక యభ్యుదయము సమైక్యము కొరకే ప్రయత్నించుచున్నది." ఇక ముగిస్తాను.

ఈటెకు తగ్గ లోతన్నట్లు నాశక్తి లేశానికి వీలైనంతవరకు సమన్వయం చెయ్యడానికి ప్రయత్నించాను. ఎక్కువ తక్కువలు నిరూపించలేదు; తీర్పులు చెప్పలేదు. న్యాయస్థానంలో వాదప్రతివాదాలు విని తీర్పుచెప్పటం నా ఉద్యోగ

ధర్మం అయినప్పటికి నాకా అధికారం సాహిత్యరంగంలో లేదు. ఆప్రపంచంలో నేనూ ఒక పిటీషనర్నే - నా విన్నపం ఏమంటే - ఆంధ్రసాహిత్య ప్రపంచ కళ్యాణానికి, పెద్దలూ, పిన్నలూ, అందరూ - అన్ని తరాలవారూ, అన్ని రకాలవారూ కలిసి కృషిచెయ్యడం పరమ కర్తవ్యం. అభ్యుదయ రచయితల ఆశయం అదే, అదే నా కోరిక, నా మనవి.

నమస్కారం.

★

ఆవేదన

శ్రీ పూసపాటి నాగేశ్వరరావు

కలకత్తా నగరాన భీకరరణన్ కల్పించి బొంబాయిలో
గలతన్‌గూర్చి రగిల్చిపోయె మతకక్షల్ నేడు బీహారులో:
కలవే? యిట్టి దురాగతంపు పను లేకాలంబునందేని, న
వ్వుల పాలైనది భారతావని స్వయం పోష్యస్థితిన్ పొందునే?

పశువరించిన మానిసి పసులవలన
రక్తధారా కరాళ ముద్రలను దాల్చి
పడిన నవఖాలి త్రిపురాలపాటుచూచి
గుండెయాలని వాడొకడుండు లేడు।

★

అభ్యుదయ రచయిత . నవయుగానికి సందేశ కర్త

శ్రీ నిడదవోలు వెంకటరావు

అభ్యుదయ రచయితల సంఘము తెనుగువారికి కూడలియైన బెజవాడలో పుట్టినది. తెనువారిదేయై, తెనుగుసాహిత్యము ప్రాతకొత్తల పోకడలకు పట్టుకొమ్మయైన చెన్నపురిలో నెలకొన్నది. నాలుగేళ్ళయినప్పటికి నానాటికీ కొత్తదారుల కలవాటుపడుతున్నప్పటికీ, నవ్యులలో, చాలామందికి అభ్యుదయరచన అంటే యేమిటి అనే సందేహము ఇంకా కలుగుతూనే యున్నది. సందేహము అనేది కలగడము మంచిది. ఏమంటే విషయము స్పష్టముగా గ్రహించుటకు కొంత తెలివి ఉన్నది అని తెలుపుతుంది. కాబట్టి అట్టి సందేహములను నివృత్తి చేయడముకూడా కొంత తెలిసినవారు చేయదగిన పని యని నానమ్మకము.

అభ్యుదయ రచన అంటే ఏమిటో తెలిసికోవడమునకు ముందు అభ్యుదయమంటే యేమిటో తెలిసికోవలెను. అభ్యుదయ మంటే వాస్తవిక శబ్దార్థమేదైనా కవి వ్యావహారికంలో శ్రేయస్సు, హితము, మేలు అనే అర్థము రూఢమైనది. ఈ అర్థమును ప్రతిపాదించేది ఒక విధమైన కాంక్ష లేక కోరిక ఇది కేవలము మనస్సులో పుట్టిన భావము. హృదయాంతర్గతమైన యీ భావాన్ని వాక్కుచేతను బయలు పరచునది కళా రూపమగు రచన. లోక కళ్యాణము, విశ్వ శ్రేయస్సు, జగద్ధితము, అందరకు మేలు కలిగించునట్టి రచన చేయువాడు కవి. కాబట్టియే అభ్యుదయమునకు, రచనకు, రచయితయైన కవికి అవినాభావ సంబంధము అనగా విడగొట్టుటకు వీలులేని సంబంధమేర్పడినది. ప్రకృతి సహజములైన మార్పులచే, నేర్పడిన ప్రాత కొత్తలను సమన్వయించి ఇట్టి శ్రేయస్సు ప్రతిపాదించు రచన చేయుటచే అభ్యుదయ కవి యగుచున్నాడు. ఈ క్రొత్తపాతల సమన్వయము నందు మేలి కలయికచేతనే, అభ్యుదయ రచన సాగుచున్నది,

కాబట్టి అభ్యుదయ రచన యనగా కొత్తపాతలను, మేలికలయికతో అందరకు మేలును సమకూర్చు రచన అని చెప్పవచ్చును. ఇదియే ప్రాచీన నవీన పథకములను సమన్వయ రూపమై విశ్వ శ్రేయః ప్రతిపాదకమైన రచన అభ్యుదయ రచన అని సాంస్కృతికముగా నిర్వచింపదగును.

తెలుగు సాహిత్య పథకములో నేడీ

ప్రాతకొత్త సమన్వయము చేయదగిన పరిస్థితి యేర్పడినది. ఈనాడు, నవీన పథకములో సాహిత్యము విశృంఖలముగా, విరివిగా, వ్యాప్త మగుచున్నను, ప్రాచీనపథకములో సాహితీ రచనము సాగుచునే యున్నది. కాగా ప్రాచీనపథకములో పండితులుగా నున్నవారు, సజీవమై, జాతీయమై, తత్కాల వ్యవహార సాంప్రదాయ సిద్ధమైన ప్రాచీనాంధ్ర సాహిత్యమును తెలిసినవారుకాకపోవుట చేతను తెలుగుసాహిత్యంలో నొక కాలమందు ప్రబలి నేటికిని తన ప్రభావము చూపుచున్న కృతకమగునొక సంస్కృతిక సంప్రదాయమునకు బద్ధులగుటచేతను నవీన పథకములో నుపాదేయమైనది గ్రహింపదగినది లేదని, దానికి వ్యవస్థయేర్పడలేదని ఇతరులతో నేకీభవింపని యభిప్రాయములతో నున్నారు. నిజంగా అవ్యవస్థ వారిదే - ఏమంటే వారు ముందుకు రాలేరు, వెనుకకు పోలేరు. మధ్యేమార్గములో నున్నారు.

దీనివలన సాహిత్య దృక్పథము పూర్తిగా రెండు విభిన్నమార్గములు పట్టినది, ఎన్నడునూ కలవని రెండు సమానాంతరరేఖలవలె తయారైనది.

దీనికికారణము ప్రాచీనాంధ్రసాహిత్యములో పరిశ్రమ లేకపోవుటయే.

ఇట్లు భిన్నములుగా నుండుటచేత మన సాహితీ దృష్టి చాలా సంకుచితమై పోయినది. సాహిత్యము అనునది ఒక ప్రత్యేక వ్యక్తిగతము గాక సమిష్టికి సంబంధించినది అను నభిప్రాయము నశించినది.

సాహిత్యము దేశీయులైన ప్రజలందరిదీ కాని, ఏకైకవ్యక్తికి కాదు. అనే భావానికి నిన్న మొన్నటివరకు ఆస్కారము లేకపోయినది. నవీనకాలమున దేశ కాల పాత్రలయం దేర్పడిన మార్పులబట్టి సాహిత్యదృక్పథము మార్చుకొనవలసియున్నప్పటికి, యింకా తెలుగులో నట్టి దృక్పథము మార్చుకొనకుండా, మార్చుకోలేకుండా కొంతమంది భీష్మించుకొని కూర్చున్నారు. కొంతమంది వైకిరాకపోయినా, లోలోపల మారుతున్నారు. చాలా కొద్దిమంది మాత్రమే బాహాటముగా వచ్చుచున్నారు.

సజీవమైన ప్రజాసాహిత్య సంప్రదాయమే విశిష్టమైన తెనుగు సాహిత్య సంప్రదాయము. అదే అభ్యుదయ సాహిత్యము—ప్రాచీనాంధ్ర సాహిత్యము. అంటే 15 వ శతాబ్దికి ముందుండే సాహిత్యములో అభ్యుదయ రీతియే ప్రధానము. రచన యేవిధముగా సాగినా, ప్రాచీన కవులంతా శ్రీ తో ప్రారంభించి శ్రీ తో ముగించేవారు.

"అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్పంబూనిన" అని చెప్పక కావ్యమును మొదలుపెట్టిన కవిలేడు. సాహిత్యము ప్రజలది అను భావము ప్రాచీన కవులకున్నట్లు నేటి కాలపు కవులకు చాలా మందికి లేదు. అందులో భావనా ప్రపంచములోనున్న వారికి అసలే లేదు. ఉదాత్తమైన సంస్కృతిచే కవితారచన చేయగలిగి ప్రౌఢరచనమున తెలుగుదనమును పూర్తిగ నిలిపి ప్రజాహృదయములను చూరగొనుచున్నయ తిక్కనాది మహాకవుల ప్రక్కనే, ఆయా కాలము

లతో తెలుగు జాతీయతను, తెలుగు కవితా సంప్రదాయము స్థిరముగా నిల్పిన సోమన, వేమనాది మహాకవులు తెలుగు దేశములో వెలసిల్లుట తెలుగువారు గడించిన మహాభాగ్యఫలము.

నేడు ప్రాచీన వాఙ్మయములో కూలంకుషముగా పరిశ్రమ జరిగే ఎడల నవీన పథకములోనుండే గుణవిశేషములను గ్రహించి మన దృక్పథము చాలా విశాలముగానుండి యుండేది. ఈనాడు క్రొత్తగా వెలయించిన కవితలను బాగా పరిశీలిస్తే సమవాదములేకాక సమానపద బంధములు కన్పింపక మానవు. నవీన వాఙ్మయములలో గాలిదుమారములను రేకెత్తించిన, ఎంకిపాటలకు సామ్యము 14 వ శతాబ్దమున తాళ్ళపాక వారి సంకీర్తనలందే కానవచ్చుచున్నది. ఈ క్రిందివి ఉదాహరణంగా పత్తగించండి.

"నన్నేమి పెట్టినానాటే వారాజు
మొన్నలిరిగొస్త నన్నాడే
నల్లని యెన్నెట్లో పాపేసికూకుంటే
ఒట్టిమిన్న ఒల్లంత
ఉలుకులుకు మంటాది"

అనేది.

"పండువెన్నెల బయట పవళించివేడుకల
నుండి చెలి యేటికోయనుచుంటిని
అద్దములో చూసుంటె అదియేమొ
సిగ్గమ్మి" అనేభావమే "అద్దముచూచితె
నాకంతకంటె సిగ్గయ్యేని" అనే కీర్తనలో గలదు.

ఇంకా మరికొన్ని తక్కిన రచనల నుండి సామ్యములు చూపవచ్చును. ఇట్టివిశేషములే జానపద వాఙ్మయం ఉత్కృష్ట పద్యవాఙ్మయమునకు పునాది అని స్పష్టపరచుచున్నవి.

నూతనాశయములను, నూతనభావములను, మనము నవ్యజీవిత విధానములో సమన్వయించి, సంస్కరించుకొనుటకు శిష్టజన వ్యావహారికమైన భాషను గి. రాం. మూర్తి ప్రసాదించి యభ్యుదయ భాషావాగనుశాసను డైనాడు.

గి. రా. అంటే వాక్కు, భాషాఅని అర్థము, కాబట్టియే అతడు శబ్దబ్రహ్మలో లీనమైనను, అభ్యుదయమును గూర్చిన మనమాటలు వింటూనే యుంటాడు. శబ్దగుణప్రధానమైన యాకాశములో దివ్యజ్యోతిలా వెలుగుతూనే యున్నాడు.

కాబట్టి మన మాటలన్నీ అతడు వింటూనే యున్నాడు. గిడుగువారికి చెవుడుగాని అజ్ఞానపు చెవుడుంటుందా? కాబట్టి అభ్యుదయమును కోరుతూ అవతరిల్లుచున్న రచయితలను ఆశీర్వదించుచున్నాడు.

భాషాస్రష్ట గిడుగు, వాగనుశాసనుడైతే గురజాడ రసస్రష్టయైన కవిబ్రహ్మ. తెలుగుతల్లిని ముత్యాలసరములతో కైసేసి యభ్యుదయ రచయితల నింకను [illegible] బ్రహ్మలోకములోనుండి పలుకుచున్నాడు.

నవీన సాహిత్యమునకు పునాదియైనట్టి ప్రాచీన సాహిత్యమును నేడు సంగ్రహింప వలసిన పరిస్థితి యేర్పడుచున్నది. ఈ సమన్వయమునకు కీలకము ముఖ్యమగు నా సాహిత్య వ్యాసంగము నేడెంతో జరుగ వలసి యున్నది.

ప్రతిభావ్యుత్పన్నులైనవారు, భాషా తత్వ పరిజ్ఞాతలు, సంప్రదాయాభిజ్ఞులు మహాకవులు నేడింకను మనకు కలిసి మెలసి సహృదయముతో సౌమనస్యంతో వ్యాసంగము చేయుటకు తగిన దోహద మిచ్చునది అభ్యుదయ రచయితల సంఘము వారేయని చెప్పవచ్చును. దానికి వారి సాహిత్య పారశాలయే తార్కాణం. అది శాశ్వతముగా వర్ధిల్లవలయునని కోరుచున్నాను

ప్రాచీన నవీన వాఙ్మయమును సమన్వయము చేసిన యెడల, అభ్యుదయ రచయితయే నవీన యుగమునకు సందేశకర్తయని చెప్పనగును.

ఏది సర్వమానవకోటికి, శ్రేయస్సు శాశ్వతత్వము, సౌభ్రాతృత్వము, సహృదయత్వము, దేశకాలాబాధితమై భాసించునో అదియే అభ్యుదయము అదియే సర్వతోముఖమైనది; నిత్య నూతనమైనది. ఇట్టి ఉన్నత భావములతో, ఉదారమైన ఆశయములతో ఉత్తేజకరమైన కావ్యకళా కలాపముతో నభ్యుదయ రచయితలు తెలుగునాటికి అభ్యుదయము ప్రసాదింతురుగాత!

★

నేనుసైతం
ప్రపంచాబ్జపు
తెల్ల రేకై పల్లవిస్తాను!

నేనుసైతం
విశ్వవీణకు
తంత్రినై మూర్ఛనలుపోతాను!

నేనుసైతం
భువనభువనపు
బావుటానై పైకి లేస్తాను!

— శ్రీ శ్రీ

ఆధునిక కవిత్వం

శ్రీ పువ్వాడ శేషగిరిరావు

ఈశ్రీమిసముక్షంలో నిలిచే అవకాశం నాకిచ్చిన ఆహ్వానసంఘ కార్యవర్గానికి అభ్యుదయ కవులకూ హృదయ పూర్వకమైన నాధన్యవాదాలు. ఈనాటి నా ఉపన్యాసవిషయం 'ఆధునిక కవిత్వం.'

ఇంత విపుల విషయం ఇంత అల్ప కాలంలో నిర్వహించడం సాహసమని తెలియక కాదీపని నేను స్వీకరించడం. కాలావధికి తగినట్లు, ఈ వేదిక కుచితమైనట్లు ఆధునిక కవితాగుణములు కొన్ని మాత్రం సింహావలోకనం చేద్దామని నా ఆసక్తి.

అంతే !

కవిత్వం అంటే ఏమిటి అనిసూటిగా నిర్వచింపనేరను. ఒక ఆంగ్లవిమర్శకుడన్నట్లు.

I can describe but not define.

* * *

ఆధునిక కవిత్వం అనే శీర్షిక కవిత్వంలో సనాతనం అయింది ఒకటి వుంటుందని స్ఫురింపజేస్తుంది. సనాతనాధునాతనాలు కవిత్వంలో వుంటాయని ఒప్పుకుంటే వాటిమధ్య పొలిమేర ఎక్కడ ?

ఒకజాతి సారస్వత చరిత్రను శకములుగానో, యుగములుగానో చరిత్రకారులు వీలుకొరకు విభజించుటకు పూనుకొన్నప్పటికీ తీర్చిదిద్దిన శకవిభాగరేఖను గీయడం మాత్రం అలవికాని పని. యుగమనేది ఒకటివున్నా ఒక యుగంలోనుండి ఇంకొక యుగం పొడుచుకువస్తుంది. ఆపొడుపులో వెనుకటి ముద్రలు కనిపిస్తూనే వుంటాయి. వాహినీ వీచికలమధ్య హద్దుగీత నిర్ణయింప కుదిరనట్లు సారస్వత వాహినికి యుగసంధుల పొలిమేర గీతలు నిర్ణయింప సాధ్యముకాదు. చరిత్రకారుల యుగావరణములందు ఉభయ యుగ చిహ్నములునూ గోచరిస్తూనే ఉంటయి. ఇందుచే సారస్వతంలో సనాతనాధునాతన విభజనము నిరుపపత్తికమూ నిరాధారమూ అని నమవి అయితే ఒక విశేషం

ఉద్యమ ప్రాధాన్యం

శకవిభజనమెంతక్లిష్టమయినా, కవిత్వంలో రీతులూ, ఆదర్శములూ, సంప్రదాయములూ, ఆరోజు కారోజు మారుతునే వున్నాయి. ఈ మార్పులు జాతీయశీలముమీద, జాతి లక్ష్యాలమీద విశేషముగా కవుల వ్యక్తిసంస్కారం మీద ఆధారపడుతూ వుంటయి

ఋగ్వేదకవుల ప్రకృత్యాత్మక గేయములు ఆనాటి అవకాశ వాతావరణమును ననుసరించినయి.

ఆదికవి రామాయణకావ్యం ఆనాటి

ఆర్య సాంప్రదాయాల్ని ఉద్ఘాటించింది. హిందీలో తులసీ రామాయణమూ, తెలుగులో పోతన మొదలు త్యాగయ్యవరకు బయలుదేరినభక్తివాఙ్మయమూ, చైతన్య స్వామి ప్రవచనములూ మహమ్మదీయుల ఒత్తిడులు తాళుకొన తారకములై వెలువడ్డయి.

సోద్దిష్టములు కాకపోయినా తత్కాల హిందూ మనస్తత్వస్థితిని బింబించినయి.

నాగను శాసనుని భారతరచనం బౌద్ధము క్షీణించిన ఆతెనుగునాట ఆర్షమత ప్రబోధనంస కుద్యమించినది. పెద్దనామాత్యుల విలాసగీతి రాయలనాటి రసికతనే ప్రతిబింబించింది

కాబట్టి యుగధర్మమునుంచి తెంచుకున్న [illegible] కాదు కవి వ్యక్తిత్వంలో యుగలక్షణములు మిళితములు కాక తీరవు. కవి, జాత్యభిరుచికి తృప్తికలిగించుటతో పాటు, జాతిదృక్పథమును ఒకానొక విశిష్టలక్ష్యముపై కేంద్రీకరింప యత్నించుతూనే వున్నాడు కవి, తత్కాల వాతావరణమునందసంతృప్తి చూపి ఒకానొక నూతనాదర్శం ప్రతిపాదింప సాధనం చేస్తూనే వున్నాడు.

ఈ దృష్టిని బట్టి: కవిత్వం ఉద్యమ ప్రధానమని గోచరిస్తుంది. సాహిత్య విమర్శకులలో కొందరు కవిత్వముద్యమ ప్రధానమనీ సాంఘికాభ్యుదయ లక్షితమనీన్నీ మరికొందరు కవిత్వం కళాసాధనప్రధానమనీ, కేవలరససిద్ధి లక్షితమనీ, ప్రతిపాదించారు. గతశకాంతంలో ఆస్కార్ వైల్డు, వాల్టర్ పాటర్, రస్కిన్ టాల్‌స్టాయ్ మొదలైనవారు ఈసంఘర్షణములో పాల్గొన్నారు. అందుచేత ఈ సమస్య విమర్శక లోకానికి కొత్తది కాదు.

కవిత్వముద్యమ ప్రధానమయినంత మాత్రాన అది కవిత్వ సహజలక్ష్యములు సాధించుటలేదా?

"విశ్వశ్రేయః కావ్యం" అన్ననుడి ఉద్యమ ప్రధాన కవిత్వమును సమర్థించుటలేదా?—సాంఘిక లక్ష్యములు పెంపొందించి, ప్రజాబాహుళ్యమున కందించి నూతనోద్రేకమును, సంస్కారేచ్ఛను కల్పించడం లేదా?

జాత్యౌన్నత్యమును కంటె కవితా సృష్టి సాధింపగల అమూల్యాశయమేమున్నది? కవి తనతోపాటు తన సంఘమునుద్ధరింప గలిగితే తన కర్తవ్యమును నిర్వహింపడం లేదా?

నిజమే!

కాని కవిత్వముద్యమ ప్రధానమే అయితే ప్రతిపాదిత ఉద్యమ సాధనానంతరం ఆ కవిత్వమునకు స్థైర్యమెక్కడిది? అన్నది ఒక ప్రశ్న.

ప్రత్యేకగుణం

ఈ ప్రశ్నకు సమాధానము యోచించుటకు ముందు ఆయుద్యమ మనేదిదో నిర్ధరింపాలి. ఆర్థిక రాజకీయ నైతిక నిర్మాణోద్యమము కావచ్చును. మత సంస్కారణోద్యమము కావచ్చును. ఇట్టి ఉద్యమములకు నిలకడయేది?

తాత్కాలిక ఆర్థిక రాజకీయ నైతికావసరములనుబట్టి ఆ యా ఉద్యమముల ప్రాముఖ్యము మారుతూంటుంది.

అయితే ఈ పరిస్థితిలో కవిత్వమును క్షణికములగు వుద్యమములపై ఆధారపడుట యెట్లు? అందువల్ల ఉద్యమములతో నిమిత్తంలేని ప్రత్యేకగుణం కవిత్వముకున్నట్లయితే కవిత్వం నిలుకడ సంపాదించుకుంటుందన్నమాట. ఆ గుణం సార్వకాలిక జనరంజకంకావాలి. కవిత్వానికి సార్వకాలిక ప్రబోధము ఈ ప్రత్యేకగుణం వల్లనే కలుగుతోంది. అందుచేత ఉద్యమ ప్రధానకవిత్వపు నిలుకడ ఉద్యమ ప్రాధాన్యముకంటె ఉద్యమేతర విశిష్ట గుణముపై ఆధారపడుతున్నది రామాయణమీనాడు మనహృదయాలని రంజిస్తున్నదంటే ఆర్షనీతి ప్రతిపాదనము వల్లకాదు. అందలి మానవతాసిద్ధివల్ల - అందలి రసప్రసిద్ధివల్ల. ఇంతకును సిద్ధాంత మేమన.

1 ఉద్యమ రహితమైన కవిత్వం లేదనీ,

2. ఉద్యమ సహిత కవిత్వానికి రసప్రసిద్ధి ప్రాణమనీ.

స్వేచ్ఛ :

కవితాశక్తి స్వాతంత్ర్యాన్ని వాంఛిస్తుందనీ. స్వేచ్ఛాద్వారముననే ఆత్మప్రకటనం చేసుకొంటుందనీ అంటారు. స్వేచ్ఛ కవికి జన్మహక్కయితే కవిని తన ఆవేశమునకునూ తన వస్తుస్వీకార స్వేచ్ఛకునూ వదలక, ఉద్యమ దృక్పధాన్ని అతనిపై ఆరోపించడం, అసమంజస మనిపించదా అంటే, బాహ్య ప్రోత్సాహమున గాక ఉద్యమమే ఉద్వేగమును గలిగించి కవితను ప్రోత్సహించినట్లయితే, కవి స్వాతంత్ర్యమునకు ఆ ఉద్యమం ఆటంకము ఎలా అవుతుంది? కాని ఒకవిషయముంది. ఉద్యమమును నిర్దేశింపనిదే నీ కవిత కవితే కాదని ఒక నిర్వచనం చేయడం కవి హర్షింపడు. అందుచేత సాంఘికాభ్యుదయ లక్ష్యము కవితలో కోరువారు యుక్త ఉద్యమ వాతావరణమును భావప్రచారమూలమున సృజింపాలి తప్ప, తమ కోర్కెలు చెల్లింప కవులను నిర్బంధించినచో ప్రయోజనముండదు.

ఈనాటి కవితకు స్వేచ్ఛ ప్రాణప్రాయము స్వేచ్ఛా తృష్ణలో ఆధునిక కవిత మొలకెత్తి విశేషంగా స్వేచ్ఛాగానమే సలుపుతోంది. తెలుగుజాతి ఈనాడు స్వేచ్ఛను కోరుతోంది ఈనాడు కృత్రిమ సంఘ నియమములను ధిక్కరించుటలోనూ రాజకీయశృంఖలములవిదల్చుకొనజూడడంలోను, శాస్త్రమత విషయాల్లోకూడ కేవల ప్రమాణంపై ఆధారపడక ప్రకృతిమూల సూత్ర పురస్కృతంగా విమర్శించడంలోనూ స్వేచ్ఛ ప్రకటిత మవుతోంది.

ఈ స్వేచ్ఛ కవుల గానంలో బింబించడం వింతగాదు. ఈనాటి కవి వస్తువరణంలోను, రీతి స్ఫురణంలోనూ, ఈ స్వేచ్ఛను ప్రకటిస్తూనే వున్నాడు. ఈనాటి కవికి కార్యరంగం అతివిశాలం; అందు కవితకు బాహ్యమైన వస్తువే లేదు అందు కవిత కనువుకాని భాష లేదు అందు కవితకు లొంబడని భావమే లేదు. కాని యీ కారణంచేతనే ఇప్పటికిని విమర్శక లోకంలో సనాతనులు ఈనాటి కవిత్వం చుక్కానిలేని పడవ అంటూనే వున్నారు. నేటి వాఙ్మయ

ప్రాగల్భ్యముకు లక్ష్యములుగాని నియమాలుగాని లేవని వారి ఉద్దేశ్యం.

మరి అధునికులో :—

"లక్షణము లేనిదే కవిత్వం లేదు. కాని లక్షణబద్ధమైనదెల్ల కవిత్వమునూ కాదు" అని అంటున్నారు లక్షణము కవి నిర్మితము; లాక్షణిక నిర్మితంకాదు లాక్షణికు డుత్తమ కావ్య లక్షణములు క్రోడీకరించువాడు మాత్రమే! ఇవి లోకాని కనుసరణయోగ్యమైన నియమావళి నిర్ణయించడం లాక్షణికులపని కాదు. కవిది. నూత్నాలంకార సృష్టి నూత్న ఛ్ఛందోనిర్మాణం, నూత్న శైలీకల్పనం స్వతంత్రుడైన కవికి జన్మహక్కులు. 'టుక్కనన్' విమర్శకుడు చెప్పినట్లు కవి జీవితాన్ని నూతన దృక్పథంలో చూస్తాడు; భావపచనం చేసుకుంటాడు; కావ్య ప్రకటనానికి యత్నిస్తాడు.

నియమం — నిర్బంధం

నేటి కవులు గర్హించేది నిర్బంధం గాని నియమంగాదు. అష్టాదశ వర్ణనలు సమయానుకూలంగా చొప్పిస్తేనే కాని కావ్యంకాదంటం వీరిని నొప్పిస్తుంది "చమత్కారం, వక్రోక్తి, శ్లేష, బంధరచన.— వీటిల్లోనే వుందితమాషా" అంటే ఆధునికులకు నవ్వు వస్తుంది. ఆధునికుడుకోరేది సంధ్యను మున్నూరు పద్యములలో వర్ణించే సామర్థ్యంకాదు. సంధ్యాది ప్రకృతి విశేషములు కవిలో ఉత్పన్నం చేసే భావచంచలనాన్ని చవి చూపింపుమంటా డాధునికుడు. వెనుకటి వారి ననుకరించడం కంటె సరికొత్త జాడలుతీయడం సౌందర్య పిపాసువుకు సహజ గుణమంటా డాధునికుడు. పోత బొమ్మలను మూస కట్టుటకంటె రక్త మాంసముల పుష్టిగల వ్యక్తి నిర్మాణం ఉత్కృష్టమంటా డాధునికుడు.

"వ్యక్తిత్వ సంపద అవగాహన చేసికొనే రోజులు; వ్యక్తిత్వాన్ని వ్యక్తపరచే కవిత్వం వికసించే రోజులివి. నా సోదరుని హృదయ వేదనకు ఒకానొక సానుభూతిని పొంది అతని అనుభవాన్ని నాదిగాచేసుకొనడం ఈనాడు నేను అలవరిచుకున్నాను. మానవజాతి అనుభవ నిదానమంతా నాదే!

—నాదృష్టికి పొలిమేరలేదు.
—విశ్వమంతా నాక్రీడాభూమి.
—విశ్వ సారస్వతానికి నా సారస్వత
మొక అంగము

నాపలుకు వినగోరేది అనంతమైన భవిష్యత్ ప్రపంచము.

నాపిలుకడ మానవజాతి హృదయ పీఠిలో" అంటాడు నేటికవి.

పఠితృలోక వైశాల్యం

నేటి కవితలో మరియొక విశేషం వుంది. గత శతాబ్దం వరకూ కవులు పరిమిత సంఖ్యాకులయిన శిష్టులనే ఉద్దేశించి రచనలు చేశారు. రాయలనాటి ప్రబంధగీతి రాచనగరులు దాటి ఎన్ని గజములు ప్రాకినదో! ఈనాడు పామర జనమంతా పఠితృ జనమే!

విద్యాపిపాస విశేషంగా పరివ్యాప్తమై జాతి అంతటిలో వికసింప బోతూవున్న యీ రోజుల్లో కవి విశాల పఠితృ విస్తీర్ణానికి తన మతం శ్రుతం చేస్తున్నాడు. అందుచేత తన భాషనూ తన భావాలనూ

అవసరంకొలది సరిపరచుకొంటున్నాడు. అలా చేయడంలో, కవి తన బాధ్యత సంఘాభిరుచికి దోహదం ఇవ్వడమే అనుకొంటున్నాడు. కాని నిజానికి కవి చేయవలసినదేమి? సమాజ సంస్కృతిని పెంపొందించి, తాను ప్రజాభిరుచులకు మార్గదర్శి కావాలి.

దృష్టి వైశాల్యం

ఆధునిక కవులలో ఇంకొక విశేషం ఉంది కవి విజాతీయ సంప్రదాయములనుకరించడం స్వజాతీయులకు భంగమైతే కావచ్చును గాని దృష్టిమాత్రం రాజకీయంగాను, సాంఘికంగాను విశాలమైంది. రాచనగరు దాటి రానిసంస్కృత భావసంస్కృతికి కట్టుబడక, ఆధునికుడు రాజకీయ వాతావరణంలో అలవడ్డ దృష్టి వైశాల్యాన్ని సాహిత్యరంగంలోకికూడ తెచ్చుకొని విశ్వప్రజానీకంలో తానొకడనని గుర్తెరుగుతున్నాడు. ఇంగ్లీష్ రష్యన్, జర్మన్ వాఙ్మయాలకును తన వాఙ్మయానికిని, అవినాభావసంబంధమని భావిస్తూ వానిలోని మంచి అంతా స్వీకరిస్తున్నా డాధునికుడు.

“ఇది గుణం కాదయ్యా అవగుణం! మనఆర్ష సంప్రదాయం ఇతర సాంప్రదాయాన్ని తనలో ఇముడ్చుకునేది కాదయ్యా!” అని సనాతనులు ఘోషిస్తున్నారే అనుకోండి అందుకు ఇతడంటాడు:

“కవి ఏ జాతికీ, ఏ భూమికీ ఏ మతమునకూ, ఏ సంఘమునకూ ప్రత్యేకించి చెందినవాడుకాడు. అతడు సంప్రదాయాతీతుడు” అని.

జానపద కవిత్వం

మరొక్క విషయముంది: జానపద కవిత్వం అనేక శతాబ్దాలనుండి పామర జన కుటీరములలోనే స్థావరంకుదుర్చుకొన్నదే తప్ప గ్రంథస్థం కాదగ్గ గౌరవము సంపాదింపలేదు ఇప్పుడో! జనసామాన్య సంఘబల ప్రాభవం వల్లనూ ముద్రణయంత్ర ప్రచారం వల్లనూ దృష్టివైశాల్యమువల్లనూ, పదాలుకూడ కవిత్వమే అనే దృక్పథం లోకానికి అలవడ్డది, ఇంతేకాదు నూతనచ్ఛందో నిర్మాణము ఈనాటి పద కవిత్వంమూలాన బయలుదేరింది. సంస్కృతచ్ఛందములో ప్రసరింపబడ్డ గణములూ, విస్తరింపబడ్డ యతిప్రాసములు సర్వమేళనమునూ లయబద్ధమునూ మాత్రమే చేయగా ఈనాటి పద కవిత్వము వచ్చి మాధుర్యంకూడ కల్పించి తెలుగున కలంకృతి సంపాదించింది. అసలే తెలుగు Italian of the East ఇప్పుడు మరీని —

ఈ ప్రకారం ఆధునిక వాఙ్మయములో కొన్ని గుణములు కన్పిస్తున్నమాట వాస్తవం. కాని జగత్తులో ఏవిషయంలోనైనా గుణ దోషాలు రెండును ఉంటయి. గుణాలు పరిగ్రహించి దోషాలు పరిత్యజించడం గుణగ్రాహికి ఎంత గుణమో, గుణాలకవరోధం కలిగించే దోషాలుకూడ సూచించి భవిష్యదభ్యుదయానికి దారి చూపడం అంత ముఖ్యమైన గుణము.

అదేమిటంటే, కళోపాసనకు ప్రతిభ, వ్యుత్పత్తి అభ్యాసం అనే శక్తులుమూడు

న్నూ కావాలి. "ప్రతిభైవచకవీనాంకార్య కరణకారణం" అని ఆలంకారికుడు అనుగాక! పన్నిదములు చరచుకొని ఈమూడు శక్తులను ఒకదానికన్న ఒకటిముందడుగు వేసినప్పుడేకళోపాసకుడుసత్యసాధనలో ఔత్కృష్ట్యాన్ని పొందగలుగుతాడు. ఈనాటి కవులలో ప్రతిభ ఉన్నంత వ్యుత్పత్త్యభ్యాసములు లేవు. అభ్యుదయ కవులను Progressive Writers అంటారుగద, మనజాతి పూర్వమున్న సంస్కృతికి అదనమైనదా Progress? లేక పూర్వ ఆర్ష సంస్కృతిని తన్నివేసి పునాదిలేని కట్టడములు కట్టడమా Progress? ఆనుపూర్వికసంస్కృతిని తననేటిసంస్కృతికి మూలకందముచేసికొన్నప్పుడు మనజాతి చేవగల జాతి అవుతుంది. ఈ మూడు శక్తులను అలవడ్డవో, అవే కళోపాసకుని ధృక్పథాన్ని మరింతవెల్గుతో వెలార్చి సర్వతోముఖదార్ఢ్యమును చేకూరుస్తాయని నానమ్మకం. "హితం మనోహారిచ దుర్లభం వచః" ఈనాహితం సౌహార్దంతో స్వీకరించి ప్రియమైన హితంగాగ్రహిస్తారుగాక అని విన్నవిస్తూ ఇంతతో విరమిస్తున్నాను.

★

ఈ సుమజన్మ మెట్లొ ఘటియిల్లెను నా కొకనాటిపాటిదై
వాసనలీను సోయగము వాయని తీయనిపోడుముల్ క్షణం
బో సగమో విచారపడబో నయినన్ విడివడ్డ నాయెదన్
మోసులువారు నూతన మనోరథ. మామనివేడిపొంగులన్.

పేదల రక్తమాంసముల పెంపువహించి దయాసామ్రుతా
స్వాద దరిద్రులైన ధనవంతుల పెద్దరికమ్ముకై. మతో
న్మాదము పెంచు దేవునికి మారుగనిల్చిన రాతిబొమ్మలం
దూపిరివోవు పొద్దుబ్రదు. కొక్కనిమేషము సైపనాయెదన్.

నీచపు దాస్యవృత్తి మననేరని భారత మాతృదేశ సే
వాచరణమ్మునం దసువు లర్పణసేసినవారి పార్థివ
శ్రీ చెలువారుచోట, తదసృగ్రుచులన్ వికసించి, వాసనల్
వీచుచు రాలిపోవగవలెం దదుదాత్తసమాధిమృత్తికన్!

— వేదుల

★

దండ్యాచార్యుల రసదృష్టి

శ్రీ ఆ. నరసింహ శర్మ

దండికి పూర్వుడైన భరతముని రసస్వరూపాన్ని నిర్వచించేడు. తరువాత కావ్యస్వరూపాన్ని వివరించిన దండ్యాచార్యులు రస స్వరూపాన్ని వివరింపలేదు. ఇది వీరిమతభేదము కారణమా? ఇతర కారణము కలదా?

ఈ విషయాన్ని చర్చించడానికి ముందు నాటకము, రసము, భావము అనేపదాలు దండి ఏఅర్ధంలో వాడేడు? ఆతనిదృష్టిఏమి? అని పరిశీలించవలసిన అవసరం ఏర్పడింది.

దండి "రసభావనిరంతరం" అని కావ్యాన్ని వర్ణించేడు కాని ఇక్కడ రస, భావ, శబ్దములకు భరతుడుగాని, నవీనులుగాని వ్రాసిన అర్ధం కాదు. కొందరు వ్యాఖ్యాతలు నవీనాలంకారిక వాదముగ్ధులై ఆ అర్ధాన్నే సూచించేరు కాని దండి స్వయముగ వేరొకచోట ప్రాసంగికంగా వీటిని వివరించేడు.

"కామం సర్వోప్యలంకారో
రసమర్ధే నిషించతి
తథాప్యగ్రామ్యతేవైనం
భారం వహతిభూయసా."

అలంకారము రసమును అర్ధమందు చిప్పిలజేయును. అట్లయ్యును అసభ్యత్వము భారము నధికముగ వహించును అని చెప్పి విరసమునకు ఉదాహరణముగ—

"కన్యేకామయ మానంమాం
త్వం నకస్మాన్నమన్యసే"

"ఓ కన్యా నిన్ను కామించు నన్ను నువ్వేలకోరవు" అని చెప్పి దీనినే రసవత్తరముగ చెప్పుటకు ఔచిత్యము ననుసరించి—

"కామం కందర్ప చండాలో
మయి వామాక్షి నిర్దయః
త్వయి నిర్మత్సరోద్దిష్టో"

"ఓ వామాక్షి నాయందు నిర్దయుడైన మన్మధుడు నీయందు నిర్మత్సరుడు." అని ఉదహరించెను.

ఇట్లే కళా విరోధాన్ని నిరూపిస్తూ "శృంగారవీరములకు, హాస బీభత్సములు స్థాయులు" అని ఉదహరించేరు.

దీన్నిబట్టి శృంగారాది రసములు నాట్యకళావిషయములు అని స్పష్టమవుతూంది అంచేతే భరతుడు వాటిని వివరించడం జరిగింది.

ఇష్టార్ధచర్వణముచేనైనయానందము రసము - అని దండియాశయము అని స్పష్టమవుతుంది.

నాటక ప్రయోగాదులందు అనుభవింపబడే ఆనందానికి రసము అనగా "విభావాను భావాది ... సంయోగాద్రస నిష్పత్తిః" అనే రసమనియు, రమణీయార్ధమును అనుభవించుటచేతనైన



సముద్రాల రాఘవాచార్యులుగారు



ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు

శ్రవ్యకావ్యమందలి ఆనందము రసము అనియు రెండు విధములైన అర్థం మనకు సిద్ధించింది. మొదటిది దృశ్యకావ్యంలో మాత్రమే ఉంటుంది. రెండవది శ్రవ్యకావ్యంలో ఉంటుంది. దృశ్య శ్రవ్యకావ్యానందాలు వేరు కాబట్టే దండి దృశ్యకావ్య పరామర్శవచ్చేసరికి 'తేషామన్యత్రవిస్తరః' అని ఊరుకున్నాడు. శ్రవ్యకావ్యమందలి రసము రమణీయార్థభావనచేత కలిగే ఆనందము అని అతని అభిప్రాయం.

నవీనులు ఈ రెండూ ఒకటే అని ఉభయసామాన్యముగ, రసనిర్వచనం చేసేరు.

అనుభూతిలో ఈ రెంటికి భేదం కనిపిస్తూంది.

నాటకంలో ప్రయోగము కావ్యంలో శబ్దసంఘటనము భావము మొదలగునవి ఆనంద కారణాలవుతున్నాయి విభిన్న కారణాలచేత పుట్టిన ఆనందము ఒక్కటి కాదు కాని రెంటిలోను సహృదయత్వము భావన సమాన ధర్మాలు అవడం చేత నవీనులు అభిన్నంగా వ్యాఖ్యానం చేశారు

దీనినంతటిని చూస్తే నాటకప్రయోగ దర్శనమున కలిగే ఆనందము కావ్యశ్రవణమువల్ల కలిగే ఆనందము ఒక్కటి కాదు. అందుచేత భరతునిరసస్వరూపము నెరింగిన దండి, శ్రవ్య కావ్యప్రసక్తిలో దానిని వివరింపలేదని వ్యక్తమవుతూంది. శ్రవ్యకావ్యంలో ఉక్తిభంగీభణితులవల్ల కలిగే ఆనందము రసమని అతని ఆశయము.

ఇలాగే 'భావము' అనే పదంకూడా నవీనులువాడే అర్థంలో దండిఉపయోగింపలేదు.

కవికావ్యంలో చెప్పదలచిన అభిప్రాయము భావము ఇది నవీనులు సూచించే రస కావ్యంలోను, భావ కావ్యంలోను కూడా ఉంటుంది కవి చెప్పదలచిన విషయమే భావము. ఇది కావ్యారంభం నుంచీ అంతంవరకూ ప్రతి ఆశ్వాసాది విభాగంలోను ఉంటుంది. దీన్ని ఆధారంగా చేసుకొని వర్ణనాదికాలుకూడా దీనియందే పర్యవసానాన్ని చెందుతాయి. ఇది ప్రబంధవ్యాపియైన గుణము అని దండి ఆశయము.

భావః కవేరభిప్రాయః
కావ్యేష్వాసిద్ధియః స్థితః

అని అతడు కంఠోక్తిగా వివరించాడు. ఉక్తి భంగీభణితిచేత కలిగే ఆనందానికి శ్రవ్యకావ్యంలో రసమనియు, కవియొక్క అభిప్రాయమునకు భావమనియు దండి యొక్క ఆశయము

ఋతువర్ణనము, గిరి-నదీవర్ణనము మొదలైన ఖండకావ్యాల్లో అచేతనము వర్ణ్యమవడంచేత అక్కడ రసభావాదికం లేదు. వాటిని చదవడంవల్ల ఆనందము కలుగుతుంది. నవీనులపద్ధతుల ననుసరించి కృత్రిమంగా రసభావాదికానికి ఈ ఆనందాన్ని అతకడం కంటె దండి సూచించిన పద్ధతిలో కావ్యనిర్ణయం జరగాలి. అప్పుడు శ్రవ్య కావ్యంలో ఏవి ఆనందజనకములు? అన్నవిషయం విపులంగా ప్రదర్శింపబడి రచయితలకు సూక్ష్మానుభూతిని ప్రదర్శింప కలుగుతాయి.

భరతముని సాహిత్య శబ్దాన్ని నాటక పర్యాయంగా వాడినట్లు కనిపిస్తూంది కాబట్టే సహిత శబ్దానికి చతుర్విధాభినయ యుక్తము అన్న అర్థాన్ని నిర్వచించేరు. ఆహార్యాదికము లైన ఈ అభినయాలు సమిష్టి నాటకం నుండి విడబడి ప్రత్యేకంగా నిర్మింప బడి నూతన మార్గాన్ని అవలంబించడం కనిపిస్తూంది. ఈవిషయాలనుబట్టిచూస్తే భరతముని రచించిన రసలక్షణము కేవల రూపకములకే వర్తిస్తూంది.

నాటకంలో విభావాదికము ప్రత్యక్ష మయి వానియందలి అనుభవ సాత్వి కాదిభావనచేత భావము స్థాయీభావాన్ని చెందుతూంది. కాబట్టి దానికి ఆ లక్షణము యుక్తము. శ్రవ్యకావ్యంలో ఉక్తిభంగీ భణితి, భావము — ఈరెంటిని భావించి సామాజికుడు ఆనందాన్ననుభవిస్తు న్నాడు.

తరువాత వారు రసవాదము ధ్వని వాదము రీతివాదము మొదలగునవి ప్రచా రములోకి తెచ్చి ప్రాచీనుల ఆశయాలని తమ మతాలకి ముడిపెట్టడం చేత దండి యొక్క ఆశయము భిన్నమయింది.

దండిచూపినఆశయాన్ని ఆధారంగా చేసుకుని కుంతలుడు వక్రోక్తి కావ్య జీవితమని ఉక్తి భంగీ భణితులను వివరించేరు. క్షేమేంద్రుడు ఔచిత్య మే ప్రధానమని ఔచిత్య విచార చర్చలో నిరూపించాడు. వ్యుత్పత్తి లేకపోవడం రచనకు హేలన తనా న్నిస్తుంది వ్యుత్పత్తి రీతిసౌష్ఠవాన్ని కలిగిస్తుంది — అని మంగళుని ఆశ యము

అవంతిసుందరి అః రాజితిద్రోహిణి శ్యామ వుడు మొ॥ వారు దండియొక్క విభాగాన్ని పాటించినట్టే కనిపిస్తూంది.

ఆలంకారికులు కూడా తమగ్రంథా లను వివరించేటప్పుడు నాటకధోరణి కావ్యధోరణి మనస్సులలో ఉంచుకుని వేరువేరుగా వివరిస్తూ వచ్చారు. దశ రూపకము శారదా తనయుని భావప్రకా శము జగద్ధరుని నాట్యసర్వస్వము త్రిలోచనుని నాట్యాలోచనము సర్వజ్ఞుని రసార్ణవ సుధాకరము మొదలగునవి నాట్య శాస్త్రమును ప్రధానముగా వివరిం చిన సాహిత్యశాస్త్రములు. భట్టనాయకుని హృదయ దర్పణము. హేమచంద్రుని కావ్యానుశాసనము మంఖుకుని అలంకార సర్వస్వము మొదలగునవి శ్రవ్యకావ్యాన్ని వివరించె శాస్త్రాలు.

ఈ రెంటికీ సమన్వయం చేసినవారు, ఒకతెగకి చెందినవారూ ఉన్నారు.

ఈ విధమైన శాస్త్రప్రణాళికకూడా ఈ విషయాన్నే నిరూపిస్తూ ఉన్నది.

★

కావ్యవస్తువు

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

"పెడజనిన మనోహర జాడలరసి
కలగు హృదయమ్ము; నెమ్మదిచలనమొందు,
కనులు మూసిన లోన మోహన మనోజ్ఞ
మూర్తి చిరునవ్వు చిలుకుచు మ్రోలనిలుచు"

ఇది అందరికీ కవిత్వమే. సందేహం లేదు.

"మరో ప్రపంచం, మరో ప్రపంచం,
మరో ప్రపంచం పిలిచింది—
పదండి ముందుకు, పదండి త్రోసుకు
పోదాం పోదాం పైపైకి —

దీన్ని కవిత్వం అనడానికి గూడా ఎవరూ తటపటాయించరు.

ఇక—

"దారిపక్క చెట్టుకింద
ఆరిన కుంపటి విధాన
కూర్చున్నది ముసల్దొకతె
ఈగలతో వేగలేక—"

అన్నదీ,

వరుసం దొలంగ వానలు కురియున్
వరపైరులు బంగారమె పండున్
కానీ—మా వీధులలో మాత్రము
ఆ నీరస నీగవ దరిద్రగాత్రము

అన్నదీ, గూడా కవిత్వమే అందామా? అంటే గొంతు పట్టుకుంటున్నది కొందరికి ఇదేమి కవిత్వం అనే విచికిత్స బలీయంగా కలుగుతుంది

సాధారణంగా మానవహృదయాన్నీ సాహిత్యప్రపంచాన్నీ, ఆక్రమించి ఏలుబడిచేసేవి శృంగార వీర రసాలు. కావ్యాల్లో, కథల్లో నాటకాల్లో, అనేక స్వరూపాలతో, విచ్ఛిత్తి విశేషాలతో, వీటికి అగ్రస్థానం ఇచ్చి కావ్యకర్తలు గ్రంథకోటి నిర్మించారు. ఏ ఉత్తమ కావ్యం, నాటకం తీసుకున్నా, ఇవి ప్రధాన రసాలై, తక్కినవి అంగరసాలుగా ఉండడంగూడా మనకు ప్రత్యక్షమవుతుంది. దీనినిబట్టే ఆలంకారికులు తమ లక్షణ గ్రంథాలలో కావ్యానికి శృంగార వీరరసాలుమాత్రం ముఖ్యంగా ఉండాలని నిబంధించారు.

మానవ హృదయంమీద ఈ రసాలు సంపాదించిన పలుకుబడిని బట్టి క్రమంగా ఇవి ప్రముఖంగా ఉంటేనే తప్ప అది కవిత్వమే కాదనీ అధమం అయినా ఉత్తమశ్రేణికి చెందదనీ నిర్ణయించేటంత నమ్మకం ప్రతిసాహిత్య పరిచితుని హృదయంమీదా ఒకచిక్కని పొరలాగు స్థిరపడినట్టు కనపడుతుంది.

అయితే-మానవానుభవాల్లోకల్లా అతి తియ్యని శృంగారం వెచ్చవెచ్చని వీరం మానవజాతినే ప్రబలంగా తనవైపునకు ఆకర్షించి తద్వారా సాహిత్యజగత్తును ఆక్రమించి సర్వతోముఖంగా ఏలుబడి సాగించడంలో ఆశ్చర్యంలేదు. కాని వీటి విహారానికిగూడా, దేశస్థితినిబట్టీ, కాలపరిణామాన్ని బట్టీ, ఒకపరిమితి ఏర్పడుతుంది

ఉత్తమ పరిపాలనలో దేశం, ప్రజా సుభిక్షంగా శుభస్థితిలో తులతూగుతూన్నప్పుడు పారమెరుగని శృంగార లీలానుభవమూ, పౌరుషనిబిడమైన వీర రసానుభూతీ, ఉన్నతస్థాయిలో నిలిచి వెలుగొందడం ఎంతో సహజం. కవులు వీటిని చేపట్టి కావ్యాలు నిర్మించడం లోనూ ఔచిత్యం ఉన్నది.

కాని రాజకీయంగా, సాంఘికంగా, జాతి విచిత్రమైన అశాంతికీ, అనూహ్యా పరిణామాలకూ వశమైనప్పుడు కవి ఊహలూ, కావ్యగతులూ, కొత్తబాటల లోకి అడుగుపెట్టడం, కొత్తరీతులను సృష్టించడం అపరిహార్యంగా ఏర్పడడం అసహజం కాదు—

కనుకనే "ఎవ్వాని వాకిట నిభమద పంకమ్ము రాజభూషణ రజోరాజినడగు"

అని పూర్వాంధ్ర మహాకవి దేశీయ సంపన్నతను ఉగ్గడిస్తే నేటి కవులు "పాడైన పెనుకోటగోడల దీర్ఘనిద్రలు వోవు కాంతిప్రాభవమ్ము" నూ

"చరిత్రలో మునిగిపోయిన ఆంధ్ర వసుంధరాధిపోజ్జ్వల రమణీయకీర్తి విభవంబొక స్వప్నకథా విశేషమై" న తీరునూ ఎలుగెత్తి చాటినారు.

అంతేకాక—వర్తమాన దృశ్యమాన పరిస్థితులనుంచి తప్పించుకు దూరంగా పోలేని ఆధునిక కవులు కొందరు పేదల దీనావస్థలను, జాతి దారిద్ర్యాన్నీ అగ్రవర్గపు అహంకారాన్నీ స్ఫుటంగా కావ్యాల్లో చిత్రిస్తున్నారు.

ఈ కవితా రీతులను కొందరు సాహిత్య విమర్శకులు ఇట్లా ఎదుర్కొంటున్నారు.

౧. గొప్పకవిత్వం సృష్టించాలంటే ఉదాత్తవస్తువులూ, ఉత్తమానుభవాలూ, సుందర ప్రకృతిని తీసుకోవాలి. గాని అల్పసంఘం, అధమస్థితులు కావ్యసామాగ్రిగా గ్రహించడం హర్షించతగ్గది గాదు

౨. బహుముఖలోకయాత్రా ఖిన్నులైన జనులకు ఊరటనిచ్చి, ఉల్లాసం కలిగించవలసిన కావ్యాలు, దీనులూ, భ్రష్టులూ, పతితులూ, దుఃఖితులూ, అయిన వారిచరిత్రతో నిండితే కావ్య ప్రయోజనం ఏం నెరవేరినట్టు ?

౩. దురదృష్టవంతుల కథలే కావ్య వస్తువులైతే అమంగళాశ్లీలకరమైన ఆ కావ్యం రచయితకు, పఠితకూ శుభ ఫలకం ఎట్లా అవుతుంది ?

ఈ ఆక్షేపణలకు హేతువాదపూర్వకమైన సమాధానం చెప్పవలసిన అవసరం తప్పకుండా ఉన్నది

సాహిత్య మీమాంసలో మూడు అంశాలను ప్రమాణంగా తీసుకుంటే ఒక సమ్మతమైన పరిష్కారం చెయ్యవచ్చు.

అవి, ౧ అలంకారశాస్త్రం ౨ పూర్వ కావ్యాలు ౩ మన అనుభూతి.

మొటమొదట శాస్త్రాన్నిబట్టి చూద్దాం: సాహిత్యశాఖను అనుశాసించే ఏ అలంకార శాస్త్రమైనా కావ్యానికి పరమావధి- రసమూ- కవి వాక్చమత్కారఫణితి అన్నదిగాని, తీసుకున్న వస్తువునుబట్టి ఉత్తమత్వ అధమత్వాలను నిర్ణయించ లేదు. పైగా - సృష్టిలో ఏవస్తువూ, ఏభావమూ, ఏ అణువుకూడా కావ్యసా

మగ్రి కానిది లేదని దశరూపకంలో ధనంజయుడిట్లు అన్నాడు—

రమ్యం జుగుప్సిత ముదారమథాపినీచం
ఉగ్రం ప్రసాదిగహనం వికృతంచవస్తు
యద్వాప్యవస్తు కవిభావకభావ్యమానం
తన్నాస్తియన్న రసభావముపైతిలోకే

కనుకనే - సాధారణాస్వాదానికి దూరమయిన శోకం స్థాయీభావంగాగల కరుణం. జుగుప్స(అసహ్యం) స్థాయిగాగల బీభత్సం భయస్థాయికమైన భయానకం, విచక్షణులైన అలంకారికుల దృష్టిలో కావ్యంలో వర్ణించదగ్గవైనాయి.

అయితే- మహాకావ్యలక్షణం చెబుతూ ఉత్తమనాయకాదులను స్మరించడం కావ్య శోభాతిశయంకోసం చెప్పిన మిత్ర వాక్య తుల్యాలు గాని, ప్రధాన సూత్రాలు కావు. కాకపోతే ఒకకవి ఎంత ఉత్తమ నాయకునీ, వస్తువును తీసుకొన్నా ఆ కావ్యము రసహీనమైతే ఒకపెద్ద అపశబ్దము అవుతుందని ఆనందవర్ధనుడు అన్నాడు.

సుందర ప్రకృతినే కావ్యసామగ్రిగా గ్రహించాలన్న మాటగూడా విమర్శక్షమమైనదిగాదు.

లౌకిక దృష్టికి సుందరములైనవి మాత్రమే కావ్యజగత్తులో సుందరములనీ, తక్కినవి వికృతములనీ అనుకోవడం పొరపాటు. కవి లోకులవలె వస్తునిష్టమైన బాహ్య సౌందర్యాన్నేకాక వస్తువుయొక్క అంతర సౌందర్యాన్ని గూడా దర్శించగలడు. అందుచేతనే లోకులు సాధారణంగా వికృతమనుకునే వాటిలోనుంచి అతడు ఇంద్రజాలికునిలా సౌందర్యం పిదుకగలడు తార్కాణంగా, గ్రే, భవభూతి, కవుల శ్మశాన వర్ణనం చూడండి.

ఇక్కడ కొందరంటారు —

చింతకర్రలో నుంచి శ్రీగంధం తియ్యగలమా? తుమ్మకట్టెతో వీణా దండి నిర్మాణం చెయ్యగలమా? అని ఈ లౌకికోదాహరణాలవల్ల ప్రతిపక్షవాదం తాత్కాలిక రమణీయమైనా, ప్రత్యుదాహరణలతో దీనిశక్తి సడలిపోతుంది.

నేనిట్లా అంటాను.

కవిశక్తి నారదుని మహతి వంటిది. చేతితో తీగలు తాకకుండానే అది దివ్యగానం వర్షిస్తుంది. దాన్ని ఏకట్టెతో చేశారో తెలియనక్కరలేదు. అదిప్రచండ తపశ్శక్తి వంటిది — మత్స్యగంధిని యోజనగంధిగా చెయ్యగలదు. చింతకర్ర నుంచి శ్రీ గంధంగాదు; దుర్వాసన లోంచి సుగంధాన్ని ప్రసవిస్తుంది. కవి ప్రతిభ గరీయసి అనడానికి ఇంతకంటె ఇంకేమి ఉదహరించాలి?

కవి ఎంతటి అల్పాల్ప విషయమైనా తీసుకుని తన వాగింద్ర జాలంతో అద్భుతంగాచెయ్యగలడు. శ్రీనాధుని—'సంసారద్రుమమూల పల్లవ గుళుచ్ఛము' ఎంత అపూర్వసృష్టి? అట్లే యీనాటి అతివాస్తవికులు ఎంత వికృత వస్తువును తీసుకున్నా, ఉల్లిపొరలాంటి వ్యంగ్యం చాటున ఎంత చమత్కారంగా చెప్పగలుగుతున్నారు!

శాస్త్రరీత్యా, కావ్యానికి రసమే ప్రధానమనీ, వస్తు నిర్ణయంగానీ, వ్యక్తి

నిర్ణయంగానీ, నిజానికి లేదనీ కవిప్రతిభాసముత్పన్నమైన కావ్యం ఆస్వాద్యమైతే ఉత్తమమైనదే అనీ. తేలినప్పుడు-ఈసిద్ధాంతం పూర్వమహాకవుల కావ్యాలలో ఎట్లా ప్రతిఫలించి ఉన్నదో కొంచెం పరిశీలించవలసి యున్నది

ఆదికవి వాల్మీకి ఒకకిరాతకుని క్రూర బాణానికి లగ్గమైన రెండు క్రౌంచపక్షుల దీనావస్థచూచి తనప్రదను కవితామధు బిందువులను శోకాంకితములు చేసినాడు. ఆశోకమే శ్లోకమయి 24 వేల మహా రామాయణ గ్రంథానికి అంకురార్పణ మయిందంటే కవి తనశోకాన్ని విశ్వజనీనంచేసి ఎంతటి విశుద్ధ సందేశాన్ని వినిపించినాడో గ్రహించగలం

కాళిదాసమహాకవి రఘువంశం సర్గలో అజునకూ శత్రువులకూ జరిగిన యుద్ధ వర్ణనంలోని ఈశ్లోకం అతని బీభత్స వర్ణనకు గొప్ప నిదర్శనం.

శిలీముఖోత్కృత్త శిరః ఫలాఢ్యా
చ్యుతైః శిరస్త్రైః చషకోత్తరేవ
రణక్షితిః శోణిత మద్యకుల్యా
రరాజమృత్యోరివ పానభూమిః

ఇట్లే 11వ సర్గలోని తాటకావధ సందర్భమందు చేసిన బీభత్స వర్ణనం అపూర్వం—

రామమన్మథ శరేణ తాడితా
దుస్సహేన హృదయే నిశాచరీ
గంధవద్రుధిర చందనోక్షితా
జీవితేశ వసతిం జగామసా॥

అదేసర్గలో పరశురామాగమనసందర్భంలో దిక్కులను రజస్వలా స్త్రీలతో సమంగా వర్ణించాడు.

శ్యేనపక్ష పరిధూసరాలకా
సాంధ్యమేఘ రుధిరార్ద్ర వాససః
అంగనా ఇవరజః స్వలాదిశో
నోబభూవ రవ లోకనక్షమాః ॥

భవభూతి కవీశ్వరుని మాలతీ మాధవము 5వ అంకంలోని బీభత్స వర్ణనం అనన్య సాధారణంగదా—రుద్రభూమిలో పిశాచ స్త్రీలు శవాంగాలను అలంకరించుకొని కపాలపాత్రలలో పిశాచ ప్రియులతో పానగోష్ఠి చిత్తగిస్తూఉన్న భయంకర దృశ్యం ఇది

అంత్రైః కల్పిత మంగళప్రతిసరాః
స్త్రీ హస్తరక్తోత్పల
వ్యక్తోత్తంస భృతః పినహ్య
సహసాహృత్పుండరీకస్రజః
ఏతాః శోణితపంక కుంకుమజుషః
సంభూయ కాంతైః పిబం
త్యస్థి స్నేహ సుధాంకపాల
చషకైః ప్రీతాః పిశాచాంగనాః

హృదయవిదారకమైన దారిద్ర్యాన్నీ, దుఃఖితులనూ పూర్వ కవులు ఎంత నిపుణంగా వర్ణించారో చూడండి—

మద్గేహే మశకేవ మూషకవధూః
మూషీవ మార్జారికా
మార్జారే వ శునీశునీవ గృహిణీ
వాచ్యః కిమన్యోజనః
కించక్షుత్ క్షమ ఘూర్ణమాననయనైః
రున్నిద్రముద్వీగ్నతైః
కర్తుంవాగ్వ్యయమక్షమైః స్వజననీ
బాలైః సమాలోక్యతే

మహాకవి గండితి పోషించిన ఒక మహారాజు దండికోరికమీద దారిద్ర్యాన్ని ఇంత విస్ఫుటంగా వర్ణించినాడు.

"నా యింట ఎలుక దోమలాఉన్నది.

పిల్లి ఎలకపిల్లలా ఉంది. కుక్క పిల్లిలా ఉన్నది. ఇల్లాలు కుక్కపిల్లలా ఉన్నది. తక్కినవారి మాట ఏమిచెప్పను ?

ఆకలిబాధతో కళ్ళు తిరుగుతూ నిద్ర లేక భూమిపై పడి మాటాడలేని పిల్లలు తనవైపు చూస్తుండగా పిల్లి కొయ్యబారి ఉన్నది."

మరియొకకవి దారిద్ర్యవర్ణనం ఇది—

క్షుత్క్షామాః శిశవః శవా ఇవ భృశం
మందాశయా బాంధవాః
లిప్తా జర్జరకర్కరీ జతులవైః
నో మాం తథా బాధతే
గేహిన్యా స్త్రుటితాంశుకం ఘటయితుం
కృత్వా సకాకుస్మితం
కుప్యన్తీ ప్రతివేశ లోకగృహిణీ
సూచీం యదా యాచితా

"ఆకలితో ఎండిన పిల్లలు శవాల్లా ఉన్నారు. చుట్టాల చూపు తగ్గింది. చిల్లుల కుండకు లక్కపట్టు వేశాం. ఇవేవీ బాధించడం లేదుగాని—నా యిల్లాలు చిరిగి ముక్కలైన తన రవిక కుట్టుకోడానికి సిగ్గుతో దీనమైన చిరునవ్వుతో, మాటాడితే కోప్పడే పక్కింటి ఆవిణ్ణి సూది అడగడం చాలాబాధిస్తున్నది."

లోకంలో సౌఖ్యం, సుందరం అని భావింపబడే ఏ వస్తువూ ఆకలితో అలమటించే వారికి రుచించదు. అన్ని పనులూ కుంచంగోని బియ్యం ఆధారం అని ఈ కవి—

శయ్యావస్త్రం చందనం చారుహాస్యం
వీణావాణీ దృశ్యతే యాచనారీ
నభ్రాజన్తే క్షుత్పిపాసాతురాణాం
సర్వారంభాః తండులాః ప్రస్థమూలాః॥

మృచ్ఛకటిక నాటకంలో దరిద్ర చారుదత్తుడు నాయకుడు, వేశ్యనాయిక, దొంగలు, జూదర్లు, తిరుగుబాటుదారులు మహామూర్ఖ రాజస్యాల కాదులు తక్కిన కావ్యసామగ్రి – ఇట్లాంటి లోక కావ్య విరుద్ధ కోటిని తన నాటకి వస్తువుగా తీసుకొని ఆ మహాకవి, సృష్టిలోని ఏ వస్తువూ కావ్యానికి పనికిరానిది లేదని రుజువుచేసి అద్భుత సందేశాల నివ్వదగిన రసబంధుర నాటకం నిర్మించాడు.

దారిద్ర్యపీడిత తప్తవాక్యాలతో తన నాటకానికి తెర ఎత్తుతూ సూత్రధారుడంటాడు—"అహామేవ బుభుక్షితో ఽన్యమయం పశ్యామి జీవలోకం" "ఆకలి వల్ల నాకీప్రపంచ మంతా అన్నకబళంలా కనబడుతున్నది."

శూన్యమపుత్రస్య గృహం
చిరశూన్యం నాస్తి యస్య సన్మిత్రమ్
మూర్ఖస్య దిశః శూన్యాః
సర్వం శూన్యం దరిద్రస్య.

అన్నాడుకూడా.

సర్వలోకవృత్తికీ, అద్దంవంటి కవి హృదయం దేన్నీ నిరాకరించకుండా తనలో ప్రతిఫలించుకొని దాన్ని కావ్యం చేస్తుంది.

కనుకనే ఆధునికాంధ్రకవులుకూడా "కడలేకఏడ్చు తుంగభద్ర కెరటాలను" శైలులోని 'అంధ భిక్షుకుల' ను అమావాస్యరాత్రి హృదయంలోని 'చిమ్మటల'ను భూగర్భనిక్షిప్తములైన 'సుప్తాస్థికల'ను చీకటిలో దేశదారిద్ర్యపు నీడల్లా వాడల్లో కటలే 'మాదాకవళం' పిల్లలను 'బిచ్చకత్తె' లనూ తమ కావ్యవస్తువులుగా చేసుకున్నారు.

మన అనుభూతిలోగూడా ఒక వింత విషయాన్ని గుర్తించవచ్చు.

లోకంలో మనంచూచే సామాన్య విషయా లన్నిటినుంచి కవిత్వం పుట్ట గలదని మనం అనుకోము. అట్లాంటి ఎంత చచ్చువిషయాలమీదనైనా కవి గారడీచూపు పడితే దాని సామాన్యత్వం వెంటనే తుడుచుకుపోయి అతని చాతు ర్యంలో అది మనకు రక్తిగా కనపడ్డ ప్పుడు ముగ్ధులం అవుతాం.

సాలెపట్టు, పెసరకట్టు వంటి నీరస అంశాలను సైతం కవిత్వమార్గం పట్టిం చడం ఎరుగుదుం.

"క్రూరరాజు రాజ్యం సాలెపట్టు
నోరులేని ప్రజలంతా ఈగలు" అంటే
"ముద్గదాళీగదావ్యాళీ
కవీంద్రవితుషా కథం ?
అంధోవల్లభ సంయోగే
జాతా విగతకంచుకా॥

అని పెసరకట్టుమీద చెప్పితే ఆస్వాద్యం కాదా ?

మొదట ఉదహరించిన 'దారిపక్క చెట్టుకింద' అన్న పద్యంలో ఒకపక్క దారిద్ర్యం, రెండోపక్క వార్ధక్యంనలగ దొక్కే ప్రాణి దుఃస్థితి కరుణప్లుతి కలి గించడంలేదా ? ఆ ప్రాణిలో చల్లారిన యౌవనస్థితిని 'ఆరిన కుంపటి' ఉప మానం ఎంత విస్ఫుటం చేసింది.

మన అభిరుచి ఎంతసేపూ కవి ఉక్తి లోని రక్తిని వెదకుతుందిగాని అతడు తీసుకొన్న ప్రాథమిక వస్తువుమీదికి ప్రసరించదు.

ఒకప్పుడు ఇట్లాంటి విషయాలమీద చెప్పిన పద్యాలు కొన్ని పేలవంగాను, హేయంగాను కనబడితే అది ఆ కవి ప్రతిభాశూన్యమైన వాగ్దోషంగాని అన్యం కాదని, ఆలోచిస్తే గ్రహించగలం.

ప్రపంచయాత్రాఖిన్నులైన జనులకు ఈ దీనుల కథలు ఏమి ఆనందం కలిగి స్తాయి ? అనే ప్రశ్న ఒకటి ఉన్నది

కావ్యహృదయం బాగా అవగాహన చేసుకుంటే ఈ ప్రశ్నకవకాశం ఉండదు. ఎందుచేతనంటే—

హరిశ్చంద్ర, ఉత్తరరామ చరితాది నాటక ప్రదర్శనాలకు వెళ్ళి మనం ఆనందిస్తున్నాం. అందులోని కథ శోక భూయిష్ఠమైన కరుణయే. అయితే— లోకసంబంధమైన దైన్యం దుఃఖం మొదలైన భావాలు మనకు లోకంలో చూచినప్పుడే బాధకలిగిస్తాయిగాని, అవి కవి కల్పనలో రసస్థితిని పొందినప్పుడు ఆనందకరములే అవుతున్నాయి. కాక పోతే అట్టి నాటకాలు చూడడానికి కోరి ఎందుకు ఉవ్విళ్ళూరుతాము ?

కనుక సహృదయులైన పాఠకులు వస్తువులోని దుఃఖ దైన్యాలను, రచనా సౌందర్యంలో రససిద్ధిని పొందగా చూచి ఆనందిస్తారుగాని, వట్టి ముడిసరుకువలె చూచి ఏవగించుకోరు.

ఇట్లాంటి రచనలు కవికీ పఠితకూ అమంగళకరములు కావా ? అనే మాట గూడా శక్తిగలది కాదు

నిత్యయాత్రలో నీకు పదేపదే కన పడే భిక్షుకులూ, దీనులూ, అంధులూ, పీడితులూ, పతితులూ నీకు ఎట్టి అమంగ ళాశంకనూ కలిగించనప్పుడు వారికథ కావ్యగతమయ్యేసరికి అమంగళ, అశ్లీల భయానికి కారణం ఏమిటో తెలియదు.

వీరులేని దేశదుర్భస్థితినే కోరి నీవు పరితపిస్తూఉంటే, కవిగూడా అదేకోరి వాని దీనగాధలను శక్తిమంతంగాచెప్పినందుకు సంతోషించాలిగదా. క్షేమేంద్రుడు కవిశిక్షణ గురించి చెబుతూ

"శోకప్రలాపశ్రవణం,
శ్మశానారణ్యదర్శనం"
....
శిక్షాదాంశతమిత్యుక్తం
యుక్తం ప్రాప్తగిరః కవేః"

అని మనదృష్టిలో అశ్లీలములైన వాటినిగూడా కవి విడువకుండా పరిశీలించి కవితకు వాని నుపయోగించుకోవాలని సూచించాడు.

ఇంకా అశ్లీల భయస్థులంటే అది ఒక Sentiment గా పరిగణించి విడిచిపెట్టవచ్చు.

ఈ విధంగా కావ్యంలో ఉండవలసిన వస్తువునుగూర్చి, శాస్త్రాన్నిబట్టి, పూర్వకావ్య సాంప్రదాయాన్నిబట్టి, మన అనుభవాన్నిబట్టి, ఎంత పరిశీలన జరిపినప్పటికినీ దానికి కొన్ని కథలు, కొందరు వ్యక్తులు, కొన్ని సన్నివేశాలుమాత్రమే పనికివచ్చి తక్కినవి పనికిరావనే నిబంధన ఏరీతిగానూ ఎక్కడా ఉన్నట్టుగాని, ఉండడం ఉచితమనిగాని కనబడదు. భరతాచార్యుడు లోక వృత్తాను కరణం నాట్యమేఅన్నమాట, ఒక్కదృశ్యకావ్యాలకేగాక శ్రవ్యకావ్యాలకుగూడా అక్షరాలా వర్తిస్తుందన్నమాట అనుభవసిద్ధం.

అయితే- మానవానుభూతికి సన్నిహితములూ, రుచిమంతములూ, అయిన శృంగారవీరాదులను Sublimate చేసి ఎన్ని విధాలుగానైనా చెప్పే అవకాశం ఎక్కువగావుంటే ఉండవచ్చు. తక్కిన వాటికి అంతలేక పోవచ్చును. అంతేగాని కవి కరుణ, బీభత్సాదులను గూర్చి రచించడం ఆస్వాద్యంకాదనిగాని, అశ్లీలమనిగాని, అప్రయోజకమనిగాని ఆక్షేపించడం అన్యాయమని నామనవి.

There is no forbidden fruit in the garden of poesy అన్న ఆంగ్ల కవి ఎంత ఉదారుడు!!

★

వర్ణధర్మాలన్న ఉక్కుచట్రము పగిలి
నాల కన్నమదాసు మనస్సైన సుతుడుగా
వీరవైష్ణవ మొచ్చెరా పలనాట
బ్రహ్మనాన్న "కలి" గీతలో

— వి. వి. శివయ్య.

మన సాహిత్యంలో మార్పులు

శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రి

సాహిత్యము ఒక నదీప్రవాహం లాంటిది ఎత్తుపల్లాలనుబట్టీ ఆటంకాలను తొలగించుకోవలసిన అవసరాలను బట్టీ ప్రవాహము తనగతిని మార్చుకొంటుంది. ఎన్నో మలుపులు తిరుగుతుంది అలాగే సాహిత్యం కూడా దేశకాల ధర్మాలను అనుసరించి ఎప్పటికప్పుడు మార్గాన్ని, రూపాన్ని మార్చుకుంటూ సాగుతుంది. అవిచ్ఛిన్నమైన ప్రవాహము ఒకటే కనుక పూర్వాపరాలను బాగా పర్యాలోచన చేస్తేనే తప్ప తోచనంత సహజముగా ఆమార్పు ఉంటుంది. మన సాహిత్యము ప్రారంభమైతొమ్మిది వందల సంవత్సరాలయింది. ఒక తమిళము తప్ప ఇంతవయస్సున్న సాహిత్యము భారతీయ భాషలలో, ఆంధ్రములోతప్ప మరొకభాషలో ఉన్నట్లు కన్పించదు. ఇన్నేండ్లనుండి వస్తున్న సాహిత్య ప్రవాహము కొలకర్రలాగా ఏ మార్పులేక ఒకేవిధంగా ఉన్నదా మరి? ప్రజల అవసరాలనుబట్టి కాలానుసరణముగా మారుతూనే ఉన్నది. ఆమార్పులను పర్యాలోచన చేయడమే ప్రస్తుత కర్తవ్యము

అసలు సాహిత్యమెందుకు? అది లేకుండా మానవుడు బ్రతకలేడా? శాంతి సౌఖ్యాలనుభవించలేడా? ఈ ప్రశ్నలకు కావ్యలక్షణాలను నిర్వచించే గ్రంధాలకు 'సాహిత్యదర్పణము' 'సాహిత్యదీపిక' మొదలయిన పేర్లుపెట్టటమువల్లా 'అధ్యక్షింపుం గవిసార్వభౌమ భవదీయ ప్రౌఢ సాహిత్యముల్, నేఁగలిత సాహిత్య స్ఫురన్మాధురీ చారుప్రౌఢిమఁ జెప్పవంప' మొదలయిన కవిప్రయోగాలవల్ల, పూర్వులు సాహిత్యమనే పదాన్ని ప్రత్యేకముగా రస ప్రధానాలయిన కావ్యాది రచనలకే వాడినట్లు కనిపిస్తున్నది. కాని ఇప్పటివారు భారతము మొదలుకొని బాలనాగమ్మ కథవరకూ గ్రంధరూపమైన ప్రతిదానికీ ఆ పదాన్ని వాడుతున్నారు. నేను కూడా ఆ అర్ధములోనే ఆ మాటను వాడుతున్నాను.

జవాబు చెప్పకొంటేనేగాని, సాహిత్యములోని మార్పులను మనము సరిగా గ్రహించడమునకు వీలుండదు. అన్నవస్త్రాలూ, వసతి వాహనాలూ, వినోద విలాసాలూ, విహార వ్యవహారాలూ, మొదలైన అవసరాలకు తగిన ఆర్థిక వ్యవస్థ ఏర్పడితే మానవజీవితము ప్రశాంతముగా, సుఖముగా గడుస్తుందా? గడవదనే, ప్రతిభావంతులైన పెద్దలు చాలామంది చెప్తున్నారు. ఈ అవసరాలన్నిటికంటే మానవజీవితానికి అవసరమైనది ఒకటి ఉన్నది. అదిలేకుంటే మానవజీవితానికి శాంతి సౌఖ్యాలుకాని, పరిపూర్ణతగాని ఉండదు. పశుత్వానికీ,

మానవత్వానికీ భేదము ఇందులోనే ఉన్నది. శరీరానికేగాక మానవుడిబుద్ధికీ, హృదయానికీ, ఆత్మకూ పోషణ కావాలి. వికాసము ఉండాలి. అవి లభించినప్పుడే మానవుడిలో ఉన్న రాక్షసత్వమూ, పశుత్వమూ నశించిపోతవి. అవి నశించకుంటే, ఎన్ని ఆర్థిక వ్యవస్థలైనా, యుద్ధాలనూ, మతవైషమ్యాలనూ, అసహనాన్ని, రక్తపాతాలను అరికట్టలేవు. మానవుడి ఊహలకు ఉదాత్తతా, అనుభవానికి ఔదార్యమూ, ఉన్నతికి ఆదర్శమూ కలిగినప్పుడే జాతి అంటే ఒక్క మానవజాతే; జీవితమంటే ఇతరుల సుఖముకోసము చేసే త్యాగమే; మతమంటే ఒకరి నొకరు సోదరభావముతో ఆదరించుకోవడమే; అనే సంస్కారము కలుగుతుంది. ఆ సంస్కారము కలగనంతవరకు మానవుడిలోని స్వార్థమూ, ఒకరి గొంతు ఒకరు నరుకుకొనే క్రౌర్యమూ నశించిపోవు. ఆ సంస్కారాన్ని సార్వభౌముడి శాసనముగాని, సర్వసేనాధిపతి మారణయంత్రాలుగాని కలిగించ లేవు. సాహిత్యమే కలిగించాలి. అదే సాహిత్య ప్రయోజనము అందుకనే భర్తృహరి "సుకవితాయద్యస్తి రాజ్యేనకిమ్" అని అన్నాడు. రాజు శాసించి తన ప్రజలను సరియైనమార్గాన ఎలాగు నడిపిస్తాడో, ఆలాగే కవి తన రచనలవల్ల ప్రజలను సన్మార్గాన నడిపించగలుగుతాడని దాని తాత్పర్యము. అందుచేతనే సంఘము యొక్క జీవితమే సాహిత్యము ! అని పెద్దలు నిర్ణయించారు. జాతికీ జాతికీ, దేశానికీ దేశానికీ సన్నిహితత్వమూ, సామరస్యమూ కలిగించి, ప్రపంచమంతా ఒకటే రాజ్యము, మానవులందరూ ఒకటే జాతి, అనే ఆదర్శముతో ప్రపంచాన్నంతా ఏకముచేయగలిగిన ప్రధాన సాధనము సాహిత్యమే. మన సాహిత్యము మనదే కాదు; ప్రపంచానిది. ప్రపంచ సాహిత్యము మనది కూడా: ఇది సత్యము కాకపోతే పాశ్చాత్య సాహిత్యాలనుచదివి మనము ఆనందించ లేకనేపోదుము. నేటి పరివర్తనము మనకు కలగకనే పోయి ఉండును. అందుచేతనే ఈసత్యాన్ని ముక్తకంఠముతో తొమ్మిది వందల యేండ్లక్రితమే గౌతమీ తీరాన నన్నయ భట్టు "విశ్వశ్రేయః కావ్యం" అని ఘోషించాడు. ప్రజా సాహిత్యము ప్రజా సాహిత్యము అనేమాట ఇప్పుడు దేశములో ప్రతిధ్వనిస్తున్నది. ప్రజల కోసమే సాహిత్యమన్నమాట ఇప్పటిది కాదు. అనాదినుంచి వస్తున్నదే. అంతే కాదు; ఎవరి మట్టుకువారు గోడలు కట్టుకున్న ఏకొలదిమంది ప్రజలకోకాదు; ప్రతి సాహిత్యమూ యావత్ప్రపంచానికి అని చెప్పిన నన్నయగారి మాటలోఎంత భవిష్యత్తు ఉన్నదో, ఎంత ఔదార్యము ఉన్నదో గ్రహించి మనము గర్వపడ వచ్చు. ప్రజల కోసము సాహిత్యము కాబట్టి ప్రజల ఆశయాలనూ, ఆచారాలనూ, ఆదర్శాలనూ అభిరుచులనూబట్టి ఎప్పటి కప్పుడు సాహిత్య గతికూడా మారక తప్పడములేదు ఆమార్పులేవో చూతాము.

మన దేశములో సంస్కృత భాషా వ్యామోహము చాలా ఎక్కువగా

ఉండేది. సంస్కృత పండితులకే సభా పూజ్యత, సంస్కృత భాషకే గ్రంధ రచనా గౌరవము. తెలుగు మొదలైన భాషలు జనుల వ్యవహారానికే తప్ప మరెందుకూ పనికిరాని కాలమది. ఆకాలములో ఆ సంస్కృత వ్యామోహాన్ని తొలగించి తెలుగులో మహాభారతరచన సాగించిన మహామహుడు నన్నయ్య. అందుకే తనలక్షణ గ్రంధములో ఆయన "స్వసాన వేషభాషాభి మతారస ప్రబుద్ధ ధియః ప్రాకృత కావ్యాని బహు మన్యంతే" అని ప్రధమముగా తెగవేసి చెప్పుకోవలసి వచ్చింది. మాతృభాష అంటే సంస్కృతమే అనిచెప్పు కొనే రోజులలో, జనుల వ్యవహారములో ఉన్నస్వభాషలో భారతమువంటి మహా గ్రంధాన్ని రచించ బూనుకోవడము సామాన్యమైన మార్పుకాదు. ఆకాలములో జైన బౌద్ధ మతాలు మన దేశములో ఎక్కువగా వ్యాపించి ఉన్నవి. ఆ మత గ్రంధాలన్నీ జనుల వాడుకలో ఉన్న ప్రాకృతభాషలో ఉండేవి. అందుచే జనులకు ఆ మతధర్మాలు గ్రహించడానికి అవకాశం ఉండేది వైదికమత గ్రంధాలన్నీ సంస్కృతభాషలోనే ఉన్నవి. ఏ కొద్దిమంది పండితులకో తప్ప జనసామాన్యానికి సంస్కృత భాష తెలియదు. కాబట్టి వైదికమత ధర్మాలు ప్రజలలో విరివిగా వ్యాపించడానికి, వారివాడుక భాష గ్రంధరచన చేయకతప్పింది కాదు. వేదము అపౌరుషేయము. దాన్ని భాషాంతరీకరించడము మహా పాపమవుతుంది. అందుచే వైదిక మత ధర్మాలను ప్రతిపాదించే భారతానికి, పంచమ వేదగౌరవము ఇచ్చి దానిని తెలుగులో రచించడానికి నన్నయభట్టు పూనుకొన్నాడు. అందుచేతనే పండిత పామరుల సంస్కృత వ్యామోహాన్ని ప్రతిఘటించి నన్నయతెచ్చిన ఈమార్పు అసాధారణమైనదని చెప్పకతప్పదు.

మతమనేది ప్రజలకు అందరికీ ఆవశ్యకమైనది కాబట్టే ఆ గ్రంధాలన్నీ ప్రజలకు తెలిసే భాషలో ఉండడము ముఖ్యమనే సత్యాన్ని నన్నయ తరువాత ఎక్కువగా గుర్తించినవారు శైవ కవులు. వారు భాషలోనేకాక ఛందస్సులోను, వస్తువులోనూకూడా చక్కని మార్పు తీసుకొనివచ్చారు. ఏవోకొద్ది తెలుగుమాటలుతప్ప అంతా సంస్కృత పదభూయిష్టముగా ఉండే భాషాపైఖరిని మార్చి, తెలుగుదనానికి, తెలుగు నుడికారానికీ, వారు తమరచనలలో ప్రాధాన్యమిచ్చారు. కుమార సంభవమూ, బసవ పురాణమూ, పండితారాధ్య చరిత్రమూ మొదలైన శైవ మత గ్రంధాలు చదువుతుంటేమనము తెలుగు సంస్కృత భవము అనేమాట మరచి పోతాము. మొదటినుంచి మన పండితులు తెలుగు తద్భవ భాష అని నిర్వచించడానికి మహాతాపత్రయ పడ్డారు. ఆకారణము వల్లనేరచనలలో సంస్కృతము ఎక్కువై అసలు తెలుగు నుడికారము క్షీణించి పోయింది. ఒక పెద్ద చెట్టునీడను చిన్న చెట్టు ఏదీ పెరగదు. ఆపెద్దచెట్టు పెరగనియ్యదు. తొమ్మిదివందలయేండ్లనుండి వస్తున్న, మరే భాషా సంపర్కమూ లేకుండా గ్రంధరచన చేయడానికి అసమర్ధమైన అధ్వాన్న స్థితిలో ఉంది ఆంధ్ర

భాష. జనుల పలుకుబడి గ్రంథాలలోకి రానపుడు ఏ భాషకైనా ఈ దురవస్థ తప్పదు. ఈ దురవస్థ తప్పించడానికి పూనుకొన్నవారు శైవకవులు. వీరేకాక, మార్గకవులలో తిక్కన, సూరన, చేమకూరవెంకటకవి, తమ రచనలలో తెలుగు నుడికారానికి ఎక్కువ మోజు చూపించారు

పలుకుబడిలోనే కాక, ఛందస్సులో కూడ శైవకవులు మార్పు తెచ్చారు. సంస్కృత భాషలోని చంపూకావ్యాల లాగు, పదాడంబరముతో పెటపెటలాడే మత్తేభాది పద్యాలతో, పద్యాలకు తీసిపోని గద్యాలతో కాక, తెలుగుదనమూ, తెలుగుతీరు తీయమూ వెల్లివిరిసే ద్విపదతో గ్రంధరచన సాగించారు. తెలుగు ఎంతో మెత్తని భాష, దాని సొగసూ నాజూకూ ద్విపదకు నప్పినట్లు వృత్తాలకు నప్పదు. వృత్తాలనడకలో గడబిడ ఎక్కువ. అందుచేతనే దేశిఛందస్సులోనే రచన సాగించి శైవకవులు ప్రజలను ఆకర్షించారు. తృప్తి పరచగలిగారు.

శైవకవుల వస్తుస్వీకరణంలోకూడా మార్పు ఉన్నది. దేవతలతోనో ఋషులతోనో అవతార పురుషులతోనో గాక ఏదో ఒక ఆదర్శము కోసము ఆత్మార్పణముచేసిన మానవుల జీవిత చిత్రణమే వారిరచనలలో ఎక్కువగా కనిపిస్తుంది. మాలవాడు మొదలు మహీసురుడి వరకు మనవంటి వ్యక్తుల సుఖదుఃఖాలతో, ఆశయాదర్శాలతో, సజీవముగా సృష్టించారు గనుకనే వారి రచనలు ప్రజాదరాన్నిపొంది రాణించినవి. మార్గకవులలో శ్రీనాధుడు, ఈ విషయములో తన ప్రతిభను వెల్లడించి ధర్మము కోసమో, దేశము కోసమో, మతముకోసమో ఆత్మార్పణము చేసిన మానవ వీరులకు కావ్యజగత్తులో పంక్తుల ఆంక్షను తొలగించాడు.

మొదటినుంచి మన సాహిత్యము మత ప్రబోధముతోనే సాగింది. ఆనాటి ప్రజలు ధర్మార్ధకామమోక్షాలను నాలుగింటిని ప్రధానముగాజేసుకొనిబ్రతికారు. రాజకీయముగా, ఆర్థికముగాతిరుగుబాటు చేయవలసిన అవసరము ప్రజలకు కనుపించలేదు. ధర్మబుద్ధితో పారమార్థిక చింతతో, ప్రజాహృదయము ప్రశాంతిని అనుభవించాలనే ఆనాటి రచయితలు సాహిత్యసృష్టిచేశారు. కాలము మారింది పరదేశీయులదాడికి దేశము తలవంచవలసివచ్చింది. నాజాతి, నా దేశము, నామతము అనే అభిమానము ప్రజలకు కలిగించవలసిన అవసరము వచ్చింది. సాహిత్య క్షేత్రములోకి వీరులు ప్రవేశించారు. వీరగాధలను పాడి ప్రజలను అందరినీ వీరులుగా చేయాలని రచయితలు పూనుకున్నారు, ఆనాటి మానవ జీవితానికి ఆదర్శమది.

ఈనాడు రోజులు మారిపోయినవి. పాశ్చాత్య విజ్ఞానసంపర్కంవల్ల జరిగిన ప్రపంచయుద్ధాలవల్ల ప్రజాజీవితమే మారిపోయింది ప్రజాహృదయములో విప్లవాగ్ని మండుతున్నది. రాజకీయముగా ఆర్థికముగా, సాంఘికముగా ఒకటేమిటి —అన్నివిధాలుగా స్వాతంత్ర్యము కోసము అడుగడుగుకు పోరాడవలసిన స్థితి ప్రజలను ఎదుర్కొంటున్నది.

కుల, మత, వర్ణవిద్వేషాలతో ఒళ్ళు తెలియకుండ ఒకరిగొంతు ఒకరు తెగ నరుకు కొంటున్నారు. శ్రామికుల కష్ట నిష్ఠురాలకు ధనికులు కండ్లెర్రచేస్తున్నారు పాలితులమీద పాలకులు నిరంకుశ ఖడ్గము విసురుతున్నారు. నోట్లకట్టలు అడ్డపడి ధనికుల ఇనపపెట్టెలసొరుగులు లాగినా రావడములేదు. రోజల్లా కష్ట పడినా కార్మికుడి కడుపు నిండడము లేదు. అర్థకామాలకై సాగుతున్న ఈ పోరాటములో మానవుడు మానవ త్వాన్నే కోల్పోతున్నాడు. అయితే ఇప్పుడు మానవజీవితములో శాంతి సౌఖ్యాలు నెలకొల్పి అభ్యుదయానికి నడిపించే సాధనమేది? ముమ్మాటికీ సాహిత్యమే. అదే ప్రజాహృదయ ములో విజ్ఞానజ్యోతిని వెలిగించాలి. అదే ఉదారభావాలూ, ఉన్నతాశయాలూ, ఉత్త మాదర్శాలూ కలిగించి ప్రజలందరినీ అభ్యుదయమార్గాన నడిపించగలదు.

●

అభ్యుదయము, అభ్యుదయము అని అందరమూ అంటున్నాము. కాలాను గుణమైన అభ్యుదయము అందరికీ కావాలి. ఎవడు అభ్యుదయము అక్కర లేదంటాడు? ఏ రచయిత తన రచన అభ్యుదయరచన కాదంటాడు? అయితే ఏది అభ్యుదయము? ఏది అభ్యుదయ రచన? అన్న వస్త్రాలు లేనివాడు కానీ, అక్షరాస్యుడు కానివాడు కాని లేకపోవ డమే అభ్యుదయము. మానవుడు మాన వుడుగా జీవించేటట్లు చేసేదే అభ్యుదయ రచన. అటువంటి రచనలే ఈనాటి సాహిత్యానికి మార్పు కలిగించి, మానవ జీవితము శాంతి సౌఖ్యాలతో విలసిల్లే టట్లు చేయాలి అప్పుడే అభ్యుదయ రచయితల సంఘము తనపేరు సార్థ కము చేసుకో గలుగుతుంది.

★

దారిపొడుగునా గుండె నెత్తురులు
తర్పణచేస్తూ పదండి ముందుకు
బాటలు నడచీ
పేటలు కడచీ
కోటలన్నిటిని దాటండీ

నదీనదాలు అడవులు కొండలు
ఎడారులా మన కడ్డంకి?
పదండి ముందుకు పదండి త్రోసుకు
పోదాం పోదాం పైపైకి.

— శ్రీ శ్రీ

అభ్యుదయ రచయితలు - సినిమా రంగం

శ్రీ సముద్రాల రాఘవాచార్యులు

తెరచాటున ఉండి, ఇతరులచేత పలికించడం, నా పరిపాటి. అయినా మిత్రులు నన్ను బరిమీదికెక్కించి పలికిస్తున్నారు. గత రెండురోజుల తిరునాళ్ళలోను, తెరిపిలేకుండా తిరిగి పెద్దల ఉపన్యాసాలు విన్నతరువాత, మీ ఉత్సాహం కన్నతరువాత నాకు కాసేపు మాట్లాడాలనే మనసు పుడుతోంది. ఈ మహోత్సవాల్లో మాటాడిన పెద్దలు, నాటకాలాడిచూపించిన పిన్నలు అభ్యుదయానికి, అర్థంచెప్పి బొమ్మలు కట్టి చూపించారు. అభ్యుదయమంటే, ఆగని, ముందునడక అనీ, ప్రాపంచిక జీవితాన్ని ప్రతిబింబిస్తూ, సంఘాన్ని సుఖసంపన్నమైన ఏ ఆనంద సీమకో తీసుకుపోయే అపరిపంథా అని, తేలినట్లు కనిపిస్తుంది. అనంతంగా సాగివస్తున్న ఈప్రగతి, కళామార్గాలన్నిటిలోను తన ముద్ర వేయక తప్పలేదు. ముద్ర తగిలినప్పుడల్లా పాత కొత్తలమధ్య ఒరపిడి కలిగి రవ్వరేగుతునేఉంది. ఆనాడు, సంప్రదాయాలకు నియమాలకు కట్టుబడకుండా స్వచ్ఛంద గమనాన్ని సాగించిన వారిని పాతవారు విప్లవకారులని పిలవకుండా విడిచిపెట్టలేదు. కాలం పిప్పారుతూ, సంఘం,సమానానుభూతి పొందినప్పుడు ఈవిప్లవ కారులు పాతవారై, మరీముందుకు సాగినవారు విప్లవ కారులౌతూవచ్చారు. విప్లవంమీద విప్లవంగా పెరుగుతూ వచ్చిన ఈనాటి సారస్వతాన్ని వెనక్కి తిరిగిచూచి, తరచుకుంటే ఒకనాటి విప్లవకారులు, నేటి ప్రామాణికులైనారు. ఆనాటి విప్లవకారుడు, ఈనాడు మితవాది, హ్రస్వదృక్కు. కనుక అభ్యుదయమంటే, సంఘం తాలూకు ఆనాటి ఆదర్శాలలో, అనుభూతులలో కలుగుతున్న మార్పన్నమాట. ఈమార్పునకు రాజకీయాలు, ఆర్థిక పరిస్థితులు వివిధ సంఘాల సహవాసం కారణాలు కాకతప్పదు. మానవుల ఈజీవనపరిస్థితులనుకళ్ళకుకట్టించి, కదలిక కలిగించి ముందుకు నడిపించగలిగిన కళాసృష్టే నిజమైన ఉత్తేజాన్ని జాతికి ఇవ్వగలుగుతోంది.

ఇక్కడ ఒక్కవిషయం మీకు ముఖ్యంగా మనవి చేస్తున్నాను. నేటి రాజకీయ సాంఘిక సంఘర్షణలలో, మన తెలుగుతనానికే తీరనిముప్పు కలిగే సూచనలు కన్పిస్తున్నాయి. రాజకీయాలకు ఇది స్థలంకాదు. అయినా మీకు హెచ్చరికచేస్తున్నాను. అంతర్జాతీయ దృష్టిఉండడం తప్పు కాదు.

అఖిలభారత సమన్వయ చింతన ఉండవలసిందే కాని ఆ ఆవేశంలో అవసరాలలో నేలవిడిచినసాము పనికిరాదు. మనం తెలుగువాళ్ళమని మరచిపోరాదు. మనం, మన సంస్కారం మాసిపోయిన తరువాత, వ్యక్తిత్వంలేనిసారస్వతానికి, కళాసృష్టికి అందంలేదు, పరమార్థంలేదు. కనుక మీకందరికి నా మనవి ఏమంటే మన తెలుగుతనం వెనుక పడకుండా, ముందుకు తీసుకుపొమ్మని. ప్రాచీనమైన మన జాతి సంస్కారాన్ని మన నుడికారాన్ని మరచిపోకుండా తెలుగు సీమను ప్రచారంచేసి మెలకువ కలిగించమనీ—ఆంధ్రఅభ్యుదయ రచయితలు, ఇదే ఆదర్శంగా, ప్రగమనం సాగించాలి.

సినీమా రచయితగా పరిచయం పొందిన నేను మా ప్రగతినికూడా మీకు నివేదించడం నాధర్మం. దేవుణ్ణి ఆశ్రయించుకొని జన్మించి, రాజసంస్థానాలలో నర్తించి ఈ నాడు ప్రజా హృదయాలలో విహరిస్తున్న సారస్వతంలాగే సినిమాకళగూడా పురాణాలు, కట్టుకథలు, విడిచిపెట్టి సిసలైన ప్రజాజీవితాన్ని, సమస్యలను, చిత్రించడానికే నేడు ప్రయత్నిస్తోంది, చాలమంది నిర్మాతలు ప్రగతిని గమనించి ముందంజవేస్తున్నారు. ఈ సంవత్సరం విడుదలకానున్న చిత్రాలలో ఈ అభ్యుదయ రేఖలు మీకు గోచరిస్తవి. మీ ఆనందానికి మా మనోరథసిద్ధికి చేస్తున్న ఈ ప్రయత్నాన్ని మీరు మనసారా ఆదరించి వారి కండగా నిలిచి ప్రోత్సహిస్తే మనం, ఈ సారస్వతపీఠంమీద నిలబడి పొందతలచుకున్న అభ్యుదయానికంటే మహత్తరమైన అభ్యుదయం పొందగలమని నేను నమ్మకంగా చెప్పగలను. అభ్యుదయరచయితలు సినీమా లక్ష్యాన్ని మనసులో ఉంచుకొని అందుకవసరమైన కథలు వగైరా వ్రాసిగాని, అట్టి సలహాలను ఇచ్చిగాని సహాయపడ తలచుకొంటే, నిర్మాతలు సంతోషపూర్వకంగా వాటిని గ్రహిస్తారు, ఈ విషయంకూడా అభ్యుదయ గతిలో ఒకభాగంగా ఆలోచించి సాగించమని కోరుతున్నాను. సెలవు.

*

పదవోయిక పదవోయిక
ఇది నిజమే పద పద పద!
తరలిందిదె ప్రజారథం
పొరలింది ప్రపంచ పథం!!

ఇది మాత్రం నిజమనవోయ్
తుది సమరం ముగిసిందని!
రాగలదిక శాంతి యుగం
కాగల అభ్యుదయ జగం!!

— కృష్ణశాస్త్రి.

అభ్యుదయ రచన

శ్రీ పిలకా గణపతి శాస్త్రి

మొన్న జరిగిన మదరాసు అభ్యుదయరచయితలసభలో అనేకులు 'అభ్యుదయ రచన'ని గురించి మాట్లాడారు. భిన్న భిన్న దృక్పథాలతో మాట్లాడిన వారిలో అనేకులు ఈపదానికే భిన్నభిన్నములైన అర్థచ్ఛాయలు కల్పిస్తూవచ్చారు. అందుచేత ఈ పదానికి సరియైన వ్యాఖ్యానము అవసరము. నేనిచ్చే వ్యాఖ్యానం అభ్యుదయ రచయితలందరూ అంగీకరించేదే అనుకుంటాను.

అసలు ఈపదం మనప్రాచీనులు అనేక చోట్ల వాడారు. దీనికి ఉదయము 'అభివృద్ధి' అనే అర్థాలు సుప్రసిద్ధాలు. "అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్పం బూనిన" అన్నవాక్యం మనప్రబంధాల్లో చాలాచోట్ల కనిపిస్తోంది. అక్కడ ఈ పదము 'మంగళము' 'శుభము' అన్న అర్థాలలోనే ఎక్కువగా వాడారు

అయితే ఈ పదం అభ్యుదయ రచయితలు ఒకప్రత్యేకార్థంలోనే వాడుతూ వచ్చారు. సాంఘికంగా నిత్య పురోగామి అయిన శ్రేయస్సే 'అభ్యుదయము' అనీ ఆ విధమైన ప్రత్యక్షోపయోగం కలిగించే రచనే అభ్యుదయరచన అనీ వారి నిర్వచనము అంటే సాంఘికాభివృద్ధికి ప్రత్యక్షంగా ప్రోద్బలపరిచే రచనే 'అభ్యుదయ రచన' అని తేలింది. ఈ సాంఘికాభివృద్ధి నైతికంగాను, రాజకీయంగాను, ఆర్థికంగాను. అనేక విధాలుగా ఉండవచ్చు.

ఇక్కడ ఒక ప్రశ్న రావచ్చును. అభ్యుదయ రచయితలు సాంఘిక శ్రేయస్సు కలిగించే రచనలు కావాలంటున్నారు ఆ సాంఘిక శ్రేయస్సు అనేకులు అనేక విధాలుగా నిర్వచిస్తున్నారు. ఈ విధంగా నిర్వచించేవారిలో ముఖ్యమైనవి రెండు మతాలున్నాయి. వీటిలో మొదటిది ఆదర్శవాదము; రెండోది భౌతికవాదము. ఇప్పుడు భౌతికవాదం సంఘశ్రేయస్సు కోరుతూన్నట్లే, ఆదర్శవాదంకూడా సాంఘిక శ్రేయస్సు అభిలషించేదే అనడం నిర్వివాదాంశము. అయితే అభ్యుదయ రచయితలు ఏ మతం అవలంబిస్తారు? అన్నది ఒక ప్రశ్న.

ఈ ప్రశ్నకు అభ్యుదయ రచయితలు చెప్పే సమాధానం ఇది. అభ్యుదయ రచయితలు ఒక గిరిగీసి. రచయితలందరూ దీన్నే అవలంబించాలని ఎప్పుడూ అనరు. వారికి కావలసినది సువిశాలమైన విశ్వశ్రేయస్సు. ఈ విశ్వశ్రేయస్సుకు విరుద్ధమైనది ఏ మతప్రణాళిక అయినా వారికి అనంగీకార్యమే. భౌతికవాదమే అవలంబించాలనిగాని, ఆదర్శవాదమే అవలంబించాలనిగాని ఒకనియమంయేదీ లేదు. అయితే విశ్వశ్రేయోదృష్టిమాత్రం

చాలా ముఖ్యము.

అయినా ఇంకొక ముఖ్యమైన ప్రశ్న మిగిలిఉంది. అభ్యుదయ రచయితలు సాంఘిక మూల్యం ఉన్న రచనే ఎక్కువగా ఆదరిస్తారని అనుకున్నాము. అయితే కేవలం రసమూల్యమే ఉన్న రచనల మాట ఏమిటి? అవి కేవలం పరిత్యాజ్యాలేనా? అభ్యుదయ రచయితల దృక్పథంలో వాటికి విలువే లేదా? ఉదాహరణకు ఈ కిందిపాట చూద్దాం.

కొమ్మలో కోయిలా కోయంటదే!
రాగతసమో యేమొ బాగువోగెరుగదే!
ఎంకి దూరానుండె ఏటిదరి నేనుంటి
సావాస మింకెవరో! సందదెవరోనంటి
కొమ్మలో....

పూవెరుగు నాకోత, నీవెరుగు నామోత
మనుగడల కెవరితో మనసుకలిపేదంటి
కొమ్మలో...

ఏటి కడుపునదాగి తోట నిదరోయింది
ఆలనా, నానొదకు, పాలనాయనుకొంటి
కొమ్మలో..

తిరిమి తరిమేశాను, తిరిగి కోకోయంది
ఆడిందె ఆటగా! పాడిందె పాటగా!
కొమ్మలో .

అసలు కేవలం సాంఘికమూల్యం మాత్రమే వున్న రచనగాని, లేక రసమూల్యం మాత్రమే ఉన్న రచనగాని లభించడం దుష్కరము. అందుచేత ఎక్కువగా రసమూల్యం ఉన్న రచనల మాటేమిటి? అన్నదే ప్రశ్న. అదీగాక వాఙ్మయం నిత్యమూ పరిణమిస్తూనే ఉంటుంది. ఏ వాఙ్మయం పరిశీలించినా, ఒకప్పుడు సాంఘికమూల్యాలు ఎక్కువగాఉన్న వాఙ్మయం రావడమూ, ఆపైన రసమూల్యం ఎక్కువగా ఉన్న వాఙ్మయము రావడమూ జరుగుతూంది. వాఙ్మయంలో ఒకదాని తరవాత ఒకటి చొప్పున ఉభయపక్షాలకూ మొగ్గే ఈ నిత్యపరిణామం సహజంగానూ, సార్వత్రికంగానూ కనిపిస్తుంది. రసమూల్యం కలిగిన వాఙ్మయం అనాదరణీయమే అయితే, ఆంధ్రవాఙ్మయంలో సుప్రసిద్ధమైన ప్రబంధయుగ వాఙ్మయం అంతా నిష్ఫలం అయిపోతుంది. అంతేకాదు. శ్రీ గురజాడ అప్పారావుగారి తరువాత వచ్చిన ఆధునికకవిత్వం అంతా చాలావరకు రసప్రధానమైనదే! ఇప్పుడు ఉదహరించిన "కొమ్మలో కోయిలా కోయంటదే!" అన్న రచనకూడా ఎక్కువగా రసమూల్యం కలిగినదే. ఈ తరహా వాఙ్మయం అంతా అభ్యుదయ రచయితలకు అనాదరణీయమేనా?

ఎన్నటికీ కాదు; దీనికి కారణం ఇది: అభ్యుదయ రచయితలు నిత్య నూతనమైన వాఙ్మయ పరిణామం సహజమనీ, ఆవశ్యకమనీ గుర్తించిన వారు. కనుకనే వాఙ్మయంలో నిత్య నూతన పరిణామ సూత్రానికి లోబడిన ప్రాచీన వాఙ్మయాన్ని అంతటినీ ఆదరిస్తారు. అందుకనే వీరికి నన్నయ మొదలుకొని నవ్యాతినవ్యులవరకూ వచ్చిన అందరూ ఆదరణీయులే అయ్యారు నేటి వారిలో ఈ వాఙ్మయ చైతన్యం గుర్తించినవారినందరినీ ఆవిధంగానే గౌరవిస్తున్నారు.

కాని ఇప్పటి నవ్యాతినవ్య వాఙ్మయాన్ని గురించి వీరు వివరించే దృక్పథంమాత్రం ఇది: మనకి వీరేశలింగ

యుగం తరవాత 'నవ్య సాహిత్యం' అనే పేరుతో ఒక వాఙ్మయ యుగం వెలిసింది. అందులో చాలవరకు రస మూల్యమే ఎక్కువగా ఉన్నమాటవాస్తవము. అయితే అది పాతిక ముప్ఫయి ఏళ్ళనుంచి అనర్గళంగా ప్రవహించింది. ఈ పైన వాఙ్మయ పరిణామ సూత్ర ప్రకారం సాంఘిక మూల్యం కలిగిన వాఙ్మయం ప్రచారంలోనికి రావాలి; వచ్చి తీరుతుంది.

అదేగాక దేశంలో ఒక ప్రబలమైన సాంఘిక విప్లవం రాబోతూంది. ఎటు చూసినా జీవితంలో సాంఘిక సమస్యలే. మేము రచయితల్ని ఈ సమస్యల్ని గురించి వ్రాయమని అడగడంలేదు. పీరు చైతన్యంతో స్పందించే రచయితలైతే ఈ సమస్యలు స్వీకరించి తీరుతారు. రండి! చక్కని సాంఘిక దృక్పథం కలిగిన రచనల రచించండి! దేశానికి వెలుగుబాట చూపించండి!" అంటు న్నారు.

ఈ విధమైన నిత్య నూతన పురోగామి అయిన దృక్పథం అవలంబించిన అభ్యుదయ రచయితలకు నేటి సాంఘిక చైతన్యంకలిగినవాఙ్మయంక్రమంగావారి కొన్నాళ్ళకి రసచైతన్యం కలిగిన వాఙ్మయం వచ్చినా అదీ సమాదరణీయమే అవుతుంది. అప్పటికి అదే అభ్యుదయ రచనకూడా అవుతుంది.

అయితే ప్రస్తుత పరిస్థితుల్లోమాత్రం సాంఘిక దృక్పథం ఎక్కువగా కలిగిన రచనలు బాగాకావాలి. క్రమక్రమంగా అటువంటి రచనలు ఎక్కువగా వస్తాయని నిశ్చయంగా చెప్పవచ్చును. వాఙ్మయపరిణామం దీనివైపే ముల్లుచూపుతూ ఉంది. అందుచేత ప్రస్తుత కాలంలో రచయిత లందరికీ ఇదే సమాదరణీయమైన మార్గము.

ఈ పైన వివరించినదే అభ్యుదయ రచయితల దృక్పథం అనుకుంటాను. ఈ దృక్పథంతో రచయిత లెవరికీ అభిప్రాయభేదం ఉండవలసిన ఆవశ్యకత ఉండదనుకుంటాను. ఈ దృక్పథంతో అభ్యుదయ రచయితల సంఘం యీ సంవత్సరం సాహిత్యసభలు ఏర్పాటు చేసింది. ఇకముందుకూడా ఈ మార్గం అవలంబించి చక్కని అభ్యుదయ సాహిత్యము సృజించడానికి దోహదం ఇవ్వగలదని ఆశిస్తాను.

ఇంతకు పూర్వం అభ్యుదయ రచయితల సంఘం చక్కని వాఙ్మయసేవ చేసింది. నిత్యమూ కార్యవ్యగ్రమయిన ఈ సంస్థ ఇంకా అత్యధికమైన వాఙ్మయ సేవ చెయ్యగలదని గట్టి విశ్వాసం కలుగుతూ ఉంది.

★

రామమూర్తి పంతులుగారి కృషిఫలం

[వ్యావహారిక భాషా పరిణామం]

డాక్టర్, శ్రీ గిడుగు వేంకట సీతాపతి

ఇప్పుడు ఆంధ్ర దేశంలో సర్వ సాధారణంగా ప్రతి సభలోనూ, అది సాహిత్య సభకానీ, రాజకీయ సభకానీ సాంఘిక సభకానీ, వక్తలందరూ వ్యావహారిక భాషలోనే ఉపన్యాసాలు చేస్తున్నారు. ఆంధ్ర భాషలో వెలువడుతున్న గ్రంథాలలో కూడా నూటికి తొంభై తొమ్మిది వ్యావహారిక భాషలోనే రచించడం జరుగుతున్నది. కావ్యభాషలో పద్యరచన సాగకపోవడ మంటూలేదు, కానీ, చాలా అరుదుగా ఉంది. పద్యరచనకు మట్టుకే ఇంకా కావ్యభాష ఉపయోగిస్తున్నారేకాని, గద్యరచనకు, కథలేకాని, నవలలేకాని, వ్యాసాలేకాని, వ్యావహారిక భాషనే ఉపయోగిస్తున్నారు ఈ గద్యరచన ఇరవై ఏండ్లకంటే ఇప్పుడు సాపుగా సాగుతూఉంది ఇంకా సాపుగా పరిణమించ గలదనినానమ్మకం. భావనా శక్తిగల ఆంధ్రులు, విద్యాధికులు కావ్యభాషలోనే రచించవలెననే నియమం ఉంటే వీరిలో నూటికి తొంభై మంది ఏ రచనా సాగించేవారు కాదు. వ్యావహారిక భాషలో రచించడం తప్పుకాదని తోచిన తర్వాతనే యువకులలో ఉత్సాహము ఎక్కువై, తమ మనోభావాలను ఆశయాలను స్వేచ్ఛగాప్రకటింప గలుగుతున్నారు.

ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో ఆధునిక యుగమందు పరిణమించిన రచనలు, సంఖ్యలోనేగాక, అన్ని విషయములందూ వ్యాప్తిచెందుటలో కూడా అధికమైందని చెప్పవచ్చు. సాంఘిక, రాజకీయ విషయాలలో ఇప్పుడు కలుగుతూ ఉన్న సంస్కరణలకు, ఆశయాలకు, అనుగుణంగా ఈవ్యావహారిక భాషోద్యమము మంచి తరుణంలోనే ఉదయించి వృద్ధి పొందడం ఆంధ్రుల భాగ్యం. ఈ మహాభాగ్యాన్ని కలుగజేసిన వారిలో ప్రధానంగా గిడుగు రామమూర్తిపంతులు గారిని పేర్కొంటున్నారు.

ఇప్పటి యువకులలో చాలా మందికి వీరు ఎంత శ్రమపడి, ఎన్నికష్టాలకు ఓర్చి, ఎంత తీవ్రంగా పండితులతో యుద్ధంచేసి, ఈ ఉద్యమాన్ని సాగించారో అంత ఎక్కువగా తెలియదు. ఇప్పటివారికి, ఇందులో ఇంత చర్చ ఎందుకు. ఈ వ్యావహారికభాష గ్రంథస్థము చెయ్యడానికి అంతగా ఎవరైనా

ప్రతిఘటించి ఉందురా? అని తోచ వచ్చును. కాని, శ్రీ రామమూర్తి పంతులుగారు ఇంకా వారం రోజులకు పరమపదిస్తారనగా, 1940 జనవరి 15 తేదీని, కీ॥ శే॥ గూడవల్లి రామబ్రహ్మం గారు ఏర్పాటు చేసిన పత్రికా సంపాద కుల సభలో వారి కడపటి సందేశం చదివితే, వారి ఉద్యమం ఏమాత్రమేనా నెరవేరడానికి, ఎంత శ్రమపడవలసి వచ్చిందో, ఇంకా కావలసిన పని ఏముందో స్పష్టంగా తెలుస్తుంది. "1926 సంవత్సరం తణుకులో ఆంధ్రసాహిత్య పరిషత్ సాంవత్సరికోత్సవము జరిగి నప్పుడు, సభలోని వారు అందరూ కాక పోయినా అనేకులు వ్యావహారిక భాషా ప్రయోజనం అంగీకరించారు. దానితో పరి షత్ పెద్దలు ఉపద్రవం జరిగిపోయి నట్లుగా, భయపడి - అటుపైని జరిగే సాంవత్సరికోత్సవములలో అటువంటి తీర్మానాలు మరికాకుండా ఉండేటట్లున్నూ, వ్యావహారిక భాషావాదు లెవరూ తమ పరిషత్తులో సభ్యులుగా చేరకుండా ఉండే టట్లున్నూ కట్టుదిట్టాలు చేసుకొన్నారు.

"దేశంలో అంతకంతకు వ్యావహా రిక భాషావాదము అంగీకరించినవారి సంఖ్య ఎక్కువగుటచేతను, ఆంధ్ర సాహిత్య పరిషత్తువారి ఉద్దేశములను ఆమోదించేవారి సంఖ్య తక్కువగుట చేతను ఆ పరిషత్తు క్షీణించినది. నా వాదమును పూర్తిగా ఆమోదించిన నా మిత్రులు నవ్య సాహిత్య పరిషత్తు స్థాపించి 'ప్రతిభ' అనే పత్రిక ప్రకటి స్తున్నారు. ఆ పత్రికేకాదు; అన్నిపత్రిక లున్నూ వ్యావహారిక భాషా ప్రయోజన మును అంగీకరించినవి.

"వందలకొలది కవులూ పండితులు తమ వాడుకభాషలో రచన సాగిస్తు న్నారు. ఇంతమట్టుకయినా నా కృషి ఫలించినందుకు నేను కృతార్థుడనైనా నని సంతోషిస్తున్నాను.

"కాని బడులలోను, కాలేజీలలోను, ప్రభుత్వమువారున్ను వ్యావహారిక భాషా ప్రయోజనము అంగీకరించే వరకు నా వాదము పూర్తిగా నెగ్గినదని నేను భావించలేను. దేశంలో అందరున్ను మీకు ప్రతికూలంగా వున్నారుగనుక వ్యావహారికభాషా ప్రయోజనము మేము అంగీకరించలేమని గదా ప్రభుత్వము వారున్ను, విశ్వవిద్యాలయమువారున్ను 25 సంవత్సరాలక్రిందట అన్నారు. ఈ 25 సంవత్సరాలలో ఇంతమట్టుకు పరి వర్తనం జరిగింది గనుక ఇకనైనా బడు లలోను, కాలేజీలలోను వ్యావహారిక భాషమూలంగా విద్యసాగేటట్టు చూడ వలసివున్నది. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు వారు నాకు కళాప్రపూర్ణ బిరుదు అను గ్రహించటం నా గ్రాంధిక భాషా పాండి త్యానికి కాదుగదా, నా వ్యావహారికభాషా వాదము ఆమోదించే ఈ గౌరవము నాకు ప్రసాదించారనక తప్పదు.

"నన్ను గౌరవించినందుకు నేను కృతజ్ఞుడనే కాని వ్యావహారికభాషా ప్రయో జనము ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారు అంగీకరించి ఆచరణలో పెట్టినదాకా నేను పూర్తిగా కృతకృత్యుణ్ణయినా నని సంతోషించలేను.

"కళనడుము విశ్వవిద్యాలయమువారి తెలుగు పరీక్షలలో వ్యాసరచనకు ఒక

విషయంగా రేడియో ప్రసంగములవంటి ప్రసంగమొకటి వాడుకభాషలో విద్యార్థులు రచించేటట్లు ఏర్పరచవలసినదని ఎకడమిక్ కౌన్సిల్లో ఒకరు తీర్మానం ప్రవేశపెడితే. అది Board of studies వారి అభిప్రాయానికి పంపించాలన్నారు.

"ప్రభుత్వమువారు బడులలో ఎందుకూ పొందని దిక్కుమాలిన కృతకాంధ్రభాషలో రచించిన వాచకాలే కావలెనంటున్నారు. వాడుక భాషలో రచించిన పుస్తకాలు 'అప్రువ్' చేయమంటున్నారు."

చూచారా—వ్యావహారికభాష దేశస్థులందరున్నూ ఒప్పుకొని, గ్రంధరచన కూడా సాగిస్తున్నా, వ్యావహారికభాషపై గల ఆంక్ష మాత్రము యూనివర్సిటీల లోను ప్రభుత్వ విద్యాశాఖలోను ఇంకా తీసివెయ్యడం జరగలేదు. అది జరిగిందాకా రామమూర్తి పంతులుగారి ఆత్మ. ధన్యత చెందినట్టు సంతోషించలేదు.

ఆ సభలోనే వారు ఈ పని మీకు విడిచి పెడుతున్నానని మన అందరికీ అప్పజెప్పారు. అది మనం నెరవేర్చవలసియుంది. ఈ ఆంక్ష ఎప్పుడు, ఏ విధంగా వచ్చిందో తెలుసుకోడం మంచిది.

1902—1905 ఆ కాలంలో కర్జన్ వైస్రాయిగా ఉన్నప్పుడు, మన భారత దేశ విద్యా పరిస్థితులను పరిశీలించడానికి ఒక కమిటీని నియమించారు ఆ కమిటీ నివేదిక ప్రకటితమైంది. అందులో, యాభై సంవత్సరాలై విశ్వవిద్యాలయాల ద్వారా విద్యావ్యాప్తి దేశంలో జరుగుతూ ఉన్నా, విశ్వవిద్యాలయాలలో చదువుకుంటూ ఉన్న ఏ కొద్దిపాటి మందికో తప్ప, ప్రజలకు విజ్ఞానం కలుగచేసే సాధనం లేకపోయిందనిన్నీ, బి. ఏ. ప్యాసయినవారు తమ విజ్ఞానాన్ని ప్రజలకు అందజేసే సమర్థత అలవరచుకోలేదనీ, అలవరచుకో లేకపోవడానికి ఇంగ్లీషుద్వారా నేర్చుకున్న పరిజ్ఞానం మాతృభాషలద్వారా వ్యక్తపరచలేక పోతున్నారనిన్నీ, కృషి జరగకపోవడమంటూ లేదుకాని తగిన రచనా సామర్థ్యాన్ని పెంపొందించలేకపోవడమే కారణమనిన్నీ చెప్పారు. అందుచేత మాతృభాషలో వ్యాసరచన [Vernacular Composition] నిర్బంధ పాఠ్య విషయంగా హైస్కూళ్ళలోను, కాలేజీలలోను పెట్టించవలసి నటువంటి ఆవశ్యకత కలదని సూచించారు. విశ్వవిద్యాలయాలలో పరీక్షలు ప్యాసయినవారు మాతృభాషలద్వారా సకల విషయములగురించీ ప్రజలకు బోధించగల అవకాశం కల్పించాలనే ఆశయంతో ఈ సంస్కరణ సూచించారు.

ఇటువంటి నూతన విషయాలను అనుసరించి మెట్రిక్యులేషన్ స్థానే స్కూలుఫైనలు, ఎఫ్. ఏ. స్థానే ఇంటరు తరగతులు ఏర్పాటుచేశారు. వాటికి కావలసిన ప్రణాళికలు ఆలోచిస్తూ ఉండే సమయంలో ఈ వ్యావహారిక భాషావాదం, తలవని తలంపుగా ఆవిర్భవించింది.

1906 లో అది వరకు 'పచ్చయప్ప కళాశాల'లో ప్రిన్సిపాలుగా ఉండిన ఏట్సుదొర ఉత్తర తెలుగు జిల్లాలకు స్కూళ్ళ 'ఇన్‌స్పెక్టరు' అయినాడు.

ఆయన విశాఖపట్నంలో మకాం పెట్టు కొని తెలుగు చదవడం ఆరంభించాడు. అతడు చదువుతూ ఉండిన తెలుగు పుస్తకాలలోని భాషకూ, దేశంలో వింటూన్న ప్రజల భాషకూ తారతమ్యం విశేషంగా కనపడింది. ఆరోజులలోనే విశాఖపట్నం కాలేజీ హైస్కూలులో మెట్రిక్యులేషన్ తరగతికి తెలుగుపాఠం జరుగుతూవున్నప్పుడు కాలేజి ప్రిన్సిపాలు గారైన పి. టి శ్రీనివాసయ్యంగారితో కలసి ఈ ఏట్సుదొర తనిఖీ చెయ్యడానికి వెళ్ళాడు. అప్పుడు పాఠ్య పుస్తకంగా నిర్ణయించిన కావ్యగ్రంథములో 15వ పద్యం ఉపాధ్యాయుడు బోధిస్తున్నాడు

'ఎన్నాళ్ళయింది ఈకావ్యం ప్రారంభించి ?' అని అడిగాడు ఏట్సు.

'నెలపైగా అయింది' అన్నాడు ఉపాధ్యాయుడు.

'ఈ నెల నాళ్ళకీ 14 పద్యాలేనా అయింది !' అంటూ ఆయన నివ్వెర పోయినాడు.

ఉపాధ్యాయుడు. వారానికి రెండు సార్లే పద్యకావ్యం చెప్పడం, గంటకు ఒకటీ. రెండు పద్యాలకంటే ఎక్కువ చెప్పడానికి అవకాశం ఉండదు.

ఏట్సు : 'టెన్నిసన్, వర్డ్స్ వర్తు మొదలైన రచయితల ఇంగ్లీషుపద్యాలు గంటకు పది పన్నెండు చెప్పగలుగుతామే ఇంగ్లీషులో, అలాంటిది మీమాతృభాషలో రచించినపద్యాలు ఒకటీ రెండూ కంటే ఎక్కువ చెప్పలేకపోవడం ఏమిటి ? ఇంత కఠినమైన పద్యకావ్యం ఎందుకు పాఠ్యగ్రంథంగా పెట్టారు ?'

ఉపా : 'అయ్యా ! — ఏ కావ్యమైనా అలాగే ఉంటుంది. పిల్లలకు బోధపరిచేప్పుడు ప్రతి పద్యానికీ పదవిభాగం, అర్థం, తాత్పర్యం, వ్యాకరణ విశేషాలూ ఛందస్సూ, అలంకారాలూ-ఇట్లా ఎన్నో చెప్పాలి. ఇందువల్ల ఒకటి, రెండు పద్యాలకంటే ఎక్కువ పడదు'

ఏట్సుదొరకు ఇదంతా అయోమయంగా తోచింది 'అయితే ఈపద్యాలు ఇంగ్లీషు భాషలో కవిత్వం లాగా ప్రాచీన భాషలో ఉంటాయా ?' అని అడిగాడు,

'ఇంకా మీభాషలో 15వ శతాబ్దంనాడు కాని, ఈకావ్యం రచించిన నన్నయ 11వ శతాబ్దంనాటి వాడని' జవాబు చెప్పాడు ప్రిన్సిపాల్.

'అయితే — ఆధునిక రచయితల కావ్యాలు ఎందుకు పెట్టకూడదు ఈచిన్న తరగతులకు ?' అన్నాడు ఏట్సు.

అది ఇంతకన్నా క్లిష్టంగా ఉంటుందన్నాడు పండితుడు

దానితో మరీ మతిపోయింది ఏట్సుకి. తర్వాత—'అయితే వ్యాసరచన కూడా ఇలాగే ఉంటుందా లేక ఇప్పుడు మీరు మాట్లాడుకునే భాషలో నలుగురుకీ అర్థమయ్యేటట్టు చేయిస్తున్నారా' అన్నాడు.

అంటే—మాటల్లో సౌలభ్యం కొంచకొంచం చూచుకుంటామేకాని, వ్యాకరణ విషయంలో అంతా ఒకటే భాషండీ' అని పండితుడు చెప్పాడు. ఇక ఈవిషయము ఎటుచూచినా ఏట్సుకి బోధపడలేదు ప్రిన్సిపాల్ కూడా చెప్పలేక పోయినాడు.

మరికొన్ని నెలలు గడిచాక పర్లాకి

మిడి కాలేజి హైస్కూలు తనిఖీకి ఆయన అక్కడికి వెళ్ళాడు. అక్కడ, రామమూర్తి పంతులుగారితోటి ఈవిషయము చర్చించాడు. రామమూర్తి పంతులుగారు అంతవరకున్నూ ఈభాషా విషయం ఆలోచించి ఉండలేదు. ఒక్క విషయం మాత్రం వారి మనస్సుకు బాగా గోచరించింది. ఇంగ్లీషులో ఛాసర్, స్పెన్సర్ షేక్స్పియర్ రచించినకావ్యాలు చదువుకున్నప్పటికీ, ఆంగ్ల విద్యార్థులు తమనాటి ఇంగ్లీషు భాషలోనేకాని, ఆ కవుల భాషలో ఉపన్యాసాలు చెప్పరు; వ్యాసాలు రచించరు. మన తెలుగు విషయంలోకూడ అలాగే ఉండాలి కాని, కావ్యభాషలో రచించడం అసందర్భంగానే ఉందనుకున్నారు.

1907 సం॥రో విశాఖపట్నంలో ఉత్తరజిల్లాల ఉపాధ్యాయుల సమావేశం ఏట్సు అధ్యక్షతను జరిగింది. ఆ సమావేశంలో రామమూర్తి పంతులుగారిచేత 'ఆధునిక వ్యాసరచన' ఏ భాషలో హైస్కూలు పిల్లలకు నేర్పించాలనే విషయాన్ని గురించి ఉపన్యాసం ఇప్పించారు. నేటి శిష్టజనభాష వ్యాసరచనకు అనుకూలమైంది. ఇతర దేశాలలోని సంప్రదాయంకూడా అదేనని రామమూర్తిగారు చెప్పారు. ఇది చాలా మందికి నచ్చలేదు 'మన ఆంధ్రభాషకు గల ఆధిక్యం నన్నయతో సిద్ధించింది అది అవిచ్ఛిన్నంగా నేటివరకూ సాగుతూ ఉంది. అది కలకాలం అలాగాసాగుతూ ఉండవలసిందే. క్షణక్షణమూ మారుతూ ఉండే ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలలాగా దినదినమూ మారే భాషకాదు. గనుక వాటి సాదృశ్యం మనకు వర్తించద'ని వారన్నారు.

ఈ పై అభిప్రాయం కేవలం ఆ సభకు వచ్చిన పండితుల అభిప్రాయమే కాదు. జయంతి రామయ్య పంతులుగారి లాంటివారు చిన్నయసూరి మిత్రలాభము సుహృద్భేదములలో వ్రాసినటువంటి భాషకున్నూ, నన్నయభాషకున్నూ భేదము ఏమీ లేదన్నారు. అవిచ్ఛిన్నంగా నేటి వరకూ సాగుతూవస్తున్న నన్నయ పవిత్రభాషను సంస్కరించూ అనడం సాహసమన్నారు

1910 నాటికి పైనచెప్పిన స్కూల్ ఫైనల్ ప్రణాళిక అమలులో పెట్టవలసిన సమయం వచ్చింది. ఆ పరీక్షకు చదివిన విద్యార్థులు అందరున్నూ ఐచ్ఛికంగా తెనుగైనా, సంస్కృతమైనా చదువవచ్చు. కాని ప్రణాళికను అనుసరించి నిర్బంధంగా అందరూ తెనుగులో 'వ్యాసరచన' చెయ్యాలి. అప్పుడు వ్యాసరచన కావ్యభాషలో సాగించవలెనా? వాస్తవమైన విద్యార్థుల వాడుకభాషలో సాగించవలెనా? అన్నవిషయం చర్చకువచ్చింది. వ్యావహారిక భాషలోనే సాగించవలెనని పంతులుగారి వాదం. వారితో కొందరు ఏకీభవించారు, అయినా చాలామంది కావ్యభాషలోనే సాగించాలని పట్టుబట్టారు. అందుచేత స్కూలుఫైనలు ప్రణాళికలో విద్యార్థులకు స్వేచ్ఛ ఇచ్చారు. విద్యార్థులకు ఇష్టమైన ఏ భాషలోనైనా రచించవచ్చన్నారు. కాని ఏ భాషలో రచించేది ముందుగానే తెలియజెయ్యాలని, మొదటి నుంచి చివరిదాకా వ్యాసం ఒకే భాషా

పద్ధతిలో రచించాలని నియమంపెట్టారు. పిమ్మట కావ్యభాషకు మార్గదర్శకంగా వాఙ్మయమంతా ఉన్నదికాని, వ్యవహార భాషకుమార్గదర్శకమైన గ్రంథంఒక్కటీ లేదని ఆక్షేపణ వచ్చింది ఉన్నసంగతి ఎవరికీ తెలియదు. అప్పుడు పి. టి. శ్రీనివాసయ్యంగారు తమ కాలేజీలో లెక్చరర్‌గా ఉన్న సెట్టి నరశింహంగారి చేత 'గ్రీక్‌మిత్తులు' అనే పుస్తకం వ్రాయించి, దానికి వారే పీఠిక వ్రాశారు. దాన్ని స్కూలు ఫైనలు పరీక్షకు పాఠ్య గ్రంథంగా పెట్టించారు. అది ఆంధ్రదేశ మంతటా పెద్ద సంచలనంకలిగించింది. ప్రతిఊళ్లోను సభలుచేసి, ఈ వాదనను, ఆ గ్రంథాన్ని ఖండిస్తూ తీర్మానాలు చేశారు. స్కూలుఫైనలు ప్రణాళికలో వ్యాస రచనకైనా వ్యావహారిక భాషను ఆమోదించడంవల్ల మన భాషాభివృద్ధికి గొప్ప కీడు మూడిందన్నారు. ఇట్లా తీర్మానాలు చేసి గవర్నమెంటువారికి మహజర్లుకూడా పంపారు 1912 లో నేను కాకినాడ వెళ్ళడం జరిగినది నేను వెళ్ళినరోజే అక్కడ ఒక పెద్ద సభ జరుగుతున్నది. దుగ్గిరాల సూర్యప్రకాశ రావుగారు అధ్యక్షులు. నేను కూడా ప్రసంగిస్తానంటే నాకు అవకాశం ఇవ్వ లేదు. ఒక విషయం మాత్రం తెలియజేశాను అక్కడి ప్రజలకు ఇప్పుడు ఇక్కడ ఈ 'గ్రీక్‌మిత్సు' ఖండించిన వాళ్ళు శ్రీనివాసయ్యంగారి పీఠికను చదివి, ఆ పీఠికలో "కావ్యభాష ఇప్పుడు దేశంలో ఎక్కడా వినపడటం లేదనీ, సజీవమైన వాడుక భాషలో రచన సాగించవలసి ఉంటుందనీ ఉన్న వాక్యాన్ని ఆధారంగా పుచ్చుకొని, ఈపుస్తకాన్ని ఖండిస్తున్నారన్నాను. ఆ పుస్తకం చదివి చూస్తే ఇదివరకటి పాఠ్యపుస్తకాల భాషకున్నూ దీనికిన్నీ తారతమ్యం అట్టే కనబడదు. శకట రేఫలూ, అర్ధానుస్వారాలూమాత్రం తీసేసి అర్థసౌష్ఠవంకోసరం సంధి సూత్రాలు కాస్త సడలించారు అంత మాత్రానికే ఈ పుస్తకాన్ని 'గ్రామ్య భాషలో రచించినట్టుగా భావించి ఖండించడం సబబుకాదనికూడా చెప్పాను.

ఇప్పుడు మీరు ఆ గ్రంథంచూస్తే ఇది గ్రాంథిక భాషలో ఉందేగాని, వ్యావహారికభాషలో ఉన్నదిగాదని తోస్తుంది. దేశంలో తీవ్రమైన ఆందోళన జరుగుతూ ఉన్నప్పటికీ, స్కూలుఫైనలు పరీక్షలకు మాత్రం మూడునాలుగేళ్ళు వ్యావహారిక భాషలోనైనా వ్యాసరచన చేయవచ్చునన్న అనుజ్ఞ నిలిచింది. ఈ గ్రంథాన్ని పురస్కరించుకొని ప్రెసిడెన్సీ కాలేజీ తెలుగు పండితులుగా వుండిన వావిలకొలను సుబ్బారావుగారు 'ఆధునిక వచన రచనా విమర్శనము' అనే పేర ఒక గ్రంథం ప్రకటించారు. దానికి 'సొడ్డు' అని పేరుపెట్టి నావిమర్శన ప్రకటించి అందులో వారి వాదాన్ని ఖండించాను. సుబ్బారావుగారి విమర్శలో 'కెరటము' మొదలైన మాటలు మా రాయలసీమ వారికి తెలియవు శబ్ద రత్నాకరములో కనబడవు. ఈ పదముల అర్థము గ్రహించాలంటే నేను గ్రంథకర్తగారినే ఆశ్రయించాలి కదా! —అని వ్రాశాను. బ్రౌను దొరగారి నిఘంటువు చూచుకుంటే కన

బడుతుందని నేను ప్రత్యుత్తర మిచ్చాను. తర్వాత పంతులుగారూ శేషగిరిరావూ, నేనూ యూనివర్సిటీ వారు ఏర్పరచిన Jones, phonetic Lectures వినడానికి చెన్నపట్నం వచ్చి నప్పుడు 'ప్రెసిడెన్సీ కాలేజి' 'ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజ' కార్యదర్శిగా ఉండిన. వింజమూరు రంగాచారి గారు కాలేజీలో ఒకసభఏర్పాటుచేసి,మమ్మల్ని మాట్లాడమన్నారు అంతకు ముందు ఒకసంవత్సరం క్రిందట ఈలాంటి సభకే పంతులుగారిని ఈకాలేజీవారేఆహ్వానించి అల్లరిచేశారు. ఆకాలంలో, ఈవ్యావహారిక భాషావాదులను అపహాస్యం చేసేవారే కాని, వాస్తవమైన సంగతులు తెలుసు కోవాలనే జిజ్ఞాస విద్యార్థులకు ఉండేది కాదు. అందుకని ఈసారి మమ్మల్ని పిలిచినప్పుడు కూడా వారికి దురుద్దేశమే ఉందని గ్రహించి రంగాచారిగారి కోరిక చెల్లించలేమని చెప్పాము. రంగాచారి గారు అలాంటిదేమీ లేదని నచ్చచెప్పగా నేనూ, శేషగిరిరావూ వెళ్ళి ఉపన్యసించాము అప్పుడు నేనువ్రాసిన 'సొద్దు' అనేగ్రంథం ఎత్తుకుని తిరస్కార భావంతో విద్యార్థులు వుపన్యసించారు. మేము తగినట్టుగానే జవాబు చెప్పాము. అప్ప టిలో విద్యార్థిగాఉండిన ఇప్పటి 'త్రివేణీ' పత్రికాసంపాదకులు రామకోటేశ్వరరావు గారుకూడా మమ్మల్ని అల్లరిచేసినవారే.

మేము చెన్నపట్నానికి వచ్చిన ఆ రోజుల్లోనే కొమర్రాజులక్ష్మణరావుగారు, ఆచంట లక్ష్మీపతిగారు, ఇంకామరొకరు మాటసకు వచ్చారు. వ్యావహారిక భాషా వాదాన్ని గురించి తెలుసుకోవాలనే ఉద్దే శంతో వచ్చామన్నారు. వారిదగ్గర వీరేశ లింగంగారి 'సంగ్రహ వ్యాకరణం' ఉంది. మీవాదాన్ని అనుసరించి ఇందులో ఏసూత్రాలు ఉండాలి, ఏది ఉండకూడదో, ఏవి మార్చచెయ్యాలో చెప్పండని పంతులుగారిని అడిగారు

"మావాదం మీకు బోధపడాలంటే ఈ 'సంగ్రహవ్యాకరణం' పట్టుకుంటే మీకు బోధపడదు ఈ సూత్రాలు కావ్య భాషకు వర్తిస్తాయే కాని, వ్యావహారిక భాషకు వర్తించవు దీనికి వేరే వ్యాక రణం కావాలి కాంప్‌బెల్ మారిసన్, బ్రౌన్ మొదలయిన ఆంగ్లేయ పండితులు వాడుక భాషకు కొంతవరకు వ్యాకరణం రచించారు. అది చూచి, దాన్ని ఎంత వరకు సంస్కరించాలని అడిగితే నేను ఏమైనా చెప్పగలను" అని పంతులుగారు చెప్పారు.

"లక్షణ విరుద్ధమైన భాష, గ్రామ్య మని సూత్రమున్నది కదా. ఆ సూత్ర ములో చెప్పిన గ్రామ్యభాషేకదా మీ రంటున్న వ్యవహారభాష' అని వాళ్ళల్లో ఒకరన్నారు.

అప్పుడు పంతులుగారికి దేశంలో అనేకులకు ఉండిన దుర్భ్రమ ఒకటి సవిస్తరంగా బోధించి, పోగొట్టడానికి అవకాశం చిక్కింది. లక్షణంలేని భాష అనే అర్థంలో 'లక్షణ విరుద్ధమన్న సూత్రాన్ని' సూచించడంలో వారి అర్థం ఏమంటే, వ్యావహారికభాషకు వ్యాకరణ మంటూ లేదనీ వ్యాకరణం ఎవరూ ఇది వరకు దీనికి రచించలేదనీ, అంతేకాని, దీనికి లక్షణం అంటూ ఒకటి ఉండదు, అని అనుకోవడం తప్పు. ఎవరైనా

వృక్షశాస్త్రం గురించి వ్రాస్తూ, గడ్డిజాతి మొక్కని అందులో ఉదహరించకపోతే గడ్డిమొక్కకు వృక్షశాస్త్రం లేదన్నట్టుగా ఉంటుంది. లక్షణ విరుద్ధం అని చెప్పినప్పుడు సూత్రకారుడి అభిప్రాయము ఏమిటంటే మేము కావ్యభాషకు లక్షణము చెప్పాము. ఆ లక్షణానికి విరుద్ధంగా ఉన్న వాటిని మేము పారిభాషికంగా 'గ్రామ్యము'ని అంటున్నాము అని అంతేకాని వారనే 'గ్రామ్య భాషకు' వ్యాకరణం అంటూ ఉండడం అసంభవమని కాదు.

ఇది ఎటువంటిది అంటే, పాణిని లక్షణవిరుద్ధమైన భాష 'పాకృతము' అని అంటే, ఏ అర్థం పొసుగుతుందో, ఆ అర్థాన్నే ఇక్కడకూడా గ్రహించాలి. ప్రాకృతానికి వ్యాకరణాలు పుట్టినట్టే, వ్యావహారికాంధ్రానికికూడా వ్యాకరణాలు పుట్టవచ్చు

ఈవిధంగా సమాధానం చెప్పుకొస్తుంటే - లక్ష్మణరావుగారు ఒక విపరీతమైన ప్రశ్న వేశారు. ఇంకా వ్యాకరణం లేని భాషకు మీరు పిల్లలకు బోధించమంటే ఎట్లాగన్నారు. వ్యాకరణం వ్రాసినతరువాత పుస్తకాలు పెట్టించవచ్చునన్నారు.

అప్పుడు పంతులుగారు మిరొక దుర్భ్రమకూడా తొలగించవలసి వచ్చింది. ఏదేశంలోనైనా వ్యాకరణం పుట్టిందాకా వాఙ్మయం ఆగదు వాఙ్మయం కొంత సాగిన తర్వాతనే వ్యాకరణాలు పుడతాయి. మన ఆంధ్ర కావ్యభాషా విషయంలోకూడా అట్లాగే జరిగింది. నన్నయ ముందర వ్యాకరణం రచించి, తర్వాత తాను చెప్పిన లక్షణానికి లక్ష్యంగా భారతంచెప్పాడని వాదిస్తారు, అదితప్పు. అసలు 'నన్నయభట్టీయము' అనుకున్నది ఆ నన్నయభట్టు రచించినదిగాదు ఎవరు రచించారనుకున్నప్పటికీ, అందులో చెప్పిన లక్షణాన్నిబట్టి చూస్తే, కొంత వాఙ్మయం పుట్టిన తరువాతనే రచించినట్టు తేలుతుంది అందులో ఉదాహరణలు ఇవ్వకపోవడం చేత, మీకు ఆ విషయం నచ్చచెప్పడం కష్టం. తర్వాత లక్షణగ్రంథాలు తీసుకోండి అప్పకవి కొన్ని గ్రంథాలలో నుండి ప్రయోగాలు చూపిస్తూ, లక్షణం కల్పించాడు.

ఆయన ఆ లక్షణం కల్పించినదాకా కవులు ఆగలేదు. ఆ తర్వాత ఈపూర్వ లక్షణానికి విరుద్ధంగా కవులుచేసిన ప్రయోగాలకు కూచిమంచి తిమ్మకవి లక్షణం కల్పిస్తూ, సర్వలక్షణ సారసంగ్రహం రచించాడు. ఆతరువాత అడిదము సూరన్న "కవిసంశయ విచ్ఛేదం" రచించాడు. కొన్నిచోట్ల పూర్వకవులు వాడినప్పటికి, లాక్షణికులు లక్షణం కల్పించక మరచి పోవడంచేత, తరువాతి లాక్షణికులు లక్షణం కల్పించవలసి వచ్చింది. ఈ విధంగా లక్ష్యం ముందర ఉంటుంది. తర్వాత లక్షణం వస్తుంది. ఇదే మన లాక్షణికుల సంప్రదాయం. 'లక్షణ విరుద్ధంబగు భాష గ్రామ్యంబగు' నన్న సూత్రం మీరు వర్తింపజేస్తే, మరియొక లాక్షణికుడు లక్షణం సవరించేదాకా మహా కవులు చేసిన ప్రయోగాలు గ్రామ్యాలు అనవలసి వస్తుంది, లాక్షణికుని పొరపాటువల్ల

కూడా కొన్ని మహాకవి ప్రయోగాలు గ్రామ్యమనే అనవలసి వస్తుంది అని పంతులుగారు భాషాతత్వం, లక్షణ తత్త్వం లక్ష్మణరావు మొదలైనవారికి చెప్పారు ఆ తర్వాత లక్ష్మణరావు పంతులుగారు ఈవాదం జోలికిరాలేదు అయితే మాత్రం ప్రతికూలంగానే ఉన్నారు.

ఆ పైన చెప్పిన ప్రణాళికను అనుసరించే యూనివర్సిటీ చదువుల్లో కూడా ఇంటర్ విద్యార్థులకు 'తెలుగు వ్యాస రచన' నిర్బంధంగా పెట్టారు. మళ్ళీ ఇక్కడకూడా వ్యాసరచన ఏ భాషలో సాగాలని ప్రశ్న బయలుదేరింది.

ఇప్పటికి ఈవాదం కొంచెం విరివిగా ప్రచారంలోకి వచ్చింది 1907 నుంచీ 1911 దాకా ఏటేటా 'ఏట్సు' ఉపాధ్యాయుల సమావేశాలు జరిపిస్తూ ఆ వేదికల మీద రామమూర్తి పంతులుగారిచేత మరికొందరిచేత వ్యావహారిక భాషావాదానికి సంబంధించిన ఉపన్యాసాలు యిప్పిస్తుండేవాడు. ఒక సంవత్సరం జరిగిన సమావేశానికి విజయనగరం కాలేజీ ప్రిన్సిపాలుగారైన కిళాంబి రామానుజాచార్యులవారు వచ్చి, సభలో యేమీ మాట్లాడకుండా బయటికివచ్చి, తెలుగు భాష Italian of the East అని పేరు పడినది. దాని మాధుర్యాన్ని వీరు చెరపడానికి సంకల్పించుకున్నారంటూ ఆక్షేపించాడు.

దీనికి - 'ఆ మాధుర్యం చెవి అనుభవించేదేకాని, కన్నుకాదు గనుక, ఈ అభినందనం వాడుక భాషకే వర్తిస్తుంది. పుస్తకాల్లో భాషకి కానేకాదు, అని చెప్పారు జవాబుగా రామమూర్తి పంతులుగారు.

1911 లో పిఠాపురం* మహారాజా వారి అధ్యక్షతను ఈ మద్రాసులోనే ఒక పెద్ద 'సాహిత్య సమ్మేళనం' జరిగింది. అదే తర్వాత తర్వాత ఆంధ్ర సాహిత్య పరిషత్తుగా మారింది. ఆ సభలో, ఆ సభా నిర్వాహకుల కోరికపైని పంతులుగారు 'ఆంధ్ర భాషా చరిత్ర'ను గూర్చి ప్రసంగించడానికి ప్రారంభించారు. వారు రెండు వాక్యాలయినా చెప్పారో లేదో, వీరు గ్రామ్యభాషలో మాట్లాడుతున్నారు గనుక వీరి ఉపన్యాసానికి నేను అనుమతి ఇవ్వను. ఈ సభలో గ్రాంథిక భాషలోనే అందరూ ఉపన్యసించాలి. వారి ఉపన్యాసం ఇంక ఆపు చెయ్యండి అని, అధ్యక్షులు ఆజ్ఞాపించారు. ఈ సంగతి, రామమూర్తి పంతులుగారికి చెవుడుగనుక ఎవరో దగ్గరకు వచ్చి గట్టిగా చెవులో చెప్పారు. అప్పుడు వారు, 'నాకు గ్రాంథిక భాషలో ఉపన్యసించడం చేతకాదు ఇక్కడ ఉపన్యసించే వారందరూ నిర్దుష్టమైన గ్రాంథిక భాషలో ఉపన్యసించే వారేనా?' అంటూ Black-Board పైని ఏవో పట్టికలు వేసి చూపించడానికి చేత్తోపట్టుకున్న సుద్దముక్క నేలకు విసిరికొట్టి, సభనుంచి లేచిపోయినారు.

ఆ ఆంధ్ర సాహిత్య పరిషత్తే, వ్యావహారిక భాషావాదాన్ని అణగద్రొక్కడానికి కంకణం కట్టుకొన్నది. ఆ మహారాజావారి ప్రోత్సాహంతో, అప్పుడు, ఇక్కడ ప్రెసిడెన్సీ మేజిస్ట్రేటుగా ఉండిన జయంతి రామయ్యపంతులుగారు

తమ పలుకుబడిని వినియోగించి, గవర్న మెంటువార్ను, యూనివర్సిటీవారు ఈ వాదాన్ని ఆమోదించకుండా ఉండేటట్టు చెయ్యడానికి పూనుకొన్నారు ఆ 1911 లోనే రామమూర్తి పంతులుగారు 'కాలేజీ లెక్చరర్' నుంచి రిటైర్ అయినారు

అప్పటినుంచీ తమజీవిత శేషమంతా భాషాసేవకు, ఈ వ్యావహారిక భాషా ఉద్యమ విజయానికి వినియోగింపదలచుకొని కృషి సాగించారు వాటి ఉపపత్తులతో అన్యదేశములలోని సంప్రదాయములను మాత్రం చూపిస్తూ వ్యావహారిక భాషా వాదాన్ని సమర్థించడం కష్టమని వారికి తోచింది

ఆ వాదాన్ని ప్రతిఘటిస్తూఉన్న పండితులు రెండువిధములైన ఆక్షేపణలు చేస్తూవచ్చారు ఆంధ్రభాష, వాఙ్మయం చదువుకోడానికి ఓపిక లేనివారు ఈ వాదాన్ని లేవదీస్తున్నారు వీరు దేశంలో భాషాకృషి నశింపజేస్తున్నారు. ఈ వాదాన్ని అనుసరించి విద్యాకృషి సాగేట్టయితే ఇహ పండితులు దేనికి? మాట్లాడకనే భాషకు చెప్పేవారు ఎందుకు? ఎవరి యిష్టంవచ్చినట్టు, వాళ్ళు వ్రాసుకోవచ్చు. పండితులమీద వీరు ఇంతగా ఎందుకు కత్తిగట్టారో తెలియడంలేదనేవారు.

వారి ఆక్షేపణలకు తాము సరికాకుండా ఉండాలనే సంకల్పంతో పంతులుగారు ఆంధ్రభాషాచరిత్ర, వ్యాకరణాలు, వాఙ్మయం, సమగ్రనదృష్టితో రాత్రింబవళ్ళు పరిశీలనచెయ్యడంమొదలెట్టారు. ఒక సంవత్సరం గడిచేసరికి, ఆయన ప్రదర్శించిన పాండిత్యం అందరికీ విస్మయం కలిగించింది నన్నయనాటి భాష, కావ్యభాషలోనే ఎట్లా మారుతూ వచ్చిందో నిరూపించారు

చిన్నయసూరి గద్యరచనకు పితామహుడు అంతకు పూర్వం ఆంధ్ర వాఙ్మయంలో గద్యరచన లేనేలేదని లోకంలో ఉన్న ప్రతీతి నిరాధారమైందనికూడా ధృవపరచారు.

13 వ శతాబ్దంనుంచీ దేశంలో వచన గ్రంథాలు వందల కొలదిగా ఉన్నవి. అవి అచ్చుకాకపోవడంవల్ల, చిన్నయ సూరిగారితోటే గద్యరచన ప్రారంభమైందని లోకం అనుకుంటున్నదని గుర్తించారు ఈ విషయం వారు ఒక్కసారిగా గుర్తించలేదు 1911 నుండీ 1914 దాకా అనేక మిత్రుల తోడ్పాటుతో అనేక విషయాలపైన మన పూర్వులు వ్రాసిన ఎన్నో గద్యగ్రంథాలను తెలుసుకోగలిగారు, రామమూర్తి పంతులుగారు ఈ విషయం బహిర్గతం చెయ్యక పూర్వం ప్రభాకర శాస్త్రిగారి వంటి పండితులు కొందరికి తప్ప, అందరికీ తెలియదు

అప్పకవీయం, సర్వలక్షణసార సంగ్రహం అలాంటి లాక్షణిక గ్రంధాలకు తెలివిడి, గద్యాలు మొదలైనవి కావ్య భాషలోకాక ఆనాటి వాడుక భాషలోనే ఉండడం తెలుసుకోగలిగారు. దీన్నిబట్టి చిన్నయసూరిగారికి పూర్వం, వ్యావహా

1913 లో శ్రీ వావిళ్ళవారు ప్రకటించిన 'నిజమైన సంప్రదాయం' అనే గ్రంథంలో అదే పెద్ద గ్రంథమై 'గద్య చింతామణి' అన్నపేర 1934 లో ప్రకటితమైంది.

రిక భాషలోని గద్యరచన సాగడం సంప్రదాయమని తేలింది.

అప్పట్లో ఈవిషయం లోకంగుర్తించక పోవడానికి కారణం ఏమంటే, చిన్నయసూరిగారు ప్రెసిడెన్సీ కాలేజీలో పండితులూ పలుకుబడికలవారూ, అదివరకుండిన గద్య రచనా సాంప్రదాయానికి విరుద్ధంగా, వారు కావ్యభాషలోనే అందులోనూ జటిలమయిన భాషలో మిత్రలాభాన్నిరచించి స్కూళ్ళలోపార్య గ్రంథంగా పెట్టించారు. వారి బాలవ్యాకరణంకూడా పాఠ్యగ్రంథం అయింది. వారి వచన రచనశైలి ఇతర పండితులు అనుకరించారు. అదే 50 సంవత్సరాలకుపైగా ఆదర్శప్రాయమైపోయింది.

అప్పటిలో వ్యావహారిక భాషలో వ్రాసిన వచన గ్రంథాలు ఏవో రెండు మూడు తప్ప అచ్చుకాలేదు అవి పాఠ్య గ్రంథాలూకావు. అందుచేత నిజమయిన సాంప్రదాయం మరుగుపడి పోయింది. దీనికి తోడు వారి రచనలు చదువుకొంటున్నవారు, దానికే అలవాటుపడ్డవారు ఈ వ్యవహారిక భాషావాదాన్ని వప్పుకోలేదు.

దేశంలో బలంగా వేళ్ళునాటుకొని ఉన్న ఈ అజ్ఞాన విష వృక్షాన్ని పెళ్ళగిస్తేనేతప్ప, తను వ్యావహారికభాషావాదాన్ని నచ్చజెప్పడానికి అవకాశం లేదని గ్రహించి, నూతన ఫక్కీలో ప్రచారం ప్రారంభించారు.

ఈలోగా యూనివర్సిటీవారు 'కాంపొజిషన్ కమిటీ' అన్న పేరిట ఒక పది మందిని నియమించి, ఇంటరు విద్యార్థులు వ్రాయవలసిన వ్యాసాలు ఏభాషలో ఉండాలో తేల్చమన్నారు ఆ కమిటీలో వేదం వేంకటరాయ శాస్త్రిగారు, కొమర్రాజు లక్ష్మణరావుగారు, జయంతి రామయ్యపంతులుగారు మొదలైనప్రముఖులు గ్రాంధికభాషావాద ప్రతినిధులు; రామమూర్తి పంతులుగారు, గురజాడ అప్పారావుగారు, బుర్రా శేషగిరిరావూ వ్యావహారికభాషావాద ప్రతినిధులు.

వీరుగాక మధ్యవర్తులుగా ప్రెసిడెన్సీ కాలేజీ పండితులైన రంగాచారిగారిని స్కూళ్ళ ఇన్‌స్పెక్టరుగావున్న థాంప్సన్ గారిని నియమించారు.

ఈకమిటీ చేసిన తీర్మానం ఇది :

Forms that are used in speech as well as in literature an acceptable. (వ్యావహారం లోనూ, వాఙ్మయం లోనూ ఉన్న పదములు గ్రహింపదగినవే) ఈ తీర్మానాన్ని అనుసరించి పదముల పట్టికలుకూడా తయారు చేయవలసిందని కోరారు మధ్యవర్తులు ఇద్దరూ వ్యవహార భాషావాదాన్నే బలపరచారు. తీర్మానం, వ్యావహారిక భాషావాదానికి అనుకూలంగా ఉందని ప్రత్యర్థులు విచారించారు. దీనికి విఘాతం కలిగించడానికి, ఒక విజయవంతమైన పన్నుగడ పన్నారు.

వ్యవహారంలో ఉన్నపదములు నిర్ణయించవలసి ఉన్నది గనుక, అన్ని మండలములలోని పదములను సంగ్రహించవలసి ఉంటుంది. ఇప్పుడు కమిటీలోని సభ్యులందరూ, సర్కారుజిల్లాల వారు. రాయలసీమ ప్రతినిధులుకూడా ఈ కమిటీలో సభ్యులు అయితేనే తప్ప,

అక్కడి వ్యావహారిక భాషలోని పదాలను సంగ్రహించడానికి అవకాశంలేదని ఆందోళన రాయలసీమ వారిచేత చేయించారు యూనివర్సిటీకి ఒత్తిడి కలిగించారు. దానితో నలుగురు రాయలసీమ సభ్యులను కమిటీలో చేర్చారు వీరుచేయవలసిన పని నిజానికి రాయలసీమలోని వ్యావహారిక భాషాపదములను నిర్ణయించడం. అయితే ఈ నలుగురూ గ్రాంధిక భాషాప్రియులు వీరందరూచేరి పైన చెప్పిన తీర్మానానికి విపరీత వ్యాఖ్యానం చెప్పారు. ఇంగ్లీషు తీర్మానంలో వున్న 'As well as' కి వారు చెప్పిన అర్థం ఏమంటే— ఏపదములైతే వ్యవహారములోను, వాఙ్మయంలోను, రెండింటిలోను సమానంగా ఉంటవో అవే నిర్ణయించవలసిందని అర్థమే. వాఙ్మయంలో ఉన్నా లేకున్నా వ్యవహారంలో ఉన్న పదములన్నింటినీ సేకరించడం మా పనికాదని.

వ్యావహారిక భాషావాదులు, మీ వ్యాఖ్యానమే సరైనదైతే మీ ప్రాతినిధ్యానికి అవసరమేమీలేదు. మీ ప్రాతినిధ్యానికి అవసరం కలగడం మేము చెప్పే వ్యాఖ్యానాన్నిబట్టే వస్తుందన్నారు, కమిటీలో గ్రాంధిక భాషావాదులు అధికంగా ఉండడంచేత తీర్మానమేనప్పటికీ పని జరగలేదు. మెజారిటీ రిపోర్టులూ, మైనారిటీ రిపోర్టులూ వెలువడ్డాయి. అందులో ఒక చక్కని విషయం వ్యావహారిక భాషావాదులు చూపించారు మా ప్రతిపక్షుల వ్యాఖ్యానమే సరైనదైతే వాడుకలో లేని గ్రాంధిక భాషా రూపాలు అగ్రాహ్యం కావలసివస్తుంది ఇది వారికి ఇష్టాపత్తి కాదుగదా! అందుచేత వారి వ్యాఖ్యానం తప్పనికూడా యూనివర్సిటీకి తెలియపరిచారు

ఈలోగా పలుకుబడిగల పెద్దల మంత్రాంగానికి యూనివర్సిటీ లోబడవలసివచ్చింది. 1914 లో సిండికేటు వారు ఇట్లా తీర్పు చెప్పారు: The university is not now in a position to accept what is known as modern Telugu. ఇప్పట్లో ఈ విశ్వవిద్యాలయంవారు ఈ వ్యా వ హా రి క భాషను ఆమోదించే స్థితిలోలేరు.

దానితో ఆ కమిటీ ఏమీ చెయ్యకుండానే అంతరించిపోయింది. స్కూల్ ఫైనలు ప్రణాళికలో వ్యావహారికభాషలో వ్యాసరచన సాగించవచ్చుననే నియమాన్నికూడా రద్దుచేశారు.

దీనితో వ్యావహారిక భాషావాదం పూర్తిగా అంతరించిపోయిందనే చాలా మంది, అందులోను ఎక్కువగా గ్రాంధిక భాషావాదులు అనుకున్నారు. ఆంధ్ర సాహిత్య పరిషత్తువారుకూడా ఈ అపజయానికి తోడ్పడ్డారు

ఈ సాహిత్య పరిషత్తువారు 1911 నుంచీ వార్షికోత్సవాలు జరుపుతుండేవారు. 1914 లో కాకినాడలో జరిగిన వార్షికోత్సవానికి కిళాంబి రామానుజాచార్యులవారు అధ్యక్షులు అప్పుడు పంతులుగారు సర్ విజయాగారికీ, వారి సోదరికి, 'ట్యూటర్' గా ఉండేవారు అప్పుడు విజయనగరంవాళ్ళు చాలా మంది ఈ కాకినాడ సభలకు వచ్చారు పంతులుగారూ, అప్పారావుగారూ, శేషగిరిరావూ, నేనూ, కొవ్వెర్లకోట కృష్ణ రావుగారింట్లో బసచేశాము. పరిషత్తు

సభలలో మాట్లాడడానికి మాకెవరికీ అవకాశం ఇవ్వలేదు. ఆ కారణంచేత కృష్ణారావుగారు పరిషత్ వార్షికం జరిగిన తర్వాత మమ్మల్ని ఆవూళ్ళో మూడు రోజులు వుంచేశారు. ప్రత్యేకంగా సభలు పెట్టి, ఒకనాడు పంతులుగారినీ, అప్పారావుగారినీ; రెండోనాడు వఝ్ఝల చిన సీతారామస్వామిశాస్త్రిగారినీ; మూడో రోజు శేషగిరిరావునూ, నన్నూ ప్రసంగించమన్నారు. ఈ సభలకు కృష్ణరావుగారే అధ్యక్షులు. దీనివల్ల ఏదో ఉపద్రవం జరిగిపోతుందనుకున్నారు మా ప్రతిపక్షులు. చెన్నపట్నం వెళ్ళిన రామయ్య పంతులుగారిని తిరిగి రప్పించారు. అప్పారావుగారు మాట్లాడుతున్నప్పుడు సభలో కలకలం బయల్దేరింది.

వారిది చిన్నగొంతు. కళాదృష్టితో వ్యావహారిక భాషాప్రాశస్త్యాన్ని విశదం చేస్తూ "నేను ఏదో కథలు వ్రాస్తాను. పద్యాలూ, పాటలూ అల్లుతాను. ఈ వాదం పుట్టక మునుపే, వాడుకభాషలో కన్యాశుల్కం అనే నాటకం వ్రాశాను. అనుభవంచేత నేను గ్రహించింది ఏమంటే - సంభాషణలు మన వాడుక భాషలో స్వభావసిద్ధంగా నడిపించడానికి వీలున్నట్టు కావ్యభాషలో ఉండదనీ, పాత్రోచిత భాష కావాలనుకుంటే గ్రాంధికభాష ఉపకరించదని. రచన అనేది రసంతో కూడుకొని ఉంటుంది. నాకు కావ్యభాష అంటే ద్వేషంలేదు. నేను కావ్యభాషలో కూడా పద్యాలు రచించాను. కవి భావాలు వ్యక్తపరచడానికి కవి తెచ్చిపెట్టుకున్న భాషకంటే, సహజంగా అలవడ్డభాష ఎక్కువగా తోడ్పడుతుందని గుర్తించాం" అని అన్నారు. ఇప్పటిలాగా అప్పటికి అప్పారావుగారి కన్యాశుల్కం, ఖండకావ్యాలు చదివినవారు ఆ సభలో అట్టేలేరు. ఆ సభలోనే కాదు దేశంలోకూడా అట్టే లేరని చెప్పొచ్చు. కన్యాశుల్కం ఒక ప్రహసనంగాను, ఆయన పద్యాలు పేలవంగాను తిరస్కారభావంతో చూచేవారే ఎక్కువ అయినా ఆయన ప్రతిభను గ్రహించినవారుకూడా లేకపోలేదు. అప్పారావుగారి తర్వాత, కావ్యభాషా విషయంలో, గద్యరచనా విషయంలో ఉన్న నిజమైన సంప్రదాయం ఎలా ఉన్నదో సవిస్తరంగా నిరూపించారు రామమూర్తిగారు.

సీతారామస్వామిశాస్త్రిగారు సంస్కృత లాక్షణికుల మతం ప్రకారం, వ్యాకరణ మర్యాదలు ఏమిటో తెలియజేస్తూ గ్రామ్యం, చ్యుతసంస్కారం మొదలైన పదాలను వివరించి మేము సమర్థిస్తున్నది వ్యావహారికభాషగాని గ్రామ్యం కాదన్నారు.

శేషగిరిరావూ, నేనూ భాషాతత్వాన్ని గురించి ఉపన్యసించాము. మనభాషను ఇతర భాషలతో పోల్చి, సాదృశ్యాలు చూపిస్తూ నేటి వ్యావహారికభాష, ప్రజావాఙ్మయానికి ఎక్కువగా తోడ్పడిందని తెలియజేశాం. ఆరోజులలో సభలలో కంటె కృష్ణరావు గారింట్లో జరిగే ప్రసంగాలు ఎక్కువ ఫలప్రదంగా ఉండేవి. అనేకులు సద్భావంతో వచ్చి మా వాదన గ్రహించడానికి ప్రయత్నించారు. కొంత మంది మాతో ఏకీభవించారు. రామమూర్తిగారు కృష్ణారావుగారి ఆస్థానపండి

తులుగా ఉండిన తిరుపతి కవిగారితో ప్రసంగిస్తూ ఒకవిషయం నచ్చజెప్పారు.

"వాస్తవంగా మన మాతృభాషఏది ? కావ్యభాషా లేక వ్యావహారికభాషా ?— అనే ప్రశ్నకు మనం చెప్పవలసిన సమాధానం ఏమిటో చూడండి. ఆవిషయం నిర్ణయించడానికి ఒకటే గీటురాయి ఏదైతే స్వప్నంలోనైనా నిర్దుష్టంగా వస్తుందో అదిమనమాతృభాష. స్వప్నంలోనైనా 'వాడువచ్చాను-నేనువస్తుంది' అనం. మనకు మాతృభాషకాక నేర్చుకున్న భాషఎంత శ్రద్ధతో అభ్యసించినా, ఎక్కడో ఒకదగ్గర తప్పరాక మానదు 'మీరువచ్చిరి' అని మీరెవరేనా ప్రయోగిస్తే ఏమనాలి ? అది మా మాతృభాష కాదనాలి ఈతప్పుడు ప్రయోగం చెయ్యనివారు నాకు కనపడలేదు. బహుశ మీరు చెయ్యలేదేమో !" అనిఅంటూంటే నేను దగ్గరఉండి, వీరూ చేశారన్నాను.

'ఎక్కడ చేశారో చెప్పు' అన్నారు.

అంటే వారుప్రగల్భంగా చెప్పుకున్న పద్యంలోనే 'దోసమటంచెరింగియును ——కవిపరుల్ మముగెల్వుడు గెల్చిరేని' అన్నాను.

'ఆహా !—మీరూపడ్డారూ—' అన్నారు పంతులుగారు.

'పడిలేదనడం భావ్యం కాదు గనక పడ్డామనే అనాలి అయితే 'గెల్తురేని' అని మార్చుకోగలం. నలుగురితో పాటు మేమూ—" అన్నారు తిరుపతికవి గారు 1914 నుండీ దేశంలో ప్రచారం చేసి తమవాదం నలుగురికీ అంగీకృతం అయ్యేటట్టు చేస్తేనేగాని, గవర్నమెంటు వారున్నూ,యూనివర్సిటీవారున్నూ అంగీకరించరన్నమాట గుర్తించారు పంతులు గారు.

బరంపురం మొదలు చెన్నపట్నం వరకూ ఉన్న ఆంధ్రదేశపు కాలేజీలన్నింటికీ వెళ్ళారు అక్కడ కాలేజీ అధికారులకు తమ ఆశయం తెలియజెప్పారు. కాలేజీ పండితులనూ, ఊళ్లోని పండితులనూ సమావేశపరచి నేను ప్రదర్శించే ప్రమాణాలను పరిశీలించి, నేను చూపించే ప్రయోగాలను తెలుసుకొని, వారి నివేదికలు సంతకాలతో ఇప్పించమని అడిగారు. నా వాదం ఆమోదించామనిగాని, ఆమోదించమనిగాని వారేమీ చెప్పక్కర్లేదనికూడా చెప్పారు. ప్రతి కాలేజీ అధికారులు వారడిగినట్టు సభలు ఏర్పాటుచేసి, వారి వాదం వినేట్టుచేశారు. కొందరు వారివాదాన్ని ఆమోదిస్తున్నట్టూ చెప్పారు ప్రయోగాలు, దృష్టాంతాలు ఉన్నా మాకు ఇష్టం కాలేదని సూచించిన వాళ్ళుకూడా కొందరున్నారు. ఈ పని 1916 వచ్చేసరికి పూర్తి అయింది.

1916 లో కొవ్వూరులో ఆంధ్ర సారస్వత మహాసభ నాల్గవ వార్షికోత్సవం జరిగింది. ఆసభలో ఈవ్యావహారిక భాషా వాదాన్ని ఆమోదిస్తూ ఒక తీర్మానం సభా సమ్మతమైంది. ఆ సభకు రావుబహదూర్ శ్రీ వీరేశలింగం పంతులుగారు కూడా వెళ్ళారు. రామమూర్తి పంతులుగారు ప్రసంగిస్తుంటే నించొని విన్నారు వీరు చెప్పేది సబబుగా ఉన్నట్టుతోచింది. కాని వీరేశలింగంగారు వచ్చినట్టు రామమూర్తి గారికి తెలియదు. మరి కొన్నాళ్ళకు

వీరేశలింగం పంతులుగారు ఆసభకు వచ్చినట్టూ, వారి వాదాన్ని ఆమోదించి నట్టూ తెలిసింది. 1919 లో రామమూర్తి పంతులుగారు వీరేశలింగంగారి దర్శనానికి వెళ్ళారు. అప్పుడు వర్తమాన వ్యావహారికాంధ్రభాషా ప్రవర్తక సమాజము స్థాపించారు. దానికి వీరేశలింగంగారే అధ్యక్షులు. రామమూర్తి పంతులుగారు సేకరించిన పూర్వ లక్షణ విరుద్ధమైన కవిప్రయోగాలు, వారుచెప్పిన సంప్రదాయానికి దృష్టాంతాలు తెలియజేస్తే, వ్యావహారికాంధ్ర భాషా లక్షణం రచిస్తామని వీరేశలింగంగారు వాగ్దానం చేశారు. వారు కోరిన విషయాలు తెలియజేస్తూ రామమూర్తి పంతులుగారు ఉత్తరం వ్రాశారు. కాని మరికొద్ది మాసాలకే వీరేశలింగంగారు పరమపదించారు. ఆపని నెరవేరలేదు. ఆసమాజంవారి కోరికతో పంతులుగారు 'తెలుగు' అనే మాసపత్రిక ప్రకటించి వారి వ్యావహారిక వాదప్రచారం సాగించారు. ఆ సమాజంలో చాలామంది సభ్యులుగా చేరారు.

1926 లో తణుకులో ఆంధ్రసాహిత్య పరిషత్తు సమావేశం జరిగింది. ఆసభలో పంతులుగారు 3½ గంటలు ఉపన్యసించారు. వ్యావహారిక భాషకు అనుకూలంగా ఒక తీర్మానంజరిగింది. ఆ సభకు జయంతి రామయ్య పంతులుగారు రాలేదు. అందుచేత ఈ తీర్మానం రద్దు చేయించడానికి పూను కొన్నారు. మరుసటి వార్షికోత్సవ సమయంలో మరొక తీర్మానం తణుకు తీర్మానాన్ని రద్దుచేస్తూ ఆమోదింప చేశారు. తర్వాత ఏంజరిగిందో మీకుతెలుసు.

అప్పటినుండీనవ్యసాహిత్య పరిషత్తు ఈ వ్యావహారిక భాషోద్యమానికి కృషి చేస్తూవచ్చింది. 1933 లో రాజమహేంద్రవరంలో (డిసెంబరులో) పంతులుగారి సప్తతి తమ ఉత్సవం జరిపారు. సుమారు వెయ్యిమంది సభకు వచ్చి, వారిని గౌరవించారు. అప్పుడు కొందరు ఒక విషయం ప్రధానంగాముచ్చటించారు. ఏ రాజమహేంద్రవరంలో 1915 లో వీరిని హేళన చెయ్యాలని ప్రయత్నించారో, ఆ రాజమహేంద్రవరంలోనే ఇప్పుడు అమోఘమైన గౌరవం కలిగిందంటే ఈ 18 సంవత్సరాలలో వీరి కృషి ఫలించి ఎంత అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డవో గోచరించక మానదు-అని. వీరు ఈ వాదం, సత్యం ఎప్పటికైనా జయించక తప్పదనే దృఢ విశ్వాసంతో, సాగిస్తూవచ్చారు. పల్లెపట్టుల్లో సైతం గొప్పసంచలనం కలిగించి పత్రికలలో వివిధ విషయాలపై వ్యాసాలు వాడుక భాషలో వెలువడడం చేతనే ప్రజలు వాటిని సులభంగా చదివి అర్థం చేసుకోగలిగారు. ఈ కృషి ఫలం ఆంధ్రదేశమంతటా వ్యాపించిందనవచ్చు.

1938 లో రేడియో స్టేషన్ చెన్నపట్టణంలో స్థాపించినపుడు, తెలుగు ప్రసంగాలు రామమూర్తి పంతులుగారితోటే ప్రారంభించారు. ప్రసంగాలన్నీ వాడుక భాషలోనే ఉండాలన్న ఆశయం రేడియోవారు నెరవేర్చడం మెచ్చుకోదగిన విషయం. ఆరంభంలో మాండలిక భాషాభేదాలవట్టి ఒకరి మాటలు మరొకరికి బోధపడవన్నభయం, ఈ రేడియో ప్రసంగాలవల్ల పోయింది. నూతన

శైలికూడా అలవడింది. భావానుకూలంగా ఉచ్చారణరీతి పరిపక్వాన్ని పొందుతున్నది.

1940 లో పంతులుగారు పరమపదించినప్పటినుంచీ నెరవేర్చ వలసివున్న పని ఒకటి ఉండిపోయింది. అది అభ్యుదయ రచయితలందరూ కృషిచేయవలసి ఉంది. దేశాభ్యుదయమునకు సేవచేయుటకు అన్ని విధములా సంకల్పించుకున్న అభ్యుదయ రచయితలు, వారికి మార్గదర్శకులుగా ఉండిన మహానీయుల వర్ధంతుల జరిపి, వారి సందేశాలను ప్రజలచేత స్మరింపజేస్తూ ఉండడంచేత ప్రజా హృదయాలలో నూతన వికాసం కలిగింది, ప్రజలకూ, రచయితలకూ సాన్నిధ్యము ఏర్పడుతున్నది. వ్యావహారిక భాషావాదం ఇంతమట్టుకు దేశంలో వ్యాప్తిచెందిన తర్వాత యూనివర్సిటీ ప్రభుత్వశాఖ ఆమోదించక తప్పదు. అందుకు శుభసూచకంగా ఆంధ్ర విశ్వకళాపరిషత్ వారి స్నాతకోత్సవ సమయమున మన ప్రధాని, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంగారు చేసిన ఉపన్యాసం, ఇదివరకు సంప్రదాయానికి విరుద్ధంగా కేవలము ఆంధ్రభాషలో, అందులోనూ వ్యావహారిక భాషలోనే వెలువడడం అభినందించదగిన విషయం. ప్రజల ప్రభుత్వాలు వెలసిన ఈ రోజులలో, ప్రజాభీష్టమునకు ప్రజాక్షేమమునకు, ప్రజా వైజ్ఞానికాభివృద్ధికి ఉపచరించిన వ్యావహారిక భాషను ప్రభుత్వశాఖవారుకూడా ఆమోదించి, కృతకభాషలో సాగుతున్న పాఠ్య పుస్తకములను తొలగించి, వాస్తవమయిన మాతృభాషలో రచితములైన గ్రంథములను విద్యార్థులకు అందజేయవలసి ఉన్నది.

ఇక వారి కృషిఫలితముల సారాంశము, వారు మనకు చేసిన ఉపదేశం, వారి మాటలతోనే చెప్పి నావ్యాసం ముగిస్తాను

"లౌకికభాష శిష్టజనవ్యవహార సిద్ధమయినది గనుక పూజ్యమే కాని ఎంతమాత్రమూ నింద్యముకాదని మా మతము. శిష్టజనవ్యవహారమైనా లౌకిక భాష గ్రామ్యమే అనిన్నీ, గ్రంథములలో వాడుటకు తగినది కాదనిన్నీ కొందరు వాదిస్తున్నారు. ఆలాగున వాదించేవారి మతము మామతమునకు విరుద్ధమయినది గనుక వారితో మాకు వివాదము కలిగినది వారి వాదమును ఖండించుటకు పూనుకొన్నంత మాత్రం చేత వారియెడల మాకు గౌరవములేదని తలంచగూడదు" అని వివాదాంశము తెలియజేశారు

లౌకికభాష అంతా ఒక్కలాగున ఉంటుందా ? అని విషయాన్ని ఎత్తుకొని వారేమి చెప్పారంటే :

"తెలుగుభాష అనేక కోటిముఖముల ప్రవహిస్తూ ఉన్నప్పుడు తెలుగువారందరూ నేడు సరిగా ఒక్కలాటి తెలుగే వ్యవహరిస్తున్నారని చెప్పలేము. దేశమునుబట్టి, జాతినిబట్టి, వృత్తినిబట్టి, మతమునుబట్టి, విద్యనుబట్టి, వయస్సునుబట్టి, నాగరికతనుబట్టి ఎంతో కొంత వ్యత్యాసము ఏర్పడకతప్పదు. అయినా నేటి నాగరకుల తెలుగులో సాధర్మ్యము అధికముగాను, వైషమ్యము తక్కువ

గాను ఉన్నందున దానిని విశేషించి, ప్రత్యేకించి, సగటున అనగా మొత్తము మీద పరీక్షించి ఒక్కలాటిదే అనవచ్చును... ..మన కాలములో అచ్చు పుస్తకములు, అచ్చు వార్తాపత్రికలు, పోస్టు, వ్రాతమూలకమయిన లౌకిక వ్యవహారము ఉన్నందున వీటినిబట్టి నేటి నాగరక తెలుగుభాషకు లక్షణము చెప్పవచ్చును. గాని సంపూర్ణమయిన లక్షణము నిరూపించుట అసాధ్యమనక తప్పదు. అర్థమునకు బాధకముకాని వ్యత్యాసములు వ్యవహారములో ఎవ్వరి మనస్సుకున్ను తట్టనేతట్టవు. ఇంత పరిచితమైనదయినా దానిలక్షణము విశ్శేషముగా నిరూపించుట ఆకాశముమీది చుక్కలు లెక్కపెట్టుట వంటిది" అని తెలియజేసి దీని లక్షణము నిశ్శేషముగా నిరూపించడం కష్టమైనా సొంతభాష గనుకచిన్నప్పటినుండిన్నీ మాతృభాషగా అలవర్చుకొన్నది గనుక నిర్దుష్టముగా ప్రయోగించగలము. ఇతరులు మాటలాడేది అర్థము చేసుకోగలము గాని గ్రాంధికభాష అనేది ఇప్పుడు వాడుకలో లేనిది: గ్రంధాలు, వ్యాకరణాలు చదువుకొంటేనేకాని బోధపడనిది; బోధపడినా అందులో నిర్దుష్టంగా రచించడానికి అసాధ్యమయినది అనే విషయం తెలియజేస్తూ ఏమన్నారంటే—

"నేటి నాగరకభాష అంతా లక్షణములో ఇముడ్చుట దుష్కరముగా నున్నప్పుడు పూర్వకాలపు నాగరకభాషా లక్షణము సంపూర్ణముగా తెలుసుకొని ఆభాష స్వాధీనము చేసుకొన్నట్టుగా ఆంధ్రపండితులు నటిస్తే ఎట్లు నమ్మగలము? మనకాలములో ఉన్నట్టు ఆ కాలములో వార్తాపత్రికలు లేవు. వ్యవహారమంతా ఇంచుమించుగా వ్రాత అక్కరలేకుండా మూజబానీగా జరిగేది. నన్నయ మొదలుకొని తిక్కనదాకా తెలుగుభాషా స్వరూపముతెలిపే సాధనములు ఏమున్నవి. నన్నయవ్రాసినగ్రంధ మొక్కటేగదా? ఆకాలపు శాసనములయినా అట్టేలేవు ఉన్నవయినా పండితులదృష్టికి ప్రమాణములుకావు. తెలుగుదేశమందున్న తెలుగువారి అందరిభాష నన్నయభాషలో అంతర్భూతము అయి ఉండదు. నన్నయ వాడుకొన్న తెలుగు భాష అంతా అతడు వ్రాసిన కొంచెము గ్రంధములోను చేరివుండదు గదా? అందులోని కధచెప్పుటకు ఏశబ్దములు కావలెనో అవే అతడు వాడినాడు అతడు తన గ్రంధములో వాడని శబ్దములున్ను, వాడని ప్రత్యయాదులున్ను వేనవేలు గ్రంధస్థముకాక నశించినవి కావా? నన్నయ వ్రాసిన మూడుపర్వములలో నున్న భాషఅంతా కంఠపాఠముచేసినా నేటి వ్యవహారమునకు కావలసిన వ్రాతలు నన్నయభాషలో వ్రాయలేము ఇట్లే తక్కిన గ్రంధాలలోని భాష... గ్రంధములలో చేరక నశించిన శబ్దములు అనేకములు తెలియరానందున లక్షణము అసమగ్రముకాక తప్పదు. తెలుగుభాషాలక్షణంఅత్యల్పం. ఆ కాస్తలోను వైవిధ్యంవైరుధ్యంకూడా ఉన్నది కనుక తెలుగులో తప్పొప్పులను లక్షణమును బట్టి తెలుసుకోలేము. గ్రంధములే ఆధారము. అయితే గ్రంధములలో సమగ్రముగా

భాషలేదుగదా! గ్రంథస్థమైన భాష మారుతూవచ్చింది. ఒక్కొక్క కాలములో ఒక్కొక్క విధముగా ఉన్నది దీనికి తోడు గ్రంధాలలోని పాఠాలు ఎవరి యిష్టము వచ్చినట్లు వారు దిద్దుతూ ఉన్నారు లక్షణముపుట్టినప్పటినుండిన్ని పండితులే ఈ పాడుపని చేస్తున్నారు" అని ప్రాచీనాంధ్ర భాషాలక్షణము తెలిసి కోడంలో వున్న అసాధ్యత తెలియజేసి, పోనీ మనఆంధ్ర పండితులలో ఎవరికైనా ఈ భాషాలక్షణము పట్టుబడిందేమో చూతామని వేదము వేంకట రాయశాస్త్రిగారు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు, వావిలకొలనుసుబ్బారావుగారు తిరుపతి కవులు చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు, వీరేశలింగం పంతులు గారు, కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు మొదలైన పెద్దపండితులు కవులు రచించిన గ్రంథాలు శ్రద్ధతో చదివిచూచినా ఎవ్వరికినీ పట్టుబడ లేదు. ఎవరున్ను ప్రాచీనాంధ్ర భాషలో నిర్దుష్టంగా రచన సాగించలేదు అనేవిషయాన్ని ఎత్తుకుని ఏమన్నారంటే :—

"ప్రాచీన కావ్యభాష పట్టుబడవలెనంటే సంస్కృతభాష బాగా రావాలి. తెలుగు ప్రబంధాలు కావ్యాలు అన్నీ చదివి అందులోని భాషారూపాలు గ్రహించాలి. అర్ధానుస్వార శకటరేఫ నిర్ణయాలు గుర్తించాలి. ఇంత చేసినా ఆకావ్యభాష కొంతవరకు అర్ధంచేసుకోవడం సాధ్యమైతే కావచ్చునేమో కాని, అది నిర్దుష్టంగా వాడడం ఇదివరకెవ్వరికీ సాధ్యంకాలేదని సాధ్యంకావడం అసంభవమనీనేను బాహాటంగా చెప్పగలను. మహామహోపాధ్యాయులు కొక్కొండ వెంకటరత్నంపంతులు గారికీ రా. బ. కం. వీరేశలింగంపంతులు గారికీ గ్రాంధికాంధ్రభాష రాదనీ, సంస్కృతభాష రాదనీ వారి గ్రంధాలలోని తప్పులు చూపించారు కళాప్రపూర్ణ వేంకటరాయశాస్త్రిగారు. వారితప్పులు ఒప్పులుగాను ఒప్పులు తప్పులుగాను చెప్పారని చూపించి ప్రాచీన గ్రాంధిక భాష వారికి బాగుగా పట్టుపడలేదని నేను రుజువుచేశాను

"నేను రచించిన మిథ్యాపవాదము ఆంధ్ర పండిత భిషక్కుల భాషాభేషజము చదివితే మీకీ విషయం స్పష్టమవుతుంది. నాకుపూర్తిగా పట్టుపడిందని నేను చెప్పుకోవడంలేదు. ప్రాచీన కావ్యభాష ఎవరికీ చక్కగా రాదనే చెప్తున్నాను. అది పట్టుపడడం అసాధ్యమని ఎందుకంటున్నానంటే— అది పూర్తిగా తెలుసుకోడానికి తగిన సాధనాలు తక్కువ...

"వ్యాకరణములు సంపూర్ణములు కావు; నిర్దుష్టములున్నూ కావు. మనకున్న కోశములున్ను అట్టివే వ్యాకరణములో అనుశాసించిన మట్టుకైనా సాధువైన గ్రాంధిక భాష పెద్దపేరుగల పండితులకే అలవడలేదు"

ఈ విధముగా చాలాసార్లు చెప్పి పండితుల గ్రంధాలలోని తప్పులు చూపించారు. గ్రాంధి కాంధ్రమనేది వాస్తవముగా కృతకభాషఅని నిరూపించి ఈ కృతక గ్రాంధిక భాషా వ్యామోహమువల్ల వాస్తవమయిన దేశభాష నింద్యమని ఉపేక్షించి తెలుగు వారు తమ దేశాభివృద్ధికి గొప్ప ఆటంకం

కలుగజేసుకొన్నారన్నారు. వారి ప్రబో ధమును తెలియచేసే వాక్యాలతో వ్యాసం ముగిస్తాను.

"గ్రాంథికభాష తెలిసినవారు వేయి మందిలో ఒకడయినా ఉండడు గనుక పండితులేమంటే అదే సత్యమని లోకులు నమ్ముతారు. "కానని వాని నూఁతగొని కానని వాఁడు విశిష్ట వస్తువుల్ గానని భంగి" గుడ్డి పండితులను నమ్ముకొని తెలుగువారు మోసపోతు న్నారు....ఏమికర్మము ! ఏమిపాపము ! ....అయ్యో ! దేశభాషా ! నిన్ను తృణీకరించుట చేతనేకదా నూటికి పదిమందైనా తెలుగక్షరాలు వచ్చినవాళ్ళు దేశములో లేకపోవడం, చదువునేర్చిన వాళ్ళయినా తెలుగు పుస్తకాలు ముట్టుకోకపోవడము....ఇకనైనా తెలుగువారు కండ్లువిప్పి చూతురా ?" అన్నారు.

అయితే, ఇది 20 సంవత్సరాల క్రిందట చెప్పినమాట. ఇప్పుడు తెలుగువారు కండ్లు తెరచారనే చెప్పాలి. గాని విశ్వకళాపరిషత్తువారి కళ్ళు ప్రభుత్వ విద్యాశాఖవారి కళ్ళు ఇంకా బాగుగా తెరువలేదు. ఆ పని మీ వల్లను కావాలి అని మరీ మరీ చెప్తున్నాను.

★

కనపడలేదా మరో ప్రపంచపు
కణ కణ మండే త్రేతాగ్ని
ఎగిరి ఎగిరి ఎగిరి పడుతున్నవి
ఎన్నశైలక్షల మేరువులు....
తిరిగి తిరిగి తిరిగి సముద్రాల్
జలప్రళయ నాట్యం చేస్తున్నవి....

—శ్రీ శ్రీ

నీలి గంధాలు

శ్రీ తెన్నేటి సూరి

భ్రమలు కమాన్లు కదులుతున్నయ్

మధువసంత యామినీ
మంగళ నిశ్శబ్దగీతి
పిలచినది!
హృదయమునే
కలచినదీ!.. ॥మధు॥
ముదిత మౌన శార్వరీ
మోహాసిగాప స్రవంతి
మొరసినదీ!
తెలివెన్నెల
విరిసినదీ!.... ॥మధు॥

"ఈ రాగం పేరేమిటి బావా?"

"పటదీప్"

"అరె! ఎంతందంగా వుందీ!"

"అందం రాగానిదికాదు"

"ఆఁ?"

"శ్రుతి"

"ఏమోనబ్బా! నువ్వేదో అంటావు గాని.... మన రాగాల్లో ఏదీ ఇంత అందముగా వుండదు. శ్రుతేమిటి?.... హిందుస్థానీ రాగాలకు ఆ చక్కదనమంపుంది."

"భ్రమ. మన రాగాలకున్న జీవకళ వీటికెక్కడేడిసింది. శాస్త్ర శ్రుతి సుఖం చూసుకు పాడితే, సౌందర్యంలో మన రాగాలముందు ఇవి నిల్చోలేవు.... నువ్వెంతో అదృష్టవంతురాలివి"

"అదృష్టమేమిటి?"

"కర్ణాటకం కట్టుగా చెప్పుకున్నావు. కావలసినంత గ్రంథం సంపాయించుకున్నావు. మా నాన్నగారి దగ్గిరుంటే, నేనూ కర్ణాటకం బాగా చెప్పుకునేవాణ్ణి. ఈ ఇంగ్లీషు చదువు మూలంగా నాకా అవకాశం లేకుండా పోయింది"

"ఏమోనబ్బా! నువ్వు హిందుస్థానీ బాణీగా పాడుతుంటేనే నాకు ప్రాణం హాయిగా ఉంటుంది.... అలా పాడ్డం నాచాతౌతేనా!.. ఏదో తమాషాకి అంటున్నావుగాని ఇంత శ్రుతి సుఖం చూసుకు పాడితే మట్టుకు, మన రాగాలిలా నుంటాయా?"

"నీకు తెలియదులే"

"ఏదీ! అయినా, మనరాగం ఒకటి తీసి, అలా పాడి చూపించుదూ. చూద్దాం"

"నీకు నీలాంబరి వచ్చా?"

"'శృంగారలహరి' వచ్చుగా!"

"ఏదీ పాడు"

"శృం, ఉం, ఉం, గఅ, అఅఅ, రఅఅ, లాహారే," అంటూ మెట్లు మెట్లుగా పాడుతుంది.

"అలాగాదు నే నంటాను చూడు"

"ఏదీ అను"

"శృం...."

"అరె! అదేమిటి! అలా పడగ విప్పుకు నిల్చుంటోందేమిటి ఆ రాగం?"

"అదే మరి."

"చాలా బావుంది బావా! నాకొచ్చిన కీర్తనలన్నీ ఇలా మార్చి చెప్పుకుంటే?"

"చక్కగా వుంటయ్ .... కష్టపడి సంగీతం చెప్పుకొన్నందుకు జీవితంలో సుఖం, సంతోషం లభిస్తాయి."

"ఇక్కడ నీ దగ్గిరుండి చెప్పు కొంటాను బావా! నన్నిక్కడ ఉంచి పొమ్మని మా నాన్ననడుగు. నే నుంటా నంటే ఉణ్ణీరు .... పోనీ అత్తయ్యచేత చెప్పించు."

"చిన్నదానివి మీ అమ్మను వదలి పెట్టి ఇప్పుడప్పుడే వుండలేవు ... నేను మీ వూరొస్తాగా!

"ఎప్పుడూ!"

"కాలేజీ తెరవంగానే.... ఇంటర్‌లో జేరాలిగా"

"అరె! బలే! ఇంకేం! ఈ కీర్తన లన్నీ చక్కగా మరాటీ బాణీలోకి మార్చేసి నీ చేత చెప్పించేసుకోవచ్చు."

"మరి నాకూ నువ్వు చెప్పాలిసొస్తుంది"

"నేనేం చెప్పాలీ?"

"నీ కొచ్చిన కృతులన్నీ"

"అలాగే చెబుతాను ఓప్! దీనికేనా మనిద్దరం కలిసి హాయిగా పాడుకుందాం"

"నాకు వీణ చెప్పుకోవలని ఆశగా వుంది. అక్కడ మీ వూళ్ళో మంచి విద్వాంసులున్నారటగా. మా నాన్న గారన్నారు?

"నేను చెప్పుకుంటున్నాగా"

"అదృష్టం"

"అదృష్ట మేమిటి? .... నువ్వూ చెప్పుకుందువుగాని."

"మ్చ! ఈజన్మలో నాకాఆశ తీరదు."

"ఏం?"

"వీణ సాధకం చెయ్యాలంటే, బాగా విశ్రాంతి వుండాలి. నాకు తైమేదీ?"

"ఏం?"

"ఈ చదువో?"

"మానెయ్యరాదూ?"

"నేను చదువు మానటం .... మా సుబ్బలక్ష్మికి ఇష్టంలేదు."

"సుబ్బలక్ష్మంటే నీకు పాలిచ్చి నమ్మాయా?"

"ఆఁ"

"సుబ్బలక్ష్మికి ఇష్టం లేకపోతే మాత్రం నువ్వెందుకు మానగూడదూ?"

"లక్ష్మికి కోపం వస్తుంది."

"వస్తే!"

"నాకు బాగుండదు"

"మరే! బావోయ్! మీ సుబ్బలక్ష్మి నన్ను ఇందాక కోమటింటికి తీసుకెళ్ళి పిప్పరుమెంటు బిళ్ళలు కొనిపెట్టింది బావా.... నన్ను ఎత్తుకునీ, బుగ్గలు ముద్దు పెట్టుకుంది"

"చిన్నప్పుడు నన్నూ అలానే ముద్దు బెట్టుకునేది"

"ఇంకా బలేబలే తమాషా మాటలు చెప్పింది బావా! నీకు బూరెలు వండటము చాతౌనా అంది చేతగాదన్నాను. నేర్చుకోమంది."

"నాకు బూరెలంటే ఇష్టం."

"నువ్వు చాలా మంచివాడవన్నాను. కోప మొచ్చినప్పుడు చూడమంది—చక్కగా పాడతావన్నాను. బాగాపాటలు వ్రాస్తావంది. మంచి పాటగాడి వౌతా వన్నాను. కాదు, బాగా చదువుకుని పెద్ద కవి అవుతావన్నది. అల్లావీల్లేదు:

సంగీతమే పాడతాడని దెబ్బలాడాను. కోపంగా నా వంక చూసి, నీకు తెలియదులే, చిన్నపిల్లవ్ అంది. మీ లక్ష్మి బలే, తమాషా మనిషి బావా!"

"వట్టినే కబుర్లు చెబుతున్నావ్.... మళ్ళీ బండికి వెడుతావ్... ఇంకో కీర్తన పాడూ"

"అమ్మదొంగా! నా చేత తెగ పాడిస్తున్నావ్... . నేను పాణ్ణు. నువ్వు పాడాలసిందే"

"ఏం పాడమన్నావ్"

"'నీలిగంటలే విచ్చినవి' అన్న పాట నాకింకా బాగా రాలేదు. అదిమళ్ళా ఓసారి చెప్పు. ఆపాట నాకెంతో ముచ్చటగా వుంది."

"నిజంగానా?"

"నిజం, నిజం. ... ఒట్టు....నీ మీద ఒట్టు."

"అలాగైతే యీ తడవ యింకా బాగా వ్రాస్తాను."

"ఆ పాట ఇంకోసారి చెప్పుబావా!"

ఇద్దరూ కమాన్లు తీసుకున్నారు——

జంత్రి గాత్రాలు సెలయేళ్ళలా ప్రవహించు తున్నయ్——

* నీలిగంటలే విచ్చినవీ!
నిశ్శబ్దములే మ్రోగినవి——
కుణుకుణు, కుణుకుణు
మణినాదములై .... ॥నీలి॥
కన్నె హృదయమే విచ్చినదీ!
బంగరు గాజులె పలికినవీ—— ॥నీలి॥
ఆకుల మాటున విచ్చినవీ
అరవిందములే మ్రోగినవీ—— ॥నీలి॥

ఘల్ ఘల్, ఘల్ ఘల్
తలుపుచాటుగా,
కలరావముగా,
బంగరుగాజులె పలికినవీ
ప్రణయగీతమే మొరసినదీ—— ॥నీలి॥

వదినే మరదళ్ళిద్దరూ అదే అదే వచ్చీను ఆపేసి ఒకళ్ళ ముఖంలోకి ఒకళ్ళు చూసుకుని ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారు. పాటవింటూ కూర్చున్నారు.

పాటవిని, కచేరీ సావిట్లోనుంచి బావమరదు లిద్దరూ నడవాలోకివచ్చారు. ఒకరి భుజాన ఒకరిచెయ్యివేసి ఒకర్నొకరు అనుకు సుంచున్నారు

సుబ్బలక్ష్మి నెమ్మదిగావచ్చి గది మొత్తకు ఆనుకు నుంచుని పాట వింటోంది.

"నీలిగంటలే విచ్చినవీ
నిశ్శబ్దములే మ్రోగినవీ"

హృదయాలు రెండూ విచ్చిలుకుని, ప్రపంచాన్ని మరిచేసి గొంతులెత్తి బిగ్గరిగా పాడుతున్నారు

"పిల్లలికి పెళ్ళీడువచ్చింది" అన్నది వదినె

"అపును ఆ నాలుగు అక్షింతలూ వేసేస్తే అచ్చటా ముచ్చటా చూసుకోవచ్చు" అంది మరదలు.

"కన్నె హృదయమే పిలిచినదీ...." అంటూ మూర్చిన స్థానాన్ని అందుకున్నాడు - ఓరకంట ఆ కన్నెపడుచు ముఖంలోకి చిరునవ్వుగా తొంగిచూస్తూ.

సిగ్గుమొగ్గయి, కమానక్కడ పారేసి

* 'నీలిగంటలు'——ఒక పూదీగ.

జడకుప్పెలు చేత్తో పట్టుకుని, తుర్రున గదిలోకి పారిపోయి తలుపుచాటున దాక్కుంది.

"పసిపిల్లల ముందు పెళ్ళి సంగతు లెందుకెత్తుతారమ్మా? ఇప్పణ్ణుంచీ గుండెలు చీరుకోటానికి?" అంటూ, లక్ష్మి దొడ్లోకి నడుస్తోంది.

* * *

ఈ దృశ్యమంతా అతని మెదట్లో గిర్రున మళ్ళా ఫిలుంలా తిరిగిపోయింది. దొక్కలో గడ్డపలుగుదిగేసినట్టు నొప్పి పుట్టుకొచ్చింది. బాధగా మూలిగాడు. ఒత్తిగిలి కళ్ళు అరమూతలు వేసుకుని పడుకున్నాడు.

కప్పు, సాసరూ తీసుకుని తల్లి గదిలోకి వచ్చింది. అక్కడ బల్లమీద వాటినివుంచి వచ్చి పక్కలోకూర్చుంది. కొడుకు వంటిని తాకిచూసింది.

"ఈ పూట జ్వరం మరీ హెచ్చుగా తగిల్నట్టుంది"

అతను మాట్లాడలేదు.

"కాస్త వేడివేడి కాఫీ పుచ్చుకో నాయనా! కొంచెం త్రాణగావుంటుంది"

"త్రాగాలని లేదమ్మా!—"

"కొంచెం."

"అబ్బా!" అంటూ చరాల్ప విసుక్కున్నాడు

అవును. ఆ ఇంట్లో తన్ను అంతా విసుక్కుంటున్నారు. ఆ యింట్లో ఇక తనమాట లెక్కజేసేవా రెవరూ లేరు. ఇంతవరకూ తనా యింటికి యజమాని ననుకుంది. అందరూ తన మాటంటే ఎంతో గౌరవించేవారు. ఇప్పుడు తను అంటే ఒక గడ్డిపోచకంటే కనీసంగా చూస్తున్నారు. "పిల్లది సంగతేమీ బాగా లే"దనిఆదుర్దాగా భర్తతో చెప్పుకోబోతే 'చూసుకుంటున్నాంగా' అంటూ ఆపిల్లది బాధ్యత తనకేమీ లేదన్నట్టు మాట్లాడు తున్నాడు భర్త.

"ఆ పాడు సంబంధం మాట పిల్లది ముందుపేలవద్దని లక్షసార్లు చెప్పాను" అంటూఅత్తగారు ఆపిల్లది దుస్థితికంతకు బాధ్యురాలు తనే అయినట్టు తన నెత్తికి ఆముళ్ళకిరీటం తొడుగుతోంది. "గంపె డాశలు మూటగట్టుకుని బిడ్డకు పాలిచ్చి పెంచుకున్నాను; చివరకు ఈ యమ్మ చుట్టరికానికి బలిపెట్టాను" అన్నట్లు బిడ్డ వంక దిగులుగా చూసి నిట్టూరుస్తోంది లక్ష్మి.

అసలా పిల్లణ్ణి పలకరించటానికే వీల్లేదు. "నీవే నాడొక్క యిలా చీరింది" అన్నట్టు తనవంక బాధగా చూస్తాడు. తన అసమర్థతనంతా, తన లేకి తనాన్నంతా భరించుతున్న సహన మూర్తిలా "అక్కర్లేదులే" అంటూ తను ఏ చిన్నసహాయం చేయబోయినా నిర్లక్ష్యం చేస్తాడు "ఇంత భరించు తున్న నాకీ యీ కాస్తసహాయం నువ్వు చెయ్యకపోతే నేను చావనులే." అన్నట్టు కోపంగా చిరునవ్వు నవ్వు తాడు.

"పిల్లదిసంగతి ఎలావుంది?" అని డాక్టరును ఆదుర్దాగా అడిగితే మందు మాకుల వల్ల ప్రయోజనమున్నట్టు తోచదు అతను ఏదో మనస్సులో చాలా బాధపడుతున్నాడు. మనశ్శాంతి చేకూర్చుకుని తనకి తనే ఎల్లాగో అలా పైకి లేవాలి" అంటున్నాడు.

ఆ అఘాతంలో అతణ్ణి తనే త్రోసింది. అతనంతటి కతను లేవటం ఆ పసివాడివల్ల నేమౌతుంది? తను చెయ్యూసరా యిచ్చి పైకి తెచ్చుకోగలిగితే?— సరే! తన కాయోగ్యతేవుంటే తనకీ దుర్గతంతా ఎందుకూ? పురుగును చూసినట్టు లోకం తన్నలా ఎందుకు చూస్తుంది?

ముంచుకొస్తున్న ఏడుపు ఆపుకోటానికి పైటచెంగు ముద్దగాచుట్టి నోట్లో కుక్కుకుంది. ఆ బంగారుముఖం కళవళంగా కదిలి చెలించిపోతూ వుంది.

"అబ్బా! ఎందుకమ్మాయేడుస్తావూ?"

"నన్నేం చెయ్యమన్నావూ?"— వెక్కి వెక్కి యేడుస్తుంది.

"నిన్నేం చెయ్యమన్నా నమ్మా యిప్పుడూ?"

"వాళ్లు నామాటవినరు—"

"ఎవళ్లూ?"

"నావాళ్లు."

"వాళ్లు వినకపోతే నీకేం తక్కువా? మేమంతా వింటున్నాంగా, వాళ్ళసంగతి ఎందుకు?"

"మీరు మాత్రం యెవరు వింటున్నారూ?"

"అదేమిటమ్మా! ఎందుకలా అనుకుంటావూ?" అంటూ, నెమ్మదిగా పక్కలో లేచి కూర్చున్నాడు. తల్లి వీపు మీద ఆప్యాయంగా అనుకున్నాడు. "అనవసరంగా బాధపడుతున్నావు నీ మాట వినందెవరు? నాన్న వినరా?— నీబిడ్డలు వినరా?—ఎందుకలా అనుకుంటావు?"

"ఎందుకు వింటారూ? కన్నబిడ్డలకే దూరమై పోతున్నాను. నీకిన్ని పాలచుక్కలన్నా ఇచ్చి పెంచుకోలేక పోయాను. పోనీ పేగును పేగుబెట్టి ముడేసుకుందామనుకున్నాను. ఇదంతా ఇలాఅయింది"

"నువ్వు అనవసరంగా విచారపడుతున్నావు నేను నీమాట వినక పోవటమేమిటి? నీ పాదాలదగ్గిరనుంచి నేనెప్పుడూ అవతలికి పోను. నాకు పాలిచ్చి పెంచుకోలేకపోయావని నీకు లోపల గంపెడు బాధవుందని నాకు తెలుసు. అందుకనే నీ బాంధవ్యంతో నాచుట్టూ పెనవేసుకుపోవాలని ఆదుర్దా పడుతున్నావనీ నాకు తెలుసు. యిది అర్థం చేసుకునే, తూగి అడుగు ముందుకువేసి ఈ ఊబిలో దిగబడి పోయాను. కాని.... తల్లిమాటను నిర్లక్ష్యం చేసే నీచుడెవడూ ఈ వంశంలో ఇంకా పుట్టలేదు. అందులో ప్రథముణ్ణి కావటం నా కిష్టంలేదు జీవితంలో మరో ఇతర లక్ష్యమేమీ లేకుండా నీ ఆజ్ఞలను పరిపాలించుతూ వుంటానికే నేను భీష్మదేవుణ్ని అనుకరించబోతున్నాను"

"అమ్మయ్యో! ఇదీ నా మూలంగా నేనా?" అంటూ కెవ్వునయేడ్చి పక్కమీద పడిపోయింది

అతను హడలిపోయాడు. లక్ష్మీ అంటూ తల పగిలిపోయేట్టు బిగ్గరగా అరిచాడు అంతా గదిలోకి వచ్చేశారు, "ఏమిటేమి" టంటూ

"అమ్మ విరుచుకు పడిపోయింది"

"అవతలికి తీసుకుపోయి ఇన్నినీళ్ళు మొహానకొట్టి తగులెయ్యండి. పిల్లాణ్ణి కూడ బ్రతకనిచ్చేలా లేదు. ఈకులనాప..

అంటూ కోపంగా విసుక్కున్నాడు తండ్రి.

* * *

రాత్రి 8½ గంటలయింది. అంతా లోపల భోజనాలు చేస్తున్నారు సుబ్బలక్ష్మి అతని పక్కలో కూర్చుని కాళ్ళు పిసుకుతోంది. అతను మాగన్నుగా నిద్రపోతున్నాడు.

"లక్ష్మీ" అంటూ తమ్ముడు గదిలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు

"అరవబోకు అన్నయ్యకు కొంచెం నిద్దరబడుతున్నట్టుగా వుంది"

"లక్ష్మీ ! శాస్త్రులు చెప్పవ్ ?"

"చెబుతాగా ! అరవకుండా కుర్చీలో కూర్చుని నెమ్మది. 'ఊ' కొట్టు"

"అనగనగా ఒకవూరు. ఆ వూళ్ళో ఒక పేరాశ పెద్దమ్మ. ఆ వూరికి ఒక కరణం. కరణంగారింట్లో పేరాశ పెద్దమ్మ పనిజేస్తూ వుండేది. వాళ్లు బొక్కెడు మెతుకులెగిరితే తిని బ్రతుకుతో వుండేది. ఆ కరణంగారికి లేక లేక ఒక కొడుకు పుట్టాడు. లేక లేక పుట్టాడేమో అంతా అల్లారు ముద్దుగా చూసేవాళ్ళు. కాని ఓ పని జరిగింది. ఆ పిల్లణ్ణి కడుపుతో వున్నప్పుడు తల్లికి జబ్బుచేసింది. అంచేత పిల్లాడు పుట్టాక తల్లి దగ్గర పాల్లేకండా పోయాయి. అప్పుడు ఆ పిల్లణ్ణి పేరాశ పెద్దమ్మకు అప్ప చెప్పారు. ఆ పిచ్చిముండ పిల్లడికి పాలిస్తూ వుండేది. ఆ పిల్లడంటే ఎంతో ప్రాణంగా వుండేది."

"బలే మంచి తల్లన్నమాట !"

"ఆ పిచ్చిముండా...."

"అంత మంచి తల్లిని పిచ్చిముండ అంటావేం ?....'ఆ తల్లి' అను"

"సరే ఆ తల్లి....ఆ పిల్లణ్ణి ఒళ్ళో పడుకోబెట్టుకొని పాలిస్తూ ఇలా అనుకునేది.

"ఏమనుకునేది?"

"ఆబిడ్డ తన పాలు త్రాగి చాలా పెద్దవాడు గావాలనుకునేది."

"నాన్నంత వాడు గావాలనుకునేదా?"

"అంతకంటె ఇంకా పెద్దవాడు గావాలనుకునేది, పెద్దవాడై బాగా చదువుకుంటాడనుకునేది. బాగా చదువుకుని ఒక పెద్ద కవి గావాలనుకునేది."

"కవంటే ?"

"గొప్పగొప్ప పాటలూ, పద్యాలూ వ్రాయాలనుకునేది."

"అంటే, సుమతీ శతకం వ్రాయాలనుకుందన్నమాట."

"అంతకంటె మంచి మంచి పుస్తకాలు వ్రాయాలనుకుంది.

"అతనట్టా పెద్దపెద్ద పుస్తకాలు వ్రాసే కవి గావాలని, యెందుకో ఆ తల్లికా ఆశ ?"

"అడ్డుప్రశ్నలు వెయ్యకుండా వుంటే అన్నీ నేనే చెబుతాను. ఎందుకంటే— ఆ దేశాన్ని పరాయి రాజొకడు ఆక్రమించి పాలించుతున్నాడు. ఆ రాజు మహా చెడ్డవాడు. పట్టి అబద్ధాలకోరు. తంపుల మారి. తంపులుపెట్టి ఆదేశంలో వున్న ప్రజల్లో అన్నీ తగూలు లేవదీశాడు"

"ఎందుకూ అలా చెయ్యటం ?"

"ఎందుకా ? .... వాళ్ళంతా కలిసి తన్ను తరిమెయ్యరూ మరీ ?"

"ఓరి ముండా కొడుకా! అదా ఎత్తూ?"

"హిందువులనీ, తురకలనీ, డబ్బున్న వాళ్ళనీ, డబ్బులేని వాళ్ళనీ, కులాలనీ, మతాలనీ — ఇలా చీలిపి తగూలెన్నో లేవదీసి ఒకళ్ళపీక లొకళ్లు కోసేసుకునే దాకా తెచ్చాడు తనుశరించి హాయిగా చలనం లేకుండా, సింహాసనం మీద కూర్చున్నాడు; వీళ్ళల్లో వీళ్లు కొట్టుకు చస్తుంటే దేశంలో వున్న డబ్బూ, ధాన్యం అంతా తనదేశానికి జారేస్తున్నాడు. ఇక ఆదేశంలో తినతిండీ, కట్ట గుడ్డా లేక జనం దరిద్రంతో అల్లాడి చస్తున్నారు.

"ఆరాజుని కుర్చీకింద దూరి ఎత్తి పడేస్తే."

"ఎత్తి పడెయ్యటానికి వాడేమన్నా కాస్తా కూస్తా మనిషి అనుకున్నావా యేమిటి? — పైగా వాడిచుట్టూ కత్తులూ తుపాకులూ ఇచ్చి ఎంతమంది పోలీసుల్ని కాపలా బెట్టుకున్నాడూ!"

"పదిమందీ గలిసి మీదబడిపోతే, పోలీసులుమాత్రం యేం జెయ్యగలరు లక్ష్మీ?"

"పదిమందీ కలిస్తేనా?"

"అరే!.... ఎందుక్కలవరూ?"

"కలవాలని వాళ్ళకు తెలియదు; అజ్ఞానం—"

"అసలు పిరికిముండా వాళ్ళేమో లక్ష్మీ! తుపాకులంటే వాళ్ళకి భయమేఁవో?"

"తెలియని అజ్ఞానులికి భయం మాత్రం వుండదూ?"

"నిజంగా వాళ్ళంతా పిరికిముండా కొడుకులే లక్ష్మీ! అల్లాంటి పిరికిపందలు మనదేశంలో పుట్టరని నా పుస్తకంలో ఉంది. బాలచంద్రుడి కధలో వుంది"

"హూ!—" అని నిట్టూర్చిందిలక్ష్మి.

"పోనీ— లక్ష్మి! అంతాకలిసి కట్టుగా వుండాలనీ, అంతా ఒక్కసారిగా ఆరాజుమీద పడిపోవాలనీ వాళ్ళకు చెబితే"

"చెబితే వాళ్ళువినరు"

"అరె! మరెలా?"

"ఒకమహాకవి ఎవడన్నా ఆజాతిలో పుట్టి ఆమాట చెపితే అప్పుడు వింటారు. అందాకా ఆజాతికి మోక్షం లేదు"

"అందుకేనా యేమిటి పేరాశ పెద్దమ్మ ఆపిల్లడికి పాలిస్తూ మహాకవి గావాలని ఆశపడ్డదన్నావూ?"

"ఆ!"

"చివరికి ఆపాపాయి మరి అంత వాడు అయాడా మరి?"

"మ్చ్" అని పెదవి విరిచింది.

"ఛీ! ఛీ! వెధవ! ఎందుకయ్యాడు గాదు! నేనైతేనా?"

పక్కలోవున్న రోగి "లక్ష్మి" అంటూ కళవళంగా పిలిచాడు. "దాహమేస్తోంది" అన్నాడు.

లక్ష్మి వినిపించుకోలేదు.

"అన్నయ్యకి దాహమేస్తోందిట లక్ష్మి!"

"తరవాత తెచ్చిస్తాలే ...ముందు కధవిను. ఆపిల్లడు దినదినం పెరిగి పెద్ద వాడౌతున్నాడు. చక్కగా చదువుకుంటున్నాడు. అంతా చాలా [illegible]. చక్కగా సంగీతం [illegible] వాడు. [illegible] దిగా పాటలూ, [illegible]లూ కూడా వ్రా[illegible]

Acc. No.

టము మొదలుపెట్టాడు - అనుకున్నట్టే. అవి చాలా బాగున్నాయని అంతా మెచ్చుకునేవాళ్ళు. పేరాశపెద్దమ్మ మరీ మురుసుకునేది.

"ఇంకేం....ఆ తల్లి అనుకున్నట్టే జరిగిందీ !"

"అదే జరగలేదు . అట్టా జరిగితే ఇంకేం ?....మధ్య ఒక అవాంతరం వచ్చిపడి అంతా - తలక్రిందైంది. కొంసకంటూ వినూ ?"

"అరె ! ఏం జరిగిందేమిటి ?"

"ఆ పిల్లడికి ఒక మేనమామ వున్నాడు. ఆ మేనమామకి ఒక కూతురుంది. ఆ పిల్ల కొంచెం అందంగా వుంటుంది ఆ పిల్లకూడా బాగా పాడుతుంది. ఆ పిల్లని, ఓసారి మేనత్తగారి యింటికి ఎందుకో తీసుకొచ్చారు.

"ఈ పిల్లడూనూ ఆపిల్లానూ ఇద్దరూ కమాన్లుతీసుకునిఫిడేళ్లువాయించుతూ ఒక పాట పాడుకుంటున్నారు చుట్టూవున్న ఉలిపినోళ్ళవాళ్ళు విని ఊరుకోవచ్చునా? ఈ పిల్లలిద్దరికీ పెళ్ళిచేస్తే బాగుంటుం టన్నారు. వెంటనే ఆ పిల్లకు, సిగ్గొచ్చి కమానక్కడపారేసి. గదిలోకిపారిపోయిదాక్కుంది. అప్పట్నుంచీ ఆ పిల్లనే పెళ్ళిచేసుకోవాలని ఈ పిల్లడి మనసులో పుట్టింది. ప్రపంచమంతా మరిచేసి ఆ పిల్లమీదీ పంచప్రాణాలూ పెట్టుకుని బ్రతకటం మొదలు బెట్టాడు అంతాకూడా ఈపిల్లలిద్దరికీ పెళ్ళౌతుందనే అనుకునే వాళ్ళు. కాని చివరికి అల్లా జరగలేదు."

"ఎందుకు జరగలేదు ?"

"ఆ పిల్ల తండ్రీ తల్లీ డబ్బు చూసుకున్నారుగాని చుట్టరికం చూళ్ళేదు. డబ్బుసంగతే ఆలోచించారు గాని, పిల్లలు బ్రతికి వున్నంతకాలం గుండెలు చీరుకు చస్తారని వాళ్ళు ఆలోచించలేదు. ఆ పిల్లకి బాగాడబ్బున్న ఇంకోసంబంధం వచ్చేటప్పటికి ఈ సంబంధం వొదులుకోవాలని ఆలోచించారు."

"అదేమిటి లక్ష్మి ! తప్పుగాదూ ?"

"ఏం ?"

"డబ్బుకోసం మొగుడూ పెళ్ళాన్ని అట్టా చీలదీయొచ్చా తప్పుగాదూ ?"

"పెళ్ళిగాందే మొగుడూ పెళ్ళాం ఎట్టా అవుతారూ ."

"అవుతారు లక్ష్మి, నీకు తెలవదు. నువ్వు చదువుకోలేదు గనక, నీకు తెలవదు. దమయంతీ. నలుడూ పెళ్ళిగాకుండానే మొగుడు పెళ్ళామూ అయ్యారు. సావిత్రీ, సత్యవంతుడూ కూడా అలానే అయ్యారు. నాపుస్తకంలో ఆ కథలు రెండూ వున్నయ్. కావలిస్తే తెచ్చి చూపిస్తాను—పందెం."

"వాళ్ళసంగతి వేరూ, మనసంగతి వేరు మనవాళ్ళకు డబ్బున్నవాడు గావాలిగా"

"నీకేమీ తెలవదు లక్ష్మి ! ఇట్టాగే సావిత్రి తల్లీ దండ్రీ, సావిత్రిని డబ్బువున్నవాడి కిచ్చిచేస్తామంటే ఎలా చెప్పుచ్చుకు కొట్టిందో తెలుసా "

"నన్ను కథ చెప్పనిస్తావా ? మానెయ్యమంటావా ? మధ్య మధ్య ఇలా అడ్డుప్రశ్నలు వేస్తే కథ సాగేదెలా ?"

"ఊఁ ఊఁ ! చెప్పు చెప్పు."

"ఇహాఁ .... ఆ పిల్ల దేంజేశాడో తెలుసా ?....పాటా పోయింది, పద్యం పోయింది; దేశమూలేదు, ప్రజలూలేదు ఆపిల్లకోసం మనాదిబడి మంచమెక్కాడు, అన్నం, నీళ్లూ మానేశాడు. జబ్బు పుట్టింది. ప్రాణంమీదికూడా తెచ్చుకుంటున్నాడు."

"అరె ! పాపం !"

"ఛీ ? పాప మేమిటి పుణ్యం. అదే మంత పంచి ఎనీ ? ఆ వ్రేలెడు పిల్లనీ తనకిచ్చి పెళ్ళి చెయ్యలేదని, ఎవరన్నా అట్టా, అనవసరంగా ప్రాణం తీసేసుకుంటారా ?—తెలివి తక్కువా మరే మన్నానా"

"తెలివి తక్కువవాడుకాదు లక్ష్మీ, అట్టాగే జరుగుతుంది. మజ్నూ అల్లానే చేశాడు—మజ్నూ తెలివి తక్కువ వాడంటావా ?"

"మజ్నూ యెవరూ ?"

"అరె ! నీకు 'లైలామజ్నూ' కధ రాదన్నమాట ?"

"ఆ కధ సంగతి అలావుంచు, పేరాశపెద్దమ్మ సంగతి కాస్త ఆలోచించు. అముండ ఎన్ని ఆశలు బెట్టుకు తన్ని పెంచుకుంది ? తను ఒక మహాకవై యీ బీదవాళ్ళందరికీ అండగా నిలబడతాడనుకుందే. యీ జాతిని ఉద్ధరిస్తాడనుకుందే. కూడూ గుడ్డా లేక అజ్ఞానంలో అలమటించి చస్తూ, ఒకళ్ళ పీక లొకళ్ళు కోసేసుకుంటున్న తన ప్రజల గతి ఇక అంతేనా ? వాళ్ళంతా అట్టా నశించిపోవాలిసిందేనా? వ్రేలెడు ఆడపిల్లకోసం తనదేశాన్ని, తనప్రజల్నీ గంగలో కలుపుకుని, తనూ పీక కోసుకుని నాశనమై పోతాడన్నమాట !"—

"నిజమే లక్ష్మీ ! తెలివితక్కువ వాడులానే వున్నాడు."

"తెలివితక్కువేకాదు! వట్టి పిరికి పంద "

"నిజమే లక్ష్మీ ! నువ్వన్నదినిజం. పిరికిపందే."

"దేశం అలావున్నపుడు చావట మేమిటి ?—అంత చావదలిస్తే దేశం బాగుపడ్డ తరువాత చావాలిగాని, ఈలోగా చావగూడదు ఛీ ! ఛీ ! వాడు వట్టి పిరికి పందే లక్ష్మీ ! నేనైతేనా ?"

పక్కలో రోగి బాధగా నిట్టూర్చాడు, "పిల్లణ్ని లోపలికి పంపించు లక్ష్మీ ! నేను నీతో మాట్లాడుకోవాలి...."

"అమ్మావాళ్ళూ భోంచేసి సావిట్లోకి వచ్చారు. నువ్వు ఇక వెళ్ళపడుకో నాన్నా !" అని తమ్ముణ్ని లక్ష్మి లోపలికి పంపించింది.

పక్కలో వున్న రోగి కొంచెం మోచేతిమీద లేచాడు.

"నేను బతికివుంటానికి ప్రయత్నించుతాను లక్ష్మీ నీ దేశంకోసం, నీ ప్రజలకోసం నేను బతికివుంటాను." దుఃఖం ముంచుకొచ్చి అకంఠం రుద్ధమై పోయింది.

చిక్కి శల్యమైపోయిన రోగిని హృదయంలోకి పొదువుకుని, కన్నీటితో అతని చెక్కిళ్లు తడిపింది లక్ష్మి.

"మరి పెళ్ళిచేసుకోమని మాత్రం పట్టుబట్టకు"

"నా తండ్రి వి, తెలివిగలవాడివి; అర్థం చేసుకోగలవ్; ఒక్క-ముక్క-లో చెప్పి నీచేత ఔననిపించుకోగలను."

"చెప్పు లక్ష్మీ!"

"పెళ్ళి మానటానికి వీల్లేదు"

"అసంభవం లక్ష్మీ! అదిమాత్రం నేను విననను"

"ఆపిల్లకు నువ్వు భర్త వౌతావని చెప్పేశారు"—

"అబ్బా! ఆ బిడ్డనుకూడా గొంతు కోశేశారూ?"—అంటూ బాధగా తల బట్టుకున్నాడు.

"కొయ్యటమో, బ్రతికించడమో అది నీచేతిలోవుంది ఇప్పుడు"

"అతడు కళ్ళుమూసుకుని మౌనమూర్తిగా ఆలోచనలోగడ్డగట్టిపోయాడు

ఒక్క-క్షణానికి నెమ్మదిగా కళ్ళువిప్పి "సరే! పెళ్ళి కొడుకుని చెయ్యి లక్ష్మీ! ఎల్లుండి లగ్నానికే తూగగలమని నాన్నచేత టెలిగ్రాం ఇప్పించు."

★

ముదిలోకం పోయిందని!
పదునైనది యువజీవం
ఎదురైనది సమభావం!!
ఇదిమాత్రం నిజమనవోయ్
మదిలోభం మాసిందని!
ప్రతిజాతికి స్వాతంత్ర్యం
పరపీడా రాహిత్యం!!
ఇదిమాత్రం ఇదిమాత్రం
ఇదిమాత్రం నిజమనవోయ్
వికసించే విధానమున
మకుటధారి మానవుడని!!

దేవులపల్లి కృష్ణశాస్త్రి

జాతీయ సాహిత్యం

శ్రీ 'సహజానందం'

గత పాతికేళ్ళ సంరంభం ఈనాడు సాహిత్యంలోకూడా ప్రతిధ్వనిస్తోంది.

దేశ మాయూలాగ్రము సంకెళ్ళమధ్య బిగిసి, కిందపడి వున్నప్పుడు, సాహిత్యానికి మటుకు స్వేచ్ఛ ఎక్కడిది ?

కటకటాల వెనుక, జైలుగోడల నీడల్లో, ఉరి స్తంభాలవద్ద, తుపాకుల అగ్నివర్షంలో ప్రజలు దగ్ధమై నేల కరుస్తున్నప్పుడు, సాహిత్యము కలల్లో, మబ్బుల్లో దాగుడుమూత లాడుకుంటూ పొద్దు పుచ్చలేదు

దేశంయొక్క నల్దిక్కులనుండి ఆవిర్భూతమై, ఘోష పెట్టుతున్న ఈ ఘోష - స్వాతంత్ర్యఘోష కారాగృహాల్లోనే కాదు, సాహిత్య వీధుల్లోనూ ప్రతిధ్వనించాలి పరాధీనమైన దేశం యొక్క విప్లవానికి విజయగీతాలు పాడాలి.

దాస్యశాపం సాహిత్యాన్నంటదా ?
కారాగృహ చ్ఛాయలు కవికుమారుల
చుట్టు ముసురుకొనవా ?
సాహిత్యానికి సంఘ పరిణామానికి
సంబంధం లేదా ?

అనేక ప్రశ్నలు నిలువునా లేచి, సాహిత్యం యొక్క అంతరాత్మను కల్లోల పరుస్తయ్,

సత్యం, శివం, సుందరం... సమాజ జీవితంలో ప్రతిబింబించ వద్దా ?

తోటివాని కంఠంచుట్టూ ఉరితాళ్ళు బిగించే మానవ జీవితంలో సత్యమేది ?

సమాజంయొక్క ప్రతిమెట్టు వద్ద మృత్యువు పాడె పరుస్తున్నప్పుడు శివమేది ?

మనుష్యుడు దైన్యానికి తోలు తొడుగైనప్పుడు, సౌందర్యమేది ?

—మాకు ఈదేశీయకోలాహలముతో పొత్తులేదు

దేశంలో జరుగు గల్లంతు ప్రకారం మేం యతి ప్రాసలు కూర్చుకోం.

ఈ సబ్‌జైళ్ళు, సెంట్రల్ జైళ్ళు; కాల్పులు, పేల్పులు; కాటకాలు, మరణాలు ... ఈ భౌతిక విషయాల్లో చిక్కుకోపోం ఉద్యానవనాలు, సౌధాలు, శృంగారం, ప్రణయం, భక్తి, ఏనుగు అంబారీలు, కృతిపతులు....వీటన్నిటినీ విడిచి, ఈ శిఖరాగ్రం నుంచిదిగి మేం క్షుద్రమైన నేలమీదికిరాలేము" అని అంటే కొంతమంది అనవచ్చు. పైకనక పోయినా లోపల భావించవచ్చు.

కాని ఇలాంటిధోరణి ఇకచెల్లుబడి అవుతుందా ? కవిచేతిలో కలమే ఎదురు తిరిగే ఘడియ వచ్చింది !

ఇదంతా ప్రచార సాహిత్యం, నీచం అనిఆక్రోశిస్తారు; విలపిస్తారుకొంతమంది.

"కాని ఇదే జీవంతో ఉన్న సాహిత్యము. దీంట్లో రక్త, మాంసాలు

ఉన్నయ్. దీనికి హృదయస్పందం ఉంది"అని సంఘం గుర్తిస్తోంది.

ఇక పూర్వ ధోరణిలో సాహిత్య రచన సాగదు. ఏ దో మూరుమూల మరుగుపడి, కృతులతో, కృతిపతులతో పొద్దుపుచ్చే రోజులు పోయినయ్. సంఘ సౌధంలో సాహిత్యానిదే సింహద్వారం.

సంఘ పరిణామములో సాహిత్యం తన భారం తాను నిర్వహించాలి. బెంగాలు, మహారాష్ట్రం, ఇతర ప్రాంతాలలో ప్రజలు విరోధితో హోరాహోరి పెనుగులాడుతున్నప్పుడు, అష్టావధానాలతో, శతావధానాలతో కొంత కాలయాపన జరిగింది. కోడిపెట్టమీద, కుక్కపిల్లమీద, గీతాలు, ఆటవెలదులు, సమస్యలు ఆశువుగా చెప్పిన కవిరాజుల కావ్య జగత్తులో బాలగంగాధర తిలక్‌కు చిన్న ద్విపదకైనా చోటులేదు!

కృతిపతుల తాత ముత్తాతలను సీస పద్యాల్లో స్తవంచేసిన కవి సింహాల కావ్య జగత్తులో జతీంద్రనాధ్ దాస్‌కు ఒక 'శార్దూలా'నికైనా చోటులేదు !!

ఈ బెంగాలు యువకుడు నిరాహార దీక్షపూని కారాగృహంలోనే కట్టె అయిపోయాడు!

దేశం క్రోధంతో, దుఃఖంతో దహించుకు పోయింది

కాని ఈ దుర్మరణానికి, ఈ ఆత్మత్యాగానికి కవి హృదయం స్పందించలేదు.

భీష్ముని అంపశయ్యా గాథను మరిపిస్తుంది ఈ గాథ!

ఆర్యభూమి, పుణ్యభూమి, వేదాలు. పురాణాలు, దేవతలు అని మాత్ర్యస్తవం చేసే కవికి ఈ 'భూలోకస్వర్గం' తెల్లవాడి బందిలి దొడ్డి అయిందనే స్పృహ లేదు,

గంగ, యమున, కాశీ, గయ. రాముడు, కృష్ణుడు అనే ఉపాసనచేసే వారికి దేశంలో ప్రవహిస్తున్న నెత్తురు కాల్వలు, జలియన్‌వాలాబాగ్, భగత్ సింగ్, మనస్సుకు పట్టలేదు

తన సంఘపు అశ్రుసముద్రంలో కలంముంచి, ఉదాత్తమైన నవలలు వ్రాశాడు—శరత్‌చంద్ర చటర్జీ 'దేవదాస్'ను ఎవరు మరచిపోగలరు ?

రవీంద్రనాథ ఠాకూర్ 'గోరా' నవ భారతానికి ఉజ్వల స్వరూపం. 'కాబూలీవాలా' విశ్వకవి సమాజాని కర్పించిన కన్నీటి కానుక. చివరి చివరి రోజుల్లో స్వాతంత్ర్య ప్రేమ మరింత మరింత ప్రజ్వలించింది. ఆ రోజుల పాటల్లో జాతీయ ఆవేదనఘోషపెట్టింది.

ప్రేమచంద్....ఎంత మధుర కవి. శరత్, ప్రేమచంద్—వీరి వాక్యాల్లో దుఃఖం నిశ్శబ్దంగా ప్రవహించిపోతుంది,

సత్యాగ్రహ యుద్ధంలో హింసితులైన వందలాది వ్యథను ఎంత రసాత్మకంగా చిత్రించాడు!

ఒక సత్యాగ్రహి విపరీత దాహంతో తపిస్తూ, ఓ యింటికి వెళ్లాడు. గాంధీ టోపీచూసి ఇంటివాళ్ళు మంచినీళ్ళివ్వరు. అతను దాహంతో స్పృహతప్పి పడిపోయాడో, ఏమో మనకు తెలియదు.

కాని ప్రేమచంద్ ఆ వందలాది

త్యాగమూర్తులమర్త్యగాథలకు అమృతము పోశాడు.

దక్షిణాన భారతి ఎన్నో విప్లవ గీతాలు పాడాడు.

కాని ... కాని.... మన సాహిత్య వీధులలో ఈ కోలాహలమేది ? ఈ సంగీతమేది ? ఈ పరివేదన ఏది ? ఈ జీవ - స్పందం ఏది ?

గురజాడ, బసవరాజు ... దారి చూపించి, వెళ్ళిపోయారు.

తర్వాత మనం మబ్బుల్లో, శూన్యములో, కాల్పనిక జగత్తులో దారి తప్పిపోయాం.

ఈనాడు దేశం మళ్ళీ కురుక్షేత్రంలా ఉంది.

దాస్యం ముగింపుకు వస్తోంది.

స్వాతంత్ర్యం సిద్ధించబోతోంది.

మనకో కొత్తయుగం ఆరంభమవుతోంది.

ఈ నవయుగంలోనన్నా సాహిత్యం తన విధిని నిర్వర్తిస్తుందా ?

ఫ్రెంచి విప్లవంగురించి రొమైరోలా 'స్టారమ్ ఆఫ్ బాస్టిలీ' అనే నాటకం వ్రాశాడు.

సాంఘిక సంఘర్షణగురించి గోర్కీ 'ఎనిమీస్' అనే నాటకం వ్రాశాడు.

డొస్టొవిస్కీ 'క్రైమ్ అండ్ పనిష్మెంటు'లో ఒక యువకుని ఘోర పరిణామం వర్ణించాడు.

టాల్‌స్టాయ్ జారు దురంతాలను ఉత్కృష్టంగా చిత్రించాడు. ఈ నాడు రష్యాలో అతని పుస్తకాలు వేలకువేలు అచ్చు అవుతున్నాయ్.

పరాసు విప్లవాగ్ని షెల్లీ, కీట్సు, వర్డ్స్‌వర్త్ కావ్యాల్లో ప్రజ్వలించింది.

లార్డ్ బైరన్ గ్రీస్ దేశానికి తన ప్రాణం ధారపోశాడు.

వాల్ట్‌విట్‌మన్ అమెరికాకు కవి సింహం.

వీరంతా తమ తమ దేశాల్లోని అపూర్వ సంఘటనల చారిత్రక సత్యం గుర్తించి, ఆ సత్యాన్ని తమ సాహిత్యంలో ప్రదర్శించారు.

మనుష్యుడు తన నిత్యయాత్రలో, తన పురోభివృద్ధిలో వీరి మాటల సింహనాదం వింటూ; వీరిపాటల ఝంకారాన్ని పాడుకుంటూ ముందడుగు వేస్తాడు.

ఈ సాహిత్యసృష్టి కోసం మన ప్రజానీకమీనాడు తహ తహలాడుతున్నారు.

మన సాహిత్య నిర్మాతలు ఈ నిజాన్ని గుర్తించాలి.

★

ఆంధ్ర చిత్రకళా ప్రదర్శనం

శ్రీ పిలకా నరసింహామూర్తి

ఆంధ్రాభ్యుదయ రచయితల చతుర్ధమహాసభలో జరిగిన ఆంధ్ర చిత్రకళా ప్రదర్శనమునకు చాలా వుత్తమ చిత్రాలు వచ్చాయి. ప్రదర్శన ప్రారంభకులు శ్రీ వి. ఆర్. చిత్రాగారు.

సాధారణంగా చిత్రకళాప్రదర్శనాల్లో ఉత్తమ తరగతికి చెందిన చిత్రాలను ఏరి కొన్ని బహుమతులు ఇవ్వాలనే ఆచారం ఒకటివుంది. అది తొలగిస్తే బాగుండును.

ఇది మంచిచిత్రము అవును - కాదు అని నిర్ణయించేవారు రసజ్ఞులు, సహృదయులు అయివుండాలి ప్రపంచకంలో విదేశాలలో ఏయేమార్గాల్లో చిత్రకారులు కృషిచేస్తున్నారో గ్రహించాలి అన్నిటి కంటె జీవితాన్ని సానుభూతితో, సానుభవదృష్టితో చూచి ఆనందించగలిగే శక్తివుండాలి. ఉత్తమ చిత్రాలను గుర్తించడం రత్నపరీక్ష వంటిదంటే అతిశయోక్తికాదు

మామూలు పద్ధతుల్లో చిత్రకళాప్రదర్శనాలుజరగటం మానాలి. ఇంకా విశాల దృష్టి అవసరము. అసలు జీవితంలో ఉత్కృష్ట విషయాలలో ఒకరితో ఒకరు పోటీచేయడం. నెగ్గడం — ఓడిపోవడం అనేవి లేవని నాఊహ. సంఘాన్ని వెలుగు దారుల నడిపించేవి కళలు ఉదాత్తమైనవిషయాలు గ్రహించి, వానిని జీవితంలో ఆచరణలోకి తెచ్చుకుని జీవితాలు పరిమళభరం చేసుకోవడం మానవకోటి కంతటికీ ఒక్కటే ఆశయం. కళలు ఆ పరమావధికి చేర్చేమార్గములు. చిత్రాలు ప్రజాహితంకోరి ప్రదర్శనంలో ఉంచటం ఒకపవిత్ర ధర్మంగా చిత్రకారులు— ప్రదర్శనాలు ఏర్పాటుచేసే వారు గ్రహిస్తే పోటీలలో పాల్గొనడం, వ్యాపార దృష్టితో ప్రదర్శనాలు ఏర్పాటు చేయడం, అంతరిస్తాయి.

ఆంధ్రాభ్యుదయ రచయితల మహాసభలో జరిగిన చిత్రకళా ప్రదర్శనము పాతమార్గాలు వదలి కొత్తమార్గంగా ఏర్పాటుచేయాలనే దృష్టితో జరిగింది. బహుమతులు — ఫొటోలుతీసే — ఆంధ్ర చిత్రకారులందరూ ఆహ్వానింపబడ్డారు. ఈప్రదర్శనానికి పొరుగు ఊళ్ళనుంచి వచ్చినవారు శ్రీ వి. వి. భగీరధి, శ్రీ లంకా వెంకటసుబ్బారావు, శ్రీ మొక్కపాటి కృష్ణమూర్తి, శ్రీమతి సీతాదేవి, శ్రీమాధవపెద్ది గోపాలకష్ణ గోఖ్లే గార్లు వీరిలో కొందరు. చిత్రప్రదర్శన ప్రారంభంరోజున చిత్రకళపై ప్రసంగించడం ముదావహమైన విషయం.

ఇందులో ప్రదర్శించినవారు శ్రీ వి. ఆర్. చిత్రా, శ్రీ వి వి. భగీరధి, శ్రీ మొక్కపాటి కృష్ణమూర్తి, శ్రీ

అంకాల వెంకటసుబ్బారావు, శ్రీ పైడి రాజు, శ్రీమతి పి. సీతాదేవి, శ్రీమతి పి. విజయలక్ష్మి, శ్రీమతి స్వరాజ్య లక్ష్మి, శ్రీ పిలకా నరసింహమూర్తి, శ్రీ ముడుంబి నరసింహాచార్యులు, శ్రీ హోతా రామగోపాలరావు, ఖండవల్లి సుబ్బారావు, రామమూర్తి, బుజ్జాయి నాగేశ్వరరావు గారలు

శ్రీ వి. ఆర్. చిత్రాగారి హిమాలయ దృశ్య చిత్రాలు ప్రసిద్ధ కళావిమర్శకుల మన్ననలు పొందాయి. ఎన్నిసార్లు చూచినా, నిత్యనూతనంగా కనబడతాయి, చూచినపుడల్లా, ఏవో క్రొత్త అనుభవాలు కలిగించి ఆనందాన్ని ఇవ్వగలగడం ఉత్తమచిత్ర లక్షణము. ఈ గుణం హిమాలయ దృశ్య చిత్రాలలో సమగ్రంగా ఉంది కొన్ని చిత్రాలలో కాటుక, నీలివర్ణముల కలయికవల్ల ఏర్పడిన వర్ణాంతరచ్ఛాయలు ద్రష్టహృదయాన్ని కదల్చివేస్తాయి. ఉన్నత గిరి శిఖరాల్ని చుంబించే వలచని మేఘ శకలాలు సందర్శించినప్పుడు మనలో పున్నమి వెన్నెలలు నిండిపోతాయి నవ్యభారతి స్తనమండలాన్ని సత్రించే హారాలవలె పర్వతసానువుల నంటి పైకిపోయే సన్నని కాలిబాటలు శిఖరాగ్రాలనుంచి జాలువారే సెలయేళ్లు మనలో నిద్రాణమైన ఆత్మశక్తిని రగుల్కొలుపుతూన్నట్టుంటాయి.

దృశ్యచిత్రకళాదేవికి హిమాలయాలు ఆత్మయని నా విశ్వాసము. దృశ్యచిత్రకళకు పరమావధి హిమాలయాల్ని చిత్రించడం అంటాను. ఆవిధంగా ఈ మార్గంలో భారతీయ దృశ్య చిత్రకారులకే శ్రీ చిత్రాగారు మార్గదర్శకులు అనుట సత్యదూరముకాదు

శ్రీ మొక్కపాటి కృష్ణమూర్తిగారు ఈ ప్రదర్శనంలో చాలా పౌరాణిక, రూప జానపద చిత్రాలు ప్రదర్శించారు. వీరు మొదట్లో పాశ్చాత్య చిత్ర సాంప్రదాయాలనే సత్యమని నమ్మి ఆ మార్గాలలో కృషి చేస్తూండేవారు. ఆతరువాత చిత్రకళలో నూతన మార్గాలు అన్వేషించే కోరికపై చెన్నపురి లలిత కళాశాలలో ప్రవేశించారు ఒక మహానది తిన్నగా చాలాదూరం ప్రవహించి మహావేగంతో ఒక పెద్ద మలుపుతిరిగినట్లు వీరి కళాజిజ్ఞాస భారతీయ చిత్రసాంప్రదాయాలవైపు మళ్ళింది తరువాత వీరి చిత్రరచనాపద్ధతులు మారినై. అనేక నూతన సందేశాలు విని గృహాభిముఖులైనారు. స్వగృహమందే యెక్కువ చిత్రాలు చిత్రించారు. వారి సోదరీమణులలో కొందరికి కళయందు అభిరుచి ఈయనవల్లనే కలిగింది. వారికి మార్గదర్శకులైనారు. ఈప్రదర్శనంలో చిత్రములు ప్రదర్శించిన శ్రీమతి సీతాదేవి, విజయలక్ష్మి, స్వరాజ్యలక్ష్మి గారలు వీరి చెల్లెళ్లు. ఇంకా కృష్ణమూర్తిగారు రూపచిత్రకళలో ఆరితేరినవారు. శిల్పంలో మంచి నిపుణులు.

శ్రీ వి. పి భగీరథిగారి దృశ్యచిత్రములు చాలా రమణీయంగా ఉన్నాయి. మంచు తెరలు, తెరలమరుగున తాళవృక్షాలు, ముందుభాగంలో చక్కచక్కని గులకరాళ్ళు చూచి చప్పున భగీరథిగా చిత్రాలను పోల్చుకుంటాము, భారతీయ

దృశ్యచిత్రకారులలో ఈయన పేర్కొన తగ్గవారు

శ్రీ అంకాల వెంకటసుబ్బారావుగారు ఆంధ్ర చిత్రకారులలో చాలా ఏళ్ళనించి కృషి చేస్తున్నవారిలో ఒకరు. ఎప్పుడూ పదిమంది శిష్యులతో చిత్రకళాదేవిని నిత్యం ఆరాధిస్తూ ఉంటారు.

శ్రీ పైడిరాజుగారు చెన్నపురి లలిత కళాశాలలో శిల్పము, చిత్రకళ నేర్చుకున్నారు. వీరి చిత్రాలలో నీడ చిత్రాలు గమనించదగ్గవి.

శ్రీ ముడుంబి నరసింహాచార్యులు గారు చెన్నపురి లలిత కళాశాలలో చిత్ర విద్య నేర్చుకున్నారు. వీరి చిత్రాలలో మధురమైన స్వప్నాలు చూస్తాము. కలలు ఒత్తిగిలినట్లు, కలవరిస్తున్నట్లు చక్కిలిగింతలు పెడతాయి. వీరు సంస్కార బలంవల్ల చిన్నతనంనుంచి చిత్రరచన సంప్రదాయ సిద్ధమైన రచనా మార్గాలలోనే చిత్రిస్తూ వచ్చారు

శ్రీమతి పి. సీతాదేవిగారి రాధా కృష్ణుల ప్రణయ చిత్రాలు, కృష్ణలీలల చిత్రాలు మనోహరమైనవి. ఈమె చిత్రాలలోని రేఖా ప్రవాహములు సుళ్ళు తిరుగుతై. అంగవిన్యాస వర్ణసమ్మేళన ములు విశిష్టము. రంగులులేతమామిడి చిగుళ్ళను పోలిఉంటాయి రేఖాసౌష్ఠవంలో ఎక్కడా అపశృతి గోచరించదు. ఈమెచిత్రాలలో ఏభారతీయ చిత్రకారుల ప్రభావమూ ప్రస్ఫుటంగా గోచరించదు. అన్ని సంప్రదాయములు తెలియకనే ప్రౌఢంగా చిత్రించగల ప్రతిభా పాటవములు పరమేశ్వరుడు ఈమెకు పుట్టుక తోనే ప్రసాదించినట్లు తోస్తుంది. ఈమె అన్నగారైన కృష్ణమూర్తిగారు ఇచ్చిన ప్రోత్సాహమువలన, కూర్చినసంస్కార బలంవల్ల, చిత్రరచనయందీమె ప్రతిభ సహస్రముఖాలుగా విజృంభించింది. ఇంకా ఈమె తెలుగువారి గృహజీవితాన్ని, ప్రేమ - వాత్సల్యానునయాలు ఉట్టిపడేటట్లు చిత్రించిన చిత్రాలనేకం ప్రదర్శింపబడ్డాయి.

స్వరాజ్యలక్ష్మి, విజయలక్ష్మిగారల చిత్రాలు ఆకర్షణీయంగా ప్రదర్శనానికి క్రొత్తదనాన్ని తెచ్చాయి విజయలక్ష్మి గారి కృష్ణలీలల చిత్రాలలోని రేఖలు బలంతోను, శక్తివంతంగాను సృష్టింపబడినై. వీరిద్దరు భిన్నభిన్న మార్గములలో సౌందర్యవంతమైన చిత్రాలు చిత్రించగల ప్రతిభకలవాళ్ళవును. దానికి సక్రమంగా కృషిజరగాలి.

శ్రీ ఖండవల్లి సుబ్బారావుగారు చెన్నపురి లలితకళాశాలలో చిత్రకళ నేర్చుకున్నారు. వీరికి జనపదాలంటే అమిత గౌరవం కొన్ని చిత్రాలలో జానపదుల జీవితాన్ని రమ్యంగా చిత్రించారు.

పకోతా రామగోపాలరావుగారు చెన్నపురి లలిత కళాశాలలో చిత్రకళాశిల్పము నేర్చుకున్నారు వీరికి రూపచిత్రణయందభిరుచి మెండు దానిలో నుంచి కృషి చేశారు. చెన్నపురి లలితకళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తూండేవారు

ఇంకా ప్రదర్శనంలో మొక్కపాటి నాగేశ్వరరావుగారు, రామమూర్తిగారు, బుజ్జాయిగారు చిత్రాలు ప్రదర్శించారు. వీరి చిత్రాలు ఉద్వేగంతోను, స్వేచ్ఛతోను చిత్రించాలనే ప్రయత్నం గోచ

రిస్తోంది. వీరికి కొంతవయస్సు ముదిరి, జీవితంలో క్రొత్త అనుభవాలు దొర్లడం అవసరం.

ప్రదర్శనం మొత్తంమీద ఎంతో బాగుంది. ఒక నూతన ఉద్యమం ఆంధ్ర చిత్రకళలో ఆవిర్భవిస్తూన్నట్లు ఈ ప్రదర్శనం చాటుతోంది. ఒకటి రెండుకూడా స్ఫురిస్తున్నాయి, ఈ ప్రదర్శనంమొత్తం మీద చరిత్రాత్మకమైన చిత్రాలు లేవు. గుఱ్రం మల్లయ్యగారు దీనివిషయమై కొంతకృషిచేశారు. ఆంధ్రచిత్రకారులలో గోఖ్లేగారు చరిత్రాత్మకమైన చిత్రాలను, రచించారు. నేటి రాజకీయాల్ని, యదార్ధమైన పూర్వదృష్టిలో వుంచుకుని సంఘాన్ని ఉత్తేజపరచే మహోజ్వల చారిత్రక చిత్రాలు ఆంధ్ర చిత్రకారులు చిత్రంచవలసిన అవుసరం ఎంతైనా వుంది.

పౌరాణిక, ఐతిహాసిక చిత్రాలు క్లిష్ట సమస్యలు చిత్రించేప్పుడుకూడా మానవ జీవితంలో సంఘర్షణలు తీవ్రఘట్టాలు ఎత్తుకోవాలి. పురాణాలలో అట్టి సన్నివేశాలు నాడు – నేడు - ముందుకూడా మానవాభ్యుదయానికి తోడ్పడేవే ఉన్నాయి. ఇంకా దేశం మూడువవంతు నిద్రాణంగా పడివుంది. రాజకీయంగా మనంమేలుకున్నా, కళలద్వారా ప్రజల్ని ఉత్తేజిత పరిచి తద్వారా దేశానికెంతైనా సేవచేయించడానికి ఎంతైనా అవకాశం వుంది. చిత్రకారులు ప్రజల్లో ఆచైతన్యం తీసుకురావాలి. మానవలోకం పూర్తిగా మేల్కొని గడచిన మహోజ్వల చరిత్రలు తలచుకొని దేశం ముందుకు సాగిపోవాలి. కళలు పనికి దోహదం కావాలి. అవి ప్రచారానికి దిగిపోగూడదు. లక్ష్యశుద్ధితో కళ సృజింపబడి ప్రయోజనాన్నికూడా సాధించిన యుగాలు చరిత్రలోకూడ ఉన్నాయి.

★

చిత్రకారులకు విజ్ఞప్తి.

శ్రీ మాధవపెద్ది గోపాలకృష్ణ గోఖలే

1941 డిసెంబరులో ఆంధ్ర రజతోత్సవాలు యీ మదరాసులో జరిగినై. కవులూ, పండితులూ, చిత్రకారులూ, నాయకులూ, నటకులూ వుత్సవాల్లో పాల్గొన్నారు. శ్రీ అడవి బాపిరాజుగారి కృషిఫలితంగా యీ సందర్భంలో ఒక చిత్రకళా ప్రదర్శనం జరిగింది. మన ఆంధ్రచిత్రకారుల్లో ఎక్కువ మంది షుమారు 450 చిత్రాలు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనం, చిత్రాలను చూచిన ఎక్కువమంది హృదయాల్లో ఆనందాన్నీ, వివిధ ఆలోచల్ని కలుగ చేసిందనడంలో ఎవరికీ సందేహాలుండవు. కొందరి ఆంధ్ర చిత్రకారుల్లో కళాబలాన్ని హత్తిన యీ మదరాసు స్కూల్ ఆఫ్ ఆర్టుస్ ప్రిన్సిపాల్, గురుదేవులు శ్రీ దేవీ ప్రసాదరాయచౌదరి గారు ప్రదర్శనాన్ని చూసి" యివీ యివీ నా ఆంధ్రవిద్యార్థుల చిత్రాలు" అని ఎంతో గర్వంగా చెప్పుకున్నారు. ఎక్కడో మారుమూలల్లవున్న చిత్రకారుల్ని పోగుచేసి, వారి వారి కళానైపుణ్యాన్ని ఎక్కువమంది ప్రజలకూ, రసజ్ఞులకూ అందుబాట్లోకి తెచ్చి, యీ వుత్సవాలను నిర్వహించిన మదరాసు సోదరాంధ్రులు, కళలపట్ల వారి వుత్సాహాన్ని చిత్రకారులకొక హెచ్చరికగా వెలుగు చూపించారు. కళలంటే ఆనందించేందుకు, ఆలోచనలు చేసేందుకు మనుష్యులున్నారనేది చిత్రకారులకు యిదొక నిదర్శనం.

అయితే మా బొమ్మల్ని మేం ప్రదర్శించుకొని వుత్సవనిర్వాహకుల్ని, అభినందించుకుంటూ ఎవరిళ్ళకువాళ్ళం వెళ్ళిపోయినాం. మాకొక కార్యక్రమంలేదు. కొందరం కళల్ని ఎవరన్నా పోషిస్తే గాని బాగుపడవనీ, కొందరం మనం చేసేదేదో ఏ గుహల్లోనో సేసి చచ్చిపోదాం అనుకుని వెళ్ళిపోయినాం. అది 1941 ఆరేళ్ళకు 1947 వచ్చింది.

'దేశమంటేమట్టిగాదోయ్ దేశమంటే మనుజులోయ్' అని గురజాడవారి ఢంకా మోగిస్తూ అభ్యుదయ రచయితలొచ్చారు. కళాకారులంతా ఒకటి కావాలి. దేశాభ్యున్నతి, కళాభ్యున్నతి, ప్రజాసాహిత్యం కావాలి. అనే నినాదాలు వీరివి. ఈ సభ, యీ చిత్రకళా ప్రదర్శనం వీరి కార్యక్రమానికి ఒక వుదాహరణ.

కాలికి పుండుపుడ్తే నాకు తప్పకుండా ఏడుపువొస్తుంది. ఈఏడుపు చాలాకాలం ఏడవటం కష్టం. పుండు గుండెల్దాకా పాకకుండా నేను మందువేసుకుంటాను. ఎందుకంటే యిది దైవికం అన్నవాళ్ళు చచ్చిపోయినారుగనుక.

అందరి మాదిరే చిత్రకారునికి

బొమ్మలు రాయటంవృత్తి ఈ వృత్తితోనే చిత్రకారుడికి ఆనందం కలిగినా, కడుపునిండినా, గుడ్డకట్టినా. అంటే తన బొమ్మలవల్ల డబ్బుగడించి తనకు కావలసిన వస్తువుల్ని కొనుక్కొని అనుభవించటం — అంటే చిత్రకారుడికి స్వార్థంవుంది ప్రాచీనయుగాల్లోనూ ఈ ఆధునిక యుగంలోనూ చిత్రకారులకు సమస్యలున్నవి. వీరివీ మానవభావాలే. వృత్తి స్వభావంవల్ల పరిశీలనా దృష్టి చురుకుగలదై వింత భావాలను కలిగించే రూపాలను చిత్రించడంవల్ల శాస్త్రజ్ఞులూ, కవులమాదిరే వీరికీ సమాజంలో కొంత ప్రత్యేకత వున్నదేగాని, అందరిమాదిరి తిండిలేక పోతే క్షీణించకా, గుండుదెబ్బ తగిలితే చావకా వుండేది ఏమీలేదు వివిధ భావాల్తో కూడిన వీరిచిత్రాలు ఆకర్షణలు కలిగి ఒకరినుండి ఎక్కువమందిని ఆనందపెట్టో, ఉద్రేకాన్నిచ్చో ఆలోచనలు కలుగజేసో మొదలయిన ప్రత్యేకతలు వుండటంవల్ల జన సామాన్యంలో వీటికి చలామణీవుంది. చిత్రాలు అర్థరహితంగానూ, ప్రయోజన శూన్యంగానూ వుంటే చిత్రకారుడు ఆత్మహత్యకు దారివెతుక్కోవడం అన్నమాట.

ఒకప్పుడు కోతిరూపంలోవున్నమానవుడు క్రమేణా అభివృద్ధిచెంది ఆయా గుంపుల్లో వుండేకుళ్ళను కడుక్కుంటూ కొండ గుహలనుండి రమ్యహర్మ్యాలకు నీతి ధర్మాలను బోధిస్తూ మహత్తర స్తూపాకారాలు, కన్నులు చెదిరే గుడి గోపురాలు, మానవ నాగరికత, అభ్యుదయాలకు శాస్త్రరచనలు, ఇతర గ్రంధ రచనలు మొదలయిన కృషితో ఆయా యుగ విజ్ఞానాల కుచితంగా చరిత్రను సజీవంగా తీసుకురావడం మనం యెరుగుదుం.

అయితే, ఈ వ్యాపార యుగంలో స్వార్థంబలిసి, నాగరికతను మంటగలిపి, మనవైజ్ఞానిక, ఆర్థిక సుఖసంపదలనూ, అభివృద్ధినీ అరికట్టే 200 సంవత్సరాల నుంచీ జరుగుతున్న దోపిడీపట్ల మన చిత్రకారుల నేత్రాలు తెరిపిళ్ళు పడలేదు. యివాళ మనం, మన పూర్వీకుల కళా సంపదలైన అజంతా, నాగార్జునకొండ, అమరావతీ—వాటిసగురించి చెప్పుకుని గర్వపడుతున్నామంటే, ఆ బ్రహ్మాండమైన పనులు బాధ్యతాయుత ప్రభుత్వాలక్రిందే వెలుగొందినైగాని, బానిస దేశంలో మాత్రంకాదని గుర్తించడం ఎంతయినా అవసరం.

మదరాసు, బొంబాయి ఆర్టుస్కూళ్ళనో శాంతినికేతనం, ఆర్టుస్కూళ్ళల్లోనో విపరీతమయిన ఆసక్తితో కళాభ్యాసంచేసి వుత్తమచిత్రకారుల ప్రశంశలను పొంది జీవితంలోకి ప్రవేశించగానే పూర్వచిత్రకారుల ఆశయాలకు కాలానుగుణ్యంగా వుండవలసిన కళా ప్రయోజనాలను పాటించక డబ్బు ప్రధానంగాగాని, భావదాస్యం చేస్తూగాని, నూతనయుగమార్పులను గుర్తించక చిత్రకారులు వెనకబడి వున్నారు. సోదరప్రజలకూ వీరికీ అవినాభావ సంబంధాలులేవు. చిత్రకారులకు దారిద్ర్య సమస్యలుగాని, వీరి కళలవల్ల ప్రయోజనాలు వుండవనిగాని, ఏ చిత్రకారుడూ అనలేడు పోతే లోటు ఎక్కడ

వుంది ? చిత్రకారులు సంఘటిత శక్తితో యీ సమస్యలను తీవ్రంగా ఆలోచించాలి ప్రతిఒక్క చిత్రకారుడూ — చిత్రకారులందరూ వారివారి సమస్యలు ఒకటిగా భావించాలి మనపూర్వీకుల వుత్తమ సాంప్రదాయాలను అర్థంచేసుకుని, యుగ ధర్మాన్ని బట్టి నూతనకళాయుగానికి ముందడుగు వేసిన వుత్తమ చిత్రకారుల అడుగు జాడల్లో అడుగు వేయాలి మన ఆర్థిక సమస్యలకూ. ప్రజోపయోగ కళలకూ వున్న సంబంధాలను, ప్రజాభ్యుదయమే కళాభ్యుదయమని గుర్తించిన నాడు మన జానిసవిముక్తికి సరిఅయిన మార్గంలో వుంటామని, సోదర చిత్రకారులను యీ అభిప్రాయములు ఆలోచించ వలసిందిగా ప్రార్థిస్తున్నాను.

★

యుద్ధకాలం

శ్రీ కుందుర్తి ఆంజనేయులు

అవునవును - నీవా ?
నరజాతికి తెలియని
చరిత్ర కందని
పరిధిలేని చక్రగతీ !

ఋషిబాలికను ఒడిలో లాలించినవేళలు
నీతుల పూతలు
పూయించుట నుగచితివో !

ఏమెరుగని అమాయకపు
నవనీతపు ముద్దులు నీ బిడ్డలకే
కరగని గొంతుల గుండెలు
కల్పించితివా ?

నీ యనుభవ వార్ధి స్రోతు
ఉబికిన మణిపూసల రాసికి
తళ తళల కాంతిలేని
చీకటికట్టులు కట్టావా ?

వ్యక్తావ్యక్తపు
నీ కనుమూతల్లో
సుఖదుఃఖపు నీలితెరలు
చూపితివో చక్రగతీ !

తాజమహాలు కట్టించిన
చల్లని కన్నుల తల్లీ !
నిప్పులు కురిసే రణరంగంలో
నృత్యజీవులు స్వప్నాల్లో శయనిస్తావా ?

దళదళలారిన నీ కీర్తిలతల
కెత్తిన చదలు బాపుటా
మల్లెల నవ్వుల వెన్నెల కురిపింపక
మృత్యువు నీ అనుచరిగా
సర్వకృత్యా ప్రాణానిల
బలిహరణం సాగిస్తావా ?

అంతులేని ఆశాశక్తికి
దేశాలన్నీ బలిపెడుతూ
లోకం పంపిణీ కుదరక
ప్రవాహాని కెదురీదే
రాజకీయసూత్రం నీవే
సృష్టించావా ?

దుర్నీతికి లక్ష్యంగా దోపిడి సాగించే
ధూనేతల మనస్తత్త్వములు
శోధించావా ?
నీకని కట్టలుకట్టే
బాధాకర మేధావుల మన్నిస్తావా ?

ప్రజావిజయ బహురథగాములు
పాడిన రక్తారుణగీతులకై
వాడిపోని త్యాగోజ్వలమూర్తులు !
చరిత్రలో చెరగిపోని
చీకటికోణపు చిత్రవధలు
చూశావా ?

క్షుధాజ్వాల కెగసిన కడుపులు
మ్రోగించిన దుర్భరసంగీతానికి
నీనిరాదరణ కారణమో !

ప్రాణం తెచ్చిన కరువుకు
ప్రాణాన్నే బలియిచ్చే
శోకం పేరుకు పోయిన
ఆకలి మంటల లోకానికి
నీ మృతసంతానపు
చితి ధూమాగ్నిజ్వాలలు
నెచ్చెలులో !
కరుణలేని నీయెదలోతులు
రవికిరణ ప్రసక్తి యెరుగని
గుహాగర్భముల చీకటి
లోకపు గతులో !

నీవాక
అపశ్రుతులు పలికించను
ఈ లోకవిపంచిక పిలిపించిన
భూతాకృతివో !
అవునవును
నీవా ?

*

ఆంధ్రశిల్పి
సంపాదకు...
చిత్ర మాస పత్రిక ... శాస్త్రి
ఆంధ్రసాహిత్యానికీ, లలిత కళలకీ, సంస్కృతికీ.
అంకితమయి అనుసంధిస్తూ, ప్రతి సంచికా ఒక త్రివర్ణ
చిత్రముతోను, ఇంకా ఇతర చిత్రాలతోను వెలువడుతూంది.
విడి ప్రతిక : ౧౨ అణాలు — మేనేజరు, ౧౦ ... వీధి
సాలు చందా : రు ౯-౦-౦ — మౌంట్ రోడ్ · మద్రాసు

నాల్గవ అభ్యుదయ రచయితల సమావేశం

కె. కె.

మద్రాసు మహానగరంలో జనవరి 17, 18, 19 తేదీలలో త్యాగరాయనగరు వాణీమహలులో ఆంధ్రఅభ్యుదయ రచయితల సమావేశం—కాదు, ఉత్సవం—జయప్రదంగా జరిగింది

ఇది నిజంగానే ఉత్సవం ఎందుచేతనంటే, దీనివెనక మద్రాసులోని ఆంధ్ర ప్రముఖు లనేకులున్నారు. దీనిముందు ఆంధ్రదేశంలో ఉన్న మహాకవు లెందరో ఉన్నారు. న్యాయమూర్తి గోవిందరాజాచారిగారు అధ్యక్షులుగానూ, రామానుజరావు నాయుడు, నార్ల వెంకటేశ్వరరావు, నీలంరాజు శేషయ్య దేవులపల్లి కృష్ణశాస్త్రి, తాపీ ధర్మారావునాయుడుగార్ల వంటి పెద్దలు సభ్యులుగానూ ఆహ్వాన సంఘం ఏర్పాటయినప్పుడే, ఈ ఉత్సవానికి గట్టి పునాది ఏర్పడింది

రేణుకా పిక్చర్స్ నిర్వాహకులు చిత్తూరు నాగయ్యగారూ, స్వతంత్ర ఫిలిమ్సు నిర్వాహకులు కోవెలమూడి ప్రకాశరావుగారి వంటిఉదారులూ ఆహ్వాన సంఘ సభ్యులకు ఊతమిచ్చి అనేక విధాల తోడ్పడి, ఈ ఉత్సవం విజయవంతంగా కొనసాగటానికి ఆధారాలు కల్పించారు.

ఆహ్వానసంఘ కార్యదర్శి కృష్ణశాస్త్రిగారి తియ్యని పిలుపుకు వశులై తేనేమి, అభ్యుదయ రచయితలమీద పెరుగుతూ వస్తున్న అభిమానంవల్ల నై తేనేమి, దేశంలోవున్న ప్రముఖ రచయితలు ఉత్సవంలో పాల్గొనడానికి వచ్చారు కారణాంతరాలచేత రాలేని పెద్దలు ఆశీస్సులుపంపారు. పిలుపుకు సమాధానాలివ్వనివారిని ఒకచేతి వేళ్ళమీదలెక్కించవచ్చు.

పిలకా నరశింహమూర్తిగారు అవ్యవధిగానే అయినా, చిత్రకళా ప్రదర్శనం ఒకటి ఏర్పాటుచేసి, ఈ సమావేశానికి శోభ కలిగించటానికి పూనుకున్నారు మొక్కపాటి కృష్ణమూర్తిగారు, సీతాదేవిగారు, పైడిరాజుగారు మొదలయిన ఆంధ్ర చిత్రకారుల చిత్రాలు తెప్పించారు. చిత్రకారులుకూడా వచ్చారు.

న్యాయమూర్తి రాజమన్నారుగారు ఈ ఉత్సవానికి సారధ్యం ఒప్పుకున్నారు. ఖ్వాజా అహమ్మద్ అబ్బాస్‌గారు ఉత్సవాలను ప్రారంభించటానికి ఒప్పుకున్నారు నెల్లూరు .... నాటక సంఘం వారూ, కృష్ణా - గుంటూరు మండలాల వైజ్ఞానిక దళాలవారూ ప్రదర్శనాలిచ్చి

ఈ ఉత్సవానికి తోడ్పడటానికి అంగీకరించారు. మద్రాసు పట్టణంలో ఉన్న విద్యార్థి సంఘాలలోనుంచి వాలంటీర్లు ముందుకొచ్చారు.

అభ్యుదయ రచయితల సంఘం గర్వించటానికి కింతకంటె ఏంకావాలి? ఈ ఉత్సవాలు జయప్రదం కావటానికి ఇంతకంటె ఏంకావాలి?

* * *

మొదట తెనాలి, తరవాత బెజవాడ, క్రిందటేడు రాజమండ్రి ఇప్పుడు మద్రాసు—

సమావేశానికీ సమావేశానికీ, అభ్యుదయోద్యమం ముందడుగు వేస్తున్నది. ఏయేటికాయేడు క్రొత్తగా వచ్చిన పెద్దలీ ఉత్సవాలలో పాల్గొంటున్నారు సాహిత్యం సంకుచిత దృష్టితోగాక ఉదాత్తంగానూ, ఉన్నత సాంఘికాశయాలతోనూ, ప్రజలపరంగానూ, అభ్యుదయకరంగానూ ఉండాలనే భావం సాహితీపరులకు క్రొత్తది కాదు కాని ఈ ఆశయాలకు దోహదంచేసి కృషిచేసిన సాహిత్య సంస్థలన్నిటికన్నా అభ్యుదయ రచయితల సంఘం ముందుకు పోయింది. కనుకనే మూడేళ్ళలోపుగా ఈ సంఘం దేశంలో ఇంతగా చర్చలనురేపి, ఇంత మంది రచయితలను కూడగట్టుకుని, తెలుగుతల్లి పత్రికనూ, అభ్యుదయ పత్రికనూ ఇంత విజయవంతంగా నడిపి, అభ్యుదయ ప్రచురణలు సాగింపుతూ, ఈనాడు దేశంలో ఉన్న మేటిరచయితలను ఈ ఉత్సవాలకు రప్పించుకున్నది.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, కవిసామ్రాట్ విశ్వనాధ సత్యనారాయణగారు, వేదుల సత్యనారాయణశాస్త్రిగారు పుట్టపర్తి నారాయణాచార్యులుగారు, భమిడిపాటి కామేశ్వరరావుగారు మొదలైన పెద్దలు ఈ వేదికమీద క్రొత్తగా నిలబడి, వివిధవిషయాలనుగురించి తమ అభిప్రాయాలు ప్రకటించారు

వీరందరూ ఒక్కసారిగా అభ్యుదయ రచయితలతో ఏకమైపోకపోవటానికి కారణాలున్నాయి అభ్యుదయ రచయితల కార్యక్రమంతోటీ, ఆశయాలతోటీ, పూర్తి పరిచయం ఉన్న రాజమన్నారు, గోవిందరాజాచారిగార్ల వంటి పెద్దలకూ, ఇవాళే దీని విషయం తెలుసుకోవటం ప్రారంభించిన పెద్దలకూ తేడా ఉంది.

అదీకాక, ఈనాలుగేళ్ళుగా అభ్యుదయ రచయితల సంఘం అనేకవిధాల దుష్ప్రచారానికి గురిఅయి ఉన్నది. ఈ దుష్ప్రచారం సాగించినవారంతా స్వార్థపరులనీ, అజ్ఞానులనీ అనటానికికూడా వీలులేదు. ఇందులో అనేకమంది కార్యాచరణతో నిమిత్తం లేకుండా తమ సందేహాలన్నిటినీ తాత్వికంగానే నివృత్తిచేసుకోవాలని ప్రయత్నించేవారున్నారు. "ఏది అభ్యుదయ సాహిత్యం?" అంటే సమాధానం చెప్పి ఒప్పించటం తేలికకాదు. "అభ్యుదయ సాహిత్యం ఏది?" అంటే నన్నయభట్టు నాటినుంచి నేటివరకూ సమాజంతో పాటు నడిచిన సాహిత్యం చూపవచ్చు.

తెలుగులో అభ్యుదయ సాహిత్యానికి తొమ్మిది వందలఏళ్ళ వయసు. అభ్యుదయ రచయితల సంఘం వయసు నాలుగేళ్ళు మాత్రమే ఈ నాలుగేళ్ళ

కాలంలోనే ఈ సంఘం పత్రికలు నడిపింది; పుస్తకాలు ప్రచురించింది. గిడుగు రామమూర్తి కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, కొమర్రాజు లక్ష్మణరావుగార్ల మొదలైన మహనీయుల వర్ధంతులు జరిపి ప్రత్యేకసంచికలు కూడా ప్రకటించింది కిందటి సంవత్సరంనుంచీ ఏటా సాహిత్య పాఠశాల నడపడానికి ఉద్యమించింది.

దేశంలో ఉన్న రచయిత లందరూ ఈ ఉద్యమంలో చేరి కృషి చేసినకొద్దీ ఈఉద్యమం సమగ్రమవుతుంది ఈ ఉద్యమానికి ప్రాణ ప్రతిష్ట సరిగా జరిగిందనటానికి నిదర్శనం నానాటికీ ఇందులోకి పెద్దలురావటమే

* * *

"ఈ సమావేశానికీ నవ్యసాహిత్య పరిషత్సమావేశానికీ తేడా ఏమిటి ?" అని కొందరడిగారు రచయితల సమావేశాలన్నీ ఒకటిగానే ఉంటాయి అభ్యుదయ రచయితల సంఘం ఒకితరగతి రచయితలమీద కత్తిగట్టిన సంఘంకాదు; దేశంలోఉన్న రచయిత లందర్నీ అభ్యుదయ సాహిత్య రచనకు పురికొల్పటమే దీనిఆశయం దీనిప్రణాళిక దీనికున్నది. ఈప్రణాళికకు అందరి ఆశీస్సులూ సంపాదించటమే దీనికర్తవ్యం ఈ సంఘం గురించినిన్నటివరకూ-నేటివరకూ-అపోహలతో ఉన్నవారు సహితం వచ్చి ఇందులో పాల్గొనటమే దీనికి పెద్ద ఆశీర్వచనం ఆవిషయం తమఆఖరు ఉపన్యాసంలో దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు స్పష్టంగా చెప్పారు.

ఈసమావేశాల్లో అభ్యుదయ రచయితల "గొంతు" వినిపించలేదని ఒక విమర్శ వచ్చింది. కాని ఇది పూర్తిగా నిజంకాదు.

"రచయితల సంఘానికి ముందున్న వాళ్ళం, ఈసంఘం సరిగా నడిచేటట్టు ప్రబోధించే బాధ్యత మనది"

"రచయితలు అధోగతిలో ఉండి ఏమీ పట్టించుకోకుండాఉంటే ప్రజలు ముందుకెట్లా నడుస్తారు ?"

"రచయితలకు సంఘంలో తగిన గౌరవమూ, పలుకుబడీరావాలి రచయిత అయినవాడు ఠీవిగా నిలబడాలి. ఇది ఇట్లాగూ అని నలుగురికీ చెప్పాలి నలుగురూ తనమాట వినేటట్లు చెయ్యాలి"

"పేదవాళ్ళకెన్నోసమస్యలున్నాయి; వాళ్ళు దారిద్ర్యంలోనూ, అజ్ఞానంలోనూ పడి కుమిలిపోతున్నారు వాళ్ళగోడెవరు చెబుతారు ? వాళ్ళు చెప్పుకోలేరు మనం చెప్పాలి... చెప్పటం మ న కే చేతకాకపోతే, వాళ్ళకి చేతనవుతుందా ?"

"మనని ధనవంతులూ అధికార్లూ వచ్చి వీపు చరచనక్కర్లేదు సామాన్య ప్రజలు వినేటట్టు మనం పలికితేచాలు "

—ఇటువంటిఅభిప్రాయాలు ఈసమావేశంలో ప్రకటించ బడినాయి. ఇటువంటి విశ్వాసాలమీదే అభ్యుదయ రచయితలు ఇల్లు కట్టుకున్నారు.

ప్రత్యేకించి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు ఆఖరున చేసిన ఉపన్యాసం ఒక కావ్యం. అదే అభ్యుదయ రచయితల "గొంతు", అదివిన్న తరవాత అనేక

మంది సభికులలో కొత్త చైతన్యం వచ్చింది.

* * *

ఈసమావేశంద్వారా ఒక్క విషయం రూఢీ అయింది.

అభ్యుదయ రచయితల వార్షిక సమావేశాలు కొద్దిపాటి అంగబలంతో ఆఖరు నిమిషపు ఏర్పాట్లతో, ఒకటి రెండు రోజుల కార్యక్రమంతో, ఒకటి రెండు వేల మంది ప్రజలుమాత్రమే పట్టే హాలులో జరపటం అసాధ్యం. ఉన్న పరిస్థితులలో చాలా అన్యాయాలు జరిగాయి. ఉపన్యాసకులకు టైము చాల లేదు. ఆహ్వానాలు పంపినవారికే చోటు చూపవలసివచ్చింది. వైజ్ఞానిక ప్రదర్శనాలకూడా క్లుప్తీకరించవలసి వచ్చింది. పోనుపోను, ఈ ఇబ్బంది జాస్తి అవుతుంది ఈ సమావేశాలకు అసంఖ్యాకులైన ప్రజలు రావాలి. ఆధునిక అభ్యుదయ రచనలు వినాలి. వాటి ప్రదర్శనాలు చూడాలి. దేశంలో ఉన్న ప్రఖ్యాత రచయితలతో పరిచయం చేసుకోవాలి; వారి అభిప్రాయాలు వినాలి. సాహిత్యం కొద్దిమందికే ననే అభిప్రాయం రచయితలలో పోతున్నట్టే, ప్రజలలో కూడా అంతరించి, ఈ సమావేశాలు తమ కొరకే ననే అభిప్రాయం ప్రజాసామాన్యంలో విస్తరించాలి. ఈ విషయం అభ్యుదయ రచయితలసంఘంగుర్తించి, ముందు సమావేశాలు ఆదర్శవంతంగా జరపాలి "మరో రెండుసంవత్సరాలకు చూడండి. ఈ ఒక్కసంస్థే దేశంలో నిలబడి ఉంటుంది" అన్నారు ఠాకరు ఇదే జరిగితే అభ్యుదయ రచయితల సంఘంమీద చాలా పెద్ద భారం పడుతుంది.

★

సం చందా రు. 6

అభ్యుదయ

విడి ప్రతి అ. 8

సచిత్ర సాహిత్య మాసపత్రిక

—: ప్ర క ట న రే ట్లు :—

కవరు 4 వ పేజీ	రు 60	లోపలిపేజీ 1 కి	రు. 30
కవరు 2, 3 పేజీలుఒక్కొక్కటి	రు 60	½ పేజీ	రు. 15

6 నెలలకు కంట్రాక్టురేటు 20% తక్కువ.

రెండుమూడు రంగులలో ప్రకటనలు చేయించదలచినవారు మేనేజరుకు వ్రాయండి.

అన్ని వివరాలకు :— మేనేజరు, 'అభ్యుదయ'
గవర్నరుపేట — బెజవాడ.

పరివర్తన సమీక్ష.

కె. కె.

నాలుగవ ఆంధ్ర అభ్యుదయ రచయితల వార్షిక సమావేశ సందర్భంలో జనవరి 19వ తేదీన మద్రాసు వాణీ మహాలులో ఆంధ్ర ప్రజానాట్యమండలి రాష్ట్రదళం వారిచే "పరివర్తన" అనే అభ్యుదయ దృష్టితో రచింపబడ్డ నాటకం ప్రదర్శితమైంది. ఈనాటకం ఇంతకు పూర్వం ఎక్కడా ఆడలేదు. ఇంచుమించు రెండువేలమంది ప్రేక్షకులు దీన్నిచూసి తన్మయులై పోయినారు. ప్రదర్శనానంతరం దీన్నిగురించి మాట్లాడటానికి ప్రయత్నించిన పెద్దలు మాట్లాడే శక్తిలేనంత వివశులై పోయినట్టుగా కనుపించారు. అనేకమంది ఈ నాటకం "ముందడుగు"ను మించిపోయిందన్నారు.

ఇతివృత్తం

సాహిత్య పరమార్థం గుర్తించకుండా ఆత్మానందంకోసం కవిత్వం వ్రాసుకుంటూన్న కవి జీవిత యాదార్థ్యాలకు తట్టుకోలేక, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయినవాడై, సంఘ విద్రోహక శక్తులకు తలఒగ్గి చివరకు ప్రపంచానుభవంవల్ల తన అజ్ఞాన శృంఖలాలనూ, దాస్య శృంఖలాలనూ కూడా తెంచుకుని, అభ్యుదయపథం అందుకోవటం ఈకథలోని ఇతివృత్తం.

ప్రపంచంతో నిమిత్తంలేకుండా తన ఆనందంకోసం పాడుకుంటూ ఉండిన కవి, దారిద్ర్యం వాతబడి భార్యనూ, ముగ్గురు బిడ్డలనూ కోల్పోయి ప్రపంచంలో కవిత్వానికి స్థానంలేదనీ, సంఘం కవులనాదరించదనీ నిశ్చయించుకుని ఒక పెట్టుబడిదారువద్దచేరి, అతడి పోషకత్వం కింద ఉంటూ, అతనికి ఉపన్యాసాలూ లేఖలూ రాసిపెడుతూ ఉంటాడు. పెట్టుబడిదారు చెల్లెలు, శోభ, సంపన్నుల బిడ్డ అయినప్పటికీ, అభ్యుదయ దృక్పథం కలదై, తన నౌకరు కుర్రాడు, రంగడిచేత అభ్యుదయ గీతాలు పాడించి కవిని గుచ్చుతూ ఉంటుంది. కవి రచించిన భావగీతాలు పాడి హేళనచేస్తూ ఉంటుంది. పెట్టుబడిదారు దగ్గిర గుమాస్తాగా ఉంటున్న దాసు అనే వృద్ధుడు కవిని హేళన చెయ్యకపోయినా, అతనికి ప్రపంచజ్ఞానం లేదనే విషయం సూచిస్తాడు. వీరి పలుకులు కవిని కలతబెడతాయిగాని కదిలించవు.

ఇంతలో ఒకనాడు పెట్టుబడిదారు ఫ్యాక్టరీలో పనిచేసే రంగడి తండ్రి కుడిచెయ్యి యంత్రంలో పడి నలిగిపోతుంది. ఈ వార్త వినగానే పెట్టుబడిదారు ఆత్మరక్షణార్థం తప్పు తన పక్షం లేదని రుజువుచేసే ప్రయత్నం చూస్తాడు. దెబ్బతిన్న పనివాడికి నష్టపరిహారం మాట ఆలోచించడు. కార్మికనాయకు




నార్ల వెంకటేశ్వరరావుగారు



కొడవటిగంటి కుటుంబరావుగారు

[illegible]



మోటుపల్లి రామానుజరావు నాయుడుగారు
(ఆహ్వానసంఘ ఉపాధ్యక్షులు)



దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు
(ఆహ్వానసంఘ కార్యదర్శి)

డైన చౌదరి రాయబారం వచ్చి భంగ పడతాడు. అక్కడ అతను కవి పరిచయం చేసుకుని, కవి దౌర్బల్యాన్ని కూడా గుర్తిస్తాడు.

తన యజమాని అయిన పెట్టుబడిదారుచే తప్పని నమ్మలేక కాదని సరిపెట్టుకోలేక సందిగ్ధంలో పడి కవి రంగడి తండ్రి దగ్గరికివచ్చి, చూసి యధార్థం తెలుసుకుంటాడు.

పత్రికలకు దొంగరిపోర్టులు పంపి, పోలీసుల సహకారంతో పనివాళ్ళఒత్తిడి నెదుర్కొనటానికి సంసిద్ధుడైన అన్నను శోభ భంగపరుస్తుంది. కవి రచించిన పుస్తకాలుతనఅన్న అతనిసొంత పేరుతో అచ్చువేసుకున్న సంగతి శోభ బయట పెడుతుంది. దానితో పెట్టుబడిదారు బండారం బయటపడి అతనిఆట కట్టవుతుంది. కవి విప్లవకవిగా మారిపోతాడు.

గుణదోషాలు

ఈ ఇతివృత్తం అమిత ఉద్రేకపూరితంగానూ, ఎంతో సెంటిమెంటల్‌గానూ, చిత్రించ బడింది ఈరెండు కారణాలూ నాటకం రక్తి కట్టటానికి ఎంతో తోడ్పడ్డాయి. దానికితోడు సంభాషణల్లోనూ, నాటకం నడకలోనూ,చక్కని ప్రతిభా, శిల్పాలున్నాయి పాత్రల పోషణకూడా చాలా తెలివిగా ఉంది. ఈకారణాల మూలంగా నాటకంలో ఉన్న అనేక లోపాలు కప్పబడి పోయినై.

ఇతి వృత్తంలోనే చాలా లోపం ఉంది శోభ తన అన్న ఆటకట్టించే ఘట్టానికి అర్థంలేదు ఒక పుస్తకం మరొకరి పేరుతో అచ్చయినాక దాన్ని బయటపెట్టటంలో పెట్టుబడిదారుకు జరిగే పెద్ద అపజయం ఉండబోదు. పెట్టుబడిదార్ల నిరంకుశత్వం అంత సులభంగా లొంగిపోదు వాళ్ళని జయించేది ఎప్పటికైనా పనివాళ్ళ ఐక్య ప్రతిఘటనే ఆవిషయం ఈ నాటకం నిరూపించదు.

పెట్టుబడిదారు చెల్లెలు శోభ పుస్తకాలు చదివి పెట్టుబడిదారీ సంస్కారం మీద కత్తికట్టిందని ఎస్టాబ్లిష్ చెయ్యటం నమ్మశక్యంగాలేదు. అంతకంటె బలవత్తరమైన కారణం ఉండాలి.

పట్టుపురుగులాగ తనచుట్టూ గూడు కట్టుకుని అందులోనే మగ్గిపోతున్న ఒకానొక కవిలో పరివర్తన తీసుకురావటానికి గాను నాటకంలో వచ్చే పాత్రలన్నీ అంతగా కృషిచెయ్యటం దేనికో ఊహించటం కష్టం ఈ నాటకంలో చిత్రించబడింది ఆధునిక అభ్యుదయ కవి పుట్టుక అయినాకాదు; నాటక నేపథ్యంలో ఒకఅభ్యుదయ కవి ఉండనే ఉన్నాడు. మన కవి తన గూడుదాటి బయటికి రాకపూర్వమే—నాటకారంభంలోనే—శోభా, రంగడూ కలిసి మరో అభ్యుదయ కవి రాసిన పాటలు పాడనే పాడతారు, దీనికితోడుగా ఈ కవిలో ఒక విశిష్టత అయినా రుజువు చెయ్యబడలేదు పాండిత్యమో, శిల్పమో, ప్రాచీన సంస్కారమో ఉండి, జీవిత యాదార్థ్యం తెలియని కారణంచేత వెనకబడి ఉండిన కవికొరకు ఇన్ని పాత్రలూ శ్రమపడినట్టుంటే ఈ ఇతివృత్తానికి అర్థం ఉండును ఈనాడు అభ్యుదయదృష్టిలేని కవులంతా ఎట్లా

ఉన్నారో. అదే స్థితిలోఉన్న ఒకానొక కవిలో పరివర్తనం కలిగించటాని కింత నాటకం రాయటం వింతగాకనిపిస్తుంది.

శోభా, రంగడూ, దాసూ, చౌదరీ — వీరంతా కవికన్న ముందుకు వెళ్ళిన వాళ్లే. పరివర్తన పొంది కవి వారిని చేరుకుంటాడు—అంతే! ఈ కారణం చేత నాటకంలో ఉండదగిన ఉదాత్తతకు గట్టిదెబ్బ తగిలింది.

నిలబడే నాటకం కాదు

ఈ నాటకం కాలపరీక్షకు నిలబడ లేదని విమర్శకుడైనవాడు సులభంగా చెప్పవచ్చు. కాని అంతమాత్రంచేత ఇది తాత్కాలికంగా కొంతప్రయోజనం సాధించదనటానికి వీల్లేదు. తాత్కాలికంగా, ఈ నాటకం ప్రజలను ఊపుతుంది. కవులను బాగా రెచ్చగొట్టుతుంది. ఈ నాటకం తమకుచేసే కొద్దిపాటి అవమానాన్ని అభ్యుదయ కాంక్ష గల కవులు మన్నిస్తారు కవి సమాజాన్ని నడిపించగలందులకై సమాజం కవిని నడిపించే కథగల ఈ వింత నాటకాన్ని అభ్యుదయ పిపాసువులు కొంత కాలం ప్రేమించగలుగుతారు. ఎందు చేతనంటే, నాటకంయొక్క ఆశయం ప్రేక్షకలోకంనుంచి అప్రయత్నంగా సానుభూతి తెచ్చుకుంటుంది

దీన్ని ప్రదర్శించిన వైజ్ఞానిక దళం వారు పాత్రధారణలోనూ, ప్రదర్శనం లోనూ.ఎ.తో సమర్థతా, సహృదయతా ప్రకటించారు

దేశమంతటా "పరివర్తన" ప్రదర్శితం కావటమూ, తెలుగువారంతా ఈ నాటకాన్ని అధమం ఒకసారయినా చూడటమూ ఎంతయినా అవసరం

★

వి జ్ఞ ప్తి

ఏజెంట్లకు, చందాదారులకు :

అయ్యా !

'అభ్యుదయ' పత్రికకు సంబంధించిన ఉత్తరాలు, మనియార్డర్లు,

'మేనేజరు - అభ్యుదయ' అని మాత్రమే పంపాలి.

వ్యక్తుల పేర్లతో పంపవద్దని మనవి.

— మే నే జ రు .

ఆంధ్ర అభ్యుదయ రచయితల చతుర్థ మహాసభ తీర్మానాలు

[మద్రాసు వాణీమహల్‌లో జనవరి 18, 19 తేదీలలో శ్రీ పి. వి రాజమన్నారుగారి అధ్యక్షతను జరిగిన ఆంధ్ర అభ్యుదయ రచయితల చతుర్థ మహాసభా ప్రతినిధుల సమావేశంలో ఈ క్రింది తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి.]

౧. సంతాప తీర్మానం

"దేశాభిమాన పూరితములైన, సంఘ దురాచార నిర్మూలకములైన అనేక నవలలూ, నాటకాలూ, ప్రహసనాలూ రచించి శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు ఆంధ్రజాతి విజ్ఞాన వికాసానికు ఎంతగానో తోడ్పడ్డారు. తమ జీవితమంతా నాటక కళాభ్యుదయం కోసం ధారపోసి, ఆంధ్ర నాటకరంగంలో క్రొత్త పోకడలు ప్రవేశపెట్టి, శ్రీ బళ్లారి రాఘవాచార్యులుగారు ఇతర దేశాల్లోకూడా ఆంధ్ర సంస్కృతి యొక్క పేరు ప్రతిష్ఠలను నిలబెట్టారు. మన సినిమా రంగంలో దేశసేవాభిలాషనూ, సంఘ సంస్కరణేచ్ఛనూ ఉద్దీపింపజేసే 'రైతుబిడ్డ', 'మాలపిల్ల' వంటి చిత్రాలను తీసి, శ్రీ గూడవల్లి రామబ్రహ్మంగారు ఆంధ్రకళాభ్యుదయానికి దోహదం చేశారు

"ఆంధ్ర కళాభ్యుదయానికీ, ఆంధ్ర జాతి పురోగమనానికీ తమ సర్వస్వమూ అర్పించిన ఈ కళావేత్తలను కోల్పోయినందుకు, తమ సంతాపాన్ని వెలిబుచ్చుతూ, వారి వారి కుటుంబాలకు, ఈ మహాసభవారు తమ సానుభూతిని తెలియజేస్తున్నారు"

౨. వ్యావహారిక భాష

"దేశంలో స్వాతంత్ర్య చైతన్యాన్నీ, విజ్ఞానాన్నీ పెంపొందింప చేయవలసిన నేడు దేశభాషలలోనే విద్యాప్రబోధం జరగాలని చెబుతూకూడా మన విశ్వవిద్యాలయాలు, సజీవమై, నిత్యమూ వ్యవహరించబడే నేటిభాషను త్రోసి పుచ్చడాన్ని ఈసభవారు నిరసిస్తున్నారు.

"శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు ప్రారంభించిన వ్యావహారిక భాషోద్యమం దేశంలో అనాటికానాడు ప్రబలుతున్నది సుప్రసిద్ధాంధ్ర సాహితీపరులందరూ తమ రచనలను వ్యావహారిక భాషలోనే వ్రాస్తున్నారు. 'విశ్వరూపం' వంటి ఉత్తమ శాస్త్ర గ్రంథాలుకూడా వ్యావహారిక భాషలోనే వెలువడుతున్నాయి.

"వ్యావహారిక భాషోద్యమ ఫలితంగా తెలుగులోని తెలుగు దనమూ, సుడి

కారమూ పెంపొందాయి. విద్యావంతుల్లో రచనచేయాలనే కుతూహలంహెచ్చింది. అనేకమంది ప్రతిభావంతులైన క్రొత్త రచయితలు సాహితీ రంగంలో ప్రవేశిం చారు ప్రజల భాషలో ప్రజా జీవి తాన్ని చిత్రిస్తూ. మన సాహిత్యం దిన దినాభివృద్ధి చెందింది ప్రజల్లో విజ్ఞానం విరివిగా వ్యాపించ సాగింది నేటి సాంఘిక రాజకీయ చైతన్యానికి వ్యావ హారికభాష ఎంతగానో దోహదంచేసింది

"ఈ విధంగా నేటి ఆంధ్రజాతీయ సాహిత్యమంతా వ్యావహారిక భాషలోనే వెలువడుతున్న ఈనాడు మన ఆంధ్ర విశ్వవిద్యాలయం వ్యావహారిక భాషను నిషేధించడమంటే — ఆంధ్ర సాహి త్యాన్నీ. విజ్ఞానాన్నీ నిషేధించడమన్న మాట విద్యార్థులకు అర్థంకాని. జీవితా నికి అందుబాటులోలేని కృతక గ్రాంధిక భాషను వారిమీదరుద్ది వారికి నేటి విజ్ఞా నంతోనూ. భాషతోనూ సంబంధం లేకుండా చేయడమన్నమాట

"శ్రీ వెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారి వంటి విద్వత్కవులూ. మల్లంపల్లి సోమశేఖరశర్మ గారివంటి చారిత్రక పరిశోధకులూ. శ్రీకాశీపట్నంకొండయ్య గారివంటి శాస్త్రవేత్తలూ. రచయితలూ. పత్రికాధిపతులూ అందరూ ఆదరించిన భాషను. ఆంధ్ర ప్రజలు నిత్యమూ వ్యవహరించే భాషను నిషేధించడం. ఆంధ్ర సంస్కృతినీ, ఆంధ్రప్రజలనూ అవమానించడం కంటే భిన్నం కాదు.

"ఆంధ్రకళాసంస్కృతులను ప్రజల్లో వ్యాపింపజేయవలసిన విద్యాలయాలు సజీవమైన భాషనూ, సంస్కృతినీ విద్యార్థులకు దూరం చేయడం తగదనీ. వ్యావహారిక భాషను వెంటనే ఆమో దించవలసిందనీ—ఈ సభవారు, ఆంధ్ర భాష బోధించే అన్ని విద్యాలయాధికారు లను కోరుతున్నారు

"మన విద్యావిధానంలో దేశ భాషలకు ప్రధానస్థాన మివ్వడానికై కృషిచేస్తున్న ప్రజామంత్రి వర్గాన్ని అభినందిస్తూ. దేశభాషలంటే దేశంలో నిత్యమూ వ్యవహరించబడే సజీవమైన భాషలే ననీ-అట్టి వ్యావహారి కాంధ్రాన్ని ప్రభుత్వ విద్యాశాఖవారు, ఆంధ్రభాష బోధించే అన్ని విద్యాలయాల వారూ ఆమోదించేటట్లు, చెయ్యాలని ఈ సభవారు ప్రజామంత్రివర్గాన్ని కోరు తున్నారు

"ఈ విషయంలో తగిన ఆందోళన చేసి వ్యావహారికభాషలో దివ్యప్రబోధం జరిగేందుకై కృషి చేయడానికిన్నీ. ప్రభుత్వంవారి యొద్దకున్నూ. యూని వర్సిటీవారి యొద్దకున్నూ డెప్యుటేషన్ వెళ్ళడానికిన్నీ అధికారమిస్తూ. ఈక్రింది వారిని ఒక ఉపసంఘంగా ఈ సభవారు నియమిస్తున్నారు.

"ఉపసంఘం: (1) పి. వి. రాజమన్నారు (2) మల్లంపల్లి సోమ శేఖరశర్మ. (3) గిడుగు సీతాపతి. (4) దేవులపల్లి కృష్ణశాస్త్రి. (5) తెలికిచర్ల వెంకటరత్నం. (6) చదలవాడ పిచ్చయ్య. (7) చిలుకూరి నారాయణ రావు. (8) మోటుపల్లి రామానుజ రావు నాయుడుగార్లు."

౩. భాషాపండితులు

"మనప్రజల్లో విజ్ఞాన వికాసాలను పెంపొందించడం దేశభాషద్వారానే సాధ్యమవుతుందని అందరూ అంగీకరిస్తారు. కాని నేటివిద్యాలయాల్లో భాషాపండితులకూ, తక్కిన ఉపాధ్యాయులతో పాటు, సమానప్రతిపత్తిని కలిగించి భాషాగౌరవాన్నీ, ప్రయోజనాన్నీ నిలబెట్టి, భాషాభివృద్ధికీ విజ్ఞానాభివృద్ధికీ దోహదం చేయవలసిన విద్యాశాఖవారు భాషాపండితులయెడ చూపుతున్న ఔదాసీన్యం ఆంధ్రజాతి ప్రతిభనే అరికడుతుంది. కాబట్టి విద్యాలయాల్లో భాషాపండితులకు ఇతర ఉపాధ్యాయులతో పాటు సమాన ప్రతిపత్తినీ సౌకర్యాలనూ కలిగించాలనీ ; వారి హక్కులను గుర్తించి, వారివేతనాలనుకూడా ఆంగ్లోపాధ్యాయులతో సరిసమానంగా పెంచాలనీ ; ఇది ప్రజామంత్రివర్గంయొక్క కనీసధర్మమనీ — ఈ సభవారు నమ్ముతున్నారు. ప్రజామంత్రివర్గం తమ ఈ కర్తవ్యాన్ని నెరవేర్చి, ఆంధ్రభాషకూ, ఆంధ్రసంస్కృతికీ దోహదంచేయాలని ఈ సభవారు కోరుతున్నారు."

౪. రచయితల హక్కులు

"పత్రికాధిపతులూ, ప్రచురణకర్తలూ రచయితలకు తగిన పారితోషికమిచ్చి వారిని సరియైనతీరున ఆదరించడంలేదు. రచయితలు గూడా తమ ఆర్థిక పరిస్థితులకు లొంగిపోయి, ఎంతకైనా సంతృప్తిజెంది, తమ రచనలను ప్రచురణకిచ్చి వేస్తున్నారు. ఇట్టిస్థితి రచయితలకూ, పత్రికాధిపతులకూ, ప్రచురణకర్తలకూ గూడా అనర్థకమైనది.

"రచయితకు తగిన జీవనాధారం కలిగి, తగిన ప్రోత్సాహం లభించిననాడే, మంచిరచనలువచ్చి మన వాఙ్మయంపెంపొందుతుంది. అలా కానినాడు, రచయిత జీవితమే దుర్భరమైపోయి, ఉత్తమ రచనలు వచ్చే అవకాశం సన్నగిల్లి, సాహిత్యం దెబ్బతింటుంది. ఇందుకు రచయితలను వ్యాపారవస్తువులుగా వినియోగించుకొంటున్న పత్రికాధిపతులూ, ప్రచురణకర్తలూ బాధ్యులవుతారు

"కనుక ఈ సంగతిని గమనించి పత్రికాధిపతులూ, ప్రచురణకర్తలూ తమ లాభసాటి వ్యాపారానికి ఆధారభూతులైన రచయితల రచనలకు తగిన పారితోషికం ఇచ్చి, వారిని ఆదరించాలనీ; రచయితలుకూడా ఉత్తమ రచనలు చేసి రచన నొక వృత్తిగా పెంపొందింపచేయాలనీ—ఈ మహాసభవారు ఉభయులనూ హెచ్చరిస్తున్నారు"

౫. 'ముందడుగు' ప్రదర్శనం

"వాసిరెడ్డి భాస్కరరావు, సుంకర సత్యనారాయణగార్లచే రచియింపబడిన 'ముందడుగు' అనే నాటకం ఆంధ్రప్రజానాట్యమండలిచే మద్రాసులోను ఆంధ్రదేశమండలి ముఖ్యపట్టణాల్లోనూ, పల్లెలలోను ప్రదర్శింపబడి, ప్రజల మన్ననలబడసింది. సుప్రసిద్ధ కవులూ, గాయకులూ, నటకులూ, కళావేత్తలూ పత్రికాసంపాదకులూ 'ముందడుగు' ప్రదర్శనమునుహర్షించుతూ అభిప్రాయాలు తెలి

పారు. ఇట్టినాటక ప్రదర్శనాన్ని మద్రాసు అడ్వైజరీ ప్రభుత్వం నిషేధించింది. ఈనిషేధం తీసివేయ వలసిందిగా ప్రస్తుత కాంగ్రెస్ మంత్రివర్గాన్ని కోరుతూ అనేక విజ్ఞప్తులు గావించినా, ఇంతవరకు తీసివేయబడలేదు ఈనిషేధము తొలిగించే విషయమై ప్రభుత్వం ఇంతవరకు సంతృప్తికరమైన సమాధానం ఈయలేదు 'ముందడుగు' ప్రదర్శనంపైగల నిషేధాన్ని వెంటనే తొలిగించ వలసిందిగా మద్రాసు మంత్రి వర్గాన్ని ఈసభవారు కోరుతున్నారు."

౬. సైగల్ మృతికి సంతాపం

భారతీయ చలన చిత్రకళా పరిశ్రమలో అద్భుత ప్రతిభ ప్రకటించిన ప్రముఖ గాయకుడు తాన్‌సేన్ మొదలైన ఉత్తమ చిత్రాలల్లో నటించిన సైగల్ మరణానికి ఈసభవారు చింతిస్తున్నారు. సైగల్ కుటుంబానికి తమ హృదయపూర్వక సానుభూతిని తెలుపుతున్నారు"

౭. నూతన కార్యవర్గం

"ఈ క్రింది వారిని నూతన సంఘానికి కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొనడమైనది.

అధ్యక్షులు
శ్రీ సి. వి. రాజనున్నారు

ప్రధాన కార్యదర్శి
శ్రీ చపలవాడ పిచ్చయ్య

సహాయ కార్యదర్శులు:
శ్రీ ప్రయాగ కోదండరామశాస్త్రి
శ్రీ కొమ్మరాజు వినాయకరావు

సభ్యులు:
శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి
శ్రీ తెలికిచర్ల వెంకటరత్నం
శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ
శ్రీ గిడుగు వేంకటసీతాపతి
శ్రీ చిలుకూరి నారాయణరావు
శ్రీ కొడవటిగంటి కుటుంబరావు
శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి
శ్రీ అఖిలసోమయాజుల నరసింహశర్మ
శ్రీ చాగంటి సోమయాజులు
శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు
శ్రీ తెన్నేటి సూరి
శ్రీ తుమ్మల వెంకటరామయ్య
శ్రీ అత్తలూరి సర్వేశ్వరరావు
శ్రీ కోగంటి గోపాలకృష్ణయ్య
శ్రీ రాటకొండ నరసింహారెడ్డి
శ్రీ పులుగుండ్ల రామకృష్ణయ్య
శ్రీ కొంగర జగ్గయ్య
శ్రీ నాజర్
శ్రీ సుంకర సత్యనారాయణ
శ్రీ అసిశెట్టి సుబ్బారావు
శ్రీ మోహనపల్లి రామానుజరావు

నాయకుడు
శ్రీ ముంగి జి. ప్రభ

౮. సంపాదకవర్గం

"ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం తరఫున వెలువడే 'అభ్యుదయ' పత్రికకూ, ఇతర ప్రచురణలకూ ఈ క్రింది సంపాదకవర్గాన్ని ఎన్నుకొనడమైనది.

సంపాదకుడు :

శ్రీ చదలవాడ పిచ్చయ్య

సహాయ సంపాదకులు :

శ్రీ ప్రయాగ కోదండరామశాస్త్రి

శ్రీ కొమత్రాజు వినాయకరావు

గౌరవ సంపాదకులు :

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ

శ్రీ పి. వి. రాజమన్నారు

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి

శ్రీ తుమ్మల వెంకటరామయ్య

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

౯. కార్యాలయోద్యోగులు

"శ్రీ నాగభైరవ శివరామకృష్ణయ్యగారిని 'అభ్యుదయ' మేనేజరుగాను, శ్రీ ఏల్చూరి సుబ్రహ్మణ్యంగారిని రాష్ట్ర సంఘ ఆఫీసు కార్యదర్శిగాను ఎన్నుకొనడమయినది.

౧౦. అభ్యుదయ ప్రచురణలు

"ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం తరఫున అభ్యుదయ ప్రచురణలను వెలువరించాలనీ తద్వారా నేటి రచయితల లాభక్షేమాలను కాపాడాలనీ - ఈ మహాసభవారు తీర్మానిస్తున్నారు.

"ఈ దృష్టితో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం సంవత్సరానికి కనీసం అయిదువేల పేజీలుగల గ్రంథాలను ప్రచురించాలని ఈ సభవారు ఆదేశిస్తున్నారు.

"ఆంధ్ర జాతియొక్క సంస్కృతినీ, సాహిత్యాన్నీ పెంపొందించుకోవలసిన అవసరాన్ని గుర్తించి ప్రభుత్వంవారు, అభ్యుదయ ప్రచురణలకు అవసరమయ్యే పేపరు కోటాను ఇచ్చి, ఆంధ్ర కళాభ్యుదయానికి తోడ్పడాలని ఈ మహాసభవారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు."

౧౧. తెలుగు రేడియో స్టేషను

"ఆంధ్రులు అటు ఉత్తరాదివారికీ, ఇటు దక్షిణాదివారికీ మధ్యనుండి ఒక విశిష్టమైన సంస్కృతిని అభివృద్ధి చేసుకున్నవారు. అనేక విశిష్ట కళాసంప్రదాయాలతో, ప్రత్యేకమైన జాతీయ శక్తులను పెంపొందించుకొన్నవారు. అట్టి ఆంధ్రులకు ప్రత్యేకం ఒక రేడియో స్టేషను లేకపోవడం ఆంధ్ర కళాభ్యుదయానికే ఆటంకంగా వున్నదని ఈ సభవారు నమ్ముతున్నారు.

"మదరాసు రేడియో స్టేషన్లో తెలుగు ప్రోగ్రాములకు అవకాశం ఇస్తున్నప్పటికీ మదరాసుది కాస్మోపాలిటన్ స్టేషను కావటంవల్ల ఆంధ్రుల విశిష్ట కళా విజ్ఞానాభ్యుదయానికి అది అంతగా ఉపకరించటంలేదు.

"కనుక ఆంధ్రులు తమ విశిష్టమైన కళా విషయక ప్రతిభనూ ప్రజ్ఞనూ పెంపొందించుకోవాలంటే ఆంధ్రులకు ప్రత్యేక రేడియో స్టేషను అత్యంతావశ్యకమనే సత్యాన్ని అందరూ అంగీకరిస్తున్నారు

"ఇటీవల మద్రాసు ప్రభుత్వంవారు కూడా ఈ విషయాన్ని గుర్తించి ఆంధ్రు

లకు ప్రత్యేకంగా బెజవాడలో రేడియో స్టేషను నిర్మించడానికి అంగీకరించారు. కాని, అందుకవసరమైన ఏర్పాట్లు ఇంత వరకేమీ చేస్తున్నట్లు లేదు. ఆంధ్రులకు ప్రత్యేకం రేడియో స్టేషను ఉండాలని ఒప్పుకున్నంత మాత్రాన ప్రయోజనం లేదు. ఆ రేడియో స్టేషను నిర్మించబడేదాకా, ఎవ్వరికీ సంతృప్తి వుండదు.

"కనుక మదరాసు ప్రభుత్వంవారు వెంటనే తెలుగు రేడియో స్టేషను నిర్మించడానికి కృషిచెయ్యాలనీ: ఈ విషయంలో ఏమీ జాగు జరగకుండా చూడాలనీ ఈ సభవారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు."

౧౨. ఏలూరు అభ్యుదయ రచయితల మహాసభపై 144 వ సెక్షన్

"ఏలూరు పట్టణాభ్యుదయ రచయితల వార్షికోత్సవం రాష్ట్రసంఘు ఆదేశానుసారం జనవరి 12 వ తారీఖున జరుప నిశ్చయించగా, దానిని స్థానిక పోలీసు అధికారులైన సర్కిల్ ఇన్‌స్పెక్టరు ఆహ్వాన సంఘ సభ్యులను పిలచి 144 వ సెక్షన్ క్రింద ఆసభ జరగడానికి వీల్లేదని నిషేధించారు. ఆ 144 వ సెక్షన్ సాహిత్యసభలకు వర్తించక పోయినప్పటికీ సాహిత్యసభ నాటంకపరచి తమ అధికారాన్ని దుర్వినియోగ పరచిన పోలీసు అధికారుల చర్యను ఖండిస్తూ, వారిపై తగిన చర్య తీసుకోవలసిందనీ; వార్షికోత్సవం జరుపుకోడానికి ఏలూరు అభ్యుదయ రచయితల కవకాశం కలిగించ వలెననీ — ఈ సభవారు ప్రజామంత్రివర్గాన్ని కోరుతున్నారు.

౧౩. రాయలసీమను ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చేర్చాలి!

"అనంతపురం, కడప, కర్నూలు, బళ్ళారి, చిత్తూరు జిల్లాలను తిరిగి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వెంటనే చేర్చవలసిందని ఈ సభవారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు."

★

ర చ యి త ల కు :

తమ రచనలు పది పేజీలకు మించకుండా, కాగితానికి ఒక వైపు మాత్రమే సిరాతో స్పష్టంగా వ్రాసి పంప ప్రార్థన.

— సం పా ద కు లు.

ఉజ్వలమైన సతీత్వము



పండిత్ డి. గోపాలాచార్యులవారి

అరుణ

గర్భాశయరోగ నివారిణి.

అరుణ ఋతు దోషములను పోగొట్టి పరిపూర్ణ స్త్రీత్వమును ప్రసాదించ గల స్వయం సంపూర్ణ మగు ఔషధము. అట్టి దానిని విడువక సేవించినట్లయితే మిమ్ము ఆరోగ్యవంతులను జేయుటయేగాక, మీ జీవన పరమావధి యగు అమందానందమును తప్పక యొసగును.



ఆయుర్వేదాశ్రమం, లిమిటెడ్
టి. నగర్ ... మద్రాసు.

స్వర్ణోత్సవ - ఆగమనసందర్భంలో





పండిత డి. గోపాలాచార్యులవారి

జీవామృతము

ఏబదియేండ్లుగా ప్రజాకోటి మునకు సేవజేయుచు, ప్రజల ఆరోగ్యము నుపెంపొందించుచు, ఆనంద సంతృప్తులను కల్గించి, ప్రజానురంజకమైన దరి వెల్లడించుటకు గర్వించు చున్నాము.

ఆయుర్వేదాశ్రమం, లిమిటెడ్
టి. నగర్ ... మద్రాసు.

కుష్ఠు-బొల్లి

మొదలగు సకల మేహములకు. ఇతర చర్మవ్యాధులకును, సెగ, సవాయి మొదలగు వ్యాధులకు

గ్యారంటీచికిత్స !

బ్రాంచ్.

బెజవాడ

గాంధీనగరం

★

వాల్తేరు

ఆర్. యస్ పోస్టు

★

ఆఫీసులు :

సికింద్రాబాద్

3560. కింగ్సువే

★

కటక్

బక్సిబజార్

ఒక మంత్రి ప్రశంస

●

ఆనరబుల్ పండిట్ గోదావరీస్ మిశ్రా,
M. A., B. T,

ఒరిస్సా మంత్రి,
కటక్,

29 నవంబరు, 1943

మెస్సర్స్ రెడ్డి అండ్ కంపెనీ గోపాలపురం, తూర్పుగోదావరిజిల్లా వారు కుష్ఠురోగాన్ని అత్యద్భుతంగా నివారించగలరని సూచించడానికే ఇలాగ వ్రాస్తున్నాను. నాకు బాగా పరిచితురాలైన ఒక స్త్రీ ఇటీవల వారిచికిత్స పొందగా, రెండు నెలలలోపునే ఆమెలో క్రమేణా ఎంతో గుణం కనిపించింది. ఇప్పటికీ ఆమె వారి ద్వారానే చికిత్స పొందుతున్నది. ఆమెలో యిప్పటివరకు కనిపించిన అభివృద్ధినిబట్టి కొద్దినెలలలోపునే, ఆమెకు ఈవ్యాధి పూర్తిగా కుదిరిపోగలదని నేను విశ్వసిస్తున్నాను. గర్భశత్రువైన ఈ కుష్ఠురోగాన్ని నిర్మూలించడంలో మెస్సర్స్ రెడ్డి అండ్ కంపెనీవారు చేస్తున్న సేవలకు, ప్రజలంతా అభినందించవలసినదే. వైద్యవృత్తిలో వున్నవారు ఈచికిత్సావిధానాన్ని గురించి ఆలోచించవలసిందే.

ఇట్లు,
(సం.) జి మిశ్రా.
ఆర్థిక, విద్య, అభివృద్ధి ప్రచురణశాఖల మంత్రి.

పెద్దతెలుగు క్యాటలాగు, 10 భాషల్లో క్యాటలాగులు, యోగ్యతాపత్రములు

ఉచితము !!

రెడ్డి & కో.,

(రిజిష్టర్డ్)

H. O. గోపాలపురం

(వయా) తణుకు, తూర్పు గోదావరి

REDDY

Editor, Printer & Publisher · C Pitchayya

"పాలూ నేయీ కొందరి కిచ్చి
పల్చని గంజి లే కెందరినో
పస్తులతో పడి చావమందువా ?"

స్వతంత్ర ఫిలిమ్సు లిమిటెడ్

వారి

★

ద్రోహి

డైరెక్షన్ :
ప్రసాద్

సినేరియో :
తాపీ

స్టుడియో :
శోభనాచల

నటీనటకులు .

రాజ్యం, వరలక్ష్మి
ప్రసాద్
ప్రకాశరావు
ప్రభాకరరావు
రాళ్ళభండి
శివరావు

వివరాలకు:

స్వతంత్ర పిలిమ్సు లిమిటెడ్ :: మద్రాసు 17

★

ఆంధ్ర & రాయలసీమ డిస్ట్రిబ్యూటర్సు :

ప్రీమియర్ ఫిలిమ్సు లిమిటెడ్ :: బెజవాడ

ANDHRA PHOTO HOUSE

PHOTOGRAPHERS, & DEALERS IN PHOTO GOODS

Governorpet — BEZWADA.

★



Dealers in

Hand cameras, Field cameras, Cine cameras, Lamp projectors, Lenses, Binoculars, Roll films Bula Plates Cut films, Papers, Chemicals, Mounts Albums Drawing Material, and other Sundries & Accessories Photographic line

We undertake Studio portraits, family sittings, weddings, out door and in door groups, lovely children photographs enlargements and colour paintings

Amatuer Developing,
Printing, Enlarging
A Speciality

Please let us have a snap at you

అన్ని వేళలందు
ఫొటోలు తీయబడును
ఫొటో సామానులు
అమ్మబడును

డి. గరటయ్య
ఆంధ్రా ఫొటో హౌస్
బిసెంట్ రోడ్ ~ బెజవాడ

